# తెల్లగులాబీ ..



రచన: అత్తలూరి విజయలక్ష్మి

# తెల్ల గులాబీ

అత్తలూరి విజయలక్ష్మి

# తెల్లగులాబీ ..

నవలః రచన అత్తలూరి విజయలక్ష్మి

"ఆదీ! ఆదీ .. " లోపల్నించి శిరీష పిలుపు వినిపించింది ..

ఆదిత్యకి పలకాలనిపించలేదు.. తను కూర్చున్న బాల్కనీలోంచి కదలాలనీ అనిపించలేదు.. అమ్మ పిలుస్తూనే ఉంటుంది .. కాస్సేపన్నా రిలాక్స్ అవనివ్వదు.. కాలేజ్ నుంచి వచ్చి గంటసేపు కూడా ఆడుకోలేదు... ఆదిత్యకి చాలా కోపంగా ఉంది శిరీష మీద .. తనకి పదహారేళ్లు దాటుతున్నాయి. అయినా చిన్నపిల్లాడిలా ట్రీట్ చేస్తుందేంటో ఈ అమ్మ అనుకున్నాడు. ..

ఆదిత్యకి శిరీష ఎందుకు పిలుస్తోందో తెలుసు .. చదువుకో, చదువుకో అని చంపుకు తినడానికి .. చదువు , చదువు.. ఆ మాట వింటేనే చిరాగ్గా అనిపిస్తుంది. ఆడుకోనివ్వదు.. ఫ్రెండ్స్‌తో మాట్లాడనివ్వదు.. ఎప్పుడూ నాలుగ్గోడల మధ్యే కూర్చుని క్లాసు పుస్తకాలతో ఫ్రెండ్‌షిప్ చేయాలంటుంది .. ఎంత బోర్!

ఆదిత్య చూపులు కింద వాకిట్లో క్రికెట్ ఆడుతున్న కుర్రాళ్ల మీద కేంద్రీకృతమై ఉంది .. వాళ్లంతా ఎంచక్కా ప్రతిరోజూ ఆడుకుంటారు. క్రికెట్, షటిల్ ఎన్ని ఆటలున్నాయి .. ఎంతసేపూ వెధవ చదువేనా? పిల్లలన్నాక ఆడుకోవద్దా? వాళ్లంతా గంటా, గంటన్నరసేపు ఆడుకుని ఆ తరవాత ఇంట్లోకి వెళ్లిపోయి కాస్సేపు చదువుకుంటారు .. టి వి చూస్తారు ఎంజాయ్ చేస్తారు .. వాళ్లంతా అదే అపార్ట్ మెంట్‌లో ఉండే పిల్లలు ..ఆడపిల్లలంతే, మగపిల్లలంతే.. వాళ్లందరి ఇళ్లళ్లో చాలా మంది ఉంటారు . నలుగురుంటారు ఇద్దరు పిల్లలు, అమ్మా, నాన్న, కొంత మంది ఇళ్లల్లో వాళ్ల నానమ్మలు, తాతయ్యలు కూడా ఉంటారు .. ఎప్పుడూ వాళ్లింటికి ఎవరో, వస్తూ పోతూ ఉంటారు .. వాళ్లమ్మలు ఉద్యోగాలు చేయరు .. ఇంట్లోనే ఉంటారు ..

కానీ, ఈ ఇంట్లో అమ్మా, తనూ .. ఎప్పుడూ ఎవరూ ఈ ఇంటికి రారు .. రెండు రోజులకోసారి వివేక్ అంకుల్ తప్ప ఇల్లంతా ఎప్పుడూ నిశ్శబ్దంగా, ఏంటోగా ఉంటుంది .. ఆ నిశ్శబ్దం అంటే ఆదిత్యకి భయం .. ఇల్లంతా సందడిగా ఉండాలని ఆదిత్య కోరిక .. చుట్టు పక్కల ఫ్లాట్స్‌లో లాగా ఈ ఇల్లు ఎందుకుండదో అనిపిస్తుంటుంది ..

ఆదిత్యకెందుకో భయం వేసింది .. ఇలా ఒంటరిగా, కామ్‌గా ఉంటే భయం కదా .. సాధారణంగా కామ్‌గా ఉన్న ఇంట్లో దయ్యాలున్నాయని విన్నాడు తను .. కథల్లో కూడా అలాగే రాస్తారు . దయ్యాలున్న ఇల్లు నిశ్శబ్దంగా ఉంటుందని .. కొంపదీసి .. వణికిపోయాడు ..

ఆదీ పిలుస్తుంటే వినిపించడం లేదా? ఏం చేస్తున్నావిక్కడ? శిరీష కొంచెం కోపంగా అరుస్తూ వచ్చింది బాల్కనీలోకి .. ఆదిత్య బెదిరిపోయి లేచి నిలబడ్డాడు..

ఏం లేదు మమ్మీ.. బోర్ గా ఉంటేనూ .. నసిగాడు..

బోర్ ఏంటిరా చదువుకోక .. పద .. పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. ఫైనల్ ఇంటర్ అవగానే ఐఐటి కూడా రాయాలా? ఇలా టైం వేస్ట్ చేస్తే నీకు ర్యాంక్ ఎలా వస్తుంది .. పద, పద .. చదువుకో ..

ఆదిత్య మౌనంగా లోపలికి నడిచాడు..

తన గదిలోకి వెళ్లిపోయి పుస్తకం తీశాడేగానీ చదవాలనిపించడంలేదు.. ఏడుపొస్తోంది.. ఏంటి ఈ ఇల్లు .. అమ్మకి ఎందుకింత కామ్‌గా ఉండడం ఇష్టం .. అసలు నాన్న ఏమయాడు? ఎప్పుడు అడిగినా చెప్పదు అమ్మ ..

ఒకటి రెండుసార్లు అడిగాడు కూడా అమ్మా నాన్న ఎక్కడ? మనింటికి ఎందుకురారు? అని .. ఖయ్యిమని లేచింది. నీకెందుకురా ఆయన సంగతి .. నీకేం తక్కువైంది ఇక్కడ . వెళ్లు చదువుకో వెధవ ఆలోచనలు మానేం ..

బైట పిల్లలతో ఆడుకోనివ్వదు.. ఎవరింటికీ వెళ్లనివ్వదు.. వేరే ఫ్లాట్స్ వాళ్లతో కలవనివ్వదు.. ఎందుకో .. ఆదిత్య కళ్లు పుస్తకం మీద ఉన్నాయి . .. కానీ, ఆలోచనలు మాత్రం ఎటో ఉన్నాయి ..

రెండు రోజుల్లో దీపావళి పండగ వస్తుంది .. ఇప్పటి నుంచే అందరూ బాంబులు కాలుస్తున్నారు.. ఫ్లాట్స్ వాళ్లంతా చాలా సరదాగా ఉన్నారు.. అందరిళ్లల్లో ఎవరో చుట్టాలు వస్తున్నారు ..

ఈ ఇంటికి చుట్టాలు రారు .. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య ఎవరూ రారు .. ఎందుచేత? తన స్కూల్లో ఫ్రెండ్స్ అంతా సమ్మర్ హాలీడేస్ రాగానే వాళ్ల అమ్మమ్మ వాళ్ల ఊరో, మావయ్యల ఊరో వెళ్తుంటారు .. కానీ, తనకి తెలిసి ఏ ఊరూ వెళ్లలేదింత వరకూ .. తిరుపతి, శ్రీశైలం , భద్రాచలం, ఇలా కొన్ని పుణ్య క్షేత్రాలకు తప్ప అమ్మ ఎక్కడికీ తీసికెళ్లలేదు..

హాల్లో శరీష ఏదో చదువుకుంటోంది ..

టి వి ఆన్‌లో ఉంది .. కానీ, ఆడియో రావడంలేదు.. శరీష పూర్తిగా వాల్యూమ్ తగ్గించి సోఫాలో కూర్చుని ఏదో చదువుకుంటోంది ..ఎప్పుడూ అంతే .. టి వి ఆన్‌లో ఉంటుంది .. కానీ సౌండ్ ఉండదు.. అది మరీ చిరాకు ఆదిత్యకి .. టి వి అన్నా మోగుతుంటే ఇంట్లో కాస్త సందడిగా అనిపిస్తుంది .. ఛీ .. ఎవరన్నా ఇలా ఉంటారా?

ఏమిటీ జీవితం, .. ఆదిత్యకి అర్థం కాలేదు.. ఎందుకిలా? అందరికన్నా విభిన్నంగా ఉంటున్నాం మేము అనే ఆలోచన, ఇతరులతో పోల్చుకుని బాధపడే తత్వం ఈ మధ్యే అతనిలో కలుగుతోంది .. చాలాసార్లు శరీషను అడగడానికి ప్రయత్నించి భంగపడడం అతనికి తెలుసు .. ఆమెని గుచ్చి, గుచ్చి అడిగి తన మనసులో కలిగే అనేక సందేహాలకు సమాధానం పొందే సాహసం ఆదిత్య చేయలేకపోతున్నాడు.. దానికి కారణం శరీష గాంభీర్యం ..

శరీష వయసు 42,43 ఉండచ్చు .. కానీ నిత్యం యోగాసనాలు వేయడం వలన సన్నగా, నాజూగ్గా, ముప్ఫై ఏళ్ల యువతిలా ఉంటుంది .. గులాబీ రంగులో ఉండే శరీషకి నల్లటి ఉంగరాలు జుట్టు ప్రత్యేక ఆకర్షణ .. ఆమె స్టేట్ బ్యాంక్‌లో మేనేజరు .. అంతేకాదు.. ఆమెకి చాలా యాక్టివిటీస్ ఉన్నాయి .. ఎప్పుడూ బిజిగా ఉంటుంది ..పుస్తకాలు చదువుకుంటూ, ఏవో రాసుకుంటూ ఇంట్లో ఉన్నప్పుడు కూడా బిజీగానే ఉంటుంది .. బ్యాంకుకి వెళ్లడం రావడం, ఆదిత్యని కాస్సేపు చదువుకో అని పోరి, అతను చదువుకోడానికి గదిలోకి వెళ్లగానే తన పని తను చేసుకుని టి వి ఆన్ చేసి కూర్చుని పుస్తకాలు చదువుకుంటూ ఉంటుంది .. శరీష ట్రైబల్స్ మీద ఎం ఫిల్ చేస్తోంది ..

గ్రాడ్యుయేషన్ పూర్తి కాగానే తన క్లాస్‌మేట్ లతీఫ్‌ని ప్రేమించి, తల్లి, తండ్రుల్ని ఎదిరించి పెళ్లి చేసుకుంది ..

లతీఫ్ ముస్లిం. శరీషవాళ్లు బ్రాహ్మలు గుంటూరు దగ్గర కారంపూడి శరీష వాళ్ల ఊరు .. ఆ ఊళ్లో శరీష తండ్రి కరణీకం చేసేవాడు .. ఎన్టీ రామారావు కరణాలను తీసేయడంతో అదే ఊళ్లో ఉన్న ఆస్తి కాపాడుకుంటూ, గౌరవంగా ఊరివాళ్లతో మర్యాద, మన్నన పొందుతూ బతికేవాళ్లు శరీష తల్లి , తండ్రి .. శరీష ఒక్కతే కూతురు .. ఆమె పుట్టినపుడు తల్లి లలితకి బాగా జబ్బు చేయడంతో డాక్టర్లు మరోసారి ఆమె గర్భం దాలిస్తే ప్రాణానికే ముప్పు

అని చెప్పడంతో ఆ ప్రమాదం జరక్కుండా జాగ్రత్త పడ్డారు దంపతులు .. శిరీషని గారాబంగా చూసుకున్నారు .. శిరీషలో మొండితనానికి, పెంకి తనానికి అది ఒక కారణం ..

రెండోది ఆ ఊళ్లో శిరీష పెద్ద అందగత్తెగా పేరుపొందింది . ఆ గర్వం కూడా ఆమెకి ఉండేది .. అందుకే ఎవరు చెప్పిన మాట వినేది కాదు.. తనకి ఏది తోస్తే అదే చేయడం ఆమె అలవాటు.

ఒక్క కూతుర్ని బాగా చదివించాలన్న కోరికతో టెన్త్ అవగానే ఆమెని గుంటూరు కాలేజీలో చేర్పించాడు సుబ్రహ్మణ్యం. రోజూ బస్సులో వెళ్లి రావడం .. గంట ప్రయాణం .. నాన్ స్టాప్ బస్సు దొరికితే నలభై నిమిషాలు .

శిరీష కొన్నాళ్లు అలాగే వెళ్లింది .. తరవాత తనకి బండి కొనిపెట్టమని మొండిపట్టు పట్టింది .. బండిమీద కాలేజీకి వెళ్లి వస్తుండేది .. అలాగే డిగ్రీ పూర్తి చేసింది ..

అయితే ఈ లోపలే లతీఫ్‌తో శిరీషకి పరిచయం అయింది .. అతను కూడా గుంటూరులో ఆమెతో పాటు అదే కాలేజీలో చదువుకున్నాడు.. ఇద్దరూ డిగ్రీ అయిపోగానే పెళ్లి చేసుకోడానికి నిర్ణయించుకున్నారు.

లతీఫ్ గులాబీ రంగులో, ఆరడుగుల ఎత్తుతో అందంగా ఉండేవాడు.. అతను తప్ప తనకి ఇంకెవరూ జోడీ కారని గట్టిగా నమ్మింది శిరీష .. అతన్ని పెళ్లి చేసుకుంటానంటే ఇంట్లో ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోరని కూడా ఆమెకి తెలుసు.. అందుకే పరిక్షలవగానే ఎవరికీ చెప్పకుండా ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు . పెళ్లి చేసుకుని తల్లి, తండ్రులకి చెప్పడానికి వచ్చిన శిరీషని ఒక్క కూతురు ప్రాణానికి ప్రాణం అయినా , ఆమె చేసిన పని ముందు ఆ మమకారం పనిచేయలేదు.. నిర్దయగా ఆమెని ఇంటినుంచి, ఊరునుంచి వెళ్లగొట్టాడు సుబ్రహ్మణ్యం ..

ఇద్దరూ లతీఫ్ ఇంటికి వెళ్లారు .. వాళ్లు కూడా శిరీష మతం తీసుకునే కండిషన్ మీద వాళ్ల పెళ్లిని అంగీకరిస్తామనడంతో శిరీష మతం తీసుకోడానికి ఎంతమాత్రం అంగీకరించలేదు.. చేసేది లేక ఇద్దరూ హైదరాబాదు వచ్చేసి విడిగా కాపురం పెట్టి బ్యాంకు ఎగ్జామ్, యుపి ఎస్ సి ఎగ్జామ్స్ రాయడం , లతీఫ్‌కి రైల్వేలో, శిరీషకి బ్యాంకులో ఉద్యోగాలు రావడం జరిగింది ..

అయితే ఇద్దరి మధ్యా అభిప్రాయభేదాలు రావడానికి ఎక్కువ కాలం పట్టలేదు..

ముఖ్యంగా ఆహారపు అలవాట్ల విషయంలో శిరీష లతీఫ్‌ని భరించలేకపోయింది ..

కోడి గుడ్డును కూడా ఎన్నడూ ముట్టుకుని ఎరగని కుటుంబాన్నించి వచ్చిన శిరీషకి నాన్ వెజ్ లేకుండా ముద్ద దిగని లతీఫ్‌తో నిత్యం గొడవ జరిగేది ..

అంతేకాక శిరీషను మతం తీసుకొమ్మని లతీఫ్ ఒత్తిడి చేయడం వాళ్ల మధ్య అగాధం సృష్టించింది .. ఏడాదిన్నరకల్లా ఆదిత్య పుట్టాడు.. ఆదిత్య పుట్టగానే వాళ్ల ఆచారం ప్రకారం కొన్ని తతంగాలు జరపడానికి వాళ్ల మనవడి మీద సంపూర్ణ అధికారం సంపాదించడానికి లతీఫ్ తల్లి, తండ్రి రావడం గొడవలు ఎక్కువ అవడం శిరీష బాబుని తీసుకుని లతీఫ్‌ని, ఆ ఇంటినీ వదిలి రావడం వాళ్ల పెళ్లి విడాకులతో ముగియడం అంతా మరి కొంతకాలానికి జరిగిపోయింది ..

పుట్టింటికి దూరమై, ఇటు భర్తకు దూరమైన శిరీష ఒంటరిగా మిగిలిపోయింది .. కూతురు కాపురం కొల్లేరు అయిందని తెలుసుకున్న సుబ్రహ్మణ్యం, లలిత మనసుల్లో కూతురి పట్ల వాత్సల్యం పెల్లుబుకి ఆమెని ఆదరించబోయినా తనని ఇంటి నుంచి వెళ్లగొట్టారన్న కోపంతొ వాళ్లతో శాశ్వతంగా తెగతెంపులు చేసుకుంది శిరీష .

ఆ తరవాత కొంతకాలానికి తండ్రి చనిపోయినట్టు తెలిసింది శిరీషకి .. కొడుకుని వెంట బెట్టుకుని చాలా కాలానికి తను పుట్టి పెరిగిన ఊరుకి వెళ్లింది .. అప్పుడు ఆదిత్యకి ఏడు సంవత్సరాలు .. శోక సముద్రంలో ఉన్న లలిత కూతుర్ని మనసారా ఆహ్వానించలేకపోయింది .. పరాయిదానిలా గడిపింది శిరీషి రెండురోజులు .. ఆ రెండు

రోజులు ఆ ఊరివాళ్లంతా తనని తిడుతున్న తిట్లు, చేస్తున్న విమర్శలు భరించలేక కొడుకుని తీసుకుని వెంటనే హైదరాబాదు వచ్చేసింది .. అదే ఆఖరు ఆమె తన ఊరికి వెళ్లడం .

ఆ తరవాత ఆమెకి మళ్లీ పెళ్లి చేసుకునే అవకాశం వచ్చినా చేసుకోలేదు.. పెళ్లి మీద నమ్మకం కోల్పోయిన శిరీష తన కొలీగ్ వివేక్‌తో సహజీవనం ప్రారంభించి ఐదేళ్లు అవుతోంది .. వివేక్‌ని ఒక ఆత్మీయుడిగా, ఒక బంధువుగా తప్ప ఇంకో విధంగా ఆదిత్యకి తెలియకుండా జాగ్రత్త పడింది . తన జీవితం ఎవరికీ తెలియకుండా తననెవరూ ఎలాంటి ప్రశ్నలు వేయకుండా తన చుట్టూ తానే గంభీరత అనే కంచె బిగించుకుని అందులోనే ఉంటూ ఆదిత్యను కూడా అందులోంచి బైటకి రానీయకుండా జాగ్రత్త పడుతూ ఉంటుంది . అటూ, ఇటూ కూడా బంధువులు ఎవరూ లేకపోడంతో ఆ ఇంటికి ఎవరూ రారు .

ఇదంతా తెలియని ఆదిత్య మాత్రం ఎప్పుడైనా, ఈ ఇంటికి ఎవరన్నా రాకపోతారా అని ఎదురు చూస్తూ ఉంటాడు .. తల్లి, తండ్రుల రంగు, ఆ అందం పుణికి పుచ్చుకున్న ఆదిత్య తెలివైనవాడుకూడా.. అతడు బాగా చదువుకుని మంచి పొజిషన్‌లో ఉండాలని శిరీష కోరిక.

ఆదిత్య తండ్రి గురించి అడగకుండా ఉండాలని తండ్రి లెని లోటు రానివ్వకూడదని ఎంతో ప్రయత్నించినా అప్పుడప్పుడూ ఆదిత్య తండ్రి గురించి అడుగుతుంటే శిరీషకి ఏం చెప్పలేక కోపం వచ్చేస్తుంది .. సమయానికి ఏవో కుంటిసాకులు చెప్తుండేది కానీ, తన సమాధానాలు తనకే సంతృప్తినివ్వకపోడంతో ఈ మధ్యే గట్టిగా వార్నింగ్ ఇచ్చింది .. ఇంకోసారి ఆ ప్రశ్న వేస్తే తను కూడా ఎటన్నా వెళ్లిపోతానని బెదిరించింది .. దాంతో మనసులోనే అన్ని ప్రశ్నలు దాచుకుని మౌనంగా బాధ పడడం మొదలుపెట్టాడు ఆదిత్య.

గోడ గడియారం ఎనిమిది గంటలు కొట్టడంతో శిరీష తన పుస్తకాల్లోంచి బైటకి వచ్చి ఆదిత్యా అంటూ కేకేసింది .. సమాధానం రాలేదు.. ఆమె లేచి వంట గదిలోకి వెళ్లి తయారుచేసిన వంటలు ప్లేట్లు డైనింగ్ టేబిల్ మీదకి తీసుకొచ్చి మళ్లీ ఓసారి పిలిచింది .. "ఆదిత్యా .. డిన్నర్ చేద్దాం రా .. "

ఆదిత్య పలకలేదు.. అనుమానంగా ఆదిత్య గదిలోకి వెళ్లిన శిరీష స్టడీ టేబిల్ మీద తల పెట్టుకుని నిద్రపోతున్న ఆదిత్యను చూసి గట్టిగా అరిచింది .. " ఆదిత్యా .. "

ఆదిత్య ఉలిక్కిపడి లేచాడు..

"నీకసలు బుద్ధుందా? టైం ఎంతో తెలుసా .. డిన్నర్ చేయకుండా నిద్రేంటి? ఇలా నిద్రపోతూ ఉంటే నువ్వు డిగ్రీతో చదువాపేసి గుమాస్తాగా బతకాలి చెప్తున్నా .. లే, లేచి మొహం కడుక్కునిరా .. భోంచేద్దాం .. "

ఆదిత్యకి కళ్లు మూసుకుపోతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో లేవాలని లేదు.. అన్నం కూడా తినాలని లేదు.. కానీ, ఆ మాట చెబితే ఏం జరుగుతుందో అతనికి తెలుసు .. అందుకే మత్తుగా వాలిపోతూన్నా బలవంతంగా లేచి వాష్ బేసిన్ దగ్గర కళ్లు మొహం కడుక్కుని డైనింగ్ టేబిల్ దగ్గరకు వచ్చాడు..

"కూర్చో .. "

కుర్చీ జరుపుకుని కూర్చుని కంచం ముందుకు జరుపుకున్నాడు..

888888

ఆ రోజు ఆదిత్య కాలేజీనుంచి వచ్చేటప్పటికి అపార్ట్‌మెంట్ ముందు పెద్ద లారీ ఆగి ఉంది .. చాలా ఖరీదైన సోఫాలు, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్ లాంటి పెద్ద వస్తువులే కాక, అట్ట పెట్టెలు కొన్ని, బీరువాలు, డైనింగ్ టేబిల్ . అవన్నీ లిఫ్టులో పైకి తీసికెళ్లడం జరుగుతోంది .. లిఫ్టునిండా వాళ్ల సామానే ఉంది .. ఓ ఏదో ఫ్లాట్ ఖాళీ అయినట్టుంది .. ఇంకేవరో వచ్చినట్టున్నారు అనుకుంటూ మెట్లెక్కి పైకి వెళ్లిపోయాడు..

అప్పటికి శిరీష ఇంకా రాలేదు.. అప్పుడప్పుడు ఆమె ఇలా లేటుగా రావడం అలవాటే .. ఉదయం వెళ్లేటప్పుడే చెప్తుంది .. లేటుగా వస్తాను.. నువ్వు టి వి చూస్తూ కూర్చోక చదువుకో అని .. ఆరోజూ అలాగే చేసింది ..

చస్తే చదువుకోను అనుకుంటూ కాళ్లు చేతులు కడుక్కుని ప్లాస్టిక్ డబ్బాలో ఉన్న స్వీటు, మిక్స్చర్ ప్లేటులో పెట్టుకుని వచ్చి బాల్కనీలో నిలబడ్డాడు...

ఆ బాల్కనీ ఆదిత్యకి చాలా ఇష్టం .. అక్కడి నుంచి చూస్తే బైట ఏం జరుగుతోంది తెలుస్తుంది .. శిరీష వెహికల్ కూడా సందు మలుపు తిరగ్గానే కనిపిస్తుంది .. అది చూడగానే కామ్‌గా వెళ్లి చదువుకోవచ్చు .. ఆ ధైర్యంతోటే అక్కడ నిలబడి కుతూహలంగా లారీలోంచి తీస్తున్న సామాను చూస్తున్నాడు..

ఇంతలో దాదాపు తన వయసే ఉన్న అమ్మాయి పొడుగాటి స్కర్ట్ , టాప్ వేసుకుని వచ్చి లారీ లోంచి ఒక సూట్‌కేసు చాలా అపురూపంగా తీసుకుని లోపలికి లాక్కుని వెళ్లిపోయింది .. సామాను మీద నుంచి ఆ అమ్మాయి మీదకి ఆదిత్య కాన్‌సన్‌ట్రేషన్ పోడానికి ఎక్కువ సమయం పట్టలేదు.. కుతూహలంగా చూస్తూ కూర్చున్నాడు.. ఆమె నాలుగైదుసార్లు అలా బైటకి రావడం, ఏవో సామాను తీసుకుని లోపలికిపోడం చూస్తుంటే అవేవో ఆమెకి చాలా ఇంపార్టెంట్ అనిపించింది . బహుశా ఆమె బుక్స్, బొమ్మలు అయి ఉంటాయి అనుకున్నాడు.. ఎందుకో ఆ క్షణంలో సగం సేపు  ఈ అమ్మాయితొ ఫ్రెండ్‌షిప్ అయితే బాగుండు  అనిపించింది ఆదిత్యకి .. మళ్లీ వెంటనే నిరాశగా నిట్టూర్చాడు.. అలాంటి అమ్మాయిలు చాలా మంది ఉన్నారు ఫ్లాట్స్‌లో .. తను ఎవరితో మాట్లాడడు .. తనతో వాళ్లెవరూ మాట్లాడరు .. అదేంటో అమ్మ మాట్లాడనంత మాత్రాన వాళ్లు మాట్లాడకూడదని లేదుగా .. ఈ ఫ్లాట్‌కి వచ్చి రెండేళ్లు అవుతోంది .. అప్పటి నుంచీ కూడా ఎవరితో పరిచయం లేకపోవడం విచిత్రమే అనుకున్నాడు ఆదిత్య.

అయితే, తమాషా జరిగింది .. జీవితంలో కొన్ని సంఘటనలు చాలా యాధృచ్ఛికంగా జరుగుతాయి.. కొన్ని పరిచయాలు జరగడానికి  పెద్ద ప్రయత్నాలు ఏమీ అవసరం లేదు..  మర్నాడు కాలేజీకి వెళ్లడానికి లిఫ్ట్‌లో దిగుతుంటే కనిపించింది ఆ అమ్మాయి ఆదిత్యను చూడగానే పలకరింపుగా నవ్వి "హాయ్" అంది .. ఆదిత్య ముందు ఖంగారు పడ్డాడు.. తరవాత తనూ నవ్వి హాయ్ అన్నాడు..

" మీదే ఫ్లాటు " అడిగింది ..

సెకెండ్‌ఫ్లోర్ .. 202 ..

ఓ .. మాది థర్డ్ ఫ్లోర్ .. 301 .. నా పేరు ప్రఖ్య ..

అయామ్ ఆదిత్య .. ‿

గుడ్ .. ఏం చదువుతున్నావు? ‿ వాళ్ల సంభాషణ లిఫ్టులోంచి దిగాక కూడా కొనసాగుతోంది .. ఆ సంభాషణ అలా గేటుదాకా సాగింది .. అప్పుడే ప్రఖ్య కూడా తనలాగే ఇంటర్ ఫైనల్ ఇయర్ అనీ విల్లామేరీ కాలేజీలో చదువుతోందని ఆమె, వాళ్లమ్మ ఇద్దరే ఉంటారని తెలిసింది .. అంతేకాదు...ప్రఖ్యకి కైనెటిక్ హోండా ఉంది .. బంజారాహిల్స్ నుంచి సోమాజిగూడా దాకా బండిమీద వెళ్తుంది. ఆదిత్యకి సిగ్గేసింది . ఛ తనకి బండి లేకపోడం ఏంటి, అమ్మ ఎందుకు కొనలేదో ఇవాళే తనకి బండి కొనమని అడగాలి అని నిర్ణయించుకుని ప్రఖ్యకి బై చెప్పి బస్టాప్‌వైపు వెళ్లిపోయాడు ..

అలా పరిచయమైన ప్రఖ్య అతి త్వరలోనే అతని ఒంటరి జీవితంలోకి చల్లని స్నేహ పరిమళాలను వెదజల్లుతూ ఎంటర్ అయింది. ఇద్దరూ చదివేది ఒకటే ఇద్దరి సబెజెక్ట్ ఒకటే ..  ఇద్దరూ వారి, వారి కుటుంబాల్లో ఒంటరివాళ్లే .. కాకపోతే ప్రఖ్య తల్లి పూర్తిగా అల్ట్రా మోడరన్ .. జీన్స్ ప్యాంటు, పొడుగాటి టాప్స్ వేసుకుని జుట్టు భుజాలదాకా కత్తిరించుకుని ఎప్పుడూ లూజుగా వదిలేసి ఉంటుంది . ఆమె సాఫ్ట్‌వేర్ ఇంజనీరు .. బోలెడు డబ్బు సంపాదిస్తుంది .. చాలా ఫ్రీగా, హాయిగా ఉంటుంది ఈ ప్రపంచంలో ఎవరినీ లక్ష్య పెట్టనట్టు చాలా నిర్లక్ష్యంగా, డైనమిక్‌గా ఉంటుంది ..

అంతేకాక, ఆదిత్యా, ప్రఖ్యా కాలేజీనుంచి వచ్చే టైం కూడా ఒకటే అవడం మూలాన సాయంకాలాలు కూడా రెండు, మూడు సార్లు అప్రయతంగానే ప్రఖ్య, ఆదిత్య తటస్థ పడ్డారు .. వాళు ఇంటికొచ్చే టైంకి అటు ప్రఖ్య తల్లి భానుప్రియకానీ, శిరీషకానీ ఇంటికి రారు .. అంచేత ఇద్దరూ కలిసి ప్రఖ్య ప్లాట్‌కి వెళ్లి కాస్సేపు కబుర్లు చెప్పుకుని, ఏవో చిరుతిళ్లు తినడం, శిరీష ఇంటికి వచ్చే సమయానికి తానూ  ఇంటికి వెళ్లిపోడం అలవాటు అయింది ఆదిత్యకి.

ఆ పరంపరలోనే ఆదిత్య భానుప్రియ కంటపడ్డాడు.. అతని నెమ్మది తనం, ముచ్చటైన రూపం చూసి భాను చాలా మురిసిపోయింది.. నీపేరు ఆదిత్యా .. గుడ్ మా ప్రఖ్యకి మంచి ఫ్రండ్ దొరికాడనమాట. బాగా చదువుకోండి అంటూ ప్రోత్సహించింది ప్రఖ్య ఆదిత్యని పరిచయంచేసిన రోజు ..

అయితే శి రీషకింకా ప్రఖ్య సంగతి వాళ్ల స్నేహం సంగతి తెలియదు.. ఎవరితో మాట్లాడానికి ఇష్టపడని శిరీష తను ప్రఖ్యతో మాట్లాడడం తెలిస్తే ఏం గొడవ చేస్తుందోనని  ఆవిషయం ఆమెకి తెలియకుండా జాగ్రత్త పడ్డాడు ఆదిత్య ..

ఆరోజు ఆదివారం .. శిరీష ఇల్లు క్లీన్ చేసుకుని, బట్టలు వాషింగ్‌మెషిన్‌లో వేసి, వంట పనిపూర్తి చేసుకుని అప్పుడే హాల్లోకి వచ్చింది .. టి వి ఆన్ చేయబోతుండగా  కాలింగ్ బెల్ మోగింది .. తలుపు తీసిన శిరీష ప్రఖ్యను చూసి ఆశ్చర్యపోయింది . ఎవరు కావాలమ్మా అడిగింది మృదువుగా..

నమస్తే ఆంటీ .. నా పేరు ప్రఖ్య . మేము రీసెంట్‌గా థర్డ్ ఫ్లోర్‌లోకి షిఫ్ట్ అయాము .. నేనూ ఆదిత్యా ఫ్రెండ్స్ కూడా అయాం. ఆదిత్య ఉన్నాడా .. గలగలా మాట్లాడింది .

అలాగా  తనకి తెలీకుండా ఇదంతా ఎలా జరిగింది అనే ఆశ్చర్యంతో  చూస్తూ నెమ్మదిగా అంది  లోపలికిరా ..

ప్రఖ్య లోపలికి వచ్చింది .. తన గదిలో కూర్చుని ఉన్న ఆదిత్యకి ప్రఖ్య గొంతు వినిపించింది .. చటుక్కున లేచాడు కుర్చీలోంచి . అతను బైటకి నడుస్తుండగా శిరీష స్వరం వినిపించింది .. ఆదిత్యా .. నీ ఫ్రెండు వచ్చింది ..

ఆదిత్య కొంచెం బెదురుగా అక్కడికి వచ్చాడు..

ప్రఖ్య నవ్వుతూ  హాయ్ ఆదిత్యా .. అంది

హ లో .. నవ్వుతూ అన్నాడేకానీ, అతని స్వరంలో,  శిరీష వైపు చూసిన చూపులో జంకు స్పష్టంగా గమనించిన ప్రఖ్య ఆశ్చర్యంగా చూసింది ..

ఆదిత్యా .. నాతో వస్తావా?  మాఫ్రెండ్ దగ్గర నోట్సు తెచ్చుకోవాలి ..

ఎక్కడ?  అడిగాడు ఆదిత్య

సికింద్రాబాద్ నా స్కూటీమీద వెడదాం .. ఒన్ అవర్‌లో వచ్చేద్దాం ..

ఆదిత్య శిరీషవైపు చూశాడు.. ఆడపిల్ల అంత ధైర్యంగా ఉన్నప్పుడు తన కొడుకు అలా చూడడం శిరీషకి నచ్చలేదు..

లంచ్ అయాక వెళ్లచ్చుకదా అంది ప్రఖ్యని ఉద్దేశించి .

వెళ్లచ్చు .. అయితే నేను కూడా లంచ్ చేసి వస్తాను..  లేవబోయింది ప్రఖ్య ..

మా ఇంట్లో చేయకూడదా ..  నవ్వింది శిరీష .

వై నాట్ !  భుజాలు ఎగరేస్తూ తన అంగీకారం తెలిపింది ప్రఖ్య ..

తల్లి ప్రఖ్యని అంత ఆప్యాయంగా, పాజిటివ్‌గా రిసీవ్ చేసుకోడం ఆదిత్యకి చాలా సంతోషాన్ని కలిగించింది .. హమ్మయ్య అమ్మకి ఒక్కళ్లన్నా నచ్చారు  అనుకున్నాడు..

భోజనాలు చేస్తూ అవీ, ఇవీ మాట్లాడుతోంటే ప్రఖ్య తల్లి డైవోర్స్ అని తెలిసింది. ప్రఖ్య కూడా ఆదిత్యలాగా ఒక్కతే ఆమె తల్లికి ..

శిరీషకి ఆ కుటుంబంతో స్నేహం చేసుకోవాలన్న చిన్న కోరిక అప్పుడే కలిగింది .. ఇద్దరూ ఒకటే పడవలో ప్రయాణం చేస్తున్నారు .. కాబట్టి ఆమె తనని అర్థం చేసుకోగలదు.. మిగతా వాళ్లలా మీ ఆయనేం చేస్తాడు? మీ అత్తగారు వాళ్లు రారా,, మీకెంత మంది పిల్లలు? లాంటి టిపికల్ క్వశ్చన్స్ అడగదు అలా అడిగి తనని ఇబ్బంది పెట్టదు అని ఖచ్చితంగా అనిపించింది .. అందుకే అంది ప్రఖ్యతో .. ‘ఓసారి మీ అమ్మగారిని కూడా మా ఇంటికి తీసుకురా .. ’

‘ఓ ష్యూర్ .. ’గుండ్రంగా తలతిప్పింది ప్రఖ్య .

అర గంటలో భోజనం కానిచ్చి ఆదిత్యా, ప్రఖ్యా కైనెటిక్ హోండామీద బయల్దేరారు .

తక్కువ వ్యవధిలోనే ఆదిత్యా, ప్రఖ్యల స్నేహ పరిమళం భాను, శిరీషలదాకా వ్యాపించింది .. త్వరలోనే ఇద్దరూ మంచి స్నేహితులైపోయారు .. వీకెండ్స్ ఇద్దరిలో ఒకళ్ల ఇంట్లో డిన్నర్ ఏర్పాటు చేసుకుని నలుగురూ కలిసి డిన్నర్చేయడం, ఆ తరవాత, ఆదిత్యా, ప్రఖ్యా వాళ్ల గదుల్లోకి వెళ్లిపోయి చదువుకోడం, శిరీష, భాను కూర్చుని కష్టసుఖాలు కలబోసుకోడం మామూలైంది.

భానుప్రియది కూడా లవ్ మ్యారేజ్ .. ఆమె తండ్రి పెద్ద బిజినెస్ మాన్ .. బోలెడు ఆస్తి ఉన్న కుటుంబం . చిన్నప్పటి నుంచీ భానుప్రియ పూర్తిగా స్వాతంత్ర్యం, స్వేచ్ఛగా బతకడంతో ఆమె స్వేచ్ఛా జీవితం స్పీడ్బ్రేకర్స్లేని హైవేలా మారింది .. తను చేసేది తప్పైనా, ఒప్పుగా భావించడం, అందరిచేతా అది ఒప్పని ఒప్పించేలా చేయడం భానుప్రియ ప్రత్యేకత ..

వివాహం అయిన కొద్ది రోజులకే అతనికి ఆమెలోని విశృంఖల స్వభావం నచ్చలేదు... అత్తగారి మాటకి గడ్డిపోచ విలువ ఇవ్వకుండా, ఒద్దన్న డ్రెస్ వేసుకోడం, వద్దన్న చోటికి వెళ్లడం శివప్రసాద్ తట్టుకోలేకపోయాడు.. ఫలితంగా రోజూ దెబ్బలాటలు, వాగ్వివాదాలు .. అలాగే వాళ్ల సంసారం సాగుతూ ఒక పిల్లకి తల్లి అయింది భానుప్రియ..

శివప్రసాద్ తల్లి, తండ్రులు పూర్తిగా ఆర్థడాక్స్ .. భాను వేషధారణ, ఆమె జుట్టు అలా వేళ్లాడేసుకోడం ఎప్పుడు పడితే అప్పుడు ఫోన్లో మాట్లాడుతూ ఇంట్లో వాళ్లతో మాటా, పలుకూ లేకుండా కూర్చోడం వాళ్లకి చిరాగ్గా ఉండేది .. ఆమె చక్కగా చీర కట్టుకుని, జడ వేసుకుని, జడలో మూరెడు పూల మాల పెట్టుకుని అసలు, సిసలైన తెలుగింటి ఆడపడుచులా ఉండాలని కోరిక.

కానీ అందుకు పూర్తిగా విరుద్ధం భాను.. ఫలితంగా గొడవలు, మాటల యుద్ధాలూ ..

కనీసం కూతురి కోసం అయినా తన పద్ధతులు మార్చుకుంటుందేమో అని ఆశించిన అత్తగారు, మావగారు ఆమె మారదని నిర్ణయించేసుకున్నారు . శివప్రసాద్ కూడా ఆమె ప్రవర్తనకి విసిగిపోయాడు. ఒకరోజు ఖచ్చితమైన అల్టిమేటమ్ ఇచ్చాడు.. ‘ఆడదానివి .. ఆడదానిలా ఉండు ప్రియా .. మాది పూర్తిగా సాంప్రదాయ కుటుంబం .. నీ పద్ధతులు మార్చుకోకపోతే పరిస్థితులు వికటిస్తాయి . ’

మండిపడింది .. ‘ఏం జరుగుతుంది? ’అడిగింది కోపంగా .

‘మనం విడిపోతాం . ’ఖచ్చితంగా అన్నాడు శివప్రసాద్ .

భానుప్రియ విసిగిపోయింది .. అసలే ఓర్పు, సహనం తక్కువగా ఉన్న అమ్మాయి. ఇన్నాళూ శివప్రసాద్, అతని కుటుంబ సభ్యులు తరచూ తనపట్ల చేస్తున్న కామెంట్స్, తన పట్ల ప్రవర్తిస్తున్న తీరు ఆమెకి నచ్చకపోయినా తను ఉండడం లేదా? ఇలా మాట్లాడతాడా? ఎంత ధైర్యం అనుకుంది ..

ఆఖరికి తన స్వేచ్ఛా ప్రపంచంలోకి వెళ్లిపోడానికి నిశ్చయించుకుంది .. వెంటనే కూతుర్ని కూడా తనతో తీసుకుని బైటకు వస్తూ శివప్రసాద్‌కి అల్టిమేటం ఇచ్చింది .. "నీ తల్లి, తండ్రులను కుటుంబాన్ని వదిలి వస్తేనే నా దగ్గరకు రా .. లేకపోతే రానవసరంలేదు.. "అని . శివప్రసాద్ అహాన్ని దెబ్బతీసిన ఆ అల్టిమేటమ్ పని చేయలేదు.. రెండేళ్లలో విడాకులు తీసుకుని మరో అమ్మాయిని పెళ్లి చేసుకుని అమ్మా, నాన్నలకి నచ్చినట్టు బతుకుతున్నాడు శివప్రసాద్ .

అంతా విన్న శిరీష అంది .. "బోత్ ఆర్ సేయిలింగ్ ఇన్ ద సేమ్ బోట్ .. ఇంతకాలం నీలాంటి మంచి స్నేహితురాలు లేక నా చుట్టూ నేనొక గిరిగీసుకున్నా .. అదే గిరి ఆదిత్య చుట్టూ కూడా గీశాను.. నా జీవితం వాడి మౌత్ పబ్లిసిటీ కాకూడదని .. నౌ అయామ్ హ్యాపీ భానూ .. "

భానుకూడా శిరీష స్నేహ హస్తాన్ని అపురూపంగా అందుకుంది ..

వాళ్ల స్నేహంతొ పాటే ఆదిత్యా, ప్రఖ్యల స్నేహం కూడా చిగుళ్లు తొడిగి పూలు పూయసాగింది .. కలిసి చదువుకొడం, కలిసే చాలా టైము గడపడం .. ప్రఖ్య స్వభావంలో వాళ్లమ్మే .. పూర్తి ఇన్‌డివిడ్యువాలిటీ ఉన్న అమ్మాయి .. ముక్కుకు సూటిగా వెళ్తుంది .. మనసులో ఏ భావం దాచుకోదు.. మొహాన ఫెడీమని కొట్టినట్టు సమాధానం చెబుతుంది .. అలా అని చెడ్డది కాదు... ఆమెకి భవిష్యత్తు మీద అప్పటికే ఎన్నో ఆశలు, ప్రణాళికలు .. ఆదిత్యకి అవన్నీ వింటుంటే చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుండేది .. ఇంతవరకూ నాకో లక్ష్యం అంటూ ఎందుకు లేదు? నేను భవిష్యత్తులో ఏం అవాలో ఇంకా నిర్ణయించుకోలేదెందుకు అని ఆలోచిస్తుండేవాడు..

అప్పుడప్పుడు ప్రఖ్య అడుగుతుండేది .. "నీకసలు ఒక ఎయిమ్ లేదా "అని ..

"ఉంది లేకేం .. నేను ఒక మంచి అమ్మాయిని పెళ్లి చేసుకుని .. బోలెడు మంది పిల్లల్ని కంటాను... ఇల్లంతా కళకళ్లాడుతూ ఉండాలి .. నాకీ ఒంటరి తనం బోర్ కొట్టేసింది .. ఎంచక్కా ఇంటినిండా మనుషులుంటే ఎంత బాగుంటుంది? "

ఆమెచిత్రంగా చూస్తూ అనేది .. "అంత మంది ఇంట్లో ఉంటే చికాగ్గా ఉండదూ .. చదువెలా సాగుతుంది?

"ఏం? గంపెడు పిల్లలున్న ఇళ్లల్లో పెద్ద చదువులు చదువుకున్న వాళ్లు లేరా "అని అడిగాడు ఆదిత్య ..

"ఏమో బాబూ .. నాకు చాలా బొర్ అంత మంది ఉంటే .. హాయిగా ఎంచక్కా ఒక్కళ్లమే ఉంటే హాయిగా వితవుట్ డిస్టర్బెన్స్ చదువుకోవచ్చు, రాసుకోవచ్చు, ఏదైనా చేసుకోవచ్చు . "

ప్రఖ్య మాట్లాడుతుంటే ఆదిత్యకి చాలా ఆశ్చర్యంగా , అబ్బురంగా కూడా ఉంటుంది .. తన అభిప్రాయాలు అలా కుండబద్దలు కొట్టినట్టు చెప్పేస్తుంది .. ఎంతైనా ప్రఖ్యకి చాలా ధైర్యం అనుకుంటుంటాడు..

పొట్టిగా ఒత్తుగా ఉండే వంకీల జుట్టు క్లిప్పు పెట్టి వదిలేసి, ఎప్పుడూ షార్ట్స్, జీన్స్, టీ షర్ట్స్‌లో ఎక్కువగా కనిపించే ప్రఖ్యతో స్నేహాన్ని చాలా గొప్పగా భావిస్తాడు ఆదిత్య .. ఇంతకాలం ఈ అమ్మాయి తన జీవితంలోకి రాకపోడం పెద్ద లోపంలా అనిపిస్తుంది అతనికి.

ప్రఖ్య కూడా అతనితో మాట్లాడేప్పుడు, అతనితో కలిసి బైటికి వెళ్లినప్పుడు కానీ ఆ అమ్మాయిలో ఎలాంటి జంకు, గొంకు లేకపోడం కూడా చిత్రంగానే అనిపిస్తుంది ఆదిత్యకి .. అతనికి మాత్రం ఆమె పక్కన ఉంటే ఏదో ఒక కొత్త లోకంలో ఉన్నట్లు ఉంటుంది .. ఆమె దగ్గర్నించి వెళ్లిపోతుంటే ఎందుకు వెళ్లాలి అనుకుంటాడు..

రాత్రి పదిన్నరదాకా కలిసి చదువుకుని పడుకోడానికి తన ఫ్లాట్‌కి వెళ్లడం ఆదిత్యకి అసలు ఇష్టం లేదు..

కానీ, పదికాగానే శిరీష దగ్గర్నించి ఫోన్ .. "ఆదిత్యను పంపించు భానూ .. పడుకుంటాడు.. లేకపోతే పొద్దున్నే లేవడు "అంటూ ..

ఆమె ఫోన్ రావడం ఆలస్యం భాను కూడా "ఛలో ఆదిత్యా .. గో హోమ్ .. "అని పంపిస్తుంది .. ప్రఖ్య ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయదు.. "ఓ కె ఆదిత్యా .. గుడ్‌నైట్ .. "అని చెప్పేస్తుంది ..

ఆదిత్య ఇక్కడే పడుకోవచ్చుకదా మమ్మీ అని ప్రఖ్య అంటే బాగుండు అనుకుంటాడు..

కానీ అలా ఎప్పుడూ అనలేదు..

అలాగే వాళ్లిద్దరి ఇంటర్ ఎగ్జామ్స్ అయిపోయాయి ..

మధ్య, మధ్య ప్రఖ్య క్లాస్‌మేట్స్ ఇద్దరు ప్రఖ్యతో చదువుకోడానికి వస్తుంటారు .. అలాంటప్పుడు ఆదిత్య వెళ్లడు.. వాళ్లముందు బిడియంగా, సిగ్గుగా ఉంటాడు.. ప్రఖ్య వాళ్లని పరిచయం కూడా చేసింది .. కానీ, ఎందుకో ప్రఖ్యతో ఉన్నట్టు వాళ్లతో ఉండలేకపోయాడు.. అంతేకాక, ప్రఖ్య మెరిట్ స్టూడెంట్ అవడం చేత ఆ పిల్లతో కలిసి చదువుకోడం వలన ఆదిత్య మార్కుల్లో తేడా వచ్చింది .. అది శిరీషకి చాలా సంతోషాన్ని కలిగించింది . ఫర్వాలేదు.. ప్రఖ్య తో స్నేహం అయాక ఆదిత్య చదువులో కాస్త ప్రోగ్రెస్ అయాడు అనుకుంది శిరీష ..

ఇప్పుడు శిరీష, భానుల మధ్య సాన్నిహిత్యం మరింత ఎక్కువైంది .. వ్యక్తిగత విషయాలు మాట్లాడుకునేదాకా వచ్చింది ..

నువ్వెందుకు మళ్లీ పెళ్లి చేసుకోలేదు ఓరోజుఅడిగింది శిరీష భానుప్రియని ..

చేసుకోవచ్చు .. కానీ, ప్రఖ్య కొంచెం సెటిల్ అయాక చేసుకుందాం అని ఊరుకున్నాను... ఇప్పుడు చేసుకుంటే తను డిస్టర్బ్ అవుతుందేమో అని నా భయం అంది భానుప్రియ ..

మరి నువ్వు .. సందేహంగా అడిగింది భాను..

శిరీష నవ్వింది .. నాకెందుకో పెళ్లి అంటే కమిట్‌మెంట్ అనిపిస్తుంది భానూ .. పెళ్లి చేసుకున్నాక మళ్లీ పిల్లలు .. నాకెందుకో ఇప్పుడు పిల్లల్ని కని, మళ్లీ వాళ్లని పెంచి పెద్ద చేయడం అంతా రిస్క్ అనిపిస్తుంది .. నాకిలాగే బాగుంది .. ఐ లవ్ వివేక్ .. హి లవ్స్ మి. ఎప్పుడు కావాలంటే అప్పుడు సరదాగా గడిపేస్తాం .

ఆదికి తెలుసా ఈ విషయం ..

ఏమో .. వాడూ పెద్దవాడవుతున్నాడు.. తెలుసుకుంటాడు.. నేనేదో పెద్ద విశేషంలా చెప్పాలనుకోడంలేదు..

వాడికిష్టం లేకపోతే మీ బంధం ..

వాడు మగపిల్లాడు భానూ .. ఇంజనీరింగ్‌లో సీటొస్తే వేరే ఊరు పంపిస్తాను... హాస్టల్‌లో ఉంటాడు.. ఆ తరవాత జాబ్ ఎక్కడో వస్తుంది .. వాడి దారిన వాడు వెళ్తాడు.. నా జీవితం మీద వాడి ఇష్టా ఇష్టాల ప్రసక్తికి అవకాశం ఏం ఉంటుంది?

భానుక్కూడా శిరీష చెప్పింది సబబుగానే తోచింది ..

కాకపోతే పిల్లల చదువుల విషయంలో మాత్రం ఇద్దరూ ఒకటే విధంగా ఆలోచిస్తారు... వాళ్లు ఇంజనీర్స్ అవాలి .. అంతే .

ఆ రోజు కూడా ఆదిత్య , ప్రఖ్యా ఐ ఐ టి కి ప్రిపేర్ అవుతున్నారు ..

ప్రఖ్య రూమ్ చాలా బాగుంటుంది .. దోమతెరతో ఉన్న ఖరీదైన మంచం .. మంచం మీద రక,రకాల టెడ్డీబేర్స్ .. మంచం వెనక గోడకి ప్రఖ్య వాళ్లమ్మ తీయించుకున్న ఫోటోలు .. పక్కనే చిన్న టేబిల్ .. దానిమీద టేబిల్ ల్యాంప్ .. అన్ని కాలాల్లోనూ మంద్రంగా తిరిగే ఏ సి .. ప్రఖ్య వాళ్లు ఆ ఫ్లాట్ అద్దెకి తీసుకోడం విచిత్రంగా అనిపిస్తుంది ఆదిత్యకి .. తమకన్నా వాళ్లే రిచ్ .. మరెందుకు అద్దెకి తీసుకున్నారు.. స్వంత ఫ్లాట్ ఎందుకు లేదు..

అదే అడిగాడు ఆ రోజు .. ప్రఖ్యని .

మీకు ఓన్ హౌజ్ లేదా ప్రఖ్యా ..

లేకేం ఉంది .. అక్కడి నుంచే మేము ఇక్కడికి షిఫ్ట్ అయాం ..

అదేంటి సొంత ఇంటినుంచి ఎవరన్నా అద్దెకి మారతారా?

మారరు .. కానీ, మమ్మీకి అక్కడ ఉండడం ఇష్టం లేదు... పైగా మమ్మీ ఆఫీసుకి ఇది బాగా దగ్గర . మా ఇల్లు తార్నాకాలో ఉంది .. అది రెంట్‌కి ఇచ్చి ఇక్కడికి షిఫ్ట్ అయాం .. అంది .

ఓ .. సరేగానీ నాకు చదివి, చదివి బోర్‌గా ఉంది ... నీకు లేదా? అడిగాడు.. నిజంగానే అతనికి చదువు అంటే చిరాకేస్తోంది . నిద్ర లేచిన దగ్గర్నించీ పుస్తకాలతోటే జీవితం అనిపిస్తోంది .. ఒక రిక్రియేషన్ లేదు పాడులేదు... ఏదన్నా మూవీకి వెళ్లచ్చు కదా అనిపించింది .

ఏం చేద్దాం అడిగింది ప్రఖ్య .. ఆమె టేబిల్ మీదకు కొంచెం ఒంగి నోట్స్ రాస్తోంది ..

అలా రాస్తే చదివనవన్నీ బాగా గుర్తుంటాయని ప్రఖ్య అలా రాస్తుంది .. ఆదిత్య చేత కూడా రాయిస్తుంది ..

అలా ఒంగినప్పుడు అస్పష్టంగా కనిపిస్తున్న ఆమె కంఠం కింది భాగం మొదటిసారి చూశాడు ఆదిత్య .. ఒళ్లంతా జివ్వు మన్నట్టు అయింది .. అలా చూడాలని ఇంకా ఏదో కనుక్కోవాలని అతను ఆమెకి మరింత చేరువగా జరిగి నోట్సు చూస్తున్న నెపంతో టీ షర్టు లోపలికి తొంగిచూడసాగాడు.. తెల్లగా, వెన్నముద్దల్లా కనిపిస్తున్న ఆమె నవయవ్వన సౌందర్యం అతడిని కాస్సేపు విచలితుడిని చేసింది .. టీషర్టు వేసుకుంటే ప్రఖ్య చాలా బాగుంటుంది .. చాలా మంది అమ్మాయిలు టీ షర్ట్స్‌లో కనిపిస్తూనే ఉంటారు .. కానీ, ప్రఖ్యని చూసినట్టు వాళ్లని ఎన్నడూ చూడలేదు... ఈరోజు దగ్గరగా కనిపిస్తున్న ప్రఖ్య అతడికి వింతగా , గమ్మత్తుగా ఉంది .. ఎంత ప్రయత్నించినా చూపు తిప్పుకోలేకపోతున్నాడు..

మాట్లాడవేం? ఏం చేస్తున్నావు? అంటూ తలెత్తిన ప్రఖ్య ఆదిత్య దృష్టి గమనించింది .. చిరుకోపంతో ఏయ్ బాడ్‌బోయ్ ఏంటి చూస్తున్నావు? అంటూ చేతులు రెండూ వెనక్కి పెట్టి టీ షర్టు వెనక్కి లాక్కుంది .. ఆదిత్య ఖంగారుపడ్డాడు..

సారీ అన్నాడు..

ఇట్స్ ఓ కె .. చెప్పు. బోర్ కొడుతోంది అన్నావు కదా .. ఏం చేద్దాం కాస్సేపు క్యారమ్స్ ఆడదామా? నాక్కూడా బోర్‌గా ఉంది..

ఒద్దు .. ఏదన్నా మూవీకి వెడదాం అన్నాడు..

మూవీనా? ఇప్పుడా? మమ్మీ చంపేస్తుంది.. ఆంటీ కూడా .. ఓ పని చేద్దాం నా దగ్గర డి విడిలు ఉన్నాయి .. ప్లే చేస్తా ఓ కె .. మమ్మి రాగానే ఆఫ్ చేయచ్చు .

ఓ కె .. ఏం సినిమాలున్నాయి.. హుషారుగా అంగీకరించాడు..

చూద్దాం రా .. అంటూ టేబిల్ ముందునుంచి లేచి హాల్లోకి నడిచింది .. షో కేసులో ఉన్న డి విడి ఫోల్డర్ తీసి డి వి డిలు

అన్నీ చూస్తూ, బొబ్బిలిరాజా .. గంగ, మంగ, కృష్ణవేణి .. అంటూ ఒక్కో డి వి డి తీసి పేర్లు చదువుతూంటే ఇది చూద్దాం అంటూ చిత్రం సినిమా డి వి డి తీసాడు ఆదిత్య ..

యా ..గుడ్ మూవీ ఇదే చూద్దాం .. అంటూ ఫోల్డర్ మూసేసి డి వి డి తీసుకుని ప్లేయర్ దగ్గరకు వెళ్లి డి విడి పెట్టి, ఆన్ చేసింది .. సోఫాలో సెటిల్ అయాడు ఆదిత్య .. రా అన్నాడు ఆమెకి తన పక్కన చోటు చూపిస్తూ ..

వెయిట్.. తింటానికి ఏమన్నా తెస్తా .. అంటూ కిచెన్‌లోకి వెళ్లి ఒక బౌల్ నిండా జంతికలు తీసుకొచ్చింది .. ఇద్దరూ పక్క, పక్కనే కూర్చుని జంతికలు తింటూ సినిమా చూడ్డంలో మునిగిపోయారు ..

కాస్సేపు చూసేటప్పటికి ఆదిత్య ఒళ్లంతా వేడిగా ఆవిర్లు వస్తున్నట్టు అయింది .. నరాలన్నీ తిమ్మిరిపట్టినట్టు అయాయి .. ఓరగా ప్రఖ్య గుండెల్లోకి తొంగి చూడ్డానికి ప్రయత్నిస్తూ అటూ, ఇటూ కదలుతుంటే అతని చేతులు, తొడలు, ఆమెకి తగలుతూ ఆమెలో కూడా చిత్రవిచిత్రమైన అనుభూతి కలగసాగింది .. కావాలని అతనికి కొంచెం

దగ్గరగా జరిగింది .. ఆమె అలా జరగడంతో ఆదిత్య కొంచెం చనవుగా, హుషారుగా మారాడు.. తనూ జరిగీ, జరగనట్టు మరింతగా ఆమెకి దగ్గరగా జరిగి సినిమా చూస్తున్నట్టే చూస్తూ కొంచెం సాహసం చేశాడు. నెమ్మదిగా ఆమె చేతి మీద చేయి వేశాడు..

ఊ .. అంటూ చేయి తోసేసింది ప్రఖ్య ..

ఆదిత్యకి భయం వేసింది .. కొంచెం ఎడంగా జరిగాడు..

అతని చేయి తన చేతిమీద పడగానే ప్రఖ్యకి ఒళ్లంతా జివ్వుమంది .. గుండెల్లో చిన్న, చిన్న మువ్వలు కుప్పగా పోసినట్టు అనిపించింది .. ఆ స్పర్శ తీయగా, హాయిగా ఉంది .. వెచ్చని ఆవిర్లు కమ్మసాగాయి .. అయితే ఆడపిల్లలో సహజంగా ఉండే బిడియంతో అతని చేయి తోసేసి, అతను ఎడం జరగడంతో నిరుత్సాహంగా అనిపించింది .. ఓరగా అతనికేసి చూసింది .. హర్ట్ అయినట్టు మొహం ఎర్రగా చేసుకుని కూర్చున్నాడు..

ఆమె చూపులు మళ్లీ టి వి మీదకి మళ్లాయి. హీ రో, హీరోయిన్ వాళ్లకి లభించిన ఏకాంతాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు .. అతని చేతులు ఆమెని ఏదేదో చేస్తున్నాయి ..

ప్రఖ్యకి ఇంక దూరంగా కూర్చోవాలనిపించలేదు..

చటుక్కున ఆదిత్యకి దగ్గరగా జరిగి అతని చేయి చేతిలోకి తీసుకుని గోముగా అంది . సారీ, కోపం వచ్చిందా?

ఆదిత్య లేదు.. అంటూ ఆ చేయి పట్టుకుని నొక్కాడు..

సినిమా బాగుంది కదా .. అంది ప్రఖ్య..

చాలా .. తిరిగి మరి కొంచెం ఆమెకి దగ్గరగా జరిగాడు..

కానీ, నాకు భయంగా ఉంది చూడాలంటే . వేరే మూవీ పెట్టనా? అడిగింది ..

ఒద్దొద్దు . బాగుంది .. ఇదే ఉంచు అన్నాడు ఖంగారుగా .

ఆమె మాట్లాడలేదు.. ఎందుకో ఆమెకి అతనికి కొంచెం ఆనుకుని కూర్చోవాలనిపించింది .. గుండెలు బరువుగా అనిపించసాగాయి. హటాత్తుగా టీ షర్ట్ టైట్‌గా అయినట్టు ఉక్కిరి, బిక్కిరిగా అనిపించింది ..

ఆదిత్య కూడా తనని , సినిమాలో హీరోలాగా ఏదన్నా చేస్తే బాగుండు అనిపించసాగింది ..

ఆదిత్యక్కూడా అదే పరిస్థితి .. ఒళ్లంతా ఆవిర్లు వస్తున్నట్టుగా ఉంది .. అతని చూపులు సినిమా మీద ఉన్నా, అంతరంగంలో ప్రఖ్య గుండెలని చూడాలని, తాకాలని అనిపిస్తోంది .. ఆమెని ముద్దు పెట్టుకోవాలని కూడా అనిపిస్తోంది .. కానీ, భయంగా అనిపిస్తోంది .. ఎంత దగ్గరగా ఉన్నా, ఆమె వంటిమీద చేయి వేయాలంటే చేతలు వణుకుతున్నాయి ..

ఇంతలో సడన్‌గా కరెంట్ పోయింది ..

ప్రఖ్య సన్నగా అరిచి ఆదిత్యని అల్లుకుపోయింది ..

ఏ ఏమైంది? అడిగాడు ఖంగారుగా ఆమెని పట్టుకుని ..

కరెంటుపోతే నాకు భయం .. భయంగా అంది ప్రఖ్య ..

ఆదిత్య ఇంక ఆగలేకపోయాడు.. ఆమెని ఒళ్లోకి లాక్కున్నాడు.. అతని ఒళ్లొ ప్రఖ్య వెల్లకిలా పడిపోయింది .. ఒంగి ఆమె పెదాలు, బుగ్గలు, కళ్లు ముద్దులతో నింపేయసాగాడు..

ప్రఖ్య ఉక్కిరి,బిక్కిరి అవుతూ మత్తుగా మూలుగుతూ అతడిని దగ్గరకు లాక్కుంది ..ఇద్దరూ ఒకరి కౌగిట్లో ఒకరు ఒదిగిపోయారు .. ఆదిత్య ఆమె చేతులు, భుజాలు, తడిమేస్తూ, రాసేస్తూ ప్రఖ్యా నాకేదో అవుతోంది .. ఐ వాంట్ యూ అంటూ ఆమెని నలిపేయసాగాడు..

ఆదిత్యా! ఏయ్ . వాటీజ్ దిస్ అని అడుగుతూనే అతనికి మరి కొంచెం దగ్గరగా జరిగింది .. ఇప్పుడు ఇద్దరి మద్యా గాలి దూరే సందు కూడా లేదు…

కిస్ అన్నాడు ఆదిత్య ..

చీ పో .. అరచేతుల్లో మొహం దాచుకుంది ..

రెండు చేతుల్తో అచ్చు సినిమాలో హీరోలాగానే ఆమెని చుట్టేసి మత్తుగా పిలిచాడు.. ప్రఖ్యా ..

ఆమె పలకలేదు…

వాళ్ల వయసు, వాళ్ల మానసిక స్థితి, వాళ్లు చూస్తున్న సినిమా, ఆ ఏకాంతం వాళ్లిద్దరినీ స్నేహపు సరిహద్దునుంచి అవతలకి విసిరేసేనట్టు వాళ్లు శృంగార సామ్రాజ్యం వైపు విశృంఖలంగా ప్రయాణించడానికి ఆయత్తం కాసాగారు..

ఇంతకాలం ఎలాంటి వికారాలు లేకుండా సాగిన మంచి స్నేహంలో ఇప్పుడు కామప్రకంపనలు రేగాయి .. కేవలం స్త్రీ , పురుషుల మధ్య ఏర్పడే కెమిస్ట్రీకి నాంది పడింది .

ఎంత గొప్పవాళ్లైనా స్త్రీ పురుషుల మధ్య స్నేహం స్నేహంలా ఎన్నడూ ఉండదు.. అది ఒక అడుగు ముందుకేసి హద్దులు దాటితేనే వాళ్లు స్త్రీ పురుషులు అవుతారేమో ..

టీనేజ్‌లో ఉన్నారు.. ఇద్దరి మధ్యా సాన్నిహిత్యం ఉంది .. ఒక అవగాహన ఉంది .. ఒకళ్ల మీద ఇంకొకళ్లకి ఇష్టం ఉంది .. ఆ ఇష్టం స్నేహంవరకా? ఇంకా ఏదన్నానా అని ఆలోచించే అవకాశంకానీ, అవసరంకానీ వాళ్లకు రాలేదు.. అంచేత దాదాపు ఎనిమిది నెల్లనుంచీ కలిగిన సాన్నిహిత్యం చాలు వాళ్ల మధ్య కెమెస్ట్రీ కుదరడానికి ..

ఆదిత్యకి తోటి మనిషి అది ఆడైనా, మగైనా స్పర్శ కావాలి . ఆ స్పర్శలో ఆత్మీయత కావాలి .. అందుకే అతను ఆమెని తాకడానికి సందేహించలేదు..అయితే తను తాకింది అమ్మాయి శరీరాన్ని .. ఆ అమ్మాయి తనకెంతో ఇష్టమైన అమ్మాయి .. అప్పుడే అమ్మాయిలో అందాలు గమనించిన అనుభూతి గుండెల్లో తాజాగా తీయని తలపుల్ని రేపుతోంది .. ఆ అమ్మాయి శరీరం తాలూకు స్పందనలు మదురానుభూతులు కలిగిస్తున్నాయి. మనసుకీ, దృష్టికీ కూడా మైకం కలిగి ఆ మైకంలో పరిసరాలను, సమస్త ప్రపంచాన్ని మర్చిపోయాడు..

ఆ క్షణం .. ఒకానొక మధుర క్షణం వాళ్ల స్నేహంలో ఒక అడుగు ముందుకు పడి మూడు ముద్దులు, ఆరు కౌగిలింతలదాకా రావడానికి దోహదం చేసింది …ఇప్పుడు ఇద్దరికీ ఏమీ తెలియడం లేదు.. వారి, వారి శారీరక స్పర్శలో కలుగుతున్న అనేక రకాల రసానుభూతితో నిలువెల్లా తడిమేస్తున్నాడు ఆదిత్య .

అక్కడ ఆ సోఫాలో మరో టీనేజీ లవ్ స్టోరీకి ముహూర్తం కుదిరింది .. ఆ క్షణంలో కరెంటు మళ్లీ వచ్చిందని, లైట్లు వెలుగుతున్నాయని స్పృహ కూడా లేకుండా ఒకళ్ల నొకళ్లు అల్లుకుపోతున్నారు ..

ఇంకా ఏదో కావాలి .. ఏదో చేయాలి .. ఎం చేయాలో అతనికి తెలీడం లేదు.. అందిన చోటల్లా ముద్దు పెట్టేస్తూ ఆమెని అల్లుకుపోతున్నాడు.. అతని వేడి స్పర్శకి ఆమె అణువణువూ సహకరిస్తోంది .. ఆ క్షణంలో ఇద్దరికీ తామిద్దరి మద్యా ఇలాంటి సందర్భం వస్తుందన్న ఆలోచన లేకపోడంతో అనుకోకుండా కలుగుతున్న పరస్పరాలింగన మధురానుభూతుల్లో ఇద్దరికీ కాలం తెలియడంలేదు… సడన్‌గా కాలింగ్ బెల్ వినిపించింది .. ప్రఖ్య ఉలిక్కిపడి అతనికి దూరం జరిగింది .. ఆదిత్య కూడా ఒక్కసారిగా తగ్గిపోయిన ఆవేశంతో నీరసంగా లేచాడు సోఫాలోంచి ..

క్లిప్పు పడిపోయి జుట్టంతా వీపుని ఆక్రమించింది .. సోఫా మీద ఉన్న కుషన్స్ చెల్లా చెదురుగా కిందపడ్డాయి . ఆదిత్య క్రాఫ్ బాగా చెరిగిపోయింది ..క్రాఫ్ సరిచేసుకుని కింద పడిన కుషన్స్ తీసి సరిగా పెట్టేశాడు..

కిందపడిన క్లిప్పు తీసుకుని జుట్టుకి పెట్టుకుంది . సర్దుకుని ఆదిత్యను మత్తుగా చూస్తూ అంది ఆ డి వి డి ఆఫ్ చేయి .. నేను డోర్ తీస్తాను మమ్మి వచ్చింది …

వెరీ బాడ్ మనం ఇంకా ఎంజాయ్ చేయాలి .. ఇంకేదో ఉంది .. అన్నాడు సోఫాలోంచి లేచి ఆమె దగ్గరగా నడుస్తూ..

మమ్మీ వచ్చింది .. పళ్ల బిగువున అంటూ డోర్ దగ్గరకు వెళ్లింది ప్రఖ్య ..

గతిలేదన్నట్టు నీరసంగా రిమోట్‌తో డి వి డి ప్లేయర్ ఆఫ్ చేసేశాడు ఆదిత్య ..

లోపలికి వచ్చిన భాను హాయ్ గాయ్స్ అంటూ ఇద్దర్నీ పలకరించి బ్యాగు సోఫాలో పడేసి బాత్‌రూమ్ వైపు వెళ్లిపోయింది .

ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.. వెంటనే ఇద్దరి చూపులు కిందకి వాలిపోయాయి .. వాళ్లని భానుప్రియ సరిగా గమనించలేదు.. గమనించి ఉంటే అక్కడ అప్పటిదాకా ఏం జరిగిందో ఆమె ఇట్టే చెప్పేయగలదు.. కానీ, ప్రస్తుతం ఆమె వాళ్లని చూడలేదు.. వాళ్లు ఆమె దృష్టిలో పిల్లలు ..

కానీ, ఆ పిల్లతనంలోనే తప్పు చేయడానికి కావలసిన హార్మోన్స్ వాళ్లలో ముమ్మరంగా ఉన్నాయని ఆమె గ్రహించి ఉంటే వాళ్ల భవిష్యత్తు మరోలా ఉండేది ..

శిరీషకానీ, భానుప్రియకానీ వాళ్ల స్నేహానికి హద్దులు గీయలేదు.. వాళ్ల దృష్టిలో వాళ్లింకా చిన్న పిల్లలే .. ఇప్పుడే జీవితపు సోపానపు మొదటి మెట్టు మీద ఉన్నారు .. వాళ్లకింకా జీవితంలో అతి ముఖ్యమైన దశ అనేది ఒకటి ఉందనీ, అది శృంగార జీవితం అని తెలియదని వాళ్లిద్దరి గాఢనమ్మకం ..

వాళ్లే కాదు ప్రతి తల్లి, తండ్రి కూడా అలాగే భావిస్తారు .. అందుకే ఊహించని తప్పులు జరిగిపోతుంటాయి ..

సరిగ్గా అదే తప్పు జరగడానికి నాంది ఏర్పడిన ఆ క్షణం ..ఆ పిల్లలిద్దరికీ వాళ్ల శరీరంలో వాళ్లకే తెలియని కొత్త అనుభూతులున్నాయని, అణువణువునీ చల్లబర్చుకోవాలంటే ఒకరి రాపిడి మరొకరికి కావాలని దానిపేరు ఆలింగనం అనీ, ఆ ఆలింగనమే అనేక రకాల అనుభూతులకు నాంది అనీ తెలిసిన క్షణం .. ఆ రోజు భాను రాక వారి ఆనందానికి ఆనకట్ట వేయకపోయి ఉంటే ఏం జరిగేదో .. కానీ, ఆ రోజు నుంచీ ఏ మాత్రం అవకాశం దొరికినా వాళ్లు వృధా చేయడంలేదు .. అసంకల్పిత ప్రతీకార చర్యలా ఒకరికొకరు దగ్గరవడం, ముద్దులు , కౌగిలింతలు ఇంకా ఏదో కావాలన్న తపన ప్రఖ్యలో ఆమెనింకేదో చేయాలన్న ఆరాటం ఆదిత్యలో బుసకొడుతూనే ఉన్నాయి ..

ఒకరోజు అంది ప్రఖ్య ..ఆరోజు కాలేజీ అవగానే ఇద్దరూ పార్కుకి వెళ్లారు .. దగ్గరగా కూర్చున్నారు .. ఒకరి చేయి మరొకళ్లు పట్టుకుని నలిపేస్తూ, మరింత, మరింత దగ్గరగా జరుగుతూ మధ్య, మధ్యలో ఎవరూ తమని చూడట్లేదని నిర్ధారించుకుని ముద్దులు పెట్టుకుంటూ కూర్చున్నారు ..ఆదిత్యకి బాగా దగ్గరగా జరిగి హత్తుకుంటూ అంది ప్రఖ్య ..

ఆదీ! రాత్రిపూట నాకెలాగో ఉంటోంది ఒంటరిగా పడుకుంటే ఇవే ఆలోచనలు .. నువ్వు నన్ను ముద్దుపెట్టుకున్నట్టు, ఇంకా ఏదో చేస్తున్నట్టు ..

ఏం చేసాను? అల్లరిగా అడిగాడు ఆదిత్య ..

చెక్కిళ్లు ఎర్రబడగా ఏమో .. తెలియదు.. కానీ, ఏదేదో అవుతోంది ..

నాక్కూడా .. అన్నాడు..

మనం ఇంకా ఏదో ఎంజాయ్ చేయాలి అనిపిస్తోంది ..

అవును .. చేయాలి ..

ఎలా? నీకు తెలుసా ..

కొంచెం, కొంచెం ..

ఎలా?

అమ్మా, వివేక్ అంకుల్ బెడ్‌మీద పడుకున్నప్పుడు చూశాను..

అవునా .. ఆశ్చర్యంగా చూసింది ప్రఖ్య .. ఆంటీకి కూడా లవ్ ఎఫైర్ ఉందా?

ఏం మీ అమ్మకూ్కడా ఉందా?

ఉంది .. అమ్మ ఫ్రెండ్ ఇంటికి రాడు .. అమ్మే వెళ్తుంది .. ఆఫీస్ నుంచి వస్తూ, వస్తూ కాస్సేపు అతనితో స్పెండ్ చేసి వస్తుంది.

అతను మీ మమ్మీ లవర్ అని ఎలా చెప్పగలవు? .. ఫ్రెండ్ కావచ్చేమో..

ఫ్రెండ్ అయితే అతని ఒడిలో మమ్మీ ఎందుకు పడుకుంటుంది?

వాట్..

అవును. అతనెవరో ఏంటో నాకేం తెలియదు.. అమ్మ ఏమీ చెప్పదు.. నేనే అర్థం చేసుకున్నాను..ఎప్పుడన్నా ఒకసారి మా ఇంటికి వస్తాడు .. వచ్చినపుడు ఇద్దరూ జోక్స్ వేసుకుంటారు .. మధ్య, మధ్య అమ్మని కిస్ చేస్తాడు..

నాకూ అంతే .. మా అమ్మ కూడా నాకేం చెప్పలేదు.. ఎందుకంటే వివేక్ అంకుల్ వచ్చినపుడు అమ్మ వేరుగా ఉంటుంది .. చాలా హ్యాపీగా, యాక్టివ్‌గా ఉంటుంది .. నేను మెలకువగా ఉన్నంతసేపూ వాళ్లిద్దరూ టి వి చూస్తూ కూర్చుంటారు .. నన్ను త్వరగా పడుకో ఆదీ అంటూ ఉంటుంది అమ్మ .. నేను పడుకోగానే ఇద్దరూ అమ్మ బెడ్‌రూమ్‌లోకి వెళ్లిపోతారు . .

ఒకరోజు నేను నిద్రలోంచి అర్ధరాత్రి లేచి మంచినీళ్లకోసం హాల్లోకి వెళ్లాను.. అమ్మ గదిలోంచి మాటలు వినిపిస్తుంటే కీ హోల్‌లోంచి చూశాను..

ఏం చేశారు ?

ఆదిత్య చిలిపిగా చూశాడు.. చెప్పను.. అలా చేయగలను..

అమ్మో ! గుండెలమీద చేయేసుకుంది ప్రఖ్య .. తప్పు మనం చిన్నవాళ్లం అలాంటి పనులు చేయకూడదు..

అలాంటి పనులంటే .. తెలుసా నీకు?

ప్రఖ్య సిగ్గుతో చేతులు మొహానికి అడ్డు పెట్టుకుని తల ఊపింది తెలుసు అన్నట్టు .

ఎలా?

ఛీ పో .. నేను చెప్పను.

ప్లీజ్ చెప్పవా?

లాస్ట్ టైమ్ ఎగ్జామ్స్ టైంలో నైట్ చదువుకుంటూ బోర్ కొట్టి కాస్సేపు టి వి చూశాను.. అందులో చూపించారు .. శృంగార దేవోభవ అని కార్యక్రమంలొ చాలా, చాలా చూపించారు .. ఆ రాత్రి నాకసలు నిద్రపట్టలేదు తెలుసా ..

నేనూ చూసాను ఆ ప్రోగ్రామ్ .. మనం కలిసి చూద్దామా ఎప్పుడన్నా?

ఎప్పుడు?

నువ్వే చెప్పు .. ఒకరోజు మా అమ్మనీ, మీ అమ్మనీ ఒక దగ్గర ఉంచి మనం చదువుకుంటాం అని చెబ్దాం .. అప్పుడు చూడచ్చు .

అప్పటిదాకా నా ..

నాకూ అలాగే అనిపిస్తుంది .. ఇద్దరం ఆ ప్రోగ్రామ్ చూస్తూ .. అబ్బా తల్చుకుంటేనే ఒళ్లంతా మైకం కమ్మేస్తోంది .. ఏయ్ నాకోసారి ..

ఊ .. ఏంటి? రెట్టించింది ప్రఖ్య .

ఆదిత్య కొద్దిగా ఆమె వైపు ఒంగి నెమ్మదిగా అన్నాడు.. నాకోసారి చూపించవా?

ఒక్కసారి వంద వోల్టుల విద్యుత్‌షాక్ తగిలినట్టు నరాలన్నీ జివ్వున లాగాయి ప్రఖ్యకి .. చీ పో .. నేను వెళ్తున్నాను . చటుక్కున లేచి గిరుక్కున వెనక్కి తిరిగి పరిగెత్తింది ..

ఆదిత్య ఏయ్ ప్రఖ్యా ఆగు అంటూ వెనకాలే వెళ్లి ఆపేశాడు.. ఎలా వెల్తావు? నడిచా? అడిగాడు వెనకనుంచి జడ పట్టుకుని ఆపుతూ ..

నువ్వన్నీ పిచ్చిమాటలు మాట్లాడుతున్నావు బుంగమూతితో అంది ప్రఖ్య .

ఈ మాటలు మాట్లాడుకోడానికేగా మనం పార్క్‌కి వచ్చాం ..

అయితే ..

ఏం నీకు బాగాలేదా నేనలా మాట్లాడుతుంటే .

ప్రఖ్య మాట్లాడలేదు..

చెప్పు .. బాగా లేదా? రెట్టించాడు..

నేను చెప్పను .. పద వెళ్లిపోదాం .. బండి తీసుకురా .

ఊహు తేను.. చెప్పు .. బాగుందా? లేదా?

చాలా బాగుంది ..

అందుకే చెప్తాను ఆ కబుర్లు .. ఉండు బండి తెస్తాను.. అంటూ పార్కింగ్ ప్లేస్‌కి వెళ్లిపోయాడు ఆదిత్య .

ముసి, ముసి నవ్వులు నవ్వుకుంటూ ప్రఖ్య అతనికోసం ఎదురుచూస్తూ అక్కడే నిలబడిపోయింది ..

ఆరోజు ఆదిత్య బాల్కనీలో కూర్చుని చదువుకుంటున్నాడు.. నిజానికి చదువుకోడానికి ప్రయత్నిస్తున్నాడనాలి .. పుస్తకం చేతిలో ఉంది .. కళ్లు పుస్తకంలోని పాఠం మీద ఉన్నాయి కానీ, మనసంతా గందరగోళంగా ఉంది .. ఏదో కావాలన్న ఆరాటం.. ఏదో చేయాలన్న తపన .. ఏం చేయాలో తెలియని అయోమయం .. ఏం చేయలేకపోతున్నానన్న నిస్సహాయత ..

మెదడు స్టోర్‌రూమ్‌లా ఉంది .. పనికిరాని సామానంతా అడ్డదిడ్డంగా పడేసినట్టు , తలా,తోకాలేని ఆలోచనలు పిచ్చి, పిచ్చిగా మెదడులో రొదచేస్తున్నాయి .. దయ్యాలన్నీ కలిసి మూకుమ్మడిగా వికృతమైన నృత్యాలు చేస్తున్నట్టుగా ఉంది .. గందరగోళంగా ఉంది ..

ఐ ఐ టి పరీక్షలు దగ్గరకొస్తున్నాయి ..ఇద్దరూ కూడా ఐఐటీ, ఎంసెట్ రెండిటికీ ప్రిపేర్ అవుతున్నారు. ఒక వంక పరీక్షలొస్తున్నాయన్న టెన్షన్, మరో పక్క కాంక్షతో రగిలిపోతున్న శరీరం ..

ఆలోచనల నిండా ప్రఖ్య నిండిపోయి ఉంది . ఇప్పుడు ప్రఖ్య ఎప్పటిలా మంచి స్నేహితురాలిలా కాదు.. కేవలం అందమైన ఆడపిల్లలా కనిపిస్తోంది .. ఎదుగుతున్న గుండెలు, పొంకం సంతరించుకుంటున్న అవయవాలు, అరవిరిసిన గులాబీలా అద్భుతంగా అనిపిస్తోంది .. ఆమె అణువణువూ స్పృశించాలని , ఆమెని నలిపేయాలని అనిపిస్తోంది .

ప్రఖ్య కూడా అతనికి సహకరించడంతో అతనిలో కొత్త ఆలోచనలకు, భావాలకు ఆమె ప్రోత్సహిస్తున్నట్టుగా, తనే చేతకానివాడిలా అనిపిస్తోంది ..

ఆదిత్యకిప్పుడు తనకి మార్గం చూపించే మార్గదర్శి ఒక్క విక్రమ మాత్రమే అనిపిస్తోంది ..

అతనికి తెలుసు .. వివేక్ వస్తే శిరీష పురి విప్పిన మయూరం అవుతుంది .. తన ముందు పులిలా కనిపించే అమ్మ వివేక్ సమక్షంలో నెమలి ఎందుకవుతుందో ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది .. వాళ్లిద్దరి మధ్యా స్నేహం కాక మరేదో ఉందని తెలుసు .. త నకీ, అమ్మకీ మధ్యలో అతను ఉండడం జీర్ణించుకోలేక అతని మీద అకారణ ద్వేషం పెంచుకున్నాడు.. అతను ఇంటికి రాగానే ఆదిత్య మొహం ముడుచుకుపోతుంది .. ఎప్పుడు

వెళ్లిపోతాడా అని ఎదురుచూస్తుంటాడు.. అతను రాగానే తన గదిలోకి వెళ్లిపోయి తలుపేసుకునే ఆదిత్య ఇప్పుడు విక్రమ్ కోసం ఎదురుచూస్తున్నాడు..

పదిరోజులనుంచి వివేక్ ఎందుకు రావడంలేదో శిరీషను అడగాలని చాలాసార్లు ప్రయత్నించి అడగకుండా వెనక్కి వచ్చేశాడు.. ఇప్పుడు వివేక్ రాకకోసం శిరీషకన్నా ఆదిత్యే ఎక్కువ ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాడు.

అతను రాగానే శిరీష ఆదిత్యను గదిలోకి వెళ్లిపోయి చదువుకొ .. నీకు డిస్టర్బెన్స్ ఇక్కడ అంటూ ఆదిత్య గదిలోకి పంపించేస్తుంది .. ఎనిమిది, ఎనిమిదిన్నర కాగానే ఆదిత్యకొక్కడికే డిన్నర్ పెట్టేస్తుంది .. నేనూ అంకుల్ తింటాం .. నువ్వు తినేసి వెళ్లి చదువుకో అని డిన్నర్ చేయగానే మళ్లీ గదిలోకి తోసేసినంత పనిచేస్తుంది ..

తల్లితో కలిసి అన్నం తినాలని, ఎప్పుడన్నా తల్లే తనకి తినిపించాలని అనిపిస్తుంటుంది ఆదిత్యకి .. కానీ, ఆ ఆటలేం సాగనివ్వదు శిరీష . ఎప్పుడూ చూపుల్తో, మాటల్తో కూడా ఆమడ దూరం నిలబెడ్తుంది .. తనకీ తల్లికీ ఉన్న దూరం ఆదిత్యకి నచ్చదు.. ఇంట్లో ఉన్నది ఇద్దరే కదా .. ఇద్దరి మధ్యా ఈ దూరం ఏంటో అనిపిస్తుంది ..

అయితే వివేక్‌తో ఉన్నప్పుడు ఆమెలో మరో శిరీషను చూస్తాడు.. అప్పుడు ఆమెలో తల్లి కనిపించదు.. ఎడతెగని కబుర్లు చెప్పుకుంటారు ఇద్దరూ .. ఇద్దరూ కలిసి సరదాగా భోంచేస్తారు .. మధ్య, మధ్య పక,పకా నవ్వులు ఏవో జోక్స్ వేసుకుంటూ .. అవన్నీ చూస్తుంటే తల్లి మీద చాలా కోపం వస్తుంటుంది ఆదిత్యకి .. ఇంత సరదాగా అమ్మ నాతో ఎందుకుండదు అనుకుంటాడు.. ఒక్కోసారి వాళ్ల ఆనందం చూడలేక త్వరగా నిద్రలోకి జారుకుంటాడు..

అయితే అర్థరాత్రి బాత్‌రూమ్‌కి వెళ్లడానికో, మంచినీళ్లకోసమో లేచి హాల్లోకి వచ్చిన రెండు, మూడు సార్లు శిరీషగది తలుపులు మూసి ఉండడం చూశాడు .. ఆరోజు వివేక్ వచ్చిన రోజు అవడం కూడా తెలుసు .. కానీ తను లేచేటప్పటికే వివేక్ లేచి వెళ్లిపోడంతో తెల్లవారాక అతను రాత్రి అక్కడ ఉండిపోయాడన్న విషయం ఆదిత్యకు తెలియదనే అనుకుంటుంది శిరీష .

నిజానికి ఆ విషయం అప్పుడు సీరియస్‌గా తీసుకోలేదు ఆదిత్య .. కానీ, ఇప్పుడు ఆ విషయమే ఆదిత్య మదిలో మెలుగుతోంది .. మూసుకున్న తలుపుల వెనక ఏం జరుగుతుందో తెలుసుకోడానికి చాలా ఉద్విగ్నంగా ఎదురుచూస్తున్నాడు.. స్త్రీ పురుషుల మధ్య జరిగే శారీరక చర్య గురించి తనకు తెలియచేసే గురువు కేవలం వివేక్ ఒక్కడే ..

ఆదిత్య అసహనంగా పుస్తకంలోంచి తలతిప్పి రోడ్డు మీదకు చూశాడు.. కుర్రాళ్లు ఆడుకుంటున్నారు . ఇప్పుడతనికి ఇదివరకులా తను ఆడుకోడానికి వెళ్లాలన్న కోరికలేదు.. జీవితంలో అతి ముఖ్యమైన గొప్ప విషయం తెలుసుకోవాలి .. ఆ తెలుసుకున్న విషయం ప్రఖ్యకి తెలియచేయాలి .. వివేక్ నుంచి ప్రాక్టికల్‌గా కొన్ని పాఠాలు నేర్చుకోవాలి. శృంగార పాఠాలు నేర్చుకోవాలి .. అవన్నీ ప్రఖ్య దగ్గర ప్రదర్శించి ఆమెని ఆనంద పెట్టాలి.. స్వర్గసుఖాలంటే ఏంటో రుచి చూడాలి. అందుకే వివేక్ కోసం పదిరోజులునుంచీ ఎంతో కుతూహలంగా ఎదురుచూస్తున్నాడు..

ఆదిత్య కళ్లు మెరిశాయి .. వివేక్ మోటార్ సైకిల్ మీద సందు మలుపు తిరిగి అపార్ట్‌మెంట్ గేట్ దగ్గరకు వచ్చాడు.. ఆదిత్య ఆనందానికి హద్దులేకుండా అయింది .. అప్రయత్నంగా లోపలికి తొంగిచూశాడు.. శిరీష సోఫాలో వయ్యారంగా పడుకుని ఏదో చదువుకుంటోంది ..

వివేక్ వచ్చిన సంగతి చెప్పాడంటే ఆవిడ చేతిలో బుక్ ఎగిరిపోతుంది .. గాంభీర్యం చెదిరిపోతుంది .. మొహంలో వెలుగు, నవ్వు నిండిపోతాయి .. .. ఆదిత్యలో హుషారు ఎక్కువైంది .. చదువు మీద శ్రద్ధ పోయింది

..పుస్తకం కుర్చీలో పెట్టేసి లేచాడు.. వివేక్ ఇంట్లోకి వచ్చాక ఏం జరుగుతుందో తల్చుకుంటే నరాలన్నీ తీయగా లాగుతున్నాయి .. చూడాలి .. ఎట్టి పరిస్థితుల్లో వాళ్లేం చేస్తారో చూడాలి .. లోపలికి వెళ్లాడు..

అమ్మా .. అంకుల్ వచ్చారు .. అన్నాడు..

శిరీష పుస్తకంలోంచి తలెత్తి ఆదిత్యవైపు ఆశ్చర్యంగా చూసింది ..

ఏ అంకుల్? విస్మయంగా అడిగింది .

ఇంకే అంకుల్? వివేక్ అంకుల్ ..

ఎన్నడూ లేనిది ఇవాళ ఆదిత్య కెందుకు ఇంత సంతోషం .. వివేక్‌ని చూస్తేనే మొహం ముడుచుకునే ఆదిత్య ఇంత హుషారుగా అతని రాక గురించి తనకి చెప్తున్నాడేంటి?

అయితే ! నీకేంటిరా నీకెందుకంత సంతోషం? చిత్రంగా చూస్తూ అడిగింది ..

చాలారోజులైంది కదమ్మా అంకుల్ వచ్చి .. అందుకే ..

పదిరోజులు వివేక్ రాకపోతే ఆదిత్య అతడిని మిస్ అయాడా? వివేక్ పట్ల ఆదిత్య మనసులో ఏదన్నా అనుబంధం, ఆత్మీయత, దగ్గరతనం ఏర్పడి ఉంటాయా? ఎంతైనా వాడూ చిన్నవాడే .. వాడికీ తండ్రి ప్రేమ కావాలనిపిస్తుంది.. అది వివేక్ దగ్గర లభిస్తుందన్న ఆశో, నమ్మకమో లేకపోతే వివేక్ కోసం ఎందుకింతగా ఎదురుచూస్తాడు? వివేక్‌ని చూడగానే ఎందుకంతగా ఎక్సైట్ అయాడు .. ఆదిత్యకి వివేక్ అంటే ఇష్టంలేదనే అభిప్రాయంతో ఇంతకాలంనుంచీ తను వివేక్‌కీ, తనకీ ఉన్న అనుబంధం గురించి ఆదిత్య దగ్గర దాచింది .. కేవలం వివేక్ తన స్నేహితుడిగానే ఆదిత్యకి చెప్పింది .. అంటే, అంటే ఆదిత్య ఆమె పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి .. ఎంతటి సుదినం .. ఆదిత్యకి తాను చెప్పే అవసరం లేకుండా వాడంతట వాడే జీవితంలోకి ఆహ్వానిస్తే అంతకన్నా తనకేం కావాలి?

సందేహంగా చూస్తున్న ఆదిత్య వైపు ఆప్యాయంగా చూస్తూ దగ్గరకు రమ్మన్నట్టు తలాడించింది ..

ఆదిత్య సోఫా దగ్గరగా నడిచాడు.. శిరీష సరిగా సర్దుకుని కూర్చుంటూ ఆదిత్య నుదటి మీద జుట్టు సవరిస్తూ అడిగింది .. అంకుల్‌ని మిస్ అయావా?

ఆదిత్య అవునన్నట్టు తలాడించాడు..

నవ్వింది శిరీష ..

అప్పుడే సరిగ్గా కాలింగ్ బెల్ మోగింది ..

ఆదిత్య ఒక్కసారి శిరీషను చూసి, తిరిగి తలుపు వైపు చూసి చటుక్కున ఆమె చేయి విడిపించుకుని ఒక్కపరుగుతో వెళ్లి తలుపు గడియతీశాడు.. హలో అంకుల్ ..

నవ్వుతూ హలో చెప్తున్న ఆదిత్య వైపు విచిత్రంగా చూశాడు వివేక్ .. అతనిక్కూడా తెలుసు తనంటే ఆదిత్యకి ఇష్టం లేదని .. కానీ, ఇవాళ .. లోపలికి నడుస్తూ ఎదురు వచ్చిన శిరీషవైపు ఆశ్చర్యంగా చూశాడు..

హాయ్ విక్కీ .. చేయిచాచి వివేక్ చేయందుకుంటూ అంది .. ఆదిత్య నిన్ను బాగా మిస్ అయినట్టున్నాడు..

అవునా .. ఏం ఆదిత్యా .. నిజంగానా .. ఆదిత్య వైపు చూశాడు వివేక్.

ఆదిత్య తలవంచుకున్నాడు..

ఏయ్ .. ఆడపిల్లలా తలొంచుకుంటావేం .. ఇలా చూడు... చూపుడు వేలితో ఆదిత్య గడ్డం ఎత్తి చూస్తూ అన్నాడు.. నిజంగా నన్ను మిస్ అయావా?

ఆదిత్య పల్చగా నవ్వి అవునంకుల్ మీరీమధ్య రావడం లెదేం ..బోర్‌గా ఉంది మాకు .. అన్నాడు..

మీకా? ఆదిత్యనూ, శిరీషనూ మార్చి, మార్చి చిత్రంగా చూస్తూ అడిగాడు..

శిరీష నవ్వుతూ అంది .. ఉండదా .. మరీ ఇద్దరమే .. వాడి దార్న వాడు చదువుకుంటుంటాడు.. నా దారిన నేను టి వి ఆన్ చేసి చదువుకుంటూ ఉంటాను.. ఇల్లు ఇల్లులా లేదు.. లైబ్రరీలా ఉంది .. నువ్వు వస్తే కాస్త హడావుడి ఉంటుంది కదా ..

వివేక్ భుజాలెగరేస్తూ అన్నాడు.. ఓ కె అయితే రేపట్నించీ రోజూ వస్తాను సరేనా ..

ఆదిత్య నవ్వాడు..

వెళ్లు నాన్నా .. వెళ్లి చదువుకుంటావా? ఆంకుల్‌తో కాస్సేపు స్పెండ్ చేస్తావా? అడిగింది శిరీష ..

చదువుకుంటాను..

ఓ .. మరి నాతో ఏదో మాట్లాడేసేవాడిలా మిస్ అయానంటున్నావు ..

బాగుంది .. నీతో వాడేం మాట్లాడతాడు.. మనం మాట్లాడుకుంటూ ఉంటే వాడికి కాస్త హడావుడి కనిపిస్తుంది .. కాస్త ప్రశాంతంగా చదువుకుంటాడు .. నీకో సంగతి తెలుసా .. ఇంట్లో మాట్లాడేవాళ్లుంటేనే ఏదన్నా పని చేయాలనిపిస్తుంది .. .. పద, పద ఫ్రెష్ అయిరా .. నేను కాఫీ తెస్తాను... అంటూ శిరీష వంటగదివైపు నడిచింది.

ఓ కె మై బోయ్ .. వెళ్లు చదువుకో .. నీకెందుకు నేనివాళ మీ ఇల్లంతా సందడితో నింపేస్తాను సరేనా .. గో . బి కూల్ ..అంటూ బాత్‌రూమ్ వైపు వెళ్లిపోయాడు వివేక్.

ఆదిత్యకి ఇప్పుడు మరో టెన్షన్ మొదలైంది .. తను ఎంత త్వరగా పడుకుంటే .. కాదు, కాదు పడుకున్నట్టు నటిస్తే వాళ్లంత తొందరగా గదిలోకి వెళ్లిపోతారు .. ఆ తరవాత ఏం జరుగుతుందో చూడాలి .. సన్నగా ఒంట్లో వణుకు మొదలైంది .. అదేం కనిపించనీకుండా తిరిగి బాల్కనీలోకి వెళ్లిపోయి కుర్చీలో ఉన్న పుస్తకం తీసుకున్నాడు.. అప్పుడే చేతిలో మంచి నీళ్ల గ్లాసుతో వచ్చిన శిరీష .. చీకటి పడింది నాన్నా .. చలిగా కూడా ఉంది .. నీ రూమ్‌లో చదువుకో వెళ్లు .. అంది ఆదిత్యతో.

అవును అదే మంచిది .. తను గదిలోకి వెళ్లాక వాళ్లిద్దరూ ఏం చేస్తారో కూడాచూడచ్చు అనుకుంటూ సరేనమ్మా అంటూ పుస్తకం తీసుకుని గదిలోకి వెళ్లిపోయాడు..

వెనకనుంచి శిరీష స్వరం మళ్లీ వినిపించింది ..డిన్నర్ చేసేస్తావా? ఆకలేస్తోందా?

ఆదిత్య గోడ గడియారం చూశాడు .. ఎనిమిదవుతోంది ..

ఆకల్లేదమ్మా కాస్సేపయాక తింటాను..

ఎనిమిదైందిరా .. ఎంతాకలేస్తే అంతే తిను..

ఫోర్స్ చేయకు .. తనకి ఆకలేస్తే తింటాడుగా అన్నాడు వివేక్ .

వాడి సంగతి నీకు తెలియదు.. అలా చదువుకుంటూ నిద్రలోకి జారిపోతాడు..

కొంచెం పెరుగన్నం తింటాను.. అన్నాడు.. ఇప్పుడు తినకపోతే ఈవిడ వదలదు అనుకుంటూ..

గుడ్ .. శిరీష లేచి వెళ్లి చిన్న బౌల్‌లో పెరుగన్నం కలిపి, స్పూన్ వేసి తీసుకొచ్చింది ..

ఎలా చదువుతున్నావు ఆదిత్యా.. అడిగాడు వివేక్ ఆప్యాయంగా.

బాగా చదువుతున్నానంకుల్ ..

వాడికిక్కడ మంచి ఫ్రెండ్ ఉంది .. అప్పుడప్పుడు ఇద్దరూ కలిసి చదువుకుంటారు .

అవును చెప్పావు కదా .. నేనెప్పుడు ఆ అమ్మాయి ని చూడలేదే .. ఆసక్తిగా అన్నాడు వివేక్..

చూద్దువుగాని .. నువ్వు కొంచెం త్వరగా వస్తే చూడచ్చు .. ఇంత లేట్‌గా వస్తే ఆ అమ్మాయి ఎక్కడుంటుంది?

అలా ఆమె అనడంలో లేటుగా వచ్చినందుకు తనని మందలిస్తున్న ధ్వని వినిపించింది వివేక్‌కి చురుగ్గా ఆమె వైపు చూసి నవ్వాడు.. శిరీష గుండె జల్లుమంది .. చూపులు తిప్పేసుకుని ఏరా ఇంకా కొంచెం కలిపివ్వనా? అంది ఆదిత్యని.

ఒద్దు .. చాలు నాకు .. ఆఖరి స్పూన్ నోట్లో పెట్టుకుని లేచాడు ఆదిత్య ..

బౌల్ కిచెన్ సింక్‌లో పడేసి మంచినీళ్లు తాగేసి గుడ్ నైట్ అంకుల్ .. గుడ్‌నైట్ అమ్మా .. అంటూ లోపలికి వెళ్లిపోయాడు..

కాస్సేపు చదువుకుని పడుకో .. వెనకనుంచి హెచ్చరించింది శిరీష .

ఓ కె అమ్మా .. ఓ కె .. అన్నాడు ఆదిత్య .. అలా అనడంలో అతని స్వరంలో వినిపించిన ఉత్సాహం శిరీషని ఆశ్చర్యపోయేలా చేసింది .. ఏంటమ్మా ఇంతలో ఇంతమార్పు వీడిలో అనుకుంది ..

ఆదిత్య తన గదిలోకి వెళ్లిపోయాడు.. గది తలుపులు జేరవేసుకున్నాడు.

ఆదిత్య ఇప్పుడు చాలా ఉద్విగ్నంగా కూర్చున్నాడు... ఇప్పుడు కాఫీ ఇవ్వడం దగ్గర్నించి చూడాలి .. వాళ్లేం చేస్తారో ..

నెమ్మదిగా కుర్చీ తలుపు దగ్గరగా జరుపుకున్నాడు.. కర్టెన్ కొంచెం జరిపాడు.. చిన్న సందులోంచి తొంగిచూశాడు..

వివేక్ మొహం కడుక్కుని వచ్చాడు.. శిరీష టవల్ అందించింది ..టవ ల్ తో పాటు ఆమె చేయి అందుకుని దగ్గరకు లాక్కున్నాడు.. శిరీష కొంచెం తల ఆతని గుండెల మీద వాల్చి .. వెంటనే దూరం జరిగి లోపలికి వెళ్లింది .. వివేక్ టవల్‌తో మొహం తుడుచుకుని, వేళ్లతో జుట్టు సరిచేసుకుని రిమోట్ అందుకుని సోఫాలో జారగిలపడ్డాడు.. టివి ఛానెల్స్ నొక్కుతూ కూర్చున్నాడు..

శిరీష కాఫీ కప్పులతో వచ్చింది .. కప్పులు టీపాయమీద పెట్టి సోఫాలో వివేక్ పక్కన కూర్చుని కాఫీ కప్పు అతనికొకటి అందిచ్చి, తానొకటి తీసుకుంది .. వివేక్ నవ్వి ఏదో అన్నాడు.. థాంక్యూ అన్నట్టున్నాడు అనుకున్నాడు ఆదిత్య అతని లిప్ మూమెంట్ చూసి .. ఎడం చేత్తో శిరీషను దగ్గరకు లాక్కున్నాడు వివేక్ ..

శిరీష గోముగా ఏదో అంటోంది .. ఏం అంటోంది .. పది రోజుల్నుంచీ ఎందుకు రాలేదు అనడుగుతోందో ఏమో ..నవ్వుతూ ఏదో చెబుతూ సడన్‌గా ఆగి శిరీష బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నాడు.. శిరీష నోటి మీద వేలుపెట్టుకుని ఆదిత్య గదివైపు చూసింది .. బహుశా తను చూస్తాడని అంటున్నట్టుంది అనుకున్నాడు ఆదిత్య ..

ఆదిత్య రక్తం వేడెక్కుతోంది .. తను త్వరగా పడుకుంటే వాళ్లు కూడా గదిలోకి వెళ్లిపోతారేమో .. పడుకుంటే .. ఛ మరీ ఏడున్నరే .. అబ్బా .. ఇంకా ఏదన్నా వాళ్లు చేస్తే బాగుండు .. ఆదిత్య మనసు చదువు మీద కి పోలేదు.. ప్రఖ్యతో మాట్లాడాలనిపించింది .. ఎలా? ఇప్పుడు ప్రఖ్య వాళ్లింటికి వెడితే వీళ్లేం చేస్తారో తనకి తెలియదు.. వెళ్లకపోతే ఎలా? తనతో మాట్లాడాలనిపిస్తోంది .. తన దగ్గర సెల్‌ఫోన్ కూడా లేదు.. ఉంటే ఎంచక్కా చాటింగ్ చేసేవాళ్లు .. ఐడియా ..

ఆదిత్య చటుక్కున గదిలోంచి బైటకి వచ్చాడు..

శిరీష వివేక్‌కి దూరం జరిగింది ..

అమ్మా .. నాకు కొన్ని డౌట్స్ ఉన్నాయి .. ప్రఖ్యకి ఫోన్ చేయాలి అన్నాడు..

శిరీష తన సెల్‌ఫోన్ తీసి ఇస్తూ .. ఇదిగో మాట్లాడు అంది ..

థాంక్యూ అమ్మా .. వెలిగిపోతున్న మొహంతో ఫోన్ తీసుకుని లోపలికి వెళ్లిపోయాడు..గుడ్‌నైట్ అమ్మా అంటూ తలుపు వేసుకున్నాడు..

సెల్‌లో ప్రఖ్య నెంబరు తిప్పాడు.. అవతలి నుంచి ప్రఖ్య స్వరం వెంటనే వినిపించింది ..

హలో ..

హాయ్ ప్రఖ్యా .. నేను.. నీకో విషయం చెప్పనా?

ఏంటి? మమ్మీ ఇంట్లోనే ఉంది .. ఫోన్‌లో మాట్లాడితే తిడుతుంది .. ఎగ్జామ్స్ దగ్గరకొస్తున్నాయి కదా . చదువుకోవాలి ..

నేనూ చదువుకోవాలి .. కానీ, నాకసలు చదువుకోవాలనిపించడం లేదు.

అమ్మో .. చదువుకోకపోతే కెరియర్ పాడైపోతుంది ..అమ్మ చంపేస్తుంది..

నేనిప్పుడు వేరే కొత్త పాఠం నేర్చుకుంటున్నా .. దానికన్నా కెరియర్ ముఖ్యమా?

ఏంటది?

ఆదిత్య స్వరం బాగా తగ్గించి .. అంకుల్ వచ్చాడు.. నేను పడుకుంటానని నా రూమ్‌లోకి వచ్చి తలుపేసుకున్నా .. కాస్సేపట్లో చూస్తా .. ఎంత నెమ్మదిగా అన్నా అతని స్వరంలో సన్నని వణుకు వినిపించింది ..

గాభరాగా అడిగింది .. చూస్తున్నావా?

నో .. అప్పుడేనా? వాళ్లింకా డిన్నర్ చేయాలి .. గదిలోకి వెళ్లాలి .. అందాకా నీతొ మాట్లాడాలని, నాకేవో డౌట్స్ ఉన్నాయని చెప్పి అమ్మ ఫోన్ తీసుకున్నాను....

ఆదీ .. అలాంటి పనులు చేయకు .. ఆంటీకి తెలిసిందంటే డేంజర్ .. ఫోన్ పెట్టెయ్ .. మమ్మీ పిలుస్తుంది ..

ఏయ్ .. నీకు అది ఒద్దా? ..

ఆదీ .. ప్లీజ్ ..కంపిస్తున్న స్వరంతో అంది ప్రఖ్య .. నాకు అదే కాదు.. ఇంకా ఏదో కావాలి .. కానీ, మమ్మీ కి తెలిసిందంటే నన్ను చంపేస్తుంది ..

సరే .. రేపు మీ అమ్మ, మా అమ్మని సినిమాకి పంపించేద్దాం .. మనిద్దరం .. ఓ .. తల్చుకుంటుంటేనే నా ఒళ్లు జివ్వుమంటోంది .. అబ్బా .. ఎప్పుడు వస్తుందో ఆ మూమెంట్ ..

మమ్మీ వస్తోంది .. పెట్టెయ్ ..

అకస్మాత్తుగా ఫోన్ డిస్కనెక్ట్ అవడంతో ఆదిత్య షిట్ అంటూ సెల్ మంచం మీద పడేశాడు..

ఏం చేయాలో తోచలేదు .. శబ్దం చేయకుండా తలుపు దగ్గరగా నడిచి కీ హోల్‌లోంచి ఒక కన్నుతో తొంగిచూశాడు..

శిరీష, వివేక్ డైనింగ్ టేబిల్ దగ్గర పక్క, పక్కనే కూర్చుని భోంచేస్తున్నారు .. శిరీష నోట్లో చపాతీ ముక్క పెట్టి అది తన నోటితో అందుకుంటున్నాడు వివేక్ ..

ఆదిత్య నరాలన్నీ కరెంటు తీగలుగా మారి విద్యుత్తు ప్రవహిస్తున్నట్టు అయింది .. ఇంకా ఏం చేస్తాడో అన్నట్టు అలాగే చూడసాగాడు.. శిరీష కూడా చిన్న ముక్క తుంచి వివేక్ నోటికి అందించింది .. ఇద్దరూ నవ్వుకున్నారు .. వివేక్ శిరీషని ఎడం చేత్తో కొంచెం దగ్గరకి తీసుకున్నాడు.. శిరీష అతని భుజం మీద తలపెట్టుకుని అతను నోటికి అందిస్తున్న చపాతీ తింటోంది ..

ఆదిత్య నిలబడలేనట్టు మంచం మీద వెల్లకిలా వాలిపోయాడు.. దిండు తీసి ఒళ్లంతా అదుముకోసాగాడు.. అతనికి అమాంతం ప్రఖ్య దగ్గరకి పరిగెత్తుకుని వెళ్లి ఆమెని నిలువెల్లా నలిపేయాలని ఉంది .. ఇంకా, ఇంకా ఏదో ఉన్న శృంగార కార్యక్రమం వెంటనే చూడాలనిపించసాగింది .. వాళ్లిద్దరూ బెడ్‌రూమ్‌లోకి వెళ్లే సమయం కోసం అసహనంగా ఎదురుచూడసాగాడు..

అతనికి పిచ్చెక్కినట్టుగా ఉంది .. ఏదో చేయాలి .. ఏం చేయాలి? .. మంచం మీద వెర్రిగా దొర్లసాగాడు..

కాసేపట్లో హాల్లో లైట్లు ఆరిపోయాయి .. శిరీష స్వరం తన గది దగ్గరగా వినిపించింది .. ఆదీ .. ఆదీ ..

ఆదిత్య పలకలేదు..

పడుకున్నట్టున్నాడు.. అంటోంది శిరీష ..

వివేక్ స్వరం వినిపించలేదు.. ఆదిత్య నిశ్శబ్దంగా ఉండిపోయాడు..

కొన్ని క్షణాల్లో శిరీష గదితలుపు వేసిన శబ్దం వినిపించింది ..

ఆదిత్య ఆగలేదు.. గబ,గబా రీడింగ్ టేబిల్ శిరీష గది వెంటిలేటర్ వైపు నెమ్మదిగా జరిపాడు.. దానిమీద కుర్చీ వేశాడు.. హైటు చూసుకున్నాడు.. యస్ .. తప్పకుండా కనిపిస్తుంది .. ఒక్కసారి కుర్చీ కదిలించాడు.. హమ్మయ్య పడనులే అనుకుంటూ నెమ్మదిగా కుర్చీ ఎక్కాడు..

ఇప్పుడు శిరీష గదిలో బెడ్‌లైటు వెలుగులో అస్పష్టంగా కనిపిస్తున్నారు ఇద్దరూ .. బెడ్‌మీద వివేక్ పడుకుని ఉన్నాడు.. అతని మీద శిరీష వాలిపోయి ఉంది .. వివేక్ చేతులు రెండూ ఆమె నడుం మీద వేసి దగ్గరగా హత్తుకుంటున్నాడు.. వాళ్లేదో గుసగుసగా మాట్లాడుకుంటున్నరు.. శి రీష పకపకా నవ్వింది .. వివేక్ ఆమెని ముద్దు పెట్టుకున్నాడు.. శిరీష పక్కకి వాలింది .. వివేక్ ఆమె మీదకి వాలాడు.....

ఆదిత్య చటుక్కున కళ్లు మూసుకున్నాడు.. అతని కాళ్లలో వణుకు మొదలైంది .. ఏ క్షణానైనా కింద పడిపోవచ్చుననిపించింది ..

అచేతనంగా కుర్చీలో కూలబడిపోయాడు..

నిలువెల్లా శరీరం కంపిస్తోంది .. ఇప్పుడతని శరీరంలో కామం లేదు.. కోరిక లేదు.. అక్కడేం జరుగుతుందో చూడాలన్న కాంక్ష కూడా లేదు..

రెండు చేతుల్లో తల పట్టుకున్నాడు.. మెదడు మీద సుత్తితో కొడుతున్నట్టు తన తల మీద పెద్ద బండ ధడాల్న పడినట్టు బరువుగా, నెప్పిగా ..

అతని కళ్లల్లో  అప్రయత్నంగా నీళ్లు తిరిగాయి ..కొన్ని నిమిషాల్లోనే ప్రవాహంలా కన్నీరు కారసాగింది. చూడకూడనిదేదో చూస్తున్నట్టు తనేదో చేయరాని పాపం చేస్తున్నట్టు అనిపించసాగింది .

అమ్మ ...

తననెంతో ప్రేమగా చూసుకునే అమ్మ .. తనెప్పుడైనా దిగులుగా కనిపిస్తే దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకుని ఓదార్చే అమ్మ ..

చిన్న, చిన్న విషయాలకి అలిగి, రోషంతో ఏడుస్తుంటే చిరునవ్వుతో తనని గుండెలకి హత్తుకుని లాలించే అమ్మ ..

పసితనంలో ఆ గుండెలమీద పడుకోబెట్టుకుని లాలిపాడిన అమ్మ ..

తనని ఒళ్లో పడుకోబెట్టుకుని పాలుతాగించి ఆకలి తీర్చిన అమ్మ ..

ఎక్కడో చదివాడు.. అమ్మ పాలు గోల్డెన్ డ్రాప్స్‌ట ..

ఇప్పుడా పాలిండ్లు .. .. ఛీ, ఛీ .

వివేక్! బ్లడీ అమ్మ పక్కన పడుకున్నాడు.. పైగా.. పైగా .. అమ్మ గుండెలు ..

అసలు వాడు అమ్మ పక్కన పడుకోడం ఏంటి? అది నాన్న ప్లేసు .. వివేక్ .. ఎవడీ వివేక్ .. అమ్మ వాడికెందుకంత చనువిచ్చింది ..

ఇంతకాలం అమ్మ తనది .. తనకు మాత్రమే సొంతం అనుకున్నాడు.. కానీ,

తనకి మాత్రమే సొంతం అయిన అమ్మని పరాయి వాడైన వివేక్ అంత సన్నిహితంగా ముట్టుకోడం తట్టుకోలేకపోతున్నాడు..

ఆపాదమస్తకం వణికిపోతోంటే నెమ్మదిగా కుర్చీ దిగాడు.. కుర్చీ జరిగి శబ్దం అయింది ..

ఆదిత్యకి భయం వేసింది .. నెమ్మదిగా కుర్చీ యధాస్థానంలో పెట్టేసి, గప్‌చిప్‌గా మంచం మీద పడుకుని దుప్పటి కప్పుకున్నాడు..

కొన్ని సెకన్ల తరవాత గది బైట నుంచి ఆదీ .. అని శిరీష స్వరం వినిపించింది ..

ఆదిత్య పలకలేదు..

ఏమైంది? వివేక్ స్వరం ..

ఏమో .. నిద్రలో కుర్చీగానీ  తన్ని ఉంటాడు.. చదువుకుంటూ కుర్చీ మంచం దగ్గరకు జరుపుకుంటాడు. అది మళ్లీ పక్కన పెట్టడుకదా .. బద్దకం ..

ఇట్స్  ఓ కె ..అయినా అంత భయపడతావేంటి ? వాడూ పెద్దవాడవుతున్నాడు.. చెప్పచ్చుకదా .

ఇంకా నయం .. ఎలా చెప్తాను? వదిలెయ్ .. కుర్చీ చప్పుడైతే  భయపడ్డాను లేచాడేమో అని .. పద . మంచినీళ్లివ్వనా?

అప్పుడేనా?  వివేక్‌స్వరంలో సన్నటి నవ్వు ..

యూ నాటీ .. గోముగా శిరీష స్వరం ..

దా .. వివేక్ స్వరం ..

ఊః ..

మళ్లీ నిశ్శబ్దం ..

ఆదిత్యకి నిద్రపట్టలేదు.. లేచి కూర్చున్నాడు.. భయంగా ఉంది .. ఒళ్లంతా నూటనాలుగు డిగ్రీల జ్వరం వచ్చినట్టు సెగలు, పొగలుగా ఉంది .. చెవుల్లోంచి వెచ్చటి ఆవిరి .. కళ్లల్లో నీళ్లు ధారాపాతంగా కారుతున్నాయి ..

గొంతు ఎండిపోతున్నట్టుగా ఉంది .. దాహంగా ఉంది .. తను  పడుకునేటప్పుడు వాటర్ బాటిల్ గదిలో పెట్టుకుంటాడు.. కానీ, ఇవాళ పెట్టుకోలేదు.. బైటికి వెళ్లాలంటే భయంగా ఉంది .. ఆదిత్య అలాగే కూర్చున్నాడు.. దాదాపు పదిహేను నిమిషాలు గడిచాయి .. దాహంతో గొంతు ఆర్చుకుపోతోంది ..

ఈపాటికి వాళ్లిద్దరూ నిద్రపోయి ఉండచ్చేమో ..

ఆదిత్య నెమ్మదిగా మంచం దిగాడు.. అంతకన్నా నెమ్మదిగా తలుపు తీసుకుని బైటకి వచ్చాడు.. అంతా నిశ్శబ్దంగా ఉంది .. ఫ్రిజ్ దగ్గరగా నడిచి బాటిల్ తీసుకున్నాడు.. తిరిగి నెమ్మదిగా ఫ్రిజ్ డోర్ వేసేసి, అడుగులో అడుగు వేసుకుంటూ గదివైపు నడిచిన వాడు ఒక్క క్షణం ఆగి వెనక్కి తిరిగాడు.. రెండు, మూడు సెకన్లు సందేహంతో ఆగి నెమ్మదిగా నడుస్తూ శిరీష గదివైపు నడిచాడు .. అక్కడే కొన్నిక్షణాలు తచ్చాడి తిరిగి తన గదివైపు గబ,గబా నడిచి లోపలికి వెళ్లిపోయి తలుపువేసుకుని మంచం మీద వాలిపోయాడు . కానీ, తెల్లవారుజామున నాలుగు అయిందాకా ఆదిత్య కంటిమీద కునుకులేదు..

మర్నాడు  శిరీష మామూలుగానే ఆరింటికి లేచి, బ్రష్ చేసుకుని వివేక్‌కి కాఫీ కలిపిచ్చింది . వివేక్ కాఫీ తాగి వెళ్లిపోయాడు.. శిరీష తన రొటీన్‌లో పడింది . ఆమె స్నానం, పూజ అయిపోయి వంటగదిలోకి వెళ్లింది. కిచెన్ ప్లాట్‌ఫామ్ మీద అలారం టైం పీస్ ఉంటుంది .. అది చూడగానే ఆమె కనుబొమలు ముడిపడ్డాయి .. ఎనిమిదవుతోంది .. ఆదిత్య లేవలేదేంటి? ..  కాలేజీ టైమ్ అవుతోంది .. బెండకాయలు కట్‌చేయబోతున్నదల్లా ఆగి చాకు పక్కన పడేసి ఆదిత్య గదివైపు వెళ్లింది .. ఆదిత్యా !

సమాధానం రాలేదు..

ఆదీ .. టైమ్ అవుతోంది లేవవా? తలుపు దబదబా బాదింది ..

సమాధానం రాలేదు..

శిరీష ఖంగారుగా మళ్లీ తలుపు బాదింది .. కొన్ని క్షణాల్లో తలుపు తెరుచుకుంది..

ఆదిత్య తూలిపోతూ వచ్చి తలుపు తీశాడు..

ఏంట్రా.. టైం ఏంతయిందో తెలుసా .. కోపంగా అనబోయిన శిరీష ఆదిత్య వాలకం చూసి, ఖంగారుగా లోపలికి నడిచి పడబోతున్న ఆదిత్యను పట్టుకుంది .. ఒళ్లు మసిలిపోతోంది .

అయ్యో .. ఆదీ .. ఏమైందిరా .. సడన్‌గా జ్వరం వచ్చిందేంటి? రాత్రంగా ఏ సి వేసుకున్నావా? గాభరాగా అడుగుతూ ఏ సి వైపు చూసింది. ఆఫ్‌లోనే ఉంది. గది కూడా పెద్ద చల్లగా లేదు.. మరి వీడికి ఇంత హటాత్తుగా ఇంత జ్వరం వచ్చిందేంటి?

ఆలోచిస్తూనే ఆదిత్యను పొదివిపట్టుకుని మంచం దగ్గరగా నడిపించి మంచం మీద పడుకోబెట్టింది .. తనూ మంచం చివర కూర్చుని ఆదిత్య నుదుటిమీద పడిన జుట్టు పైకి తోసి నుదురూ, మెడా చేయి వేసి చూసింది .. ఆమె మనసు ద్రవించిపోయింది .. ఆదిత్య కళ్ల పక్కనుంచి నీళ్లు కారుతున్నాయి ..శిరీష తనని ముట్టుకుంటే ఒంటిమీద ఏవో పురుగులు పాకుతున్నట్టుగా అనిపిస్తోంది .. కానీ, ఏం మాట్లాడే ఓపిక లేదు.. నడిచే ఓపిక అసలే లేదు.. ఇంతకాలం ఎంతో హాయిగా అనిపించిన ఆవిడ స్పర్శ ఇప్పుడు భరించలేనిదిగా అనిపిస్తోంది ..కానీ ఆమెని దూరంగా పొమ్మని అనలేకపోతున్నాడు.. అమ్మ . నా అమ్మ .. ఇంకోసారి వివేక్ అమ్మని ముట్టుకుంటే .. ముట్టుకుంటే చేయి కోసేస్తాను... పళ్లు పట, పట కొరికాడు..

ఆ శబ్దానికి ఖంగారు పడింది ..అయ్యో నాతండ్రీ ..ఇంత జ్వరం వచ్చిందేంటిరా? అసలే పరీక్షలు కూడాను.. చలిగా ఉందా? బ్లాంకెట్ కప్పనా? వణికిపోతున్నావు అంటూ బ్లాంకెట్ కప్పింది ..ఉండు టాబ్లెట్ తెస్తాను.. అంటూ లేవబోతున్న శిరీష చేయి గట్టిగా పట్టుకున్నాడు ఆదిత్య ..

ఏంటిరా? ఏమైంది నాన్నా .. ఆప్యాయత, అనురాగం కురిపిస్తూ అడిగింది ..

అమ్మా .. నాకు .. నాకు భయంగా ఉంది ... మాటలు కూడదీసుకుంటూ అన్నాడు..

ఎందుకురా? ఏవన్నా పీడకలలు వచ్చాయా? ఎందుకు భయం? వాత్సల్యంతో చెంపలు నిమిరింది..

లేదన్నట్టు తల ఊపాడు.. రాత్రి నిద్రపట్టాలేదు..

నిద్రపట్టలేదా? మరి నేను పడుకునేటప్పుడు పిలిస్తే లేవలేదేం .. అదిరిపడుతూ అడిగింది శిరీష ..

ఆదిత్యకి భయం వేసింది .. అంటే తను నటించినట్టు అమ్మకి తెలిసిపోతుందేమో .. సవరించుకుంటూ అన్నాడు.. పడుకోగానే నిద్రొచ్చింది .. కానీ, మధ్యలో మంచినీళ్లకోసం లేచాను.. నిద్రపట్టలేదు..

శిరీష తేలిగ్గా ఊపిరి పీల్చుకుంటూ అంది .. అందుకే చెప్పాను.. రాత్రి మరీ తొమ్మిదింటికే పడుకోవద్దు అని .. పడుకునేటప్పుడు వాటర్ తాగి పడుకోవాలి కదా .. సర్లె ముందు ఒక టాబ్లెట్ వేసుకొని, పాలు తాగు.. నేను ఆఫీస్‌కి ఫోన్ చేసి లేట్‌గా వస్తానని చెప్తాను.. డాక్టర్ దగ్గరకు వెడదాం .. సరేనా? మృదువుగా అంటూ లేచి తన గదిలోకి వెళ్లబోతూ ఆగి వెనక్కి తిరిగి స్థానభ్రంశం చెందిన టేబిల్‌వైపు చూసింది..

ఇదేంటి టేబిల్ ఎందుకు జరిపావు? అడిగింది.. అలా అడగడంలొ టేబిల్ వెంటిలేటర్‌కి దగ్గరగా ఉందన్న విషయం గమనించలేదు.. కేవలం ఉండాల్సిన చోట కాకుండా అక్కడెందుకుంది అన్న కోపమే కనిపించింది. ఆదిత్య గాభరాపడ్డాడు కానీ, మాట్లాడలేదు..

తనే సర్దుకుని బైటకి వెళ్తూ సణిగింది .. ఏంటో ఏదో చేస్తుంటాడు.. వెదవపనులు .. అంటూనే హాల్లోకి వెళ్లి కొన్ని క్షణాల్లోనే టాబ్లెట్, మంచి నీళ్ల గ్లాసుతో వచ్చింది ..

లే .. లేచి కూర్చుని ఈ టాబ్లెట్ వేసుకో .. ఒంగి ఆదిత్య మెడ కింద చేయి వేసి నెమ్మదిగా లేపింది .

ఆదిత్య టాబ్లెట్ వేసుకున్నాడు..

పడుకో .. పాలు తీసుకొస్తాను..

ఒద్దు .. దోకొస్తుంది .. కాఫీ తాగుతాను..

కాఫీనా? ఆశ్చర్యంగా చూసింది .. కాఫీ మాట ఎత్తితేనే చిరాకు పడే ఆదిత్య కాఫీ తాగుతా అనగానే ఆమెకి ఆశ్చర్యం వేసింది ..

అవునమ్మా .. జ్వరం వచ్చినప్పుడు కాఫీనే తాగాలి ..

ఎవరు చెప్పారు?

ఆదిత్య ఒక్క క్షణం ఏం మాట్లాడలేదు.. నెమ్మదిగా అన్నాడు.. ప్రఖ్య ..

ఓ .. నవ్వేసింది . అదో పెద్ద ఆరిందా .. నువ్వు వినేవాడివి .. సర్లె కాఫీనే తెస్తాను.. లేచి వెళ్లింది .

ఆదిత్య ఆమె వెళ్తున్న వైపు చూస్తూ ఉండిపోయాడు..

అమ్మ .. తన అమ్మ .. తనకి అమ్మ, అమ్మకి తను .. ఊహు .. కాదు .. అమ్మకి విక్రమ్ అంకుల్ .. కానీ అమ్మకి తనంటే ఇష్టం .. విక్రమ్ అంకుల్ అన్నా ఇష్టమే .. తనంటే ప్రెమ, ఆప్యాయత, వాత్సల్యం .. అంకుల్ అంటే ప్రేమ, ఇంకా కోరిక .. ఇంకా ఏదో .. లవ్ .. వాళ్లిద్దరూ లవర్స్ .. లవర్స్‌కి వాళ్లిద్దరే కావాలి .. అమ్మకి తనక్కరలేదా? తనూ, ప్రఖ్యా లవర్స్ కదా .. కాదు, కాదు... ఫ్రెండ్స్ .. తామిద్దరి మధ్యా లవ్ ఉందా? తను ప్రఖ్యని లవ్ చేస్తున్నాడా? ఏమో తెలియదు.. అసలు లవ్ అంటేనే తెలియదు.. లవ్ అంటే అదేనా? ఒకరినొకరు కౌగలించుకోడం, ముద్దు పెట్టుకోడం .. ఇంకా .. ఇంకా .. ఆదిత్యకి ఒళ్లంతా వణుకు మొదలైంది .. ఇంకా ఏదో ఉంది .. అది తనకి కావాలి .. ప్రఖ్యకీ కావాలి .. కానీ, కానీ, అమ్మ, వివేక్ అంకుల్ అలా చేయడం బాగాలేదు.. తనకి నచ్చలేదు ..

శిరీష గదిలోకి వచ్చింది .. కూర్చో .. అంది కాఫీ గ్లాసు పట్టుకుని .

ఆదిత్య కూర్చున్నాడు.. మంచి కాఫీ పరిమళం .. పొగలు వస్తున్నాయి గ్లాసులోంచి ..

నెమ్మదిగా సిప్ చేశాడు..

కాఫీ బాగుందమ్మా .. నేను రోజూ కాఫీనే తాగుతాను..

శిరీష నవ్వింది .. సరే .. దానికేం .. నీకేది కావాలంటే అదే తాగు.. అవునూ ఇంతకు ముందు ఎప్పుడైనా తాగావా? .. తనెప్పుడు ఆదిత్యకి కాఫీ ఇచ్చిన గుర్తులేని శిరీష అనుమానంగా అడిగింది ..

తాగాను .. ప్రఖ్యవాళ్లింట్లో .. తను కాఫీ నే తాగుతుంది .

ఎందుకో ..

ఏమో .. పెద్దవాళ్లం అవుతున్నాంగా కాఫీ తాగాలి అంది ..

ఓ .. శిరీష కనుబొమలెగరేసి, పెదవి విరిచింది ..

సరే .. అంటూ ఆదిత్య ఖాళీగ్లాసు ఇస్తుంటే అందుకుని మళ్లీ ఒకసారి నుదురు, చేయి పట్టుకుని చూస్తూ అంది .. టెంపరేచర్ తగ్గిందిరా .. రాత్రి దేనికో భయపడినట్టున్నావు .. అవునా .. లేక నిద్రలేక అలా టెంపరేచర్ వచ్చినట్టుంది. ఇవాళ రెస్ట్ తీసుకో .. రేపటికి ఫ్రెష్ అవుతావు .. నేను వంట చేసి పెట్టి ఆఫీస్‌కి వెళ్లనా? ప్రఖ్యని నీకు తోడుగా రమ్మని చెప్తాను... అంటూ లేచింది ..

అదిరిపడ్డాడు ఆదిత్య .. ఇప్పుడు ప్రఖ్యని కలవాలని లేదు.. మనసంతా గందరగోళంగా ఉంది .. ప్రఖ్యని అసలు కలవాలని లెదు.. కలిస్తే ఏం జరుగుతుందో తనకి తెలుసు .. ఆ సమయంలో మళ్లీ వివేక్ అమ్మని ముట్టుకోడం, ముద్దుపెట్టుకోడం గుర్తొచ్చిందంటే .. అమ్మో .. ఒద్దొద్దు .. అందుకే ఖంగారుగా అన్నాడు.. ఒద్దమ్మా .. ఇవాళ ఒక్కరోజు నువ్వు నాకోసం లీవు పెట్టచ్చుకదా ..

నేనా? చిత్రంగా చూస్తూ అంది .. ఎందుకురా? నాకు ఆఫీస్‌లో చాలా పని ఉంది నాన్నా .. కొంచెం లేటుగా వెళ్తాలే .. ఏం? మీ ఇద్దరూ హాయిగా చదువుకోవచ్చుకదా ..

లేదమ్మా .. తనివాళ వాళ్ల కజిన్ వాళ్లింటికి వెళ్తానంది .. అబద్ధం చెప్పేసాడు..

అలాగా .. పోనీ నీ ఫ్రెండ్ రాకేష్‌కి ఫోన్ చేస్తావా? రమ్మని ..

రాకేష్ .. ఆదిత్య ఆలోచించాడు..

రాకేష్ వస్తే బానే ఉంటుంది .. రాకేష్ మెరిట్ స్టూడెంట్ . వాడు చదువు తప్ప మరేం ఆలోచించడు.. వాడుంటే తనకీ పిచ్చి, పిచ్చి ఆలోచనలు రావు .. అందుకే అన్నాడు.. అవును రాకేష్‌కి ఫోన్ చేస్తాను..

గుడ్ .. ఫోన్ నీ దగ్గరే ఉండాలిగా .. రాత్రి తీసుకుని నాకివ్వలేదు నువ్వు ..

అవును .. దిండు కింది నుంచి మొబైల్ తీశాడు..

శిరీష అక్కడి నుంచి వెళ్లిపోయింది ..

ఆదిత్య రాకేష్‌కి ఫోన్ చేశాడు.. రాకేష్ పదింటికల్లా వస్తానన్నాడు.. ఆదిత్య ఆరోజు ఇంక ప్రఖ్యని కలవకూడదని నిశ్చయించుకున్నాడు..

ఎందుకో తెలియని దిగులు కమ్మేసింది మనసునిండా .. తన ఆస్తులన్నీ ఎవరో కొల్లగొట్టుకుపోతున్నట్టు తనని ఒంటరిగా నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశంలో వదిలేసినట్టు ఏదో భయంగా కూడా అనిపిస్తోంది ..

ఇన్నాళ్లు ఆదిత్యకి చుట్టు పక్కల ఫ్లాట్స్‌లో వాళ్లలా తనకో అక్కో, చెల్లో, తమ్ముడో ఉంటే బాగుండేదని, వాళ్ల ఇళ్లకి వస్తున్నట్టు నిత్యం చుట్టాలు, స్నేహితులు వస్తూ, పోతూ ఉండాలని అనిపిస్తుండేది .. ఎప్పుడూ అమ్మా, తాను ఇద్దరే ఉండడం ఏంటో అర్థం అవక చికాకు కలుగుతుండేది .. ఒంటరిగా బాల్కనీలో నిలబడి, వచ్చి వెళ్తున్న స్నేహితులకి వీడ్కోలు పలుకుతున్న ఫ్లాట్స్‌వాళ్లని చూస్తూ దిగులుగా ఉండిపోయేవాడు.. క్రమంగా ప్రఖ్య స్నేహంతో తన జీవితంలోకి ఒక తోడు వచ్చిందని, తనకో స్నేహితురాలు దొరికిందని, ఆమెక్కూడా తనకి లాగే అమ్మ తప్ప ఎవరూ లేరని ఒక నిశ్చింత కలిగింది .. నెమ్మదిగా ఆ స్నేహంలో ఒక ఆకర్షణ, ఒక ఉద్వేగం మొదలైంది .. అమ్మ, ప్రఖ్యవాళ్ల అమ్మ, ప్రఖ్య, తాను .. ఇద్దరు నలుగురైన ఫీలింగ్‌తో ఏదో సెక్యూర్డ్ భావన .. కానీ అనుకోకుండా కలిగిన ఆలోచనలు, పొందిన అనుభూతులు, ఏదో కావాలన్న తపన, ఆరాటం .. ఉద్వేగం .. తట్టుకోలేకపోతున్నాడు.. వాటినుంచి మళ్లీ తను ఒంటరి అన్న భావన భూతంలా భయపెడుతోంది ..

తనూ ప్రఖ్యా కలిసి ఎంజాయ్ చేస్తారు .. ఆ తరవాత .. ప్రఖ్య ఇక్కడినుంచి వెళ్లిపోతే .. తనకెవరుంటారు? అమ్మ వివేక్ అంకుల్‌ని ఒకవేళ పెళ్లి చేసుకుంటే .. తను .. తనేమవాలి? ఎక్కడికెళ్లాలి? అంకుల్ తనని అమ్మ దగ్గర ఉండనిస్తాడా?

ఆదిత్య కి ఆలోచనలతో తలనొప్పి మొదలైంది .. అప్రయత్నంగా కళ్లు మూసుకున్నాడు.. త్వరలోనే అతనికి నిద్రపట్టింది ..

ఈలోపల శిరీష వంట పూర్తి చేసి, రెడీ అయి, తను బ్రేక్‌ఫాస్ట్ చేసి, క్యారేజీ సర్దుకుని కూర్చుంది .. ఆదిత్య నిద్రపోతున్నాడని డిస్టర్బ్ చేయకుండా అతనే లేచిందాకా ఎదురుచూసింది .. కానీ, ఆదిత్య పదైనా లేవలేదు.. ఈలోగా రాకేష్ రావడంతో రాకేష్‌కి రెడీగా ఉంచిన ఇడ్లీ, చట్నీ, నెయ్యి, వంటకాలు అన్నీ చూపించి వాడు లేచాక మీరిద్దరూ బ్రేక్‌ఫాస్ట్ చేయండిరా .. బియ్యం కడిగి కుక్కర్‌లో పెట్టాను.. భోంచేసే ముందు స్టవ్ వెలిగించుకోండి .. వేడిగా ఉంటుంది .. సరేనా .. నే ను వెళ్లనా? వాడ్ని కాస్త చూసుకోరా .. ఏదన్నా కావాలంటే నాకు కాల్ చేయి అంటూ రాకేష్‌కి అప్పగింతలు పెట్టి తను ఆఫీసుకి బయల్దేరింది ..

రాకేష్ ఆదిత్య లేచిందాకా లెక్కలు చేసుకుంటూ కూర్చున్నాడు..

పదిన్నరకి ఆదిత్య లేచాడు.. రాకేష్‌ని చూడగానే మొహం నిండా సంతోషం నిండిపోయింది .. హాయ్ అంటూ పలకరించాడు..

నువ్వు బ్రష్ చేసుకోరా .. ఆంటీ బ్రేక్‌ఫాస్ట్ రెడీగా పెట్టి వెళ్లారు .. ఇద్దరం తిందాం అన్నాడు రాకేష్ .

ఒకె .. నాక్కూడా ఆకలేస్తోంది అంటూ ఆదిత్య లేచాడు.. మంచం దిగుతోంటే బాగా నీరసంగా అనిపించింది .. అలాగే లేచి బాత్‌రూమ్‌లోకి వెళ్లిపోయాడు..

ఆవేళ్ల శిరీష ఆఫీసునుంచి వచ్చిందాకా రాకేష్‌తోటే గడిపేశాడు ఆదిత్య ..

శిరీష వచ్చాక రాకేష్ వెళ్లిపోయాడు..

ఆరోజు ఏమనుకుందో శిరీష ఆదిత్యతోటె గడిపింది .. డిన్నర్ కూడా ఇద్దరూ కలిసి చేశారు ..

ఆరోజు మొదటిసారిగా ఆదిత్యకి చాలా, చాలా సంతోషంగా అనిపించింది .. అమ్మకి నేనంటే ఇష్టం .. అమ్మ నాది అనుకున్నాడు.. ఈ సారి మాత్రం వివేక్ అంకుల్ వస్తే తన విముఖత ప్రకటించాలి అని నిర్ణయించుకున్నాడు.. త్వరలోనే వివేక్‌ని ఆ ఇంటికి రాకుండా చేయడం కోసం ప్లాన్ చేస్తూ పడుకున్నాడా రాత్రి .

దాదాపు వారం రోజులు గడిచాయి ..ఈ వారం రోజులూ ప్రఖ్యని కలవాలని ఉన్నా ఆమెని తప్పించుకు తిరగసాగాడు ఆదిత్య .. ప్రఖ్య  కూడా ఎంచేతో రెండు, మూడుసార్లు ఫోన్ చేసింది కానీ, పెద్దగా అతనెందుకు రావడంలేదని తెలుసుకునే ప్రయత్నం చేయలేదు.. అది కూడా ఆదిత్య కోపానికి కారణం అయింది .. పైగా అతను వివేక్ ఆ ఇంటికి రాకుండా, ఒకవేళ వచ్చినా కాఫీ  తాగి వెళ్లిపోవాల్సిందే కానీ, తన తల్లితో అంత చనువుగా ఉండకూడదని, అందుకు తీవ్రమైన తన వ్యతిరిక్తతని వ్యక్తం చేయడానికి ఎదురుచూస్తున్నాడు..

కాకపోతే ఆదిత్య పరిక్షలు దగ్గరకు  వచ్చేస్తున్నాయని శిరీష కూడా వివేక్‌ని రావద్దని చెప్పింది ..

కాకపోతే ప్రఖ్యా , ఆదిత్యా కలిసి ఎందుకు చదువుకోడంలేదో ఆమెకి అర్ధం కాలేదు..

అదే అడిగింది రేపు పరీక్ష అనగా ఆ రాత్రి ఆదిత్యని .. ఏమైందిరా మీరిద్దరూ దెబ్బలాడుకున్నారా? ఎందుకని తనూ మనింటికి రావడం లేదు.. నువ్వు వెళ్లడంలేదు..

ఆదిత్య కాస్సేపు మాట్లాడలేదు.. తరవాత అన్నాడు.. ఆంటీ కూడా మనింటికి రావడం లేదేం  .. మీరిద్దరూ దెబ్బలాడుకున్నారా?

అనుకోని ఆ ప్రశ్నకి ఒక్క క్షణం బిత్తరపోయినా తరవాత నవ్వేసి అంది శిరీష .. ఆంటీ బాగా బిజీగా ఉందిట . నేను కాల్ చేశాను  .. అన్నట్టు  తను రావడం బాగా లేట్ అవుతోందని తన ఫ్రెండ్ వాళ్లింట్లో ప్రఖ్య దింపుతానంది .. బహుశా అందుకే రావడం లేదేమో ప్రఖ్య ..అప్పుడే గుర్తొచ్చినట్టు అంది .

ఓ అదా .. అనుకున్నాడు ఆదిత్య .. కనీసం తనకి చెప్పి వెళ్లచ్చుగా .. అంటే కెరియర్ పాడైపోతుందని పరీక్షల మీద కాన్‌సన్‌ట్రేషన్ చేసిందనమాట ..

తనూ అంతే .. తనకి మాత్రం కెరియర్ అక్కర్లేదా? పోనీ ఎప్పుడొస్తే అప్పుడే రానీ ..అనుకున్నాడు..

ఏంటిరా ఆలోచిస్తున్నావు? అడిగింది శిరీష ..

ఏం లేదు.. అంటూ అక్కడి నుంచి లేచి తన గదిలోకి వెళ్లిపోయాడు.. మళ్లీ వెంటనే వెనక్కి వచ్చి నీ మొబైల్ ఇవ్వు . తనకి కాల్ చేసి బెస్టాఫ్ లక్ చెప్తాను.. అన్నాడు..

శిరీష మొబైల్ ఇచ్చింది ..

అది తీసుకుని గదిలోకి వెళ్లిపోయాడు..

ప్రఖ్య నెంబరు కలిపాడు..

కొలవెరి, కొలవెరి కొలవెరి డే అంటూ రింగ్‌టోన్ వినిపించింది ..దాదాపు పాట పూర్తి అవుతుండగా ప్రఖ్య ఫోన్ లిఫ్ట్ చేసింది .

ప్రఖ్యా .. పిలిచాడు..

ఆదీ .. హాయ్ .. ఏంటి ఏమై పోయావ్? .. హుషారుగా అడిగింది .

నువ్వెక్కడికి వెళ్లావు? అడిగాడు..

నేనెక్కడికీ వెళ్లలేదు నిన్నటిదాకా .. నీ కోసం ఎదురుచూశాను.. ఇవాళే మమ్మీ ఫ్రెండ్ ఇంట్లో దింపింది నన్ను .

మరి నాకెందుకు కాల్ చేయలేదు..

నాదగ్గర ఫోన్ లేదు.. మమ్మీ తీసికెళ్లిపోయిందిగా ఆఫీస్‌కి అయినా నువ్వెందుకు రావడం లేదు?

ఊరికినే .. ఎగ్జామ్‌కదా అని ..

అవును .. నేనూ అందుకే .. నీకో సంగతి తెలుసా .. మమ్మీ డి వి డి ప్లేయర్ లో మనం చూసిన సినిమా డి విడి చూసి పరీక్షల ముందు సినిమాలు చూస్తున్నారా? రేపట్నించీ మీ ఇద్దరూ కలిసి చదువుకోవద్దు అంటూ తిట్టింది.

అవునా? గాడ్ .. ఎలా చూసింది?

ఆరోజు మనం మమ్మీ వచ్చిందని ఆ డివిడి రిమూవ్ చేయకుండా అలాగే వదిలేశాం కదా .. మరునాడు తన ఆఫీస్ సి డి ఏదో చూడడానికి ఓపెన్ చూసి ఆ మూవీ డి విడి చూసింది .. ఇదెందుకు ఇక్కడికి వచ్చింది అని అడిగింది ..

నేను అబద్ధం చెప్పలేను.. అందుకే చెప్పాను.. మనకి బోర్ కొట్టి మూవీ చూశామని ..

చెప్పకుండా ఉండాల్సింది ..

ఏమో .. నాకు మమ్మీతో ఏదీ కూడా అబద్ధం చెప్పడం చేతకాదు..

ఇంకా ఏమన్నారు ఆంటీ ?

ఏం లేదు.. పరీక్షల ముందు సినిమాలు చూడడం ఏంటి? ఆదిత్య నిన్నలా ఎంకరేజ్ చేయకూడదు.. అంటే తనకి సినిమా పిచ్చి ఉందనమాట .. నేను శిరీషతో మాట్లాడతాను.. నువ్వు రేపట్నించీ ఒక్కదానివే చదువుకో అని క్లాసు పీకింది . మీ అమ్మతో ఏం చెప్పలేదా?

ఏమో .. తెలియదు.. అమ్మ నాతో ఏం అనలేదు..

అయితే మమ్మీ బిజీగా ఉందిలే .. బహుశా చెప్పి ఉండదు.. అవునూ బాగా చదువుతున్నావా?

ఊ ఫర్వాలేదు..

ఆరోజు ..

ఏ రోజు

అదే మనం మూవీ చూసిన రోజు .. అంకుల్ వచ్చారా?

లేదు..

రెండురోజుల తరవాత వచ్చారు ..

నువ్వు చూశావా? ఆమె స్వరంలో బిడియం, సిగ్గు స్పష్టంగా తెలుస్తున్నాయి ..

నాకు నచ్చలేదు..

ఏం నచ్చలేదు..

అంకుల్ మా అమ్మని ముద్దు పెట్టుకోడం ..

ఏం?

అమ్మ నాది ..

ప్రఖ్య ఏం మాట్లాడలేదు..

ఆదిత్య మళ్లీ అన్నాడు.. ప్రఖ్యా! అంకుల్ మా ఇంటికి రావడం నాకిష్టం లేదు.. నేను ప్రొటెస్ట్ చేస్తున్నాను.. కానీ నా ఎగ్జామ్స్ దాకా రాకపోవచ్చు .. ఆ తరవాత కూడా రానివ్వను..

**తప్పు కదా ఆదీ .. పాపం ఆంటీ ఫ్రెండ్‌కదా .**

**నీకు తెలియదులే .. సరేకానీ, నాకు నిన్ను చూడాలని ఉంది ..**

**ఎగ్జామ్స్ అయిందాకా నేనిక్కడే ఉండాలి .. అందుకే ఈ ఫోన్ కూడా మమ్మీ ఇచ్చేసింది. బాగా చదువుకో ఆదీ .. కెరియర్ ఇంపార్టెంట్ ..**

**ఎగ్జామ్స్ అయాక మనం ఎక్కడికన్నా వెళదామా?**

**ఎక్కడికి?**

**ఆలోచిద్దాం .. మన అమ్మలకి చెప్పద్దు ..ఎక్కడికన్నా వెళ్లి ఎంజయ్ చేద్దాం ..**

**కానీ, ఎలా?**

**ఏం?**

అమ్మా వాళ్లకి తెలిస్తే ..

తెలియకుండా వెడదాం ..

**ఓ కె .. ఓ కె .. బై .. ఆల్ ద బెస్ట్ .**

**ఓ కె ఆల్ ద బెస్ట్ .**

**ఫోన్ డిస్కనెక్ట్ చేసి, అరచేతిలో అలాగే ఆ మొబైల్ పట్టుకుని చూస్తూ కూర్చున్నాడు ఆదిత్య .. అతని మనసు డోలాయమానంగా ఉంది .. ప్రఖ్య దగ్గరకి పరిగెత్తుకుని వెళ్లాలని ఉంది . ఆ రోజు ఇద్దరూ పొందిన మధురానుభూతులు మళ్లీ, మళ్లీ కావాలని ఉంది .. కానీ, అవి తల్చుకోగానే వివేక్, శరీషల రొమాన్స్ గుర్తొస్తోంది .. తన జ్ఞాపకాలు మధురంగా ఉంటే , వాళ్ల జ్ఞాపకాలు చేదుగా మింగుడుపడకుండా గొంతుకు అడ్డం పడుతున్నాయి ..**

**ఆదీ.. అయిందా మాట్లాడటం .. హాల్లోంచి శరీష స్వరం వినిపించింది ..**

**ఆదిత్య తను కూర్చున్న చోటునుంచి కదిలాడు..**

**సడన్‌గా ఫోన్ రింగైంది ..**

**వివూ కాలింగ్ .. అని స్క్రీన్ మీద కనిపించింది .. వివూ .. అంటే వివేక్ .. అమ్మ పెట్టుకున్న ముద్దుపేరు కాబోలు. డిస్కనెక్ట్ చేయబోయాడు.. పట్టరాని కోపం వచ్చింది .. ఇంతలో శరీష వచ్చింది .. ఫోన్ మోగుతోంది కదరా .. ఏం చేస్తున్నావు? అంటూ .**

**మౌనంగా ఫోన్ అందించాడు.. హాయ్ వివేక్ .. హుషారుగా అంటూ మాట్లాడుతూ హాల్లోకి వెళ్లిపోయింది.**

**ఆదిత్యకి వాళ్లేం మాట్లాడుకుంటున్నారో వినాలనిపించింది .. హాల్లోకి వెళ్లాడు .. కానీ, శరీష హాల్లోంచి, కిచెన్‌లోకి, అక్కడినుంచి బాల్కనీలోకి తిరుగుతూ మాట్లాడుతోంది .. అలా సుమారు పావుగంట మాట్లాడిన శరీష మొహం విచ్చుకున్న పూవులా ఉంది ..**

**ఆదిత్య అసహనంగా తన గదిలోకి వెళ్లిపోయి రీడింగ్ టేబిల్ ముందు కూర్చున్నాడు..**

**పరీక్షలు మొదలవుతూ ఉండడంతో సరిగా చదవకపోతే భవిష్యత్తు పాడవుతుందేమో అనే భయం పట్టుకుంది ఆదిత్యకి .. చదువుకోవాలి .. ఆలోచనలన్నీ మానేసి చదువుకోవాలి . ర్యాంక్ రాకపోతే అవమానం అనిపించింది .. బలవంతంగా ఆలోచనలు వదిలించుకోడానికి ప్రయత్నిస్తూ చదువు మీద ఏకాగ్రత పెట్టసాగాడు.. కానీ ఆలోచనలు కందిరీగల్లా ముసురుకుంటూ మెదడుని కుట్టేస్తున్నట్లుగా అనిపిస్తోంది .. వివేక్ రాకూడదు ఇంటికి అనుకున్నాడు..**

**ఆదీ .. ఏం చేస్తున్నావు? శరీష స్వరం వినిపించింది ..**

ఆదిత్య ఏం మాట్లాడలేదు..

శిరీష గుమ్మం దగ్గరకు వచ్చి అంది .. చదువుకుంటున్నావా?

ఆదిత్య తలెత్తి చూశాడు.. శిరీష గుమ్మంలో నిలబడి చూస్తోంది ..

అమ్మా .. పిలిచాడు ఆదిత్య ..

ఏంటిరా? అడిగింది లోపలికి వచ్చి..

నా పరీక్షలయిందాకా మీ ఫ్రెండ్ మనింటికి రావద్దు .. గబ,గబా అనేశాడు..

శిరీష ఫ్రాన్సడిపోయింది .. గొంతు పెగల్చుకుని ఎ .. ఎందుకు? అంది .

నా చదువు డిస్టర్బ్ అవుతుందమ్మా .. అతను రావడం నాకిష్టం లేదు.. విసురుగా అన్నాడు..

అతను .. ఏమైంది ఆదిత్యకి .. ఆరోజు అంత ఆరాటంగా ఎదురుచూశాడు వివేక్ కోసం ఇప్పుడిలా .. ఏమైంది వీడికి? ఆమెకేం అర్ధం కాలేదు.. సర్లె ఎగ్జామ్ అయిపోనీ అనుకుని సరే అంటూ బైటకి వచ్చేసింది ..

ఆదిత్యకి హ మ్మయ్య సాధించాను అనిపించింది ..ఆ సంతోషంతో సీరియస్‌గా చదువుకోడం మొదలుపెట్టాడు.

ఆరోజే ఐఐటి ఎగ్జామ్ .. ఆదిత్యని తీసుకుని సెంటర్‌కి వెళ్లి దింపేసింది శిరీష .. జాగ్రత్తగా ఆలోచించి రాయి .. ర్యాంకు రావాలి .. అర్ధమైందా?

అయిందన్నట్టు తలూపాడు..

గుడ్ బెస్టాఫ్ లక్ ..

థాంక్స్ మమ్మీ ..

ఆదిత్య క్లాస్‌కి, శిరీష ఆఫీస్‌కీ వెళ్లిపోయారు ..

సాయంత్రం ప్రఖ్య, ఆదిత్యా కలుసుకున్నారు ముందు అనుకున్నట్టు

ఆదిత్యలో ఆమెని చూడగానే బోలెడంత హుషారొచ్చింది .. అబ్బ ఎన్ని రోజులైంది ప్రఖ్యా నిన్ను చూసి ..ఎలా రాశావు ఎగ్జామ్స్? అడిగాడు..

చాలాబాగా రాశాను.. రాయకపోతే మమ్మీ చంపేయదూ ..

అయితే ఈ రోజు ఇంటికి వస్తున్నావా? అడిగాడు ఆమె చేయి పట్టుకుని ..

రేపు మమ్మీ వచ్చి తీసుకొస్తుంది .. అప్పుడొస్తాను..

అయితే నేను మా అమ్మకి చెప్తాను.. రేపు మా ఇంట్లోనే డిన్నర్ ..

ఓ కె .. నీకో న్యూస్ చెప్పనా?

ఏంటి? అన్నట్టు నేను మా మమ్మీ ఫ్రెండ్ వాళ్లతోకలిసి కొడైకెనాల్ వెళ్తున్నాను..

అవునా .. నీరసంగా అడిగాడు..

ఊఁ .. బహుశా ఫిఫ్టీన్త్ వెల్తాం .. పదిహేను రోజులు ..

మా అమ్మకి మీ అమ్మకున్నట్టు మంచి ఫ్రెండ్స్ కూడా లేరు .. నన్ను ఒక్కడినీ ఎక్కడికీ పంపించదు.. తను రాదు.. ఎలా? పదిహేను రోజులు నేనేం చేయను? దిగాలుగా అన్నాడు..

జాలిగా చూసింది ప్రఖ్య అతనివైపు ..

నాక్కూడా ఏం చేయాలో తెలీడం లేదు ఆదీ .. నేను వెళ్లననే అన్నాను.. మమ్మీనే .. ఏం చేస్తావు? రిజల్ట్స్ వచ్చిందాకా ఎంజాయ్ చేసిరా అంటోంది ..

ఎంజాయ్ అనగానే ఆదిత్య తుళ్లిపడ్డాడు.. ఆమె దగ్గరగా జరిగి అన్నాడు.. ఇప్పుడు మన ఎగ్జామ్స్ అయిపోయాయి .. మన ప్రోగ్రామ్ ఎప్పుడు?

ప్రఖ్య మొహం ఎర్రబడింది .. సిగ్గుతో తల వంచుకుంది ..

ఏయ్ .. నాకు ముద్దు కావాలి ..గుస,గుసగా అన్నాడు..

సిగ్గులేదు నీకు .. తల వంచుకునే అంది ..

ఎందుకు ..? నాక్కావాలి అంతే .. నువ్వు చాలా బాడ్ .. మనమేం అనుకున్నాం .. మనమే ఎక్కడికన్నా వెళ్లాలనుకున్నాంగా ..

ఇంపాసిబుల్ .. మన అమ్మలు పంపరులే .

మరెలా? చికాగ్గా అన్నాడు..

ఇంట్లోనే మా ఇంట్లో రేపు ఈవినింగ్ .. మమ్మీ లేట్గా వస్తుంది ..

అవునా .. నిజంగానా .. రేపిస్తావా?

ఏంటి? చిరుకోపంగా చూసింది ..

సడన్గా చుట్టూ చూసి ఎవరూ తమని చూడ్డం లేదని గమనించి కొద్దిగా ఒంగి ఆమె చెంపమీద ముద్దు పెట్టుకున్నాడు.

అయ్యయ్యో .. ఏం పని? ఎవరన్నా చూస్తే .. బెదిరిపోతూ అంది ప్రఖ్య ..

ఎవరూ చూడలేదులే ..

నువ్వు చాలా బాడ్ ఆదీ .. నేను కనిపిస్తే ఆగలేనట్టు ప్రవర్తిస్తావు .. కనిపించకపోతే కేర్ చేయవు..

ఆదిత్య మొహం వాడిపోయింది .. సారీ .. అన్నాడు

అసలు నువ్వెందుకు ఇన్ని రోజులు దూరంగా ఉన్నావో చెప్పు నిలదీస్తూ అంది ..

ఏం లేదు.. ఎగ్జామ్స్ కదా .. టెంప్ట్ అయితే కెరియర్ పాడవుతుంది .. అందుకే ..

అంతేనా? నిజమే చెప్తున్నావా? ఆంటీ రెస్ట్రిక్ట్ చేసిందా?

లేదు... అమ్మకసలు ఏం తెలియదు.. తనే అడిగింది .. నువ్వు రావడం లేదేంటని ..

ఏం చెప్పావు?

నేనేం చెప్పలేదు.. తనే చెప్పింది మళ్లీ .. నువ్వు మీ మమ్మీ ఫ్రెండ్ ఇంటికి వెళ్లావని ..

ఆదీ .. అదోరకంగా పిల్చింది ప్రఖ్య ..

చెప్పు.. రహస్యంగా అడిగాడు..

మమ్మీ ఫ్రెండ్కి హజ్బెండ్ కాక, ఒక బాయ్ ఫ్రెండ్ ఉన్నాడు తెలుసా ..

వాట్? ఎలా?

తెలియదు.. నేనొకరోజు చూశాను.. అతను క్యాజువల్గా వచ్చాడు.. అందరూ కూర్చుని మాట్లాడుకుంటున్నారు . సడన్గా అతను స్మోక్ చేయడానికి బాల్కనీలోకి వెళ్లాడు.. ఆ బాల్కనీ మేము చదువుకుంటున్న రూమ్ పక్కనే ఉంటుంది .. కొంచెం సేపటికి ఆంటీ వాటర్ తీసుకుని వచ్చింది .. నేను సడన్గా అన్ఎక్స్పెక్టెడ్గా చూశాను.. అతను ఆంటీని కిస్ చేశాడు..

అవునా! అంకుల్కి తెలుసా ..

ఏమో ..

తప్పు కదా ..

ఏమో? అయితే తప్పేం ఉంది .. అమాయకంగా అంది ప్రఖ్య ..

ఓ కె వదిలెయ్ రేపు నేను మీ ఇంటికి వస్తున్నాను.. మనం చూసిన మూవీ డి వి డి తీసిపెట్టు ..

ఓ కె ..పద వెడదాం ..

డ్రాప్ చేస్తావా?

కమ్ ..

ఇద్దరూ ప్రఖ్య స్కూటీ మీద వెళ్లిపోయారు ..

అయితే, వాళ్లు ప్లాన్ చేసుకున్నట్టు ఆరోజె కాదు... ప్రఖ్య కొడైకెనాల్ వెళ్లి వచ్చాక కూడా వాళ్లు కోరుకున్న శృంగారం అనుభవించలేకపోయారు .. అందుకు అనేక కారణాలు .. కొన్ని రోజులు భానుప్రియ సిక్ అయి ఇంట్లోనే ఉండిపోడం, కొన్ని రోజులు అవకాశం వచ్చినట్టే వచ్చి జారిపోడం .. మధ్య, మధ్య అవకాశం దొరికినా ముద్దులు, కౌగిలింతలతోటే సరిపెట్టుకోవాల్సి వచ్చింది ..

ఈ లోగా వివేక్ మీద ఆదిత్య పెంచుకున్న అకారణ ద్వేషం గురించి శిరీషకి తెలిసిపోయింది .. ఆమెకి తెలియడం కోసమే ఆదిత్య వివేక్ వచ్చినపుడల్లా దుమ, ధుమలాడ్డం మొదలు పెట్టాడు.. అతని ముందు శిరీషని చీటికీ, మాటికీ పిలవడం, తను అడిగింది ఇవ్వడం లేట్ అయితే విసుక్కోడం చేయడం చూసి శిరీషకి ఆదిత్య ఎందుకలా ప్రవర్తిస్తున్నాడో అర్ధం చేసుకోలేకపోయింది ..

ఏమైందిరా నీకు .. ఎందుకలా అంకుల్ వచ్చినపుడు ఇన్సల్టింగ్‌గా బిహేవ్ చేస్తున్నావు? ఒకరోజు ఉదయాన్నే నిలదీసింది ..

ఆదిత్య ఖచ్చితంగా అన్నాడు.. అతను మనింటికి రావడం నా కిష్టం లేదమ్మా .

శిరీష నిర్ఘాంతపోయింది .. కాస్సేపు నోటమాటరాక అప్రతిభురాలై నిలబడిపోయింది .. కొన్ని క్షణాల తరవాత గొంతు పెగుల్చుకుని అడిగింది ..ఏం? ఎందుకని?

ఆదిత్య ఏం మాట్లాడలేదు..

చెప్పరా ఎందుకని? అతను నిన్నేం అన్నాడు.?

నన్నడనడానికి అతనెవరమ్మా .. సీరియస్‌గా అడిగాడు..

ఖంగుతింది శిరీష .. ఆదిత్యేనా ఇలా మాట్లాడేది? వీడు పెద్దవాడైపోయాడా? వివేక్ మీదనా ద్వేషం, తన మీదనా? అంటే వీడికి తనకీ, వివేక్‌కీ ఉన్న అనుబంధం గురించి తెలిసిందా?అది డైజెస్ట్ చేసుకోలేకపోతున్నాడా?

శిరీషకి కళ్లల్లో నీళ్లు తిరిగాయి .. తన ఇంట్లో తను స్వేచ్ఛగా ఉండడానికి ఈ క్షణం నుంచి తన కొడుకు తనకి రెస్ట్రిక్షన్స్ విధిస్తున్నాడా?

నో .. జరక్కూడదు.. తను పూర్తిగా స్వేచ్ఛా జీవి .. ఎంతో కష్టపడి తను నిర్మించుకున్న ఈ స్వేచ్ఛాప్రపంచంలో తనని అరికట్టే వాళ్లు ఎవరైనా తను క్షమించదు.. అంతే ..

అందుకే ఖచ్చితంగా, కఠినంగా అంది .. చూడు ఆదీ .. కొన్ని విషయాలు నీకు చాలా అనవసరం అయినవి .. నీకిప్పుడు నీ చదువు, నీ కెరియర్ తప్ప మరో విషయం ఆలోచించాల్సిన అవసరం లేదు.. నా విషయంలో ఇంకోసారి జోక్యం చేసుకుంటే ఊరుకోను.. వివేక్ రావడం నీకిష్టం లేకపోతే నువ్వు అతనితో మాట్లాడకు . నిన్ను నేను ఫోర్స్ చేయను.. అర్ధమైందా?

విసురుగా అక్కడినుంచి వెళ్లిపోయింది ..

ఆదిత్య షాక్ తగిలినట్టు నిలబడిపోయాడు.. అలాగా .. పోనీలే నీకిష్టం లేకపోతే రావద్దని చెప్తాలే అంటుందనుకున్నాడు.. కానీ, శిరీష ఎదురు తిరగడం తనని శాసించడంతో కోపంతో వణికిపోయాడు..

అంటే అమ్మకి తనకన్నా వాడే ఎక్కువనమాట అనుకున్నాడు.. ఆ రోజు నుంచీ ఇద్దరి మధ్యా పదిరోజులు మాటలు లేవు ..

ఆ పదిరోజులూ వివేక్ రాలేదు..

పదకొండోరోజు వచ్చాడు.. రాగానే ఆదిత్యను ఆప్యాయంగా పలకరించాడు..

రిజల్ట్స్ ఎప్పుడొస్తాయి ఆదీ అంటూ కుశలం అడుగుతూ మాటల్లో పెట్టడానికి ప్రయత్నించాడు.. కానీ, ఆదిత్య పట్టించుకోలేదు.. నిర్లక్ష్యంగా వెళ్లిపోయాడు..

ఆరోజు శిరీష బాగా ఏడ్చింది ..

వివేక్ నీకు తెలుసు ..నా మనస్తత్వానికి ఎవరితో పొసగదు.. మన మనసులు కలిసాయి .. నీతో తప్ప నేనెవరితో స్నేహం చేయలేదు.. వాడికోసం అన్నీ వదులుకున్నాను.. కానీ, నాకు మిగిలిన ఒకే ఒక్క ఆనందం నువ్వు నిన్ను వదులుకోమంటుంటే తట్టుకోలేకపొతున్నాను..

చిన్నపిల్లలా ప్రవర్తించకు శిరీ .. వాడు చిన్నవాడు .. అడోల్‌సెన్సలో ఉన్నాడు.. ఈ వయసులో వాళ్లు ఏం మాట్లాడతారో, ఎలా ప్రవర్తిస్తారో వాళ్లకే తెలియదు.. ఇప్పుడే వాడిని మనం జాగ్రత్తగా చూసుకోవాలి .. నువ్వేం వర్రీ అవకు .. నేను చూసుకుంటాగా . ఓదారుస్తూ అన్నాడు..

నేనివాళ వాడికోసం నిన్ను వదులుకుంటే రేపు వాడి పెళ్లయాక నన్ను పట్టించుకుంటాడా? అప్పుడు నాకెంత ఒంటరితనం మిగుల్తుంది? నో ..లేదు.. వాడికోసం నేను చాలా వదులుకున్నాను... కానీ, నిన్ను మాత్రం వదులుకోను.. అంతగా అయితే వాడిని హాస్టల్‌లో చేర్పిస్తాను.. వెక్కుతూ అంది ..

ఓ కె .. ఓ కె .. చూద్దాంలే అవసరం అయితే అలాగే చేద్దాం .. ప్లీజ్ ఏడవకు .. కళ్లు తుడుస్తూ ఆమెని దగ్గరగా తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు..

తన గదిలోంచి అంతా చూస్తున్న ఆదిత్య పళ్లు పట, పట కొరకడం అతనికే తెలియలేదు..

ఆ తరవాత శిరీష తన బాధ భానుతో కూడా పంచుకుంది ..

మగపిల్లలతో ఎప్పుడు ఎలాంటి ఉపద్రవం వస్తుందో తెలియదు శిరీషా .. అదే ఆడపిల్లలైతే కొన్ని విషయాలు డిస్కస్ చేయడానిక సందేహిస్తారు .. ప్రఖ్యకి నాకూ, ఉత్తేజ్‌కీ ఉన్న రిలేషన్ తెలుసు .. షి నోస్ ఎవిరీథింగ్ .. కానీ షి నెవ్వర్ క్వశ్చన్ మి ..అంది భానుప్రియ ..

వీడిలా ఎందుకు తయారవుతున్నాడో నాకర్థం కావడంలేదు భానూ .. నేను ముందే చెప్పాల్సిందంటావా?

ఏమని చెప్తావు? ..

ఏమో ..

అదంతా ఆలోచించకు .. రేపు కాలేజీలు తెరిచి ఇంజనీరింగ్ చదువులో పడ్డాక ఏమీ పట్టించుకోడు.. కాలేజీ, ఫ్రెండ్స్, అల్లరి, చదువు మెంటల్లీ హివిల్‌బి వెరీ బిజీ .. ఈ సిల్లీ విషయాల గురించి ఆలోచించే టైం ఉండదు.. ఏదో తెలిసీ, తెలియక వాగాడు.. డోంట్ కేర్ ..అయినా మన బతుకులు ఎప్పుడుచూసినా ఎవరో ఒకరికోసం త్యాగం చేయడంతోటే సరా .. మనకంటూ కొన్ని ఇండివిడ్యువల్ టేస్ట్స్, ఇండివిడ్యువల్ ఐడియాస్ ఉండకూడదా?

నాకూ అదే అనిపిస్తుంది భానూ .. ఆడదెప్పుడూ అటు తల్లి, తండ్రుల కోసమో, ఇటు మొగుడుకోసమో లేక పిల్లల కోసమో మాత్రమే బతకాలి కానీ, తనకోసం తానెప్పుడూ బతక్కూడదా?

భానుప్రియ నిట్టూర్చింది .. నాకు మాత్రం ఏం తెలుసు శిరీ .. ఈ ప్రశ్నకి సమాధానం ఏ ఆడదానికీ తెలియదు.. కానీ, సమాధానం లెదని బతక్కుండా ఉండకూడదు.. బతుకుదాం .. మన కోసం మనం మన ఇష్టం వచ్చినట్టు బతుకుదాం .. నిశ్చ లంగా అంది .

అవును .. అలాగే బతకాలి అనుకుంది శిరీష .

**ఇలా అవుతుండగానే** ..రిజల్ట్స్ రావడం జరిగింది .. తల్లులిద్దరూ ఆశించినట్టు జరగలేదు.. ఇద్దరికీ కూడా ఐఐటి లో ర్యాంకు రాలేదు.. ఎంసెట్‌లొ మాత్రం ఫర్వాలేదు.. ప్రఖ్యకి జెఎన్ టి యూలో, ఆదిత్యకి మరోకాలేజీలో సీటొచ్చింది ..

శిరీష చాలా బాధపడింది.. తానాశించిన విధంగా ఆదిత్య చదువులో ముందుకుపోడంలేదు.. అందుకు కారణం తనేనా? ఎవరికీ చెప్పుకోలేని ఆ బాధకి మనసులోనే బాగా కుమిలిపోయింది.

భాను మాత్రం ప్రఖ్యని ఎడాపెడా తిట్టేసింది .. నీకు వేరే విషయాలమీద కాన్‌సెన్‌ట్రేషన్ ఎక్కువైంది .. అందుకే ఇంత పూర్ రిజల్ట్ అంటూ మండిపడుతున్న తల్లితో మెల్లిగా అంది మళ్లీ రాస్తాను మమ్మీ ..

ఏ ం అవసరంలేదు.. ఉద్ధరించింది చాలు .. ఎందులో సీటొస్తే అందులో చేరిపో .. బి టెక్ చదువు ..

ఇంజనీరింగ్‌లో చేరడం జరిగిపోయింది ..

కనీసం ఇంజనీరింగ్ అయినా ఒకే కాలేజీలో చేరాలన్న ప్రయత్నం కూడా ఫలించలేదు.. ఒకళ్లకాలేజీ సికింద్రాబాదు అయితే మరొకళ్లది కూకట్‌పల్లి .. తరచుగా కలుసుకోడం కూడా కుదరడం లేదు..

ఆదిత్య మనసులో సంఘర్షణ అలాగే ఉంది .. అటు ప్రఖ్యతో శృంగారం అనుభవించాలన్న కోరికా తీరలేదు.. ఇటు వివేక్‌ని ఇంటికి రాకుండా చేయాలన్న పంతమూ నెరవేరలేదు..

ఈలోగా ఇంజనీరింగ్ స్టూడెంట్‌గా పంధొమ్మిదేళ్ల వాడయాడు..

ఆరోజు ఆదిత్య పుట్టిన రోజు ..

శిరీష సెలబ్రేట్ చేయాలనుకుంది . ఖరీదైన రిస్ట్‌వాచ్ కొన్నది ఆదిత్యకి .. ఆమెతో ముభావంగా ఉండడం చేత ఆదిత్య సెలబ్రేషన్‌కి ఒప్పుకోలేదు .. ఫ్రెండ్స్‌తో కలిసి డిన్నర్ చేస్తాను అన్నాడు..

శిరీషకి బాధనిపించింది .. భానునీ, ప్రఖ్యనీ, వివేక్‌నీ, ఆదిత్య స్నేహితులు ఓ నలుగురున్నారు వాళ్లనీ పిలిచి ఇంట్లో కేక్ కట్ చేయించి డిన్నర్ ఏర్పాటు చేద్దామనకుంది .. ఆ విషయం తెలుసు ఆదిత్యకి .. ఆ రాబోయే అతిధులో వివేక్ ఉండడం ఇష్టం లేదు కాబట్టి అందుకు ఒప్పుకోలేదు..

మౌనంగా వేయి రూపాయలు ఇచ్చింది ..

అవి తీసుకుని వెళ్లిపోయాడు.. ప్రఖ్య, ఆదీ కాలేజీ ఎగ్గొట్టారు .

హాపీ బర్త్‌డే ఆదీ అంటూ ప్రఖ్య ఆదిత్యకి సెల్‌ఫోన్ ఇచ్చింది ..

ఆదిత్య మొహం వికసించింది .. సెల్ .. థాంక్యూ ప్రఖ్యా .. థాంక్స్ .. నేనే మా అమ్మని సెల్ కొనిమ్మని అడగాలనుకున్నాను.. అన్నాడు..

ప్రఖ్య నవ్వింది ..

నీ దగ్గర డబ్బులెక్కడివి ఇది కొనడానికి అడిగాడు..

నా పాకెట్ మనీ తో కొన్నాను..

అయ్యో .. పాపం .. సారీ .. అన్నాడు..

ఎందుకు సారీ .. నా ఫ్రెండ్‌కి గిఫ్ట్ ఇవ్వకుండా ఎలా? అంది నవ్వుతూ ..

అయితే నేను నీకు మంచి ట్రీట్ ఇస్తాను.. ధోలారీ ధనికి వెళ్దామా? అన్నాడు..

ఎంత డబ్బులున్నాయి నీ దగ్గర?

థౌజండ్ ..

ధోలారీ ధనికి ఆ డబ్బులు సరిపోవు బాబూ .. ఏదన్నా మంచి హోటల్‌కి వెళ్లి లంచ్ చేద్దాం .. తరవాత మూవీకి వెడదాం అంది ..

ఆ ఆలోచన తనకి రానందుకు నెత్తిమీద మొట్టుకుంటూ గుడ్ ఐడియా ప్రఖ్యా అన్నాడు..

ఆ అంటూ స్కూటీ స్టార్ట్ చేసింది ..

వెనకాల ఎక్కి కూర్చున్నాడు.. నేనూ త్వరలోనే బండి కొనుక్కోవాలి అనుకున్నాడు..

అవునూ నీ దగ్గర డబ్బులెక్కడివి? అడిగింది ప్రఖ్య నాంపల్లిలోని మంచి హోటల్ ముందు స్కూటీ ఆపుతూ

అమ్మ ఇచ్చింది ...,

థౌజండ్ .. ఇంక నువ్వు మీ అమ్మ దగ్గర డబ్బులు తీసుకోకూడదు.. ఏదన్నా ఎర్నింగ్ మార్గం చూసుకోవచ్చుగా ..

ఎర్నింగా? ఇప్పుడేగా మనం ఇంజనీరింగ్‌లో జాయిన్ అయింది ..అప్పుడే జాబ్ ఇవ్వమంటే ఎవరిస్తారు? అన్నాడు హోటల్ లోపలికి నడుస్తూ ..

జాబ్ అంటే జాబ్ కాదు.. మాకాలేజీలొ గర్ల్స్ కూడా పార్ట్ టైమ్ చేసి ఎర్న్ చేస్తున్నారు .. నువ్వు కూడా అలా చేస్తే బాగుంటుంది కదా .. అంది .

ఏం చేయను? సాలోచనగా అడిగాడు..

ఏదన్నా ..

ఓ కె .. ఆలోచిద్దాం ..అంటూ ఖాళీగా ఉన్న టేబిల్ దగ్గరకు నడిచాడు..

ఇద్దరూ నాన్, వెజిటబుల్ బిర్యానీ, ఐస్‌క్రీమ్ తిని , మిగిలిన రెండు వందల చిల్లరతో సినిమాకి వెళ్లారు .

సినిమా హాల్లో రష్ లేదు. కపుల్స్ సీటు. ఇద్దరూ పక్క, పక్కనే ఒకళ్లనొకళ్లు హత్తుకుంటూ..

లైట్లనీ ఆఫ్ అయాయి .. సినిమా మొదలైంది. సినిమా టీనేజ్ లవ్‌స్టోరీ .. వేడి, వేడి సీన్లు చాలా ఉన్నాయి .. హీరోయిన్ దాదాపు నగ్నంగానే ఉంది .. మామూలుగా అయితే ఈమెకి పాపం బట్టలు కొనుక్కోడానికి డబ్బులు లేవేమో అంటూ కామెంట్ చేసేవాడేమో ఆదిత్య .. కానీ, పక్కన ప్రఖ్య, మనసులో కాంక్షలు అతనికి వేరే ఆలోచన కలిగించలేదు.. ఆమె చేయి తన చేత్తో గట్టిగా పట్టుకుని కూర్చున్నాడు.. ఆ స్పర్శకి ఆమె అతనికి ఇంకా కొంచెం దగ్గరగా జరిగింది. నెమ్మదిగా అతని చేయి పాములా ఆమె అరచేయినుంచి మోచేయిదాకా, అక్కడినుంచి భుజం మీదికి, భుజం మీద నుంచి .. ప్రఖ్యకి శరీరంలో వెచ్చటి ఆవిర్లు వస్తున్నట్టుగా ఉంది .. కానీ, ఏదో భయం .. ఎవరన్నా చూస్తున్నారేమో నన్నట్టుగా తలతిప్పి వెనక్కి చూసింది .. వెనక ఎవరూ లేరు.. వాళ్లిద్దరూ కూర్చున్న లైను వెనకనుంచి రెండో లైను.. జనం పల్చగా ఉన్నారు .. సినిమా ఫ్లాప్.. ఉన్న కొద్దిమందీ వాళ్లలాగే యువతీ, యువకులు.. వాళ్లల్లో కొందరు ప్రేమికులు ఉండచ్చు .. కొందరు వీళ్లలా లస్ట్ తీర్చుకోడానికి వచ్చి ఉండచ్చు .. కానీ, అందరూ కూడా సినిమా మొదలైన దగ్గర్నించీ బాగా దగ్గరగా జరిగి కూర్చోడం గమనించింది.

కాలం ఎలా గడిచిందో తెలియలేదు.. సినిమా ఆగిందని, ఇంటర్వెల్ అయిందని లైట్లు వెలిగాక కానీ తెలియలేదు.. ఖంగారుగా ఇద్దరూ చేతులు సరిగా పెట్టుకున్నారు..

ప్రఖ్య తలవంచుకుంది.. ఆదిత్య ఏం జరగనట్టు అటూ, ఇటూ చూస్తూ కూర్చున్నాడు..

మనం తప్పు చేస్తున్నాం ఆదీ .. గొణిగినట్టుగా అంది ప్రఖ్య ..

ఏం బాగాలేదా? అడిగాడు.. అంతే స్వరంతో..

ప్రఖ్య మాట్లాడలేదు.. బాగాలేదని ఎలా అనగలదు !

ఇంతవరకూ రుచిచూడని తీయదనం ఆదిత్య స్పర్శలో లేదని ఎలా అనగలదు .. అతని చేతులు తన అణువణువూ తాకుతూ, నాట్యంచేస్తూ, తన, నరనరాన్ని మీటుతూ శృంగార గీతం పాడుతోంటే బాగాలేదని ఎలా చెప్పగలదు.. ఎంత బాగుందో, మరీ, మరీ కావాలని ఎంత తహతహగా ఉందో మాత్రమే చెప్పగలదు.. కానీ, చెప్పడానికి సంకోచం, భయం, సిగ్గు .. అందుకే ఏం మాట్లాడలేదు..

ఆదిత్య అన్నాడు. ప్రఖ్యా ! మనం ఎప్పుడు పడుకుందాం ..

అమ్మో .. గుండెలమీద చేయేసుకుంది ..

చెంపలు కెంపులైనాయి.. కళ్లు మత్తుగా బరువెక్కాయి.. గుండె జల్లుమంది .. ఛీ .. అంది తీయగా..

లైట్లారిపోయాయి .. సినిమా మొదలైంది ..

మళ్లీ ఆదిత్య చేతులు నాట్యం మొదలుపెట్టాయి .. ఇప్పుడు ఇంకా కొంచెం చొరవగా, ఇంకా కొంచెం తెగింపుగా .

ఒద్దు, అంటూనే సహకరిస్తోంది ప్రఖ్య ..

అటుచూడు .. ఒంగి రహస్యంగా అంటూ వేలితో ముందు సీట్లో ఉన్న జంటని చూపించాడు.. వాళ్లు సినిమా చూడడం లేదు.. దాదాపు ఆ అబ్బాయి అమ్మాయి ఒళ్లో ఉన్నాడు..

ఆదీ .. ప్లీజ్ .. నాకు భయంగా ఉంది .. వెళ్లిపోదాం అంది ..

ఆదిత్య కి భయం వేసింది .. తనిలా హద్దుమీరితే వెళ్లిపోదాం అంటుందేమో .. ఈ కాస్త ఆనందం అన్నా ఉంటే చాలు అనుకుంటూ సర్దుకుని కూర్చున్నాడు.. అయినా సెగలు కక్కుతున్న ఒళ్లు, మరుగుతున్న రక్తం అతన్ని ఆగనివ్వలేదు.. తిరిగి అతని చేతి వేళ్లు ఆమె ఒంటిమీద సరిగమలు మీటసాగాయి. ఆమె ఒక మైకంలోకి నెట్టబడింది. కళ్లముందు ఏమీ కనిపించడంలేదు..

సినిమా ఏం చూశారో వాళ్లకేం తెలీలేదు.. కథ, పాటలు, ఏమీ గుర్తు లేవు .. బైటకి వచ్చాక ఒకరినొకరు చూసుకుంటే ఇద్దరికీ ఏదోలా , కొత్తగా అనిపించింది ..

ఇద్దరూ బండి దగ్గరకు వచ్చారు..

ఇప్పుడు నువ్వు డ్రైవ్ చేయి నా వల్లకాదు అంది బుంగమూతితో

ఆదిత్య ఆమె వైపు చూశాడు.. బుగ్గల మీద లైట్‌గా పంటిగాట్లు, చెదిరిన జుట్టు ,

బండి స్టార్ట్ చేస్తూ ఎక్కు అన్నాడు ఆదిత్య ..

ఆమె వెనకాల ఎక్కింది ..

సాయంత్రం ఆరవుతుండగా ప్రఖ్యని ఇంటి దగ్గర దింపాడు.. స్కూటీ పార్క్ చేసి కీస్ ఆమెకిస్తూ .. త్వరలో నేను కూడా బండి కొనుక్కుంటాను అన్నాడు..

నవ్వింది ప్రఖ్య .. ఆ నవ్వులో సిగ్గు, ఇంకా ఏదో కనిపించి ముద్దు పెట్టుకోబోయినవాడు ఎవరో సెల్లార్‌లోకి రాడంతో ఆగిపోయాడు.. ఇద్దరూ లిఫ్ట్ దగ్గరకు నడిచారు ..

ఆరోజు భానుకి బాగా తలనొప్పి రావడంతో ఇంటికి త్వరగా వచ్చేసింది ..

లోపలికి వచ్చిన ప్రఖ్యనీ, వెనకాలే వచ్చిన ఆదిత్యనూ చూసిన భానుకి వాళ్ల వాలకంలో ఏదో తేడా కనిపించింది .. ఆమెకి టైంలేక కొన్ని విషయాలు పట్టించుకోదు కానీ, పట్టించుకుంటే మాత్రం ఆవలించకుండానే పేగులు లెక్కపెట్టగలదు.. ముఖ్యంగా ప్రఖ్య మొహంలో ఆమెకేదో తేడా కనిపిస్తోంది .. ఆమె చూపులు ఇబ్బందిగా అనిపించి ప్రఖ్య నేరుగా బాత్‌రూమ్‌లోకి వెళ్లిపోయింది ..

ఆదిత్య నమస్తే ఆంటీ అంటూ సోఫాలో కూర్చున్నాడు..

ఎక్కడినుంచి వస్తున్నారు అనుమానంగా అడిగింది భాను..

కాలేజీనుంచి ఆంటీ .. తడుముకోకుండా చెప్పాడు..

అలాగా .. మీ ఇద్దరూ ఎక్కడ కలిశారు? గుచ్చిచూస్తూ అడిగింది .

కొంచెం తడబడినా వెంటనే సర్దుకుని తను మా కాలేజీకి వచ్చింది .. ఇవాళ నా బర్త్‌డే కదా విష్ చేయడానికి.

భాను ఆ మాట వినగానే ప్రసన్నంగా అలాగా .. మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే .. అంది .

థాంక్స్ ఆంటీ అన్నాడు..

ప్రఖ్య మొహం కడుక్కుని, బట్టలు మార్చుకుని వచ్చింది .

ఆదిత్య బర్త్ డే అని చెప్పడంతో భానుకి మనసులో కలిగిన సందేహం, అనుమానం ఎగిరిపోయాయి .. పోనీలే ఫ్రెండ్స్ బర్త్‌డే నాడు కలుసుకుని సరదాగా ఎటన్నా వెళ్లొచ్చి ఉం టారు అనుకుంది .. అలా అనుకోకపోయి ఉంటే ప్రఖ్య బుగ్గ మీద అస్పష్టంగా కనిపిస్తున్న పంటిగాట్లు ఆమె దృష్టిలో పడేవే .. ప్రఖ్య కూడా తల్లికి రోజూలాగా దగ్గరగా వెళ్లలేకపోయింది .. ఏదో తప్పు చేసిన ఫీలింగ్ ఆమెని తల్లికి దూరంలోనే నిలబెట్టింది .

ఆదికి స్వీట్ పెట్టు ప్రఖ్యా . . చూడు నేను కాజు కత్లీ తెచ్చాను.. అంది .

ఓ కె మమ్మీ అంటూ రా ఆదీ నా రూమ్‌లోకి వెడదాం అంటూ ఆదిని తీసుకుని తన గదిలోకి వెళ్లిపోయింది ప్రఖ్య .. భానుకి వాళ్లు అలా వెళ్లడంలో కొత్తదనం, వింత, అభ్యంతరం ఏమీ కనిపించలేదు..

ఆ తరవాత వాళ్లకి నెలరోజుల దాకా ఒకళ్లనొకళ్లు ముట్టుకునే అవకాశం కూడా రాలేదు.. కలుసుకుంటున్నా, మాట్లాడుకుంటున్నా వాళ్ల ఆలోచన, దృష్టి ఏకాంతం మిదే .. కానీ, ఆ ఏకాంతం మాత్రం దక్కలేదు... కాలేజీ అవగానే ఇంటికి రావడానికి కుదరడంలేదు..ఎవరికి వాళ్లకే ఫ్రెండ్స్ సర్కిల్ పెరిగింది.. క్లాసులు అయిపోగానే వాళ్ల, వాళ్ల ఫ్రెండ్స్‌తో గడిపేయడంతో ఇంటికి లేట్‌గా రావడం, వచ్చేటప్పటికి తల్లులు కూడా ఇంటికి వచ్చేసి ఉండడంతో వాళ్లు కోరుకున్న ఏకాంతం లభించలేదు..

ఈ మధ్యలో రెండుసార్లు శిరీష భానునీ, ప్రఖ్యనీ ఇంటికి డిన్నర్‌కి పిలిచింది ..శిరీష పెద్ద స్క్రీన్ ఉన్న టి వి కొంది .. పాతది అమ్మేసింది .. ఆ టి విలో 3 డి సినిమాలు చూడచ్చు .. అవిచూడడానికి గ్లాసెస్ కూడా కొనుక్కొచ్చింది .. 3 డి పిక్చర్ డి విడి తీసుకొచ్చింది .. నలుగురూ కలిసి డిన్నర్ చేయడం, సినిమాలు చూడడంతొ పిల్లలిద్దరూ, పెద్దవాళ్లు కూడా 3డి పిక్చర్ లోని మజా అనుభవిస్తూ ఆనందించారు.. ఆ సమయంలో అటు ప్రఖ్యగానీ, ఇటు ఆదిత్యగాని వేరే దృష్టికి పోలేదు.. సినిమా మాత్రమే ఎంజాయ్ చేశారు.. అలా నలభై రోజులు గడిచాయి.

మార్చి నెల, రెండో వారం .. ఆరోజు హోలీ పండుగ .. ఫ్లాట్స్‌లో ఆడా, మగా, పిల్లా, పీచూ అంతా హోలీ సంబరాల్లో మునిగి తేలుతున్నారు.. భానుకీ, ప్రఖ్యకీ పక్క ఫ్లాట్స్‌లో ఉన్న ఆడవాళ్లు వచ్చి రంగులు పూశారు .. ముందు ఒద్దని కొంచెం ప్రతిఘటించినా ఆ సంబరాల్లో పాలు పంచుకోక తప్పలేదు భానుకి. ఆమె మొహం నిండా గులాబీ రంగు.. నీళ్లతొ కూడా తడపబోతుంటే .. ఇప్పుడే డ్రెస్ మార్చుకుని వస్తాను అంటూ భాను లోపలికి వెళ్లింది.

నువ్వేంటి ముసలమ్మలా ఇంట్లో కూర్చున్నావు.. పిల్లలంతా కింద సెల్లార్‌లో ఆడుకుంటున్నారు వెళు.. అంది పక్కింటి రజని ప్రఖ్యతో ..

ప్రఖ్య నవ్వింది .. నాకిష్టం లేదాంటీ అంది ..

ఎందుకిష్టంలేదు... ఒక్కసారి ఆడావంటే ఇష్టం పుడుతుంది ..

భాను డ్రెస్ మార్చుకుని వచ్చింది ..

రండి సెల్లార్‌లో ఆడదాం అంటూ వాళ్లు కదిలారు.. నువ్వుకూడా అంది రజని ప్రఖ్యను చూస్తూ..

ప్రఖ్య అయిష్టంగా కదిలింది ..

అందరూ కలిసి కారిడార్‌లోంచి నడుస్తూ, కనిపించిన వాళ్లందరికీ రంగులు పూసేస్తూ గోల, గోలగా నవ్వుతూ వెళ్తోంటే ఆ హడావుడి చూసిన శిరీష గబ,గబా లోపలికి వెళ్లిపోయి తలుపు వేసేసింది.

అప్పుడే భాను తనతో ఉన్న వాళ్లందరినీ తీసుకుని శిరీష ఫ్లాట్ దగ్గరికి వచ్చి బెల్ కొట్టింది .. శిరీషకి తలుపు తీయక తప్పలేదు..

భాను రెండు చేతులకూ గులాల్ అద్దుకుని సుతారంగా పూసేసింది.

మేం కూడా కొంచెం అంటూ అందరూ తలా కాస్త పూసేటప్పటికి శిరీష మొహం గులాబీపూవులా అయింది.

పద డ్రెస్ మార్చుకుని రా .. భాను శిరీషను తొందర చేసింది.

చాలదా పూసింది .. చిరుకోపంగా అంది శిరీష ..

అసలు చాలదు.. రండి, రండి బోలెడంత ఆడాలి అన్నారు మిగతా ఆడవాళ్లు.

శిరీష లోపలికి వెళ్లింది .

ఆదిత్య లేడా ఆంటీ అంటూ ప్రఖ్య శిరీషను అనుసరించింది ..

శిరీష నోటిమీద చేయి పెట్టుకుని మాట్లాడద్దు అన్నట్టు సైగ చేస్తూ .. నెమ్మదిగా అంది . వాడు రాడు.. వాడికి రంగులంటే అసహ్యం ..

ఓ .. ప్రఖ్య నవ్వుతూ వెనక్కి వచ్చేసింది .. శిరీష బెడ్‌రూమ్ తలుపేసుకుంది బట్టలు మారుకోడానికి.

కాస్సేపటికి నిండా గులాబీ రంగుల్లో మునిగిపోయిన శిరీష, భాను, మరికొందరు ఆడవాళ్లు కలిసి మొత్తం అపార్ట్‌మెంట్‌లో ఉన్న మిగతా ఆడవాళ్ల దగ్గరికికోలాహలంగా బయల్దేరారు ..

నువ్వు వెళ్లి సెల్లార్‌లో అమ్మాయిలతో ఆడుకో అంటూ వెళ్లింది భాను..

ప్రఖ్య వాళ్లని అనుసరిస్తుంటే వెనకనుంచి ఎవరో ఆమె జడ పట్టి లాగారు ..

ఉలిక్కిపడి చూసింది ప్రఖ్య, గుమ్మంలోపల తలుపు ఒరగా వేసి, ఆ తలుపు వెనకాల నిల్చుని ఉన్నాడు ఆదిత్య..

ఏయ్ .. రా బైటకి .. పిలిచింది హుషారుగా ..

హుష్ .. నోటికి వేలు అడ్డం పెట్టుకుని సైగచేసాడు..

ప్రఖ్య తిరిగిచూసేసరికి భానూ, శిరిషా, మిగతా ఆడవాళ్లంతా కింద ఫ్లోర్‌కి వెళ్లిపోడానికి మెట్లు దిగసాగారు..

ప్రఖ్యా .. గట్టిగా పిలిచాడు ఆదిత్య.

ఏంటి అన్నట్టుగా పిడికిలి బిగించి బొటనవేలు ఎత్తి సైగ చేసింది ..

లోపలికి రా .....

అమ్మో.. గుండెల మీద చేయేసుకుంది ..

ఒక్కసారి రా .. చిన్న మాట ..

ప్రఖ్య అటూ, ఇటూ తలతిప్పి చూసింది .. అందరూ ఎవరిగోలలో వాళ్లున్నారు.. తనని ఎవరూ గమనించడం లేదు.. వెనక్కి తిరిగి పరుగులాంటి నడకతో లోపలికి వచ్చింది.

ఆమెని చేయి పట్టుకుని పూర్తిగా లోపలికి లాగి చటుక్కున తలుపు వేసేశాడు ఆదిత్య ..

నువ్వెందుకు హోలీ ఆడడం లేదు? ఆశ్చర్యంగా చూసింది ప్రఖ్య..

ఊహు... నాకీ రంగులంటే అసహ్యం .. అన్నాడు..

ఇద్దరమే ఇలా ఇంట్లో ఉంటే ఏం బాగుంటుంది .. రా మనం కూడా కాస్సేపు ఆడి వచ్చేద్దాం అంది .

ఒద్దు .. ఇది మనకి గోల్డెన్ ఛాన్స్ .. ఇప్పుడెవరూ మనల్ని గమనించరు .. పట్టించుకోరు..అన్నారు

ఆమెని దగ్గరగా లాక్కుని గట్టిగా కౌగలించుకుంటూ..

ఆమెకి తన ఒంటినిండా వైర్లు చుట్టి కరెంటు ఆన్ చేసినట్టు అనిపించింది..

ఒక్కసారిగా కళ్లముందు మెరుపులు మెరిశాయి . తూలిపడబోయి అప్రయత్నంగా అతడిని గట్టిగా పట్టేసుకుంది.

అబ్బ .. ఎంత హాయిగా ఉంది .. అన్నాడు..

ఆమెకి పెదాలు అదరసాగాయి.. ఏదో చెప్పాలని ప్రయత్నించింది కానీ, మాట బైటకి రాలేదు.. ఏదో మైకం నిలువెల్లా పాకింది .. అతడిని అల్లుకుపోతూ ఒదులు .. నాకేదో అవుతోంది.. . మత్తుగా, అస్పష్టంగా అంది ..

అమ్మో .. ఇప్పుడు ఒదిలేే మళ్లీ ఈ ఛాన్స్ రాదు మనకి ..

ఎవరన్నా వస్తారేమో అంది గుసగుసగా..

ఎవరూ రారు.... వాళ్లు ఇప్పుడే రారు .. చాలామంది ఉన్నారుకదా.. ఈలోపల మన పని అవుతుంది ..

కానీ, కానీ ఒద్దు .. ప్లీజ్ .. నాకు భయం .. అతన్నుంచి విడిపించుకోడానికి పెనుగులాడుతూ అంది.

నో .. నేనివాళ వదల్ను .. నీకేం తెలుసు నా బాధ! వేరే విషయాలే ఆలోచనల్లోకి రాడం లేదు.. నిజం చెప్పు .. నీకు మాత్రం కావాలని లేదా? ..

ప్రఖ్య ఏం మాట్లాడలేకపోయింది .. ఆ ప్రశ్నకి నిజాయితీగా సమాధానం మాత్రం చెప్పలేదు..

ఆమె సమాధానం కోసం ఎదురుచూడలేదు ఆదిత్య .. .. ఇద్దరికీ కాలం స్థంభించిపోయినట్టు అనిపించింది. ప్రఖ్య బలవంతంగా విడిపించుకుంది ..

పెనుగులాడుతున్న ఆమెనలాగే గట్టిగా బంధించి గదిలోకి లాక్కెళ్లాడు..

కళ్లముందు మిరుమిట్లు గొలిపే కాంతి పుంజాలు .. ఆడే నెమళ్లు, పాడే కోయిలలు కొన్ని వేల ఇంధ్రధనుస్సులు ..

ఆమెకి ఏం జరుగుతోందో అర్ధమయేలోపలే అంతా అయిపోయింది ..

వాళ్లు ఏడాదిగా తపించిపోయిన అనుభవం పొందారు .. కొంతసేపు గడిచాక కానీ, ఇద్దరూ వాళ్లు పొందిన స్వర్గంలోంచి బైటకి రాలేకపోయారు..

ప్రఖ్యకి సడన్‌గా ఏడుపొచ్చింది .. వెక్కి, వెక్కి ఏడవసాగింది ..

అరెరె .. ఏమైంది? ఎందుకేడుస్తున్నావు? ఖంగారుగా అడిగాడు..

ప్రఖ్య మాట్లాడలేదు..

ప్రఖ్యా చెప్పు ప్లీజ్ .. ఏడవకు ..

నేను .. నేను .. అమ్మని మోసం చేస్తున్నాను.. అయామ్ చీట్.. అంది వెక్కుతూ ..

ఆదిత్యకి ఆ మాట షాక్ కొట్టినట్టుగా అయింది ..

అట్లా అనకు ప్రఖ్యా నాక్కూడా బాధగా ఉంటుంది .. మా అమ్మని మాత్రం నేను మోసం చేసినట్టుకాదా.. బాధపడకు .. మనం పెళ్లి చేసుకుందాం. అప్పుడు మనం తప్పు చేసినట్టు అవదు.. అన్నాడు.

పెళ్లా .. పక్కలో బాంబు పడినట్టు ఉలిక్కిపడుతూ అంది .. మా అమ్మ నన్ను చంపేస్తుంది .. నేను చాలా హైట్స్‌కి వెళ్లాలని అమ్మ కోరిక .. ఇప్పుడే పెళ్లి అంటే నన్ను హ్యాంగ్ చేస్తుంది ..

నేను మాత్రం .. నేనూ హైట్స్‌కి వెళ్లాలి .. ఇద్దరం పెళ్లి చేసుకుని బాగా చదువుకోవచ్చు .. హైట్స్‌కి ఎదగచ్చు .. అన్నాడు..

పెళ్లి చేసుకుంటే పిల్లల్ని కనడం తప్ప మరేం చేయమని మమ్మీ చెప్పింది ..చచ్చినా ఒప్పుకోదు పెళ్లికి.

పోనీ ఇలాగే ఎంజాయ్ చేద్దాం చదువయిందాకా ..

అమ్మో .. మళ్లీనా .. చాలు బాబూ చాలు .. చేసింది చాలు .. ఇంకెప్పుడూ నా జోలికి రాకు ఆదీ .. నీకు దణ్ణం పెడతాను.. చేతులు జోడిస్తూ ప్రాధేయపూర్వకంగా అంది.

ప్రఖ్యా! ఎందుకలా అంటున్నావు? నాకు నువ్వు కావాలి .. ఆమె భుజం మీద చేయేసి దగ్గరకు లాక్కుంటూ అన్నాడు..

ఆదీ .! దూరంగా ఉండు.. అతని చేతులు విదిలించి దూరంగా జరిగింది .. ఇంకెప్పుడూ దగ్గరకు రావద్దు ఆదీ .. ఇంకెప్పుడూ నన్నిలా రెచ్చగొట్టకు.. ఆదీ .. ఆ కాస్సేపు స్వర్గం అంటే ఇదేనా అనిపించింది .. కానీ, నాకిప్పుడు ఎంత టెన్షన్‌గా ఉందో తెలుసా.. ప్లీజ్ .. ఇంకెప్పుడూ ఇలా చేయకు .. నువ్వు మళ్లీ ఇలా చేస్తే నేను నీతో మాట్లాడను..

అమ్మో .. నువ్వు మాట్లాడకపోతే నేను చచ్చిపోతాను..

అంటే నువ్వు నన్ను లవ్ చేస్తున్నావా?

నాకు తెలియదు.. ఇన్ని రోజులూ  నీతో ఈ అనుభవం కావాలని తపించాను.. ఆ అనుభవం పొందాక నీమీద తెలియని అనురాగం, ప్రేమా కలుగుతున్నాయి. నీకు  ఈ మాత్రం కూడా దురంగా ఉండలేకపోతున్నాను.. దీన్ని లవ్ అంటారేమో నాకు తెలియదు.. బట్ ఐ నీ డ్ యూ .

కానీ, నాకు మాత్రం చాలా భయంగా ఉంది .. గిల్టీగా ఉంది .. ముందు నేను ఇంటికి వెళ్లాలి ..

వెళ్లు .. కానీ, ఇంకెప్పుడూ నన్ను కలవనని మాత్రం అనకు ..

ప్రఖ్య అతనివైపు చూసింది .. అతని కళ్లల్లో అభ్యర్ధన ..

చటుక్కున మొహం తిప్పుకుని హాల్లోకి వచ్చేసింది .. తలుపు తీయాలంటే భయంగా ఉంది .. ఎవరన్నా చూస్తే .. ఇంకేమన్నా ఉందా? తటపటాయిస్తూ తలుపు దగ్గరకు నాలుగుసార్లు వెళ్లి, వెనక్కి వస్తూ చివరికి ధైర్యం చేసి తలుపు తీసి బైటకి చూసింది .. అదృష్టం ఎవరూ లేరు.. అంతే ఒక్క ఉదుటున బైటకి నడిచి పరిగెత్తుకుంటూ తన ఫ్లాట్ వైపు వెళ్లిపోయింది ..

ఆదిత్య పొందిన ఆనందాన్ని మననం చేసుకుంటూ మంచం మీద దొర్లసాగాడు..

కాస్సేపు అలా దొర్లాక ఆదిత్యకి ఏమన్నా చేయాలనిపించింది .. తన ఆనందాన్ని ఇంకా వేరేలాగా ఆ పరిసరాలన్నిటికీ ప్రకటించాలనిపించింది .. మంచం దిగి గది మధ్యలో నిలబడి నేను పెద్దవాణ్ణి అయానోచ్ .. అని అరిచాడు కొంచెం గట్టిగా.. తరవాత మరోసారి కాస్త స్వరం పెంచి అరిచాడు.. ఆ తరవాత పదే, పదే నేను పెద్దవాణ్ణి అయానోచ్ అనుకుంటూ చేతులు బార్లా చాచి గుండ్రంగా తిరిగాడు గదిలో .. హటాత్తుగా అతని చేయి పుస్తకాల రాక్‌కి తగిలి పైనుంచి దడ,దడమంటూ పుస్తకాలు కిందపడ్డాయి. అలా పడడంలో ఒక బరువైన వెడల్పాటి పుస్తకం ఆదిత్య కాళ్లమీద పడింది.

అబ్బా అంటూ ఒంగి కాలు పట్టుకుని ఆ పుస్తకం పక్కకి జరిపాడు .. అది పుస్తకం కాదు.. పెద్ద ఆల్బమ్ .. అది చూడగానే ఆదిత్య నొప్పి మర్చిపోయి ఆశ్చర్యంగా దాన్ని చేతిలోకి తీసుకున్నాడు.. చాలా బరువుగా ఉంది .. రెండు చేతుల్తో ఆ ఆల్బమ్ మంచం మీద పెట్టి మంచం అంచున కూర్చుని ఆల్బమ్ తెరిచాడు..

ఆశ్చర్యం .. మొదటి పేజీలోనే శిరీష, ఆమె పక్కన ఒక యువకుడు .. శిరీష పట్టుచీరలో ముగ్ధమోహనంగా ఉంది .. ఫుల్‌సూటులో అతను ఇంకా అందంగా ఉన్నాడు..

అమ్మ, నాన్న .. ఆదిత్య పెదాలు ఉచ్ఛరించాయి.. నాన్న, నాన్న .. అనుకుంటూ ఆ యువకుడి ఫోటొ చేత్తో తడిమాడు..

ఎంత బాగున్నాడు నాన్న .. ఆత్రంగా మిగతా పేజీలు తిప్పసాగాడు.. ఎంతో సన్నిహితంగా, మరెంతో ప్రేమగా, అనురాగంగా వాళ్లిద్దరి ఫోటోలు .. పెళ్లినాటివి, హనీమూన్ వెళ్లినప్పటివి .. కొన్ని ఫోటోల్లో అతని తల్లి, తండ్రి కాబోలు ..

ఆదిత్య కళ్లు మెరిశాయి ఒక ఫోటో దగ్గర .. శిరీష మధ్యలో ఉంది .. పట్టు పరికిణీ, ఒణీ, మెడలో నెక్లెస్, రెండు జడలు, కళ్ల నిండా కాటుక . అటూ, ఇటూ తల్లి, తండ్రి ..

అమ్మమ్మ, తాతయ్య .....

ఆదిత్య చేతులు అమ్మమ్మ, అంటూ ఆఫోటోని ఆప్యాయంగా తాకాయి .. అమ్మమ్మ, తాతయ్య మధ్యలో అమ్మ .. ఎంత బాగుంది ఈ పోటో .. ఇంకా ఉన్నాయా? .. గబ,గబా తిప్పాడు పేజీలు .. చాలా ఉన్నాయి.. చటుక్కున ఒక ఫొటో ఆల్బమ్‌లోంచి లాగాడు.. బాగా పాత ఫోటో .. బ్లాక్ అండ్ వైట్‌లో ఉంది .. అమ్మమ్మ తాతయ్యల పెళ్లిఫోటో .. దాని వెనకాల 1968 కారంపూడి అని రాసి ఉంది ..

కాలింగ్ బెల్ మోగింది .. వెంటనే ఆదీ అంటూ శిరీష స్వరం వినిపించింది ..

ఆదిత్య కాస్సేపు తడబడ్డాడు.. ఆ ఆల్బమ్ ఎత్తి పైన పెట్టడానికి టైం పడుతుంది .. ఎలా? చటుక్కున మంచం మీద మడతపెట్టి ఉన్న బ్లాంకెట్ ఆల్బమ్ మీద పడేసి, లేచి వెళ్లి తలుపు తీశాడు..

ఏం చేస్తున్నావురా? పూర్తిగా రంగుల్లో మునిగిపోయిన శిరీష అడుగుతూనే గబ,గబా బాత్‌రూమ్‌లోకి వెళ్లిపోయింది.

హమ్మయ్య అనుకుంటూ ఆదిత్య తిరిగి తన గదిలోకి వెళ్లిపోయాడు.. ఆల్బమ్‌లోంచి రెండు ఫోటోలు తీసుకున్నాడు.. ఒకటి శిరీష తల్లి తండ్రులతో ఉన్నది .. మరోటి తాతయ్య, అమ్మమ్మ మాత్రమే ఉన్నది .. తీసుకుని తన పుస్తకాల సొరుగులో దాచేసి, ఆల్బమ్ పైన పెట్టేశాడు..

అమ్మ ఇంతకాలం తనకి ఈ ఆల్బమ్ ఎందుకు చూపించలేదో ..

అసలైనా ఇన్నాళ్లనుంచి ఈ బుక్స్‌రాక్ తను వాడుకుంటూ ఈ ఆల్బమ్ చూడకపోడం ఏంటి?

ఎక్కడినుంచి అయినా తీసి అమ్మ ఈ మధ్యే ఇక్కడ పెట్టి ఉండాలి..

అయినా తనకి ఒక్కసారన్నా ఎందుకు చూపించలేదు.. అన్యాయం .. తనకి మాత్రం తన తండ్రిని చూడాలని అనిపించదా? నాన్న ఎక్కడ ఉన్నాడో .. అమ్మమ్మ, తాతయ్య ఈ ఇంటికి ఎందుకురారో, అమ్మకి అన్నయ్యలు, అక్కయ్యలు లేరా? వాళ్లంతా ఎందుకు రారు?

ఆదిత్య ఆలోచిస్తూ అలాగే కూర్చుండిపోయాడు..

తను మాత్రం అమ్మలాగా ఒంటిగా బతకకూడదు..

తను పెళ్లి చేసుకోవాలి .. అవును ప్రఖ్య తను పెళ్లి చేసుకోవాలి .. బోలెడు మంది పిల్లల్ని కనాలి .. తనకి పెద్ద కుటుంబం కావాలి .. తనింటికి నిత్యం ఎవరో ఒకళ్లు వస్తూ, పోతూ ఉండాలి .. ఈ ఫ్లాట్స్‌లో అందరిలా తను కూడా పండగలొస్తే గుమ్మాలకి మావిడితోరణాలు కట్టుకోవాలి .. ప్రఖ్య గడపకి పసుపురాసి, కుంకుమ పెడుతుందా? నేర్పించచ్చులే ..

ఆదిత్యకి ఆ మధ్య దసరా పండక్కి ఎదురింటి ఫ్లాట్‌లొ ఆంటీ గడపకి పసుపురాసి,కుంకుమ బొట్లు పెట్టడం గుర్తొచ్చింది .. ఎంత అందంగా ఉండిందో ఆ గడప .. గుమ్మాలకి మావిడాకులు, బంతిపూలు ఎంతసేపు చూసినా చూస్తూ ఉండాలనిపించింది .. అమ్మఅవన్నీ ఎందుకు చేయదు?

ఆదీ .. ఏం చేస్తున్నావు? రా భోంచేద్దాం .. ఆకలేస్తోంది అంటూ శిరీష పిలిచేసరికి ఆలోచనల్లోంచి తేరుకుని డైనింగ్ టేబిల్ దగ్గరకు వెళ్లాడు..

శిరీష డిషెస్ అన్నీ టేబిల్ మీదకు చేరుస్తూ .. సరదాగా నువ్వుకూడా పిల్లలతోకలిసి కాస్సేపు ఆడుకోకపోయావా? హోలీ పండగ సరదాగా ఉంటుంది .. అంది .

నాకిష్టం లేదు.. అన్నాడు ముక్తసరిగా..

అతని స్వరం విని తలెత్తి కొడుకువైపు ప్రశ్నార్ధకంగా చూసింది శిరీష..

ఉదయం స్నానం చేసి తయారైన లక్షణాలు లేవు .. జుట్టంతా చెరిగిఉంది .. ఏదో తేడాగా కనిపించాడు..

ఏమైందిరా? పడుకుని లేచావా? అడిగింది ..

ఉలిక్కిపడ్డాడు.. తడబడుతూ ఆ .. అవును అన్నాడు కంచంలో పెట్టిన అన్నం కలుపుతూ ..

నీ పడకకి ఒక టైం అంటూ ఉండడంలేదు.. చదువు నెగ్లెక్ట్ చేస్తున్నావు .. ఎప్పుడూ నిద్రేనా? తనూ కుర్చీలో కూర్చుని కంచం దగ్గరగా జరుపుకుంది ..

ఆదిత్య మాట్లాడలేదు.. కొన్ని క్షణాలాగి అడిగాడు.. అమ్మా .. అమ్మమ్మ, తాతయ్య ఎక్కడ ఉంటారు?

ముద్ద నోట్లో పెట్టుకోబోతున్న శిరిష ఆశ్చర్యంగా చూసింది .. ఎందుకిప్పుడు నీకు వాళ్ల విషయం?

ఊరికినే .. ఏం? మనం ఎప్పుడూ అమ్మమ్మ వాళ్లింటికి వెళ్లకూడదా? నాకు వెళ్లాలని ఉంది .. మనకెవరూ చుట్టాలెందుకు లేరు,

శిరీష మౌనంగా ఉండిపోయింది. ఈ మధ్యే ఆమెక్కూడా తల్లిని చూడాలని బాగా అనిపిస్తోంది. వెళ్లాలంటే అహం అడ్డొస్తోంది.. అమ్మ ఎలా ఉందో .. వెళ్లి ఇక్కడికి తీసుకొచ్చి తనతో ఉంచుకోవాలని చాలాసార్లు అనిపించింది .. గట్టిగా నిట్టూర్చి కొన్ని క్షణాల తరవాత అంది .. ఆమె స్వరంలో ఇందాకటి ఉత్సాహంకానీ, అథార్టీకానీ లెదు.. కొంచెం వేదన కలగలిసిన స్వరంతో అంది .. తాతగారు పోయారు .. అమ్మమ్మ తన విలేజ్‌లోనే ఉంది .. నాకూ అమ్మమ్మని చూడాలని ఉంది .. కానీ, ఆవిడ రాదు.. నేను వెళితే రానిస్తుందో లేదో తెలియదు..

ఎందుకని? ఎందుకు రానీయదు?

శిరీష ఇదివరకులా నీకెందుకురా నోర్మూసుకో అని అనలేకపోయింది .. అవును వీడూ పెద్దవాడవుతున్నాడు.. వాడి సందేహాలు తీర్చాల్సిన బాధ్యత నాకుంది అనుకుంది ..

వాళ్లకిష్టంలేని పెళ్లి చేసుకున్నానని కోపం అంది ..

మరి నాన్న ఎక్కడమ్మా అడిగాడు

శిరీష గొంతులో ముద్ద అడ్డుపడినట్టు అయి మంచినీళ్లు తాగింది .. కాస్సేపు ఏం మాట్లాడకుండా కంచంలో చేయి పెట్టి అన్నం అటూ, ఇటూ కెలుకుతూ ఉండిపోయింది ..

తరవాత లేచి సింక్‌లో చేయి కడిగేసుకుని నాప్‌కిన్‌తో చేయి తుడుచుకుంటూ అంది .. ఆదీ .. నీకు ఏవేవో తెలుసుకోవాలని చాలా కుతూహలంగా ఉన్నట్టుంది .. రాత్రికి చెప్తాను..అందాకా నన్ను వదిలెయ్ .. సరేనా? అంటూ అక్కడినుంచి వెళ్లిపోయింది .

ఆదిత్యకి తల్లి అలా అన్నం తింటూ, తింటూ మధ్యలో వదిలేయడం బాధనిపించింది ..

తనూ లేచి ఆవిడ వెనకాలే వెళ్లి సారీ అమ్మా .. అన్నం తినేటప్పుడు అడగాల్సింది కాదు నేను .. సారీ .. ప్లీజ్ వచ్చి అన్నం తిను .. అన్నాడు బతిమాలుతూ..

శిరీష కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అవి ఆదిత్య చూడకుండా తుడుచుకుని అంది .. నాకాకలి లేదరా . నువ్వు తిను..

ఇప్పుడేగా ఆకలేస్తోంది అని పిలిచావు.. రామ్మా .. నువ్వు తినకపోతే నేనూ తినను... అన్నాడు గారంగా..

ఆదీ .. భావోద్వేగంతో ఆదిత్య ని దగ్గరకు తీసుకుని తలమీద ముద్దు పెట్టుకుంది ..తరవాత నెమ్మదిగా అంది .. నువ్వు పెద్దవాడివి అవుతున్నావురా .. సరే రా తిందాం అంటూ డైనింగ్ టేబిల్ దగ్గరకు నడిచింది ..

ఆదిత్యకి ఆమాట వినగానే ఛాతీ ఉప్పొంగినట్టు అయింది .. యస్ నేను పెద్దవాడినయాను.. అనుకున్నాడు గర్వంగా .

ఆ రాత్రి శిరీష క్లుప్తంగా తన గురించి తన తల్లి తండ్రు ల గురించి ఆదిత్యకి చెప్పింది ..

మీ నాన్న మళ్లీ పెళ్లి చేసుకున్నాడురా .. కానీ, నీకోసం నేను మాత్రం పెళ్లి చేసుకోలేకపోయాను అంది .

వివేక్ అంకుల్‌ని నువ్వు పెళ్లి చేసుకోవచ్చుగా సడన్‌గా అన్నాడు..

శిరీష మ్రాన్పడిపోయింది .. ఆదిత్య చాలా పెద్దవాడయాడు.. అనుకుంది ..

ఆదిత్య ఆవిడనా స్థితిలో చూసి మౌనంగా తన గదిలోకి వెళ్లిపోయాడు..

శిరీష అలాగే చాలాసేపు కూర్చుండి పోయింది ..

వివేక్‌తో తన అనుబంధం వీడికి తెలిసిపోతోందా? తెలిసిపోయింది ..

ఎలా? ఇప్పుడెలా?

ఆ రాత్రి ఆమెకి శివరాత్రే అయింది.

ూూూ

డాక్టర్ ప్రవీణ నర్సింగ్‌హోమ్ .. బైట డాక్టర్ ప్రవీణ, ఎం .. డి గైనిక్ అని బోర్డు ంది .. గ్లాస్ డోర్‌కి చిన్న బోర్డు డాక్టర్ ఇన్ అని రాసి ఉన్నది వేలాడుతోంది. కారిడార్‌లో పేషెంట్స్ కుర్చీల్లో కూర్చుని ఉన్నారు .. అందరూ గర్భిణులే . కొందరు భారంగా లోపల్నించి బైటకి వెళ్తున్నారు.. ఆయా ఒకొక్కరినే లోపలికి పంపిస్తోంది.

సాయంత్రం ఏడున్నర దాటి ఉండచ్చు ..

అప్పుడే భానుప్రియ వెహికల్ వచ్చి గేటు ముందు ఆగింది .. వెనక కూర్చున్న ప్రఖ్య దిగి ంది ..భాను వెహికల్ దిగి ఓ పక్కగా పార్క్ చేసి, ప్రఖ్య చేయి పట్టుకుని లోపలికి నడిచింది ..

ఆవిడ మొహం గంభీరంగా ఉంది .. కోపంగా కూడా ఉంది .. ప్రఖ్య మొహంలో భయం, బాగా ఏడ్చినట్టు కళ్లు ఉబ్బి ఉన్నాయి .. మొహం వాడిపోయి ఉంది.

ఇద్దరూ లోపలికి నడిచారు ..

ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చోమని చూపించింది ఆయా ..

భానుప్రియ తన విజిటింగ్ కార్డ్ తీసి ఆయాకిచ్చింది .. ఆయా అది తీసుకుని లోపలికి వెళ్లి రెండు నిమిషాల్లో వచ్చి కూర్చోంది పిలుస్తారు అంది .

భానుప్రియ అసహనంగా కూర్చుంది .. ప్రఖ్య మొహం దించుకుని ఏదో ఆలోచిస్తూ కూర్చుంది.

ఏం జరగబోతోందో ఆమెకి విపరీతమైన టెన్షన్‌గా ఉంది .. తనూ, ఆదిత్యా తపించి, తపించి పొందిన మధురానుభవం తాలూకు ఫలితం భయంకరంగా ఉండబోతోందా? ప్రతి నెలా తొమ్మిది, పది తారీకుల్లో రావాల్సిన పీరియడ్స్ రాకపోడానికి అదే కారణమా? రోజూ నిద్రలేవగానే కళ్లు తిరగడం, వాంతులు అవడం ఇదంతా ఆ అనుభవం తాలూకు పరిణామమా? తను, తను అమ్మ అన్నట్టు అన్‌మారీడ్ మదర్ కాబోతోందా?

అదే నిజమైతే తన కెరియర్ ఏం అవుతుంది? అందరూ తనని అసహ్యించుకుంటారేమో .. ఎంత తప్పు చేసింది.. ప్రఖ్యకి ఏడుపొస్తోంది ..

ఆదిత్యకి చెబితే పెళ్లి చేసుకుందాం అంటూ వెంటపడుతున్నాడు.. ఇది పెళ్లి చేసుకునే వయసా? ఇప్పటినుంచే పెళ్లి చేసుకుంటే తన భవిష్యత్తు వంట ఇంటికి, పిల్లల్ని పెంచడానికి మిగిలిపోతుంది .. అదికాదే కావాల్సింది .. మమ్మీ ఆశలు, తన ఆశయాలు అన్నీ కొట్టుకుపోవడమేనా?

ఏడవకు .. భుజం మీద కొంచెం గట్టిగా తట్టి హెచ్చరించింది భాను.. అలా హెచ్చరించడంలో ఓదార్పులేదు.. చిరాకుంది .. తన చేతి మీద పడిన రెండు కన్నీటి బొట్లు పైజమాకి తుడిచేసుకుంది ప్రఖ్య .

వెళ్లండి .. ఆయా స్వరం వినబడడంతో తలెత్తింది .. పేషెంట్స్ అందరూ వెళ్లిపోయినట్టున్నారు.. ఖాళీగా ఉంది.

పద .. భాను లోపలికి నడిచింది .. ప్రఖ్య అనుసరించింది.

నిమ్మపండురంగు కాటన్ చీర, తెల్లని కోటు, ప్రశాంతమైన చిరునవ్వుతో కూర్చుని ఉంది డాక్టర్ ప్రవీణ ..

విష్‌చేసిన భానుకి కుర్చీ చూపించింది .. ప్రఖ్యని తన పక్కనే ఉన్న స్టూల్ మీద కూర్చోమని సై గ చేసింది.

ఈ అమ్మాయికి అబార్షన్ చేయాలి అంది భానుప్రియ సూటిగా విషయంలోకి వస్తూ..

ఆవిడ ముందు నిర్ఘాంతపోయింది .. తరవాత అంది .. ఎన్నో నెల?

తెలియదు..

గర్భం అని ఎలా తెలుసు? చిత్రంగా చూస్తూ అడిగింది ..

తనకి పీరియడ్స్ రావడంలేదు.. అండ్ షి ఈజ్ హావింగ్ మార్నింగ్ సిక్‌నెస్.

ఆవిడ కనుబొమలు ముడిపడ్డాయి .. అబార్షన్ ఎందుకు? నాట్ అడవైజబుల్ ..

సారీ డాక్టర్ .. నేను నా డెసిషన్ చెప్పాను మీకు .. సలహా అడగలేదు అన్న ధ్వని కలిగేలా అంది భాను..

అదేం గమనించని డాక్టర్ మందలిస్తున్నట్టుగా అంది... పిల్లలు వద్దనుకున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలి .. ఇంత చిన్న వయసులో అబార్షన్ చేస్తే హెల్త్ పాడవుతుంది ..

ప్లీజ్ అర్థం చేసుకోండి .. షి ఈజ్ అన్‌మారీడ్ .. ఒక వెధవ వలన ప్రెగ్నెంట్ అయింది .. ఇప్పుడీ ప్రెగ్నెన్సీ కంటిన్యూ అయితే తన కెరియర్ దెబ్బతింటుంది .. అది నాకిష్టంలేదు.. ఎంత డబ్బు అయినా ఫర్వాలేదు..

డాక్టర్ సీరియస్‌గా చూసింది భానుప్రియవైపు .. మీపేరు? అడిగింది.

■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■

భానుప్రియ చెప్పింది బాను.

మిసెస్ భానుప్రియగారూ . డబ్బు కోసం నేను డాక్టర్ అవలేదు.. జ బ్బు తగ్గించడానికి నేను డాక్టర్ని అయాను.. మీరన్నీ డబ్బుతో కొనచ్చని అనుకుంటున్నారా?

అదికాదు నా ఉద్దేశం ..

ఓ కె .. ఓకె .. మీ ఉద్దేశం ఏదైనా నాకనవసరం .. రామ్మా అంటూ ఆకుపచ్చ కర్టెన్ చాటుకి తీసుకుని వెళ్లింది ప్రఖ్యని ..

భాను టెన్షన్ తగ్గించుకునే ప్రయత్నంలొ రెండు చేతులూ నలుపుకుంటూ కూర్చుంది .. ఆమెకిప్పుడు శరీషనీ, ఆదిత్యనీ గొంతు పిసికి చంపాలన్నంత కసిగా ఉంది .. నెలరోజులుగా ప్రఖ్య తిండి సరిగా తినకుండా, సిక్ అయి, చిక్కిపోతుంటే ఏంటో అనుకుంది .. కానీ, ఉదయం వాంతులు చేసుకుంటుంటే ఆవిడ గుండె ఆగిపోయింది. ముందు తేనె, నిమ్మకాయ గోరువెచ్చని నీటిలో ఇచ్చింది .. తరవాత తన ఫ్రెండ్ ఎం బి బి యస్ డాక్టర్ రాధకి ఫోన్ చేసి మెడిసన్ అడిగింది .. ఆమె సరదాకి అన్నా తనకి నిజంగానే గుండె ఆగింది .. ఏంటే మీ అమ్మాయికి వాంతులేంటి? వేవిళ్లవాళ్లలా అంది రాధ ..

అంతే తనకి గుండె ఆగింది .. ఏదో అనుమానం, భయం .. వెంటనే నీకు పీరియడ్స్ సరిగా వస్తున్నాయా అని ప్రఖ్యని నిలదీసింది .. అమాయకంగా చెప్పింది ప్రఖ్య లేదు మమ్మీ .. టూ మంత్స్ అయింది ..

అంతే ఆవిడ గుండెల్లో పెద్ద,పెద్ద బాకులు గుచ్చుకున్నట్టుగా అయింది.

ప్రఖ్య దగ్గర కూలబడిపోయి మొత్తం ఆరా తీసింది .. రెండు నెల్లుగా తన ఆరోగ్యంలో వచ్చిన మార్పులు చెప్పిన ప్రఖ్యని నిలదీసింది .. ఏం జరిగింది అంటూ .. అప్పుడే ఆవిడకి ఆరోజు ఆదిత్య పుట్టిన రోజు నాడు ఇద్దరూ అదోలా ఇంటికి రావడం గుర్తొచ్చింది .. ప్రఖ్య హోలీనాడు జరిగింది చెప్పగానే పెద్ద కొండరాళ్లు తన నెత్తిమీద పడ్డట్టుగా కుప్పకూలిపోయింది ..

డాక్టర్ మ్యాప్ చూపిస్తూ చెప్పసాగింది .. ‌ఇలా చూడు.. ఫస్ట్ వీక్‌లో ఎగ్ ఇలా యుటరస్ వాల్స్ మీద మొదలై సెకండ్ వీక్‌నుంచీ ఇలా డెవలప్ ..

ప్రజ్ఞ కళ్లు మూసుకుని తల తిప్పుకుంటూ అంది .. అవన్నీ నాకు చూపించకండి .. అబార్షన్‌కి ఎప్పుడు రమ్మంటారో చెప్పండి ప్లీజ్.

డాక్టర్ ఆ పిల్లవైపు ప్రశాంతంగా చూసింది .. పద అంటూ స్ట్రెచర్ మీద పడుకోమంటూ తాను చేతులకి గ్లౌజు తొడుక్కుంది..

▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪

డాక్టర్ చేతికున్న ఆరు బంగారుగాజుల నాజూకు శబ్దం, ప్రఖ్య అడుగుల చప్పుడుకి తలెత్తి వాళ్లవైపు చూసింది భాను..

"మూడోనెల .. మీరు ముందే ఎందుకు గమనించలేదు? అడిగింది డాక్టర్ తన కుర్చీలో కూర్చుంటూ..

భాను పక్కన ఫెళాఫెళా విరుచుకుపడ్డాయి అగ్నిపర్వతాలు .. గాభరాగా అడిగింది ఏం? ఎందుకలా అడుగుతున్నారు?

"అబార్షన్ నాట్ లీగల్ మీకు తెలిసే ఉండచ్చు కదా.. "

"డాక్టర్‌గారూ ! అలా అనకండి .. అది చిన్నపిల్ల .. ఏదో తప్పు చేసింది .. దానికేం తెలియదు.. పీరియడ్స్ రాకపోయినా ఈజీగా తీసుకుంది .. మార్నింగ్ సిక్‌నెస్ స్టార్ట్ అయాక నేను గమనించాను.. అప్పుడు చెప్పింది .. జరిగిందంతా . "

డాక్టర్ ఏదో ఆలోచిస్తూ కూర్చుంది .. ఆవిడ ఏం చెబుతుందో అని ఉద్వేగంగా ఎదురుచూస్తూ కూర్చుంది భాను..

"దరిద్రపు వెధవ .. నికృష్టపు వెధవ .. వాడిని చంపేయాలి .. గొంతుపిసికి చంపేయాలి .. శిరీష మీద కేసు పెట్టాలి .. తల్లీ కొడుకుల్ని ఉరి తీయాలి .. "భాను ఆపాదమస్తకం కసితో వణికిపోతోంది.

డాక్టర్ అయిదు నిమిషాల తరవాత అంది .. "ఈ అమ్మాయిలు గుడ్డిగా మగాడ్ని నమ్మి, ఫ్రీడం ఎక్కువై ముందుచూపు లేకుండా ఎంజాయ్ చేసి మా చేత చట్టబద్ధం కాని పని చేయిస్తున్నారు. . కాదంటే గొడవ .. ఏం చేస్తాం .. రేపు రండి .. ఉదయం తొమ్మిది గంటలకు రండి .. ఒక గంటలో అయిపోతుంది .. "

"థాంక్యూ డాక్టర్ .. థాంక్స్ ఎలాట్ .. "

"ఏమ్మా .. జస్ట్ అనుభవంకోసం ఒప్పుకున్నావా? లేక అతడిని ప్రేమించావా? "సీరియస్‌గా అడిగింది డాక్టర్.

ప్రఖ్య వంచిన తల ఎత్తలేదు..

"అయినా చిన్న, చిన్న పిల్లలకి ఈ రోజుల్లో అన్ని విషయాలు తెలుస్తున్నాయి .. నీకు ప్రెగ్నెన్సీ ఎలా వస్తుందో తెలియలేదా? "

"డాక్టర్ .. ప్లీజ్ .. "భాను చేయి ఎత్తి ఆవిడ్ని వారించింది .. ప్రఖ్య కళ్లనుంచి కారుతున్న కన్నీళ్లు తట్టుకోలేకపోయింది భాను..

"వదిలేయండి .. జరిగిందేదో జరిగింది .. ఏం జరగాలో అదే చేద్దాం .. ఇంకేం అనకండి మీ ఫీజు..?"

■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■

డాక్టర్ ఒక్కసారి తలెత్తి భాను మొహం లోకి సూటిగా చూసి రెండొందలు అంది ..

భాను పర్స్ తెరిచి ఆవిడకి ఫీజు ఇచ్చి ప్రఖ్యకి పద అన్నట్టు కనుసైగ చేసింది ..

ప్రఖ్య, భాను బైటకెళ్లిపోతుంటే వాళ్లనే చూస్తూ నిట్టూర్చింది డాక్టర్ ప్రవీణ.

నెక్స్ట్ .. బెల్ నొక్కి ఆయా లొపలికి వచ్చాక అంది ..

ఇంకెవరూ లేరమ్మా అంది ఆయా ..

ఓ అలాగా .. సరే అయితే అన్నీ సర్దెయ్ . వెడదాం అంది డాక్టర్ ప్రవీణ

ఆయా టేబిల్ మీద ఉన్న స్టెతస్కోప్, కిట్ తీసుకుని బైటకి వెళ్లిపోయింది కారులో పెట్టడానికి..డాక్టర్ వాష్ బేసిన్ దగ్గరకు వెళ్లి మరోసారి డెట్టాల్‌తో చేతులు కడుక్కుంది .. నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటుండగా వచ్చాడు ఇరవై ఏళ్ల కుర్రాడు.. మే ఐ కమిన్ డాక్టర్ ..

డాక్టర్ నొసలు ముడిచింది .. ఎవరు మీరు? అంటూ సీరియస్‌గా ఆయా అని పిలిచింది.

ఆయా పరిగెత్తుకుంటూ వచ్చింది .. నేను కారు దగ్గర ఉన్నప్పుడు లోపలికి వచ్చేస్తున్నాడమ్మా .. నేనొచ్చేలోగా మీ దగ్గరకు వచ్చాడు.. అంటూ ఆవిడకి వివరణ ఇస్తూ ఆ కుర్రవాడి వైపు చూస్తూ .. బాబూ ఇక్కడ ఆడవాళ్లకి మాత్రమే చూస్తారు .. బైటకి వెళ్లండి అంది ..

నేను డాక్టర్‌తో పనుండి వచ్చాను . అన్నాడతను.

అతడివైపు పరిశీలనగా చూసింది డాక్టర్ .. తెల్లగా, సన్నగా చక్కగా ఉన్నాడు.. మెడికల్ రిప్రజెంటేటివ్ అయంటాడు.. అనుకుంటూ టైం చూసుకుంది .. సరిగ్గా బయల్దేరేటప్పుడే వస్తారు చిరాగ్గా అనుకుంటూ కూర్చోండి అంది..

అతను బిడియంగా, ఇబ్బందిగా కూర్చుని నేను ట్రీట్‌మెంట్ కోసం రాలేదండి .. మీతో మాట్లాడాలి ..అన్నాడు..

నాతోటా? అనుమానంగా చూసింది ప్రవీణ ..

అవునండి ..

ఆయాకి బైటకెళ్లమన్నట్టు సైగచేసింది .. ఆయా వెళ్లిపోయింది .

చెప్పండి మీరెవరు? అడిగింది ..

నేను .. నేను .. ఇప్పుడు మీ దగ్గరికి వచ్చారే . . ప్రఖ్య వాళ్లమ్మ .. ఆ ప్రఖ్యకి భర్తని ..

...........................................................................

వాట్? అదిరిపడినట్లుగా చూసింది .. భర్తా .. ఆమెకి పెళ్లికాలేదందే ఆవిడ ..

పెళ్లి కాలేదండి ..

వాట్? పిచ్చివాడివా అన్నట్టు మొహం చిట్లించింది.ఏం మాట్లాడుతున్నావు అసలు నీ పేరేంటి? ఆవిడకి కోపం వచ్చినట్టు అర్థం చేసుకున్న కుర్రాడు అన్నాడు..

కోపం తెచ్చుకోకండి .. అంతా చెప్తాను.. నా పేరు ఆదిత్య .. ప్రఖ్య నేను ఫ్రెండ్స్ .. దాదాపు వన్ అండ్ హాఫ్ ఇయర్నుంచీ మేము ఛాన్స్ కోసం చూశాం .. తనంటే నాకు చాలా ఇష్టం .. అయితే అనుకోకుండా జరిగిపోయింది .. నిజం చెప్పాలంటే నాకు తను ప్రెగ్నెంట్ అవుతుందేమో అనే ఆలోచన రాలేదు.. అలాగే తనక్కూడా తెలియదు.. కానీ, తను ప్రెగ్నెంట్ అని చెప్పింది .. నాకు నిజంగా చాలా హ్యాపీగా అనిపించింది .. తప్పు చేశానని నేను ఫీల్ అవడంలేదు.. నేను ఫాదర్గా ప్రమోట్ అవుతున్నందుకు హ్యాపీగా ఉన్నాను..

ఆవిడ చిత్రంగా చూస్తూ అంది .. ఏం చదువుతున్నావు?

అతను కొద్దిగా నవ్వాడు.. నేను బి.టెక్ చదువుతున్నాను డాక్టర్.. అయితే పెళ్లి చేసుకునే టైం కాదు.. కానీ, తప్పదు.. నాకు పిల్లలంటే చాలా ఇష్టం .. మా అమ్మకి ఒక్కడే కొడుకుని .. నాకు చెల్లెళ్లు, తమ్ముళ్లు, అక్కలు, అన్నలు ఎవరూ లేరు .. కానీ, నాకు పెద్ద ఫ్యామిలీ కావాలని ఇష్టం ..

ఇప్పుడు మేము పెళ్లి చేసుకుంటే పాప పుడుతుంది కదా.. ఆ తరవాత ఇంకా పిల్లల్ని కంటాం .. అప్పుడు నాకు పెద్ద ఫ్యామిలీ వస్తుందికదా.. అందుకే పెళ్లి చేసుకుందాం అన్నాను.. ప్రఖ్య వినలేదు.. వాళ్లమ్మ అసలు వినరు .. వాళ్లు అబార్షన్ అంటున్నారు .. డాక్టర్ .. ప్లీజ్ నాకు హెల్ప్చేయండి .. నాకా బేబీ కావాలి .. ప్రఖ్య పెంచకపోయినా నేను పెంచుకుంటాను.. నా ఫస్ట్ ఇష్యూ నాక్కావాలి.

ఉద్వేగంగా డాక్టర్ చేతులుపట్టుకుని ప్రాధేయపూర్వకంగా అన్నాడు ఆదిత్య ..

ఆవిడ ఆశ్చర్యంగా వింటూ ఉండిపోయింది .. అతనలా చేయి పట్టుకోడం ఉలిక్కిపడి .. నీ వయసెంత? అనడిగింది ..

ఈ మధ్యే ఇరవై వచ్చింది ..

నీకు తెలుసా .. నువ్వింకా నాలుగేళ్లు చదవాలి .. అప్పుడు కానీ లైఫ్లో సెటిల్ అవవు ..

తెలుసు ..

మరి బేబీని తీసికెళ్లి ఏం చేస్తావు?

నేను పెంచుకుంటూను..

■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■■

బేబీ అంటే కుక్కపిల్లకాదు.. బిస్కెట్ వేసి, మిగిలిన అన్నం పెట్టి పెంచుకోడానికి ..

నేనెలాగైనా పెంచుకుంటాను .. పిల్లల్ని పెంచే పుస్తకాలు చదువుకుంటాను.. కానీ, ప్లీజ్ నా బేబీని మాత్రం చంపకండి ..

ఉలిక్కిపడింది ఆవిడ ఆ మాటతో .. కొంచెం సానుభూతితో అంది .. చూడు బాబూ .. మనుషుల్ని చంపడం నా వృత్తికాదు... ప్రాణం పోయడం నా వృత్తి ..కాకపోతే ఆ అమ్మాయి వయసు కూడా చిన్నదే .. తనకి బోలెడంత భవిష్యత్తు ఉంది .. నీకూ బోలెడంత భవిష్యత్తు ఉంది .. పొరపాటు చేశారు .. ఓకె .. లెటజ్ ఫర్గెట్ .. కానీ, పాపాయిని పెంచుకుంటానంటున్నావు .. ఎలాసాధ్యం చెప్పు .. వాళ్లని రేపు రమ్మన్నాను..

ఒద్దొద్దు .. అబార్షన్ చేయకండి .. ఎలాగోలా వాళ్లకి నచ్చచెప్పి బేబీని నాకిచ్చేయండి .. ప్లీజ్ ..

మీ ఇంట్లో పాపని చూసుకోడానికి ఎవరన్నా ఉన్నారా?

అమ్మ ఒక్కతే ఉంది నాకు .. అమ్మ అసలు చూడదు.. అమ్మకి నేనిలా వచ్చానని తెలిస్తే ఊరుకోదు కూడా.

మరెలా? ఎవరు చూస్తారు? ఆవిడకి చికాకొచ్చింది .. ఏం గోల ఈ ఇద్దరిదీ అనిపించింది ..

డాక్టర్గారూ .. నేను మేజర్ని కదా .. నా బేబీని నేను కావాలనుకోడం తప్పు కాదుకదా .. నేను ప్రఖ్యని పెళ్లి చేసుకుందాం అన్నాను.. తనే కెరియర్ కెరియర్ అంటూ వినడం లేదు.. కెరియర్ ఏమవుతుంది చెప్పండి . మా అమ్మ ఇప్పటికి చదువుకుంటోంది .. తను బ్యాంక్ మేనేజర్ కూడా ..మీకెందుకు? నేను చాలా బాగా నా కంటిపాపలా పెంచుకుంటాను.. మీరు నాకు సాయం చేయండి చాలు ..

ఆవిడకి ముచ్చటేసింది అతని మాటలు వింటోంటే .. కుర్రాడు బాగున్నాడు.. చూస్తే మంచివాడిలానే ఉన్నాడు.. ఆ పిల్ల తల్లికి పొగరా? పిచ్చా .. హాయిగా పెళ్లి చేసేస్తే పోతుంది కదా .. అనిపించింది ..

అదికాదు బాబూ .. వాళ్లకి నేనేం చెప్పను?

ఏదో చెప్పండి .. అబార్షన్ చేస్తే డేంజర్ అని చెప్పండి ..

ఆవిడ నవ్వింది .. అతడినే తదేకంగా చూస్తూ ఆలోచిస్తూ కూర్చుంది .. ఆదిత్య ఇబ్బందిగా కదిలాడుకుర్చీలో .ఐదు నిమిషాల తరవాత అంది ఆవిడ .. సరె రేపు వస్తారుగా నేనుచెప్పి చూస్తాను.. అబార్షన్ చేయించుకోకుండా ట్రై చేస్తాను... ఆ తరవాత నీ లక్ ..

అలా అనకండి .. నాకు బేబీ కావాలి .. అంతే ..

పాపం అనిపించింది ఆవిడకి .. ఒంటరితనంతో ఎంత బాధపడ్డాడో ఈ కుర్రాడు.. నిజంగా మైక్రోఫ్యామిలీస్ వలన చాలా మంది ఏదో డిప్రెషన్కి గురి అవుతున్నారు .. కుటుంబ నియంత్రణ వచ్చిన కొత్తల్లో

ఇద్దరు లేక ముగ్గురు పిల్లలు చాలు అన్నారు .. ఆ తరవాత మేమిద్దరం మాకిద్దరు అనే క్యాప్షన్ వచ్చింది .. రాను, రానూ .. ఒకళ్లే చాలనుకుంటున్నారు .. పేరెంట్స్ ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుండడం, పిల్లలు ఒక్కళ్లే ఉండడం, పేరెంట్స్‌తో సాన్నిహిత్యం లేకపోడం .. ఇదంతా అనారోగ్యకరమైన సమాజం ఏర్పడడానికి దోహదం చేస్తోంది .. ఆధునిక సమాజంలో మంచికన్నా చెడే ఎక్కువ జరుగుతోంది .. యువతలో దాదాపు యాభై శాతం మంది డిప్రెషన్‌తొ బాధపడడానికి జీవనవిధానంలో వచ్చిన విపరీతమైన మార్పులే కారణం అనడంలొ సందేహం ఏ మాత్రం లేదు..

ఈ కుర్రాడికి తోడు కావాలి .. ఓ స్నేహం కావాలి .. తన అనే వ్యక్తి కావాలి .. బహుశా ఆ అమ్మాయికి దగ్గరవడానికి అదే కారణం కావచ్చు .. పెళ్లికి ఆమె ఒప్పుకోకపోడంతొ తన సంతానాన్ని తను పొందాలనుకుంటున్నాడు.. అది తన రక్తం పంచుకు పుట్టబోయే బిడ్డ అంటే అతను అన్నిటికీ తెగించి ఆ బిడ్డను పెంచుకోడానికి సిద్ధపడుతున్నాడు..ఇతనికి సాయ పడడంలో తప్పేం లేదనిపించింది ఆవిడకి .. అబార్షన్ చేయడం తప్పు .. లేదా తల్లి నుంచి మరొకళ్లకి బిడ్డని అమ్మడమో, దానం ఇవ్వడమో చేయడంలేదు.. శిశువు తండ్రికే ఇవ్వాలనుకోడం తప్పుకాదుకదా ..

ఆవిడఒక నిర్ణయానికి వచ్చినదానిలా అంది .. ఓ కె .. నువ్వు ఎల్లుండి వచ్చి కనిపించు . ఏం జరిగిందోచెప్తాను...

అతని మొహం వికసించింది .. థాంక్యూ డాక్టర్ .. థాంక్యూ వెరీమచ్ అన్నాడు సంతోషం వెల్లివిరుస్తుంటే

ఆవిడ సన్నగా నవ్వి బెల్ కొట్టింది .. ఆయా లోపలికి వచ్చింది .. అతను బైటకి వెళ్లిపోయాడు..

కాసేపట్లో ఆవిడ కారు వెళ్లిపోయింది ..

ఆ రాత్రి శిరీష ఫ్లాట్‌కి వెళ్లి ఇష్టం వచ్చినట్టు తిట్టింది భానుప్రియ .. మంచి దానివని, ఉద్యోగస్తురాలివని నా కూతుర్ని నీ ఇంటికి పంపిస్తే నీ కొడుకుని నా కూతురి మీద అత్యాచారం చేయిస్తావా? ఛీ నీ బతుకు పాడుగానూ.. నీ బుద్ధే వచ్చినట్టుంది నీ కొడుక్కి .. ఆడపిల్ల జీవితం నాశనం చేశారు .. మీ రేం బాగుపడతారు? అంటూ మధ్య, మధ్య ఏడుస్తూ తిడుతోంటే శిరీష దిగ్భ్రాంతురాలై నిలబడిపోయింది ..

ఏం జరిగింది భానూ .. హీనస్వరంతో అడిగింది.

నన్నాపేరుతొ పిలిస్తే నాలుక చీరేస్తా .. ఛీ .. నీ మొహం చూపించకు నాకు .. అంటూ వెళ్లిపోయింది..

శిరీష నిర్ఘాంతపోయింది .. ఏం జరిగిందో అర్థం కాలేదు... స్థాణువై నిలబడ్డచోటే కూలబడిపోయింది .. భాను మాటలు తూటాల్లా గుండెల్ని తూట్లు పొడిచినయి. ఆ గాయాలతో మండుతున్న గుండె చిక్కబట్టుకుని ఆదిత్య గదిలోకి వెళ్లింది .. ఆదిత్య బిక్కు, బిక్కుమంటూ కూర్చున్నాడు..

శిరీష చెళ్లు, చెళ్లున ఆ చెంపా, ఈ చెంపా వాయించింది .. ఆమె ఆ క్షణంలో ఉన్మాదిలా మారింది.

………………………………………………………………………

ఏం చేశావురా దరిద్రుడా ఆ అమ్మాయిని అంటూ కాళికలా అరిచింది..

ఆదిత్య చెంప చెత్తో పట్టుకుని స్థిరంగా అన్నాడు.. నేను ప్రఖ్యని లవ్ చేస్తున్నా నమ్మా .. తనని పెళ్లి చేసుకుంటాను.. కానీ, ఆవిడే ఒప్పుకోడం లేదు..

నోర్మూయ్ .. మరోసారి చెంప పగిలింది ..

కళ్లల్లో గిర్రున నీళ్లు తిరుగుతోంటే రోషంగా అడిగాడు.. ఏం చేశానని కొడుతున్నావు? ప్రేమించడం తప్పా? మీరంతా ప్రేమించలేదా? నువ్వు నాన్నని ప్రేమించి, అమ్మమ్మ వాళ్లని ఎదిరించి పెళ్లి చేసుకోలేదా? అదే నేను చేస్తే తప్పా?

శరీష ఆదిత్య మాటలకి నివ్వెరపోయి చూడసాగింది ..

ఆదిత్య ఎదిగాడు.. శారీరకంగా, మానసికంగా ఎదిగాడు.. వాడు చిన్న పిల్లాడు కాదు.. తనకెందుకు తట్టలేదీ వాస్తవం ఇంతకాలం? ఆదిత్య వయసు పెరుగుతోందని బాలుడు యువకుడుగా మారుతున్నాడని, మారడం అనివార్యమని తనెందుకు ఆలోచించలేదు.. ఒకవేళ ఆలోచించి ఉంటే ఏం చేసేది? ఎదక్కుండా అడ్డుపడేదా? లేదుకదా .. ఎదగడం ఎంత సహజమో, వయసుకి తగిన ఆకర్షణా సహజమే .. ఈ ఎదుగుదల అనేది అవతల ప్రఖ్యక్కూడా ఇంకా సహజం కదా .. కొత్తగా యవ్వనంలో అడుగుపెడుతున్న ఆ ఇద్దరినీ వంటరిగా వదిలేయడంలో తప్పు ఇద్దరిదీ ఉందికదా .. భాను తననే ఎందుకు నేరస్తురాలిని చేసింది .? ఎందుకు అన్ని మాటలంది? ఎందుకు అంత ద్వేషం పెంచుకుంది?

తప్పు చేసి ఉండచ్చు .. కానీ, దిద్దుకుంటానంటున్నాను .. కానీ, ఆవిడ నాకా అవకాశం ఇవ్వడం లేదు.. తప్పు ఆవిడది .. వెళ్లి ఆవిడ్నే అడుగు .. అంటూ ఆదిత్య చివ్వున అక్కడినుంచి లేచి బాల్కనీలోకి వెళ్లి నిలబడ్డాడు.

శరీషకి కళ్ల ముందు చీకట్లు కమ్మినట్టు అయింది .. ఇంక నిలబడలేక రెండు చేతుల్లో తల పట్టుకుని తన గదిలోకి వెళ్లిపోయి మంచం మీద వాలి వెక్కి, వెక్కి ఏడవసాగింది ..

బాల్కనీలో నిలబడ్డ ఆదిత్యకి ఆవిడ వెక్కిళ్లు వినిపిస్తున్నాయి .. ఏం చేయాలో అర్థంకాలేదతనికి .. తనేం చేస్తే అమ్మ సంతోషిస్తుంది అని ఆలోచించసాగాడు.. ఏం చేయాలో తోచని వాడిలా ఊహించని ఆ స్థితికి ఆదిత్య బిత్తరపోతూ ఉండిపోయాడు .. కాస్సేపటికి ఏదో నిర్ణయించుకున్న వాడిలా పరిగెత్తుకుంటూ ప్రఖ్య ఫ్లాట్‌కి వెళ్లాడు..

ప్రఖ్య గదిలో పడుకుని ఉంది .. బెల్ కొట్టగానే భాను తలుపు తీసింది .. ఆదిత్యను చూసి అపరకాళి అయింది .. ఎందుకొచ్చావ్? అడిగింది నిప్పులు కురిపిస్తూ..

ఆంటీ .. నన్ను లోపలికి రానివ్వండి చెప్తాను.. ప్లీజ్ .. బతిమాలాడు .

చంపేస్తాను.. గెట్ అవుట్ పళ్ల బిగువున అరిచింది ..

ఆంటీ ప్లీజ్ .. బైట మాట్లాడద్దు .. పక్కవాళ్లు చూస్తారు .. నన్ను రానివ్వండి ..

అంటూనే ఆమెని తోసుకుని లోపలికి వచ్చి ప్రఖ్య గది వైపు చరచరా వెళ్లాడు.. పడుకున్న ఆమె భుజాలు పట్టుకుని లేవనెత్తి ప్రఖ్యా .. నీకు చెప్పా కదా .. మనం పెళ్లి చేసుకుందాం అని .. ఎందుకు మీరింత గొడవ చేస్తున్నారు.. అన్నాడు కోపంగా..

భాను విసురుగా వచ్చి ఆదిత్య చెంప చెళ్లుమనిపించింది .. నీ బతుక్కి నా కూతుర్ని పెళ్లి చేసుకుంటావా? ఇడియట్ .. నోరుమూసుకుని బైటకి నడువు.. ఇంకోసారి నా కూతుర్ని కన్నెత్తి చూసినా, పన్నెత్తి పలకరించినా నిలువునా నరికేస్తా..

ఆంటీ .. నేను ప్రఖ్యని లవ్ చేస్తున్నా .. మేము పెళ్లి చేసుకుంటే తప్పేంటి? ఆమె కొట్టిన దెబ్బకి కళ్లల్లో నీళ్లు సుడులు తిరుగుతోంటే రోషంగా అడిగాడు..

తప్పా తప్పన్నరా .. వెళ్లరా .. మెడపట్టి గెంటేస్తా ఇంకాస్సేపుంటే .. అరిచింది భాను..

ఆదిత్యకి ఆ క్షణం ఆవిడ అవతారం చూస్తే నిజంగానే భయం వేసింది ..

ఒక పక్క తల్లి దెబ్బలు, మరో పక్క ఈవిడ దెబ్బలు .. ఎన్నడూ అనుభవంలోకి రాని బాధ, ఏడుపొస్తోంది .. తనేం తప్పు చేయలేదని అనిపిస్తోంది .. ఒకవేళ తప్పు చేసినా పెళ్లి చేసేసుకుంటే ఆ తప్పు ఒప్పు అవుతుంది కదా .. ప్రఖ్య తన భార్య అవుతుంది .. ఏమవుతుంది? అతనికి ఎంత ఆలోచించినా అర్థం కావడంలేదు..

మంచం చివర తలవంచుకుని కూర్చున్న ప్రఖ్య వైపు చూశాడు..

మౌనంగా కూర్చుంది .. కనీసం అతనివైపు కూడా చూడడం లేదు..

ప్రఖ్యకి ఏమీ అనిపించడంలేదా? ఇన్నాళ్లూ, తను కూడా కావాలనుకుంటేనే కదా ఇద్దరూ ఎంజాయ్ చేశారు .. ఇప్పుడేం మాట్లాడదేం? ఇందులో ఆదిత్య తప్పే కాదు .. నాదీ ఉంది అని చెప్పదేం? ఆదిత్యని ప్రేమిస్తున్నాను.. మేము పెళ్లి చేసుకుంటాం అని డిక్లేర్ చేయదేం?

ప్రఖ్యా .. గట్టిగా పిలిచాడు..

గభాల్న తలెత్తింది ప్రఖ్య .. ఆ కళ్లల్లో స్పష్టంగా భయం కనిపిస్తోంది ..

ఎన్నిసార్లు చెప్పాలిరా నీకు బైటకి వెళ్లమని .. మీ అమ్మ పంపించిందా నిన్ను ఇంటిమీదికెళ్లి గొడవ పెట్టుకోమని ..

మా అమ్మనేం అనకండి .. మధ్యలో తనేం చేసింది? కోపంగా అన్నాడు..

ఓ రోషం పొడుచుకొస్తోందే .. వెటకారంగా అంది భాను..

ఆవిడ మాటలు విననట్టు స్థిరంగా అన్నాడు ఆదిత్య .. ప్రఖ్యా .. మనం కావాలనుకున్నాం .. ఎంజాయ్ చేశాం .. నేనేం పారిపోలేదుకదా .. నీ ఎదురుగా ఉన్నా కదా .. మనం పెళ్లి చేసుకుందాం .. నువ్వైనా మీ అమ్మకి నచ్చచెప్పు .. మళ్లీ కలుస్తాను.. ఆలోచించు ..అంటూ అక్కడినుంచి వెళ్లిపోయాడు..

భానుప్రియ నిప్పులు కురుస్తున్న కళ్లతో చూస్తూ అంది .. వాడన్నది నిజమేనా .. నువ్వు ప్రొవోక్ చేశావా? చెప్పవే .. నీకెందుకొచ్చింది ఈ పాడు బుద్ధి .. బుద్ధిగా చదువుకుంటారని చనువిచ్చాను.. చాలా తప్పు చేశాను..

ప్రఖ్య మాట్లాడలేదు...

ఛ .. తప్పు నాది .. నిన్ను నమ్మి పరాయి వాడితో ఒంటరిగా వదిలేశాను.. నువ్వింత వీక్ మైండెడ్ అనుకోలేదు..

ప్రఖ్య నెమ్మదిగా అంది .. నేను ఆదిత్యను మ్యారేజ్ చేసుకుంటాను మమ్మీ .

చంపేస్తాను.. గర్జించింది భానుప్రియ . .. నేను ఆశపడిందేంటి? జరిగేదేంటి? ఇంకా జీవితంలోకే అడుగుపెట్టలేదు.. అప్పుడే పెళ్లి కావాలా? అప్పుడే పెళ్లి, పిల్లలు అని అఘోరిస్తే నీ జీవితం పాతికేళ్లకే ఎండ్ అయిపోతుంది .. అర్ధమైందా? చదువుకుని, మంచి హోదా సంపాదించుకుని, మంచివాడిని, నీకు తగినవాడిని పెళ్లి చేసుకుని జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించాలి .. అంతేగానీ, ఇలా కక్కుర్తి పడితే ఇంతే .. అయిందేదో అయింది .. నోరుమూసుకుని నేనేం చెబితే అది చేయి . పిచ్చి వేషాలేసావంటే పళ్లు రాలగొడతాను.. వెళ్లు .. వెళ్లి చదువుకో ..

ప్రఖ్య మాట్లాడకుండా లోపలికెళ్లి ధడాల్న తలుపేసుకుని మంచం మీద వాలిపోయింది .. ఆమెకి ఏడుపు రావడం లెదు.. కానీ, ఏదో తెలియని భయం ఆవరించేసింది .. నా జీవితం ఏమవబోతోంది? అని వణికిపోయింది ..

ఆ రాత్రంతా ప్రఖ్యకి నిద్రపట్టలేదు... పిచ్చి, పిచ్చి ఆలోచనలతో భయంతో వణికిపోతూ గడిపింది ..

మర్నాడు అనుకున్న టైంకి ప్రఖ్యని తీసుకుని క్లినిక్‌కి వెళ్లింది భాను ..

డాక్టర్ ప్రవీణ ప్రఖ్యని తీసుకుని రూమ్‌లోకి వెళ్లిపోయింది ..

భాను టెన్షన్ అణచుకుంటూ కూర్చుంది .. అబార్షన్ అయిపోగానే ఫ్లాట్ వెకేట్ చేయాలి అని నిశ్చయించుకుంది.

డాక్టర్ పరీక్ష చేస్తూ నెమ్మదిగా అడిగింది .. ఏమ్మా .. మీ అమ్మ అబార్షన్ అంటున్నారు.. నీ అభిప్రాయం ఏంటి? హాయిగా ఆ అబ్బాయిని పెళ్లి చేసుకోవచ్చుకదా ..

అప్పుడేనా పెళ్లి ..నేనింకా చదువుకోవాలి ..

తరవాత చదువుకోవచ్చుకదా ..

అమ్మో .. అమ్మ ఒప్పుకోదు..

అమ్మ ఒప్పుకుంటే చేసుకుంటావా?

ఒప్పుకోదు .. స్థిరంగా అంది ..

ఒకవేళ ఒప్పుకుంటే ..

ప్రఖ్య ఆలోచించింది .. ఒక పక్క నుంచి ఆదిత్య కావాలనిపిస్తోంది .. కానీ, ఇప్పటినుంచే పెళ్లి, పిల్లలు అంటే మమ్మి అన్నట్టు జీవితం ఆగిపోతుందేమో ..

అతన్ని నువ్వు ప్రేమిస్తున్నావుకదా ..

డాక్టర్ ప్రశ్నకి ఉలిక్కిపడింది .. ప్రేమా? .. ఏమో .. అసలా ఆలోచనే రాలేదు.. ఎంతసేపూ ఆ అనుభవం కోసం తపా, తపాలాడిందే కానీ, ఆదిత్యను ప్రేమిస్తున్నట్టుగాని, అతను కావాలన్న ఆరాటం కానీ కలగలేదు.. ఏమోనండి నాకేం తెలియదు.. బహుశా ప్రేమించడంలేదు..

అయితే అతడిని పెళ్లిచేసుకోవా?

ఏమో .. మమ్మి ఏం చెబితే అదే చేస్తా..

ఒళ్లు మండింది డాక్టర్‌కి .. మీ చెబితేనే ప్రెగ్నెంట్ అయావా? చిరాగ్గా అంది ..

ఆవిడలా విసుక్కోడంతో ప్రఖ్య బిక్కమొహం పెట్టింది ..

ఆ మొహం చూసిన డాక్టర్ ప్రవీణ ఒక్కసారిగా సుర్దుకుంది .. తను అనవసరమైన విషయాలు మాట్లాడుతోందేమో అనిపించింది ..

సర్లె మీ ఇష్టం నాకెందుకు? అంటూ స్టెతస్కోప్ తీసుకుంది .

సుమారు పదినిమిషాల తరవాత ప్రఖ్య, డాక్టర్ ప్రవీణ బైటకి వచ్చారు .. వాళ్లవైపు అనుమానంగా చూసింది భాను..

ప్రఖ్య ఏమీ మాట్లాడకుండా మౌనంగా కుర్చీలో కూర్చుని టేబిల్ మీద ఉన్న జర్నల్ తీసుకుని తిరగేయసాగింది.

▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪

భాను మొహం చిట్లించి అడిగింది .. ఏం జరిగింది?

ఎవరూ మాట్లాడలేదు.. భాను అసహనంగా కదిలింది ..

కొన్ని క్షణాల తరవాత డాక్టర్ అంది .. మీకో సజెషన్ ఇస్తాను వింటారా?

ఏం చెబుతుందో అని ఆలోచిస్తు నెమ్మదిగా తలపంకిస్తూ చెప్పండి అంది భాను..

మీ అమ్మాయి చాలా వీక్‌గా ఉంది .. ఇప్పుడు అబార్షన్ చేయడం అంత మంచిదికాదు..

అయితే, తొమ్మిది నెలలు మోసి కనేయమంటారా పిల్లని .. మా పరువు పోతుంది ..

చూడండి .. తొమ్మిది నెలలు మోయనవసరం లేదు.. ఏడో నెల్లో సిజేరియన్ చేసి బేబీని తీస్తాం ..

ఆ తరవాత ఆ బేబీని ఏం చేస్తారు? అనాధని చేస్తారా? ఒక పిల్లకి జన్మనిచ్చి అనాధను చేయడం ధర్మమా? లేక అసలు జన్మనివ్వకపోడం ధర్మమా? సీరియస్‌గా అడగింది భాను.

నవ్వింది డాక్టర్ ప్రవీణ .. అనాధను చేయమని నేనెందుకంటాను చెప్పండి ..

మరి .. కని ఏం చేయమంటారు..

నిన్ననే నా దగ్గరకు ఒక వైఫ్ అండ్ హజ్బెండ్ వచ్చారు .. వాళ్లకి పిల్లల్లేరు .. పెళ్లయి ఇరవై ఏళ్లయింది .. ఆవిడ వయసు కూడా ఎక్కువే .. ఫార్టీ సిక్స్ .. పీరియడ్స్ కూడా ఆగిపోయాయి .. సరొగేట్ బేబీ ప్రపోజ్ చేశాను.. ఒద్దన్నారు . ఎవరన్నా అనాధలుంటే పెంచుకుంటాం అన్నారు .. మీరో పని చేయండి .. ఈ అమ్మాయికి ఏడో నెల రానివ్వండి .. ప్రీ మెచ్యూర్‌బేబీ సిజేరియన్ చేసి బేబీని బైటకి తీస్తాం .. ఒన్ వీక్ బేబీని మా కస్టడీలో ఉంచుకుని వాళ్లకి ఇచ్చేస్తాం .. మీకు అంగీకారం అయితే నేనో ఫామ్ ఇస్తాను.. ఫిలప్ చేసి సైన్ చేసి ఇవ్వండి ..

భానుకి డాక్టర్ మీద పిచ్చి కోపం వచ్చిందని ఆమె మొహంలో భావాలే చెప్తున్నాయి ..

సెవెన్ మన్త్స్ అది గర్భం మోస్తూ తిరిగితే నా పరువు ఉంటుందా? మీరేం మాట్లాడుతున్నారు? అంది ఆవేశంగా..

డాక్టర్ ప్రశాంతంగా అంది .. అంతకన్నా మార్గం లేదు మేడమ్ .. అమ్మాయి కూడా జంక్‌ఫుడ్ తిన్నట్టు అన్నం తినదనుకుంటా .. షి ఈజ్ వెరీ వీక్ .. మీకు మీ అమ్మాయి కావాలి కదా ..

అంటే అబార్షన్ చేస్తే అమ్మాయికేమన్నా అవుతుందా?

ప్రాణానికి ప్రమాధం లేకపోయినా ఆరోగ్యం మాత్రం పాడవుతుంది ..

అయితే ఏం చేయమంటారు? అది కడుపు వేసుకుని కాలేజీకి వెళితే దాని పరిస్థితేంటి?

--------------------------

"రెండురోజుల్లో మూడోనెల వస్తుంది ..ఇప్పుడెలాగా వెకేషన్ ఉందికదా.. పైగా  ఫస్ట్ ప్రెగ్నెన్సీ .. తను స్లిమ్‌గా ఉంది కాబట్టి పొట్ట కనిపించదు.. ఒకవేళ ఎవరన్నా అడిగితే లావైంది అని చెప్పండి .. ఎలాగా మంచి ఫుడ్ ఇస్తారు కాబట్టి తను ఖచ్చితంగా లావు అవుతుంది .. మీరిందుకు ఒప్పుకుంటే ఒక పాపకి మంచి జీవితాన్నిచ్చిన వాళ్లవుతారు... ఒక జంటని తల్లి తండ్రిని చేసినవాళ్లవుతారు .. నాకు అబార్షన్ చేయడం అంటే ఇష్టం లేక నేనిలా చెప్తున్నాను.. ఆలోచించుకోండి .. బాగా ఆలోచించి చెప్పండి .. "

భానుప్రియ ప్రఖ్యవైపు చూసింది .. ఏమీ విననట్టు తల వంచుకుని జర్నల్ తిరగేస్తోంది ..

భానుకి ఆ క్షణంలో ప్రఖ్యని లాగిపెట్టి తన్నాలనిపించింది ..స్టుపిడ్ గర్ల్ వాడు ఒంటి మీద చేయేస్తే ప్రొటెస్ట్ చేయచ్చుకదా .. తనిష్టం, తన సహకారం లేకుండా వాడు ఇంతపని చేసేవాడా? ఎంత పెద్ద సమస్య ఇది? ఎలా పరిష్కరించాలి? అయినా తను కూడా పెద్ద ఫూల్ .. వాళ్లిద్దరు యంగ్ ఏజ్‌లో ఉన్నారని మర్చిపోయి ఇద్దరికీ చనువు ఇచ్చింది ..  ఇద్దరే ఉంటే తనకి ఆ ఆలోచన కుడా రాలేదేనాడూ.. శిరీషక్కూడా అలాంటి ఆలోచన వచ్చి ఉండదు.. ఛ .. ఎలా? ఏం చేయాలి?

"సరే .. నాక్కొంచెం టైమ్ ఇవ్వండి .. చెప్తాను.." అంది చివరికి ..

డాక్టర్ మొహంలో కొంచెం ప్రసన్నత చోటుచేసుకుంది ..

ప్రఖ్య ఆ మాటతో ఒక్కసారిగా తలెత్తి తల్లి వైపు చూసింది .. ఆ చూపులో ఆశ్చర్యం, అనుమానం రెండూ కనిపించాయి .. నిజమేనా? అమ్మ అలా అందంటే ఇదే నాటకాణికి నాంది కాదుకదా .. అనుకుంది ..

"లే వెళదాం" అంది భాను ప్రఖ్య చూపుల్లో భావాలు గమనించకుండా .

ప్రఖ్య చేతిలో జర్నల్ టేబిల్ మీద పెట్టేసి లేచింది ..

బ్యాగు చేతిలోకి తీసుకుని  డాక్టర్ వైపు చూసి చేతులు జోడించింది ..

డాక్టర్ నవ్వింది ..

తల్లీ కూతుళ్లిద్దరూ బైటకి నడిచారు .. డాక్టర్ సంతృప్తిగా నిట్టూర్చింది ..

ఆ తరవాత చెప్పిన టైంకి వచ్చిన ఆదిత్యకి చెప్పింది .. ప్రస్తుతానికి అబార్షన్ ప్రమాదం తప్పింది .. మిగతా విషయాలు ఆలోచిద్దాం .. అంతవరకూ నువ్విక్కడికి రావద్దు అని ..

అలాగే అంటూ కృతజ్ఞతలు తెలియచేసి వెళ్లిపోయాడు..

అయితే డాక్టర్ అనుకున్నట్టు సిజేరియన్ చేసి ఏడో నెల్లోనే బేబీని బైటకి తీయడానికి భాను ఒప్పుకోలేదు.. పెళ్లికాని పిల్లకి  సిజేరియన్  చేస్తే ఎంత ప్రమాదమో ఆమెకి తెలుసు.. అలా అని పెళ్లికాని పిల్ల గర్భంతో కాలేజీకి వెళ్లి

వస్తుంటే ఎవరికీ తెలియకుండా కాపాడడం అసాధ్యం .. ఏ విధంగా చూసినా ప్రఖ్యకి ప్రమాద ఛ్చాయలే ఎక్కువగా కనిపిస్తున్నాయి .

భానుకి అన్నిటికన్నా ఇక్కడ కూతురి ఆరోగ్యం, అందం కాపాడడం ముఖ్యం .. సిజేరియన్ జరిగాక ఆ సంగతి పెళ్లయాక తెలియకుండా ఉంటుందా? తెలిస్తే దాని జీవితం నాశనం అవుతుంది . సిజేరియన్ అయాక ప్రఖ్య కన్నెపిల్ల అని అంటే ఎవరు నమ్ముతారు? ఎట్టి పరిస్థితుల్లో నమ్మరు .. పిచ్చెక్కినట్లుగా అయింది భానుకి ..

ఎలాగోలా ఇంకా ఆరునెలలు దాటేస్తే డాక్టర్ ప్రవీణ చెప్పినట్టు ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసి బేబీని వాళ్లెవరో అడిగిన వాళ్లకిచ్చేస్తే ఇంక నిశ్చింతగా ఉండచ్చు అని ఆలోచించింది.

ఈ సమస్య నుంచి క్షేమంగా, గౌరవంగా బైటపడాలంటే ఒకటే మార్గం కనిపించింది ఆవిడకి .. వెంటనే బెంగుళూరులో ఉన్న తన స్నేహితురాలు మాధురికి ఫోన్ చేసింది .. మాధురి భాను చెప్పిందంతా ఓపిగ్గా విని, ప్రఖ్యని వెంటనే నా దగ్గరకు పంపించు అంది ..

మాధురి భర్త ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ..ఫస్ట్ ఇయర్ అయిపోయింది కాబట్టి, సెకండ్ ఇయర్ బెంగుళూరులో చదువుతుంది .. ఇక్కడే బి టెక్ పూర్తి చేస్తుందిలే .. ఖంగారు పడకు నేను చూసుకుంటాను.. అని మాట ఇచ్చింది ..

భానుకి కొద్దిగా ఊరట లభించింది.. ఇప్పుడు ప్రఖ్యని కొట్టి, తిట్టి ఏం చేసినా చేసేదేం లేదు.. ఈ సమస్య నుంచి జాగ్రత్తగా బైట పడాలి .. అసలు డాక్టర్ నిజం చెప్తోందో లేదో .. ప్రఖ్య వీక్‌గా ఉండడం ఏంటి? ... వీలైతే మాధురిని బెంగుళూరులో డాక్టర్‌కి చూపించి అబార్షన్ చేయించమనాలి ..

అలా నిశ్చయించుకున్నాక ఆందోళన తగ్గింది .. దీనికంతటికీ కారణం శిరీష .. కొడుకుని అచ్చోసిన ఆంబోతులా పెంచింది .. వెధవ .. జానెడు లేడు .. మీసాలు కూడా రాని వెధవకి రొమాన్స్ కావాల్సి వచ్చింది .. బ్లడీ .. ఛ .

అలా రక,రకాల ఆలోచనలతోటే ప్రఖ్యని బెంగుళూరు పంపించింది ..

ప్రఖ్య వెళ్లిన రెండు రోజులకి శిరీష భాను దగ్గరకి వచ్చింది ..

ఆమెని చూడగానే మొహం తిప్పేసుకుంది భానుప్రియ ..

శిరీష కళ్లల్లో నీళ్లతో అంది .. భానూ .. అయామ్ సారీ .. నేనిలా జరుగుతుందనుకోలేదు..

సారీ నా, సారీ చెబితే బాగుపడిపోతుందా పరిస్థితి .. వాడు చేసిన వెధవ పనికి నా కూతురి భవిష్యత్తు నాశనం అవుతుంది .... మండిపడింది భానుప్రియ.

▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪

భానూ! చిన్న పిల్లలు .. వాళ్లు యవ్వనంలో అడుగుపెడుతున్నారని, ఆ దశ కొన్ని సార్లు పిల్లల చేత తప్పు చేయిస్తుందని మనకి తెలుసు .. ఈ తప్పుని ఒప్పుగా దిద్దుకుందాం భానూ..

అంటే .. ఏంటి నీ ఉద్దేశం? ఆ వెధవకిచ్చి నా కూతురికి పెళ్లిచేయమంటావా?

శిరీష రోషంగా చూసింది .. ఎందుకలా పదిసార్లు వెధవ, వెధవ అంటావు .. తప్పు వాడొక్కడే చేశాడా? నీ కూతురు చనువివ్వకుండానే దాని ఒంటిమీద చేయేశాడా?

పిచ్చి, పిచ్చిగా మాట్లాడకు ..

నేను కాదు .. నువ్వు మాట్లాడుతున్నావు .. కొంచెం ఆవేశం తగ్గించుకుని ఆలోచించు భానూ .. ప్రఖ్య నా కూతురులాంటిది .. తన భవిష్యత్తు పాడవాలని నేను కోరుకుంటానా? పెళ్లి చేద్దాం .. ప్రఖ్యని నేను చదివిస్తాను.. తనకెంత కావాలో అంత చదువుకోనీ .. ఇద్దరూ చదువుకుంటారు .. నాకా శక్తి ఉందికదా ..

ఆహా, చాలా బాగా చెప్పావు.. పెళ్లి, పిల్లలు, చదువు సాగుతాయనేనా? .. అయినా మీసాలు కూడా రాకుండానే ఇంత పని చేసినవాడు, ఏం చదవుకుంటాడు? ఏం బాగుపడతాడు.. ఆవారాగా తిరిగేవాడికి నా కూతుర్నిచ్చి దాని గొంతుకోయమంటావా? ఈ మాట అనడానికి నీకు సిగ్గు లేకపోయినా నాకుంది .. చేసింది చాలు ఇంక మా మానాన మమ్మల్ని వదిలేయండి .. శబ్దం చేస్తూ చేతులు జోడించింది ..

శిరీషకి చాలా అవమానంగా అనిపించింది .. భానుప్రియ చాలా మూర్ఖంగా ప్రవర్తిస్తోందేమో అనిపించింది. ఏదో చెప్పబోతూ ఆమె మొహంలో కనిపిస్తున్న భావాలు చూసి అక్కడి నుంచి వెళ్లిపోబోతూ అంది ..

అనవసరంగా ద్వేషం పెంచుకుంటున్నావు .. ఆలోచించి ఏదన్నా మార్పు ఉంటే నాకు చెప్పు ఆనందంగా స్వీకరిస్తాను... అంటూ వెళ్లిపోయింది శిరీష . మంచి స్నేహితురాలిని అపార్థాలతో కోల్పోతున్నందుకు శిరీష గుండె విరిగిపడినట్టుగా అనిపిస్తోంటే తనని తాను అదుపుచేసుకుంది.

ఆమె వెళ్లిన వైపు చూస్తూ నిరసగా మొహం తిప్పేసుకుంది భానుప్రియ . ఆ తరవాత పదిరోజుల్లో ఫ్లాట్ ఖాళీ చేసేసింది భానుప్రియ.

**మాధురి** భర్తతో విషయం చెప్పి అక్కడే ప్రఖ్యని ఇంజనీరింగ్ కాలేజీలో చేర్పించింది .. అయితే అక్కడ కూడా ప్రఖ్య అబార్షన్‌కి చుక్కెదురైంది .. మాధురికి బాగా తెలిసిన డాక్టర్ స్టేట్స్‌కి వెళ్లింది .. తెలియని వాళ్ల దగ్గరకి తీసికెళితే రూల్స్ అనీ, అదనీ మాట్లాడతారు .. పైగా ఆ పిల్లకి అప్పుడే మూడో నెల .. మాధురికి కూడా కొంచెం అబార్షన్ అంటే భయం వేసింది ..

---

ప్రఖ్యని జాగ్రత్తగా చూస్తూ, మధ్య, మధ్య రెండుసార్లు హైదరాబాద్ డాక్టర్ చెకప్‌కి రహస్యంగా కారులో తీసికెళ్లి తీసుకొచ్చింది ..

నెమ్మదిగా తొమ్మిదో నెల రాగానే డెలివరీకి  భాను దగ్గర దింపేసింది .. అప్పటికి దాదాపు సిలబస్ అయిపోతోంది. మిగతాది ఇంటి దగ్గర చదువుకుంటానంది ప్రఖ్య ..

ప్రఖ్యకి కూడా ఆ అనుభవం తమాషాగా ఉంది .. నెల, నెలా తన శరీరంలో మార్పులు, కడుపులో బేబీ కదలికలు అనుకోకుండానే ఆమెకేదో మధురానుభూతులు కలగసాగాయి. డెలివరీ అయాక అమ్మ పాపనేం చేస్తుందో అనుకుంది . ఆ అనుభూతులన్నీ ఆదిత్యతో పంచుకోవాలని కూడా అనిపించింది ..

పాపం ఆది ఏం చేస్తున్నాడో .. తనంటే ఎంత ఇష్టం ఆదికి అని ఆలోచిస్తుండేది..ఇద్దరూ ఎన్నిసార్లో ఆ అనుభవం పొందడానికి ప్రయత్నించారు .. కానీ, ఆ అవకాశం లభించలేదు.. హోలీ పండుగనాడు అది వెరీ అన్‌ఫార్చునేట్ ..

అన్‌ఫార్చునేటా? ఆ అనుభవం గుర్తురాగానే మనసు తీయగా మూలిగింది .. మళ్లీ ఆ తరవాత అనుభవిస్తున్న బాధలు, కష్టాలు, ఇబ్బందులు తల్చుకుంటే .. మాత్రం భయం వేస్తోంది ..  అనవసరంగా చదువు బాగా డిస్టర్బ్ అయింది.. ఇలాగే జరిగితే తన భవిష్యత్తు పాడైపోతుంది .. ఆదిత్య పెళ్లి, పెళ్లి అంటున్నాడు.. పెళ్లి చేసుకుంటే నిజంగానే మమ్మీ అన్నట్లు భవిష్యత్తు పాడవుతుంది .. పెళ్లి చేసుకుంటే పిల్లల్ని కనాలి .. ఉలిక్కి పడింది .. ఇప్పుడు, పెళ్లి కాకుండానే కంటోంది .. ఏంటోగా ఉంది .. తన కడుపులో ఒక జీవి ఊపిరిపోసుకుంటోంది .. ఎంత తప్పు చేసింది .. తన ఫ్రెండ్స్‌కి తెలిస్తే ఎంత అసహ్యించుకుంటారు .. కాకపోతే తను ఇలా జరుగుతుందనుకోలేదు..

అదేంటో ఆదిత్యను చూడగానే దగ్గరగా కూర్చోవాలని, అలా కూర్చున్నాక అతనేవో చిలిపి పనులు చెయాలని, ఆ తీయదనం అనుభవించాలని ఓ విధమైన తపన ఉండేది .. కానీ,  ఆ తీయని అనుభవం ఇంత కష్టాన్నిస్తుందని అనుకోలేదు.. అనుకుని ఉంటే అలా జరగనిచ్చేదా? ఏమో !

కడుపులో పాపాయి  కదుల్తుంటే ఆ మూవ్‌మెంట్స్ తమాషాగా, కొత్తగా ఉన్నాయి .. మధ్య, మధ్యలో భయం కూడా వేస్తోంది .. పొట్ట చీల్చుకుని పాపాయి బైటకి వస్తుందేమో అనిపిస్తుంది ..పాపాయి మూవ్‌మెంట్స్ ఆదిత్యకి చెబితే ఎంత బాగుండు !

ఆది ఎలా ఉన్నాడో .. నిట్టూర్చింది .. ఒక్కసారన్నా చూడలేదు.. ఆరు నెలలైంది ..పాపం .. అటు వాళ్లమ్మ, ఇటు మమ్మీ ఇద్దరూ తిట్టారు .. కొట్టారు .. ప్రఖ్యకి అప్రయత్నంగా కళ్లల్లో నీళ్లు తిరిగాయి .. తనకోసం దెబ్బలు కూడా తిన్నాడు.. అంటే ఆదిత్య తనని ప్రేమిస్తున్నాడా? .. మరి తను .. ఆదిత్యను ప్రేమిస్తోందా? అసలు ప్రేమంటే ఏంటి? అతను లేకపోతే బతకలేకపోడమా? కానీ, తనకి అలాంటి ఫీలింగ్ ఏం లేదే ..

▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪▪

చాలాసేపట్నించీ అలా బాల్కనీలో కూర్చుని ఆలోచిస్తూ ఉండడంచేత కాబోలు నడుం నొప్పిగా అనిపిస్తోంది .. నెమ్మదిగా కుర్చీలోంచి లేచింది ప్రఖ్య ..

తొందరగా డెలివరీ అయిపోతే బాగుండు అనిపించింది.

హౌస్ అరెస్ట్ చేసింది భానుప్రియ .. అసలు బైటకి వెళ్లలేకపోడంతొ పిచ్చి పడుతున్నట్టుగా ఉంది. పదే, పదే ఆదిత్య గుర్తొస్తున్నాడు.. బేబీని ఏం చేస్తుందో అమ్మ .. ఆదికి ఇచ్చేస్తే బాగుండు పాపం .. తల్చుకుంటుంటే బాధగా అనిపిస్తోంది .. తన బేబీని ఎవరికో ఇచ్చేస్తుందిట డాక్టర్ ..

భవిష్యత్తులో ఎప్పుడైనా పాప తనకి ఎదురు పడుతుందా? నన్నెందుకలా వదిలేసావు మమ్మీ అని తనని అడుగుతుందా? బేబీని తనే పెంచుకుంటే .. !. ఏవరికో ఇవ్వడం పాపం కాదా .. ప్రఖ్యకి ఏడుపు కూడా వచ్చింది .. కానీ, ఇలా ఆలోచిస్తోందని తల్లికి తెలిస్తే ఏం జరుగుతుందో ఆమెకి తెలుసు .. శిరీష ఆంటీ ఏమనుకుంటోందో తన గురించి .. ఈ ఆలోచనలతో పిచ్చిపడుతోంది .. ఎటూ వెళ్లలేకపోతోంది .. ఏమీ చేయలేకపోతోంది ..ఊరికే తిని కూర్చుంటే , పైగా ఒంటరిగా ఆలోచనలు ముసురుకుంటున్నాయి .. భయం వేస్తోంది ..

ప్రఖ్యకి ఇప్పుడు డెలివరీ అయిపోగానే  మళ్లీ బెంగుళూరు వెళ్లిపోయి చదువు కంటిన్యూ చేసేస్తే ఈ ఆలోచనలు అన్నీ పోతాయి .. ఇంజనీరింగ్ అయిపోతే మంచి భవిష్యతుని పొందచ్చు అనుకున్నాక కాస్త ఊరటగా అనిపించింది ఆమెకి .. నిశ్చింతగా కళ్లు మూసుకుంది..

అయితే, ప్రఖ్య బెంగుళూరు వెళ్లిందని తెలిసిన దగ్గర్నించీ ఆదిత్య వేస్తున్న ప్లాన్స్ మాత్రం అటు భానుకి , ఇటు ప్రఖ్యకీ మాత్రమే కాకుండా అతని తల్లి, శిరీషక్కూడా తెలియలేదు.. కొన్ని రోజులు పిచ్చిపట్టిన వాడిలా అయాడు.. తరవాత డాక్టర్ ప్రవీణ ద్వారా ప్రఖ్య ఆరోగ్యం గురించి, ఆమె క్షేమ సమాచారాల గురించి తెలుసుకుంటూ, మరోపక్క చదువు కుంటూ, తనేం చేయాలో ఆలోచిస్తూనే ఉన్నాడు.. ప్రతినెలా డెవలప్ మెంట్స్ కూడా ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ డెలివరీ టైం కోసం ఓపిగ్గా ఎదురుచూడసాగాడు..

ఇప్పుడు ఆ సమయం వచ్చింది ..

---

సమయం రాత్రి పది నలభై నిమిషాలు .
జంటనగరాల ప్రజలు సుషుప్తీజాగృదావస్థలమధ్య జోగుతున్న వేళ..
నగరం నడిబొడ్డున ఉన్న ఒక ప్రముఖ ప్రసూతి ఆసుపత్రి ..
నల్లటి బలమైన ఇనుపగేటు ..
లోపలి కెళుతోంటే ఎడం పక్క వరసగా సైనికుల్లా నిలబడిన పొడుగాటి అశోకావృక్షాలు ...
విశాలమైన ఆవరణలో కుడిపక్క లోపలికి వెళ్లడానికి ఆరు మెట్లు, గ్లాస్‌డోర్ .. మెట్ల మీద రెండుపక్కలా ఖరీదైన కుండీల్లో క్రోటన్స్ ..

ముందు వెప్పు ఖాళీ స్థలంలో డాక్టర్ ప్రవీణ కారు పార్క్ చేసి ఉంది .. అది కాక మరో రెండు కార్లు మాత్రం పార్క్ చేసే స్థలం ఉంది .. కాకపోతే స్కూటర్లు పార్క్ చేయడానికి కొంచెం దూరంలో రేకుల షెడ్డు వేసి పార్కింగ్‌కోసం ఏర్పాటు చేసి ఉంది ..కాంపౌండ్‌వాల్‌ని ఆనుకుని వరసగా కొన్ని మొక్కలున్నాయి ..

వాటిలో ఎర్రమందారం, నిత్యమల్లెలు, బోగస్ విల్లా మొదలైనవి విరగబూసి ఉన్నాయి .. బోగస్ విల్లా కొమ్మలు రెండు ఇనపగేటు వెప్పునుంచి, గోడ బెట్టికి తొంగిచూస్తున్నట్టుగా వంగి ఉన్నాయి .

వాచ్‌మాన్ బహదూర్ గేటుకి కొంచెం ఎడంగా స్టూలు మీద చేతిలో కర్రపట్టుకుని కూర్చుని ఉన్నాడు .

అశోకాచెట్లకి కొంచెం దూరంలో ఆవరణ వెనక భాగంలో సుమారు ఇ రవై ఏళ్ల వ యసున్న కుర్రాడు అసహనంగా అటూ, ఇటూ పచార్లుచేస్తున్నాడు. మధ్య, మధ్య ఎడం చేయి ఎత్తి లైటు వెలుగులో టైం చూస్తున్నాడు. అప్పుడప్పుడూ ఆసుపత్రి లో పలికి కిటికీల్లోంచి తొంగిచూస్తూన్నాడు .

అతని మొహంలో పరిశీలనగా చూస్తే ఆతృత, ఆదుర్దా, కొంచెం భయం కూడా కనిపిస్తున్నాయి . నడుస్తూ, నడుస్తూ కొంచెం ముందుకి వచ్చి గేటు బెట్ట అవతలవైపు రోడ్డు మీద ఆపిన కారువెప్పు చూస్తున్నాడు..

దాదాపుగా అతను ఆసుపత్రి చుట్టుపక్కలా ప్రదిక్షణ చేస్తున్నట్టు ఉంది ..

ఆసుపత్రి లోపల కారిడార్‌కి రెండుపక్కలా రూమ్స్ ఉన్నాయి ..

అందులో అన్నీ ప్రత్యేకమైన గదులేతప్ప జనరల్ వార్డు అంటూ లేకపోవడంచేత అది కేవలం డబ్బున్నవాళ్లకోసమే అన్నట్టుగా అనిపిస్తోంది ..

అన్ని గదుల్లో పేషెంట్స్, వారితోపాటు వచ్చిన అటెండెంట్స్ నిద్రపోతున్నారు .. కొందరు నర్సులు యూనిఫామ్స్‌లో శాంతి దూతల్లా అటూ, ఇటూ తిరుగుతున్నారు ..

చివరగా ఉన్న లేబర్ రూంలోంచి ఉండుండీ బాధాకరంగా అరుపులు వినిపిస్తున్నాయి ..

లేబర్ రూమ్ బెట్ట విజిటర్స్ కుర్చీలో కూర్చున్న భానుప్రియ టెన్షన్‌గా రెండు చేతులు నలుపుకుంటూ లేబర్‌రూమ్ తలుపువెప్పు ఆ గది తలుపులు ఎప్పుడు తెరుచుకుంటాయా అని చూస్తోంది ..

ఆమె తెలుపు మీద గులాబీ రంగులో చిన్న, చిన్న పూలున్న క్రేప్‌సిల్కు పంజాబీ డ్రెస్ వేసుకుంది .. జుట్టు పైకి మడిచి వెడల్పాటి క్లిప్పు పెట్టుకుంది .. భుజానికి పెద్ద హాండ్‌బ్యాగ్ వేళ్లాడుతోంది .

ఆమెకి కొంచెం ఎడంగా తల వంచుకుని కూర్చుని ఉంది శిరీష ..

లోపల ప్రసవవేదన పడుతున్న ఆమె ఒక్కగానొక్క కూతురు ప్రఖ్య చిన్న వయసులో అంత బాధ భరించడం ఆమె తట్టుకోలేకపోతోంది .

ఆమె మొహంలో ఆపుకోలేని కోపం కనిపిస్తోంది. మధ్య, మధ్య తలవంచుకుని కూర్చున్న శిరీష వైపు మండిపడుతూ చూస్తోంది . వీలైతే ఆమె గొంతుపిసికి చంపేయాలన్నంత కసి ఆమె చూపుల్లో కనిపిస్తోంది ..

శిరీష మధ్య, మధ్య కొంగుతో కళ్లు తుడుచుకుంటూ మౌనంగా కూర్చుంది .

శిరీష పసుపు పచ్చ కాటన్ చీర కట్టుకుంది .. దానికి వైలెట్ కలర్ బోర్డరు ఉంది .. ఆ చీర అందమైన ఆమెకి ఇంకా అందాన్నిస్తోంది ..

ఆమె మనసులో అగ్నిపర్వతాలు పేలుతున్నాయి ..

తన కొడుకు చేసిన పనికి ఈ అమ్మాయి భవిష్యతు పాడుకాకూడదు అన్నదే ఆమె ప్రార్ధన .. మనసులో భగవంతుడిని క్షమార్పణ అడుగుతూ, పదే, పదే ప్రఖ్య క్షేమంకోసం ప్రార్ధిస్తూ కూర్చుంది.

తన కొడుకు అంతపని చేశాడంటే నమ్మలేకపోతోంది .. నూనూగు మీసాలతో అమాయకంగా, బెదురు కళ్లతో చూసే ఆదిత్య అంత పని చేశాడా?

ఒకమ్మాయిని గర్భవతిని చేయడం, ఆమెని పెళ్లి చేసుకోమని బెదిరించడం .. ఆదిత్యేనా .. ఏ దుష్టశక్తి వాడిని ఆవహించిందో .. ఎందుకిలా చేశాడు?

ఇద్దరూ కలిసి చదువుకుంటారని, స్నేహంగా ఉంటారని అనుకుంది .. కానీ, ఇలా జరుగుతుందని ఎన్నడన్నా ఊహించిందా?

అసలు వాళ్లిద్దరి మధ్యా అలాంటి అభిప్రాయం ఉందని తనేనాడైనా ఊహించిందా?

ఆదిత్యకి వయసు వస్తోందని, యవ్వనం సంతరించుకున్నాడని , యవ్వనసహజమైన వాంఛలతో రగిలిపోతున్నాడని ఆలోచనేరాలేదు.

అకారణంగా వివేక్ మీద ద్వేషం పెంచుకుని తనతో గొడవపడుతున్నాడని కొంచెం కఠినంగా ఉంది.

తనకీ, వాడికీ మధ్య ఒక దూరం పెంచింది .. అందుకేనా ఆదిత్య మనసులోని భావాలు తను గ్రహించలేకపోయింది ..

అయినా పిచ్చిగానీ ఎలా గ్రహించగలదు? వాడు మనసు విప్పి మాట్లాడితేగా ..

ఆఖరికి నువ్వు నాకక్కర్లేదు అనేంత కాఠిన్యం, తన పట్ల అంత విముఖత ఎందుకొచ్చింది? ఎలా వచ్చింది? ఎక్కడున్నాడో .. వారం అయింది తనని ఎదిరించి వెళ్లిపోయి .. వాడికి అమ్మ అక్కర్లేదు... కానీ, తనకి కొడుకు కావాలి .. తన కొడుకుని ప్రయోజకుడిని చేయాలి .. తన వాళ్లు అనేవాళ్లు ఎప్పుడన్నా, ఎక్కడన్నా కనిపిస్తే గర్వంగా తలెత్తుకు బతకాలి అనుకుంది .. కానీ, ఇదేంటి ఇలా జరిగింది? ఇలా జరగడానికి తనేనా కారణం .. వాడిలా తయారవడానికి తన ప్రేమ వ్యవహారమా? వివేక్ మీద ద్వేషం ఎందుకు పెంచుకున్నాడు.?

ఆమె ఆలోచనలను చెల్లాచెదరుచేస్తూ

లోపలినుంచి కెవ్వుమన్న పసిపాప ఏడుపు, ఆ వెంటనే తలుపు తెరుచుకోడం జరిగింది ..

*తెల్లని దుస్తుల్లో, చిరునవ్వు చిందిస్తూ భానుముందుకు వచ్చిన నర్సు .. కంగ్రాట్స్ మేడమ్ .. ఆడపిల్ల ..అంది. ఆ విడ తేలిగ్గా నిట్టూర్చి మా అమ్మాయి ఎలా ఉంది? అడిగింది .*

*తల్లీ , పిల్లా ఇద్దరూ క్షేమమే .. వెళ్లండి .. చూడచ్చు .. నర్సు ముందుకి నడుచుకుంటూ ఎటో వెళ్లిపోయింది. భానుప్రియ ఒక్కసారి హమ్మయ్య అన్నట్టుగా కళ్లు మూసుకుని తెరిచి డోర్ తీసుకుని లోపలికి నడిచింది.*

*డాక్టర్ ప్రవీణ చిరునవ్వుతో రండి .. వెల్ రోజ్ మీ గ్రాండ్ డాటర్ అంది .*

*ఆవిడ మొహంలో గంభీరం కమ్ముకుంది .. గబ,గబా లోపలికి వెళ్లింది ..*

*శిరీష లేచింది తనూ లోపలికి వెళ్లడానికి .. కానీ, భానుప్రియ తలుపు వేసేసింది ..*

*శిరీష మొహం అవమానంతో ఎర్రబడింది .. చివ్వున అక్కడినుంచి లేచి బైటకి వెళ్లిపోయింది ..*

*పోనీలే .. ప్రసవం సుఖంగా అయి, ప్రఖ్య క్షేమంగా ఉంది .. పాపని వాళ్లేం చేసుకుంటారో వాళ్లిష్టం .. తనకి ఎలాంటి సంబంధం లేదు...*

*తన కొడుకు కారణంగా ప్రఖ్యకి చిన్న వయసులో గర్భం రావడం , అబార్షన్‌కి ఆమె లేత శరీరం అనుకూలించకపోడంతో అటు భానుప్రియ, ఇటు శిరీష కూడా ప్రఖ్య గర్భవతి అని తెలిసిన దగ్గర్నించీ టెన్షన్‌గానే ఉన్నారు ..*

*ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడుకోకపోయినా, ఒకళ్లింటికి మరొకళ్లు వెళ్లకపోయినా, తరచూ ప్రఖ్య క్షేమసమాచారాలు తెలుసుకుంటూనే ఉంది శిరీష ..*

*నిజానికి ప్రఖ్యని ఆదిత్య పెళ్లి చేసుకుంటే ఆమెకి అభ్యంతరం ఏం లేదు.. కానీ, ఇంకా జీవితంలో ఏ మాత్రం ఎదగని పిల్లలిద్దరూ పెళ్లి, సంసారం అంటూ మొదలు పెడితే భవిష్యత్తు నాశనం అవుతుందని తనకి తెలుసు ..*

కాకపోతే ఇప్పుడు సెటిల్ చేసుకుని, బి టెక్ అవగానే పెళ్లి చేయడానికి తనకేం అభ్యంతరం లేదు.. స్నేహితురాలు వియ్యపురాలు అవడంకన్నా ఏం కావాలి? పైగా ఇద్దరూ ఒకే దారిలో ప్రయాణిస్తున్నారు.. భావాలు ఒకటే ..

కానీ భాను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ నా కూతురికి ఇలాంటి సైకోకి ఇచ్చి చేస్తానా? అంటూ మండిపడింది .. ఆమె మాటలు శిరీష హృదయాన్ని గాయం చేశాయి .. ఇంతకాలం ప్రఖ్య కోసం భరించింది .. ఆ పిల్ల కి డెలివరీ అవగానే భానుకి దూరంగా వెళ్లాలనే నిశ్చయించుకుంది.

ఇంక ఇప్పుడు వాళ్ల ఇష్టం .. ఆవిడ కూతుర్ని బి టెక్‌తో ఆపేస్తుందో, ఎమ్ టెక్ చేయిస్తుందో, అమెరికాకి పంపిస్తుందో . ఏం చేస్తుందో ఇంకా ఏదన్నా గొప్ప చదువు చదివిస్తుందో ఆవిడిష్టం .. ఒక నైతిక భాధ్యతతో ఇప్పటిదాకా ఆమె అసహ్యించుకుంటున్నా, అవమానిస్తున్నా తను ఆ ఇద్దరితో సంబంధం వదులుకోకుండా వాళ్ల క్షేమసమాచారాలు తెలుసుకుంటూ ఉంది ..

ఇంక వాళ్ల జీవితాలు వాళ్లవి .

శిరీష బైటకి వచ్చేటప్పటికి వివేక్ ఎదురుచూస్తున్నాడు..

అతడిని చూడగానే ఆగలేకపోయింది శిరీష .. అతని గుండెల మీద వాలిపోయి వెక్కి, వెక్కి ఏడవసాగింది ..

రిలాక్స్ శిరీ .. బాధపడకు .. ఇంటికెళ్దాం పద ..

వాడు .. వాడు ఎక్కడున్నాడో వివేక్ .. వెక్కుతూ అంది .

వస్తాడు.. వాడే వస్తాడు.. ఎక్కడికీ వెళ్లడు.. నీ మీద అలిగి ఎవరైనా ఫ్రెండ్ ఇంట్లో ఉంటాడులే .. పద మనం వెడదాం .. అయిపోయిందిగా నీ బాధ్యత అయింది ..

వెక్కుతూనే తలూపింది .

రా .. ఆమె భుజం పట్టుకుని నడిపిస్తూ బైక్ వరకూ తీసుకొచ్చాడు..

వివేక్ బైక్ స్టార్ట్ చేశాడు.. శిరీష వెనకాల ఎక్కి కూర్చుంది .. ఆమె కళ్లింకా వర్షిస్తూనే ఉన్నాయి ..

చాటు నుంచి ఇదంతా చూస్తున్న ఆదిత్యకి కూడా ఏడుపొచ్చింది .. కానీ, ఇప్పుడు అంతకన్నా ముఖ్యమైన పని చేయాలి తను ..వెంటనే అతను మళ్లీ హాస్పిటల్ వెనక్కి వెళ్లిపోయాడు..

ప్రఖ్య పడుకున్న దగ్గరకి నడిచింది భానుప్రియ .. యుద్ధంలో అవిరామంగా పోరాడి, అలసి పోయిన సైనికుడిలా ప్రశాంతంగా పడుకుని ఉంది ప్రఖ్య ..

హౌ ఆర్ యూ బేబీ అడిగింది భానుమతి ప్రఖ్య మొహం మీద చిందర, వందరగా ఉన్న వెంట్రుకలు సవరిస్తూ ..

ప్రఖ్య మాట్లాడడానికి ఓపికలేనిదానిలా సన్నగా నవ్వింది .. ఒకసారి కళ్లు విశాలం చేసి తన పక్కన పాపకోసం చూసింది ..

పాప లేకపోడంతో నొసలు చిట్లించి చూసింది తల్లివైపు .

ఆమె భావం అర్ధం చేసుకున్న దానిలా భానుప్రియ భుజం మీదుగా వెనక్కి తిరిగి డాక్టర్ వైపు చూసింది .. పాపకి స్నానం చేయించి తెల్లటి మెత్తటి టవల్‌లో చుట్టి రెండు అరచేతుల్లో పట్టుకుని వచ్చి డాక్టర్ చేతికిచ్చింది నర్సు . భానుప్రియ వైపు చూసింది డాక్టర్ . భానుప్రియ చూపు గమనించి అ లాగే తీసుకొచ్చి ఆ విడకి అందివ్వబోయింది పాపని ..

భాను అ యిష్టంగా కొంచెం వెనక్కి తగ్గి వాళ్లకి కాల్ చేశారా డాక్టర్ అని అడిగింది .

చేశాను .. కానీ ఇప్పుడెలా వస్తారు? రేపు మార్నింగ్ వస్తారు ..అంది డాక్టర్

రేపు మార్నింగా? కొంచెం విసుగ్గా, అసహనంగా అంది భాను.. మళ్లీ ఏమనుకుందో , ఓ కె .. అంటూ తిరిగి మొహం తిప్పుకుని ప్రఖ్యను చూస్తూ రెస్ట్ తీసుకో బేబీ .. అంది భాను .

ప్రఖ్య అ లాగే అన్నట్టుగా తలాడించి కళ్లు మూసుకుంది .

తల్లీ కూతుళ్లిద్దరూ కూడా పాప వైపు చూడడానికి ఆసక్తి చూపించకపోడంతో చికాకు పడిన డాక్టర్ పాపని సిస్టర్ చేతికిచ్చి పాలు తాగించు అంటూ బైటకి వెళ్లిపోయింది .

సిస్టర్ పొత్తిళ్లలో ఉన్న పాపని మురిపెంగా చూస్తూ ప్రఖ్య దగ్గరగా వచ్చి, గుండెలమీద చేతులుపెట్టుకుని పడుకున్న ప్రఖ్యని చేయి తీయమ్మా పాపకి పాలివ్వాలి అంది .. ఒంగి పాపని ప్రఖ్య గుండెలమీద పడుకోబెట్టబోతూ .

ప్రఖ్య నెటీ జిప్ లాగబోతుంటే భానుప్రియ చిరాగ్గా అంది .. ఇప్పుడే కదా డెలివరీ అయింది. పాలు పడవు .. వేరే పాలు పట్టండి .

సిస్టర్  ఆ విడ వైపు చిత్రంగా చూస్తూ అదేంటండి .. పాపకి పాలివ్వకపోతే ఎట్లా? తీయమ్మా నెటీ తీయి . అంటూ కొంచెం బలవంతంగా పాపని ప్రఖ్య గుండెలమీద పడుకోబెట్టి గుండెలమీంచి నెటీ పక్కకి తొలగించి పాపకి తల్లి రొమ్ము అందించడానికి ప్రయత్నించసాగింది ..

ఆ తంతంతా ఇష్టం లేనిదానిలా భానుప్రియ అసహనంగా చూస్తూ చేతి వాచీ చూసుకుంది ..

ఇంకా పన్నెండుగంటలు ఈ పాప  ఇక్కడే  ఉండాలా? చిరాగ్గా అనుకుంది భాను .

ఇంతలో డాక్టర్ అటువైపు వచ్చింది ..

వాళ్లకి చెప్పాల్సింది లేట్ అయినా వచ్చేయమని .. ఇప్పుడు  పా లివ్వడం, తరవాత ఇంకోటి అలా అవుతునే ఉంటుంది ..

డాక్టర్ కొంచెం సీరియస్‌గా అంది .. తొందరపడితే ఎలా? డెలివరీ పగలైతే వెంటనే తీసికెళ్లిపోయేవాళ్లు .. మీరు నాచురల్ డెలివరీ కావాలన్నారు .. ఆపరేషన్ చేయద్దన్నారు . అందుకే వెయిట్ చేశాం . నా తప్పేం లేదు అన్నట్టుగా చెప్పేసి. కేస్ షీట్ తీసుకుని ఏదో రాసి సిస్టర్ ఈమెని రూం నెంబర్ ఫోర్‌కి షిఫ్ట్ చేయండి .. అంటూ వెళ్లిపోయింది ..

పాపతో పాలు తాగించడానికి ప్రయత్నిస్తోన్న సిస్టర్ ఓ కె డాక్టర్ అంటూ పాపని రెండోవైపుకి జరిపి ఇ క్కడ కూడా ఇవ్వమ్మా ఒక వైపు ఇవ్వకూడదు అంది ప్రఖ్యతో .

ప్రఖ్యకి ఆ అనుభవం తమాషాగా ఉంది ..

బుల్లినోటితో పాప రొమ్ములు చప్పరిస్తోంటే ఒంటినిండా గులాబీ రెక్కలు పోసినమధురానుభూతి కలుగుతోంది ..

ఎంత హాయిగా ఉంది ఈ అనుభూతి ..ఏదో మత్తుగా ఉంది ..

కళ్ల ముందు మంచుపూలరెక్క లు రాలుతున్న అనుభూతి ..

సిస్టర్ స్వరం ఎ క్కడినుంచో వినిపిస్తున్నట్టుగా ఉంది .. పాప .. పాప .. వైట్ రోజ్ .. వైట్ రోజ్ .. అంటోంది

.

ఎవరు పాపనా? పాపేనా? వైట్ రోజ్ ..  ..

పాప పుట్టిన మరుక్షణం డాక్టర్ నోటి నుంచి వచ్చిన మాట అది .. వైట్ రోజ్ .. ఎంత బాగుంది?

క్రమంగా అనస్తీషియా ప్రభావం చూపించడం ప్రారంభించింది . అ ప్పటిదాకా మెలకువా, నిద్రాకాని స్థితిలో ఉన్న  ప్రఖ్య కళ్లు మూతలు పడసాగాయి .. అనస్తీషియా మత్తుతో కళ్లు మూసుకుంది ..

సిస్టర్ పాపని ప్రత్యూ గుండెలమీంచి తీసి, ఆమె నెట్టీ సంచేసి అప్పుడే అక్కడికి వచ్చిన ఆయా చేతికిచ్చింది .. క్రెడిల్‌లో పడుకోబెట్టి తీసుకురా .. రూం నెంబర్ ఫోర్ అంటూ భాను వైపు చూసి మీరు కూడా రండి అంటూ , ప్రత్యూ పడుకున్న స్ట్రెచర్ తోసుకుంటూ రూం బైటకి నడిచింది ..

ఆయా పొత్తిళ్లలో ఉన్న పాపను ఒక్కసారి చూసింది ప్రత్యూ .. ఎంత బాగుంది పాప? అనుకుంది .. సన్న గా నిట్టూర్చింది . ఇంకా కొన్ని గంటల్లో ఇంతకాలం తను మోసి, కష్టపడి కన్న ఈ పాపని ఎవరికో ఇచేస్తుందా డాక్టర్ .. పాప తనది .. తనే అమ్మ .. తన పాపని ఎవరికో ఇచ్చేయాలా? దుఃఖం వచ్చింది. ..కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగానే మగత కమ్మేసింది.

ఆయాపాపని గుండెలకి హత్తుకుని బైటకి నడిచింది ..భానుప్రియ సిస్టర్ వెనకాల వెళ్లిపోయింది.

ఆయా కారిడార్‌లోకి వచ్చింది ..

కారిడార్ ప్రశాంతంగా ఉంది .. ఎవరూ లేరు .. రూం నెంబర్ ఫోర్‌కి వెళ్లే దారిలో రెండుగా వై ఆకారంలో చీలింది కారిడార్ .. ఆ వైపు నుంచి వెడితే ఆసుపత్రి వెనకవైపు వస్తుంది .. ఆయా వేగంగా అటు నడిచింది .. ఆమె గుండెలు దడ,దడలాడుతున్నాయి .. కాళ్లు వణికిపోతున్నాయి .. తప్పు చేస్తున్నావు .. అని ఎవరో హెచ్చరిస్తున్నట్టుగా అనిపిస్తోంది .. అ యినా అ లాగే తడబాటుగా ముందుకు నడిచింది . ఆవరణలో కొన్ని లైట్లు ఆర్పేసి ఉన్నాయి .. చిరు చీకట్లలో అశోకావృక్షం నీడలో ఎదురుచూస్తున్నఆదిత్య దగ్గరకు చేరింది ..

అప్పటికి పాప పుట్టి రెండు గంటలైంది ..

ఆమెని చూసిన ఆదిత్య చెట్టునీడ నుంచి గబగబా వచ్చి చేతులుచాచాడు .. ఆయా తన చేతిలో ఉన్న పాపని అతని చేతుల్లో పెడుతూ జాగ్రత్త .. పాప ముద్దుగా ఉంది .. ఎలా చూసుకుంటావో .. అంది

అపూర్వమైన అనుభూతితో పాపనందుకుని గుండెలకు హత్తుకుంటూ దానికన్నా ప్రేమగా, నా ప్రాణంలా చూసుకుంటా .. నీ మేలు మర్చిపోను .. ఇదిగో అంటూ ఎడంచేతి మీద పాపని జాగ్రత్తగా పట్టుకుని కుడిచేతి గుప్పిట్లో ఉన్న నోట్లు ఆమెకిచ్చాడు .

ఒద్దు బాబూ .. నీ బిడ్డని నీకప్పగించాను.. నువ్వు డబ్బిచ్చి నన్ను అవమానించకు .. నేనేదో తప్పు చేసినదానిలా బాధపడతాను.. అంది ఆయా .

నువ్వు నిజానికి చాలా రిస్క్ తీసుకున్నావు ఆయా .. కాదనకు తీసుకో ..బలవంతం చేశాడు..

ఒద్దు బాబూ ఇప్పుడు నేనిక్కడ ఒక చిన్న నాటకం ఆడాలి .. ఆ నాటకంలో ఈ డబ్బు బైట పడితే నామీదే అనుమానం వస్తుంది .. ముందు మీరి క్కడ నుంచి వెళ్లిపొండి .. నేను వెళ్లి వాచ్‌మాన్‌ని పిలుస్తాను.. ఈ లోపల మీరు గేటు దాటండి .. ఊ వెళ్లండి .. త్వరపెట్టింది ఆయా ..

చాలా థాంక్స్ ఆ యా .. నేను మళ్లీ కలుస్తాను.. నీకే సాయం కావాలన్నా నేనున్నాను.. ఒ కె .. బై.. అంటూ పాపని గుండెలకి హత్తుకుని వెనక్కి తిరిగాడు.. ఆయా చక, చకా నడుస్తూ .. గేటువైపు వెళ్లి, బహదూర్ అని పిలిచింది..

బహదూర్ పిలుపు వచ్చిన వైపు చూశాడు.. ఆయా మెట్ల మీద నిలబడి ఉంది .

బహదూర్ ఆమె వైపు వెళ్లాడు .. అది అదనుగా చప్పుడు చేయకుండా సంజయ్ గేటు బైటకి వెళ్లిపోయి రోడ్డుకావలివైపు పార్క్ చేసి ఉన్న కారు దగ్గరకు వెళ్లి కారు డోర్ తీసి పాపనెత్తుకునే డ్రైవింగ్ సీట్లో కూర్చుని స్టార్ట్ చేశాడు ..

కారు కదిలిన శబ్దం విన్న బహదూర్ ఆయా దగ్గరకు వెళ్తున్నవాడల్లా వెనక్కి తిరిగాడు.

అది గమనించిన ఆయా . మళ్లీ పిలిచింది .. బహదూర్ .. ఇటురా .

బహదూర్ ఏదో సణుక్కుంటూ ఆమె వైపు వచ్చాడు ..

టీ కావాలి .. తెస్తావా? ఇవాళ నర్సిమ్మ రాలేదు..

బహదూర్  అలాగే వెనక్కి చూస్తూ .. చాలా సేపట్నించీ గాడ కారు పార్క్ చేసి ఉండె .. ఎవరిదా అని చూస్తున్న నేనీడకు రాంగానే కారుపోయింది .. ఎవరో, ఎందో అన్నాడు.

బాగుంది నువు చె ప్పేది .. రోడ్డు మీద ఎవరో కారు ఆపుకుంటే మనకెందుకు?

లే ఆయామ్మా .. ఇంత లేట్ నైట్ వరకు ఆడనే ఉంది కారు .. డౌటుగుంది నాకు .. ఎ వడన్నా బద్మాష్‌గాడున్నడేమో అని ..

పోనీలే వెళ్లిపోయాడుగా .. టీ తెస్తావా?

గేటుకాడ ఎవరుంటరు?

ఆయా ఆలోచిస్తున్నట్టుగా చూస్తూ .. సర్లె వదిలెయ్ బాగా తలనొప్పిగా ఉందని అడిగాను.. . అంటూ లోపలికెళ్లిపోయింది .. అ లా నడుస్తూనే ఆమె తను ఆడాల్సిన నాటకం మనసులోనే రిహార్సల్స్ చేసుకోసాగింది ..

రూమ్ నెంబరు నాలుగు తెల్లటి దుప్పటి పరిచిన బెడ్ మీద మత్తుగా పడుకుని ఉంది ప్రఖ్య .. మరో వైపు అటెండెంట్ కోసం ఏర్పాటు చేసిన మరో బెడ్ మీద భానుమతి కూర్చుని ఉంది .. ప్రఖ్యకి ఇవ్వాల్సిన మందులు ఏవేళకి ఎలా ఇవ్వాలో భానుమతికి వివరించి పాపని తీసుకొచ్చే ఆయాకోసం అసహనంగా ఎదురుచూస్తూంది సిస్టర్ జానకి ..

ఇంతలో గట్టిగా  అరుపు,.. ఒక్కసారిగా పరిసరాలు ఉలిక్కిపడ్డాయి .. మత్తులో జోగుతోన్న ప్రఖ్య కూడా ఒక్కసారి కళ్లు తెరిచి ఏమైందన్నట్టుగా భయంగా చూసింది .. ఆ అరుపుకి ఉలిక్కిపడిన భానుప్రియ అ ప్పటికే కూతురు దగ్గరకెళ్లి, తల మీద మృదువుగా రాస్తూ .. ఏం లేదులే పడుకో .. అంది ..

ఆయా రొప్పుతూ వచ్చింది .. సిస్టర్ జానకి ఆయాని గట్టిగా పట్టుకుని .. ఏంటి? ఏమైంది ఎందుకట్టా అరిచావు? నిన్నే అని భుజాలు కుదుపుతూ అడుగుతోంది ..

ఆయా భయం, భయంగా .. నే . నేను .. పాపని క్రెడిల్‌లో ఉంచి బాత్‌రూమ్‌కి వెళ్లొచ్చాను .. వచ్చేటప్పటికి పాప కనిపించలేదమ్మా . ఎవరో .. వెనక కాంపౌండ్‌వాల్ దూకి పారిపోయాడు.. వాడి చేతిలో ఏదో ఉంది .. బహుశా పాపేమో .. అని అరిచాను.. పాప,  పాప అంటూ వణకిపోసాగింది ఆయా .

ఏంటి? పాపనెత్తుకుపోయాడా? ఎవరు వాడు, ఇంతవరకు మన హాస్పిటల్లో అ లాంటివేం జరగలేదు.. ఎలా జరిగింది?   జానకి హడావుడిగా లేబర్ రూమ్ వైపు పరిగెత్తింది. ఆమెని అనుసరించింది ఆయా..

ఆయా మాటలకి, జరిగిన సంఘటనకి నిర్ఘాంతపోయిన  భానుప్రియ మెదడులోఫ్లాష్‌లా మెరిసింది . . పాపనెత్తుకుపోయాడా? అంటే వాడు .. ఖచ్చితంగా వాడే .. వాడికి ప్రఖ్యని డెలివరీకి ఈ హాస్పిటల్‌కి తీసుకొచ్చినట్టు తెలిసిందనమాట .. ఎ ప్పటి నుంచీ కాపుకాస్తున్నాడో .. దట్టీఫలో .. ఎంత పని జరిగింది?  ఎ వరికైతే పాప దక్కకూడదని పకడ్బందీ ఏర్పాట్లు చేసుకుందో వాడి చేతికే చిక్కింది పాప ..  వాడు ఖచ్చితంగా  బ్లాక్‌మెయిలింగ్ స్టార్ట్ చేస్తాడు..

అ సలైనా ఈ హాస్పిటల్‌లో సరైన సెక్యూరిటీ ఏర్పాట్లు చేయకుండా ఏం చేస్తున్నారు? వేలకి వేలు ఫీజులు తీసుకోడం తప్ప పేషెంట్స్ సంక్షేమం చూడరా? ఆవేశంగా డాక్టర్ రూమ్‌లోకి నడిచింది భానుప్రియ ..

డాక్టర్ ప్రవీణ తాపీగా కూర్చుని జర్నల్ తిరగేస్తోంది . మనిషి అలికిడి కాగానే తలెత్తి చూసింది .

రండి .. ఎ లా ఉంది అ మ్మాయి? పాపకి ఫీడ్ చేసిందా? ఆహ్వానిస్తూ అడిగింది.

భానుప్రియ ఆవిడకి సమాధానం చెప్పకుండా మొహంలో విసుగు కనపరుస్తూ ఆ రాస్కెల్ అన్నంత పనీ చేశాడు.. నేనింతపకడ్బందీగా ప్లాన్ చేసుకున్నా వాడు తెలుసుకుని పాపాయినెత్తుకుని పోయాడు.

వాట్? అదిరిపడుతూ చూసింది డాక్టర్ .. పాపనెత్తుకుపోయాడా? ఆ ర్ యూ ష్యూర్?

ఇప్పుడే మీ ఆయా వచ్చి చెప్పింది .. సిస్టర్ పరిగెత్తింది .. నేనిటు వచ్చాను.. ఇప్పుడు వాళ్లకేం చెప్పాలి?

అ వును వాళ

్ల అడిగితే ఏం చెప్పాలి?

మీ హాస్పిటల్‌లో సెక్యూరిటీ అ రేంజ్ మెంట్స్ ఇంత ఘోరంగా ఉన్నాయనమాట .

డాక్టర్ కొంచెం కోపంగా చూసింది .. డోంట్ ట్రై టు బ్లేమ్ అ వర్ హాస్పిటల్ . ఇలాంటి సంఘటన జరగడం ఫస్ట్ టైమ్ . అ యినా ఇంతకు ముందు నా దగ్గరకు ఇలాంటి కేసుకూడా రాలేదు.. మీదే చిత్రమైన కేసు .. సాధారణంగా కడుపుచేసి ప్రియుడు పారిపోతే అబార్షన్ చేయించుకునో, పిల్లని కని అనాధ శరణాలయానికి ఇచ్చేసో వెళ్లిపోతారు .. ఆ అబ్బాయి పెళ్లి చేసుకుంటాను మొర్రో అంటుంటే మీరు ఒద్దంటూ మీ అమ్మాయి జీవితం నాశనం చేస్తున్నారు .. ఇది మీకేం పద్ధతిగా ఉంది చెప్పండి అంది రెచ్చిపోతూ..

కుడిచేయి పై కెత్తి ఆపమన్నట్టుగా సంజ్ఞ చేస్తూ అంది భానుప్రియ ..ప్లీజ్ ఇది పూర్తిగా మా స్వవిషయం .. మీకు నేను ఎక్స్‌ప్లనేషన్ ఇవ్వడం కన్నా ముందు ఏం చేయాలో ఆలోచించండి .. వెంటనే మీ హాస్పిటల్లో పాప మాయం అ యిందని పోలిస్ కంప్లై ంట్ ఇవ్వండి .

సారీ మిసెస్ భానుప్రియగారూ .. నేను చేయలేను.. నా హాస్పిటల్ పరువు పోతుంది .. మీకు ఖచ్చితంగా అతనే ఎత్తుకెళ్లాడని నమ్మకం ఉంటే మీరే పోలీస్ కంప్లై ంట్ చేసుకోండి ..

మీ వాళ్ల కోపరేషన్ లేకుండా అతను ఎలా తీసికెళ్తాడండి?

సూటిగా భానుప్రియ వేసిన ప్రశ్నకి క్షణం నివ్వెరపోయింది డాక్టర్ .. నిజమే .. ఎవరు సహకరించి ఉంటారు . సిస్టరా? జానకి ఎన్నటికీ అలా చేయదు .. మరి ఆయానా? ఆయా ఎన్నో ఏళ్లుగా తన దగ్గర పనిచేస్తోంది .. ఎప్పుడూ ఇలాంటి పని చేయలేదు.. మరి ఎవరు? ఏ సిస్టర్ సహకరించింది .. ఆ విడ తీవ్రంగా ఆలోచించసాగింది . ఆ విడ ఆలోచనలను చెదరగొడుతూ హాస్పిటల్‌లో ఉన్న ఆయాలు, నర్సులు బిలబిల్లాడుతూ వచ్చారు .. నిద్రపోతోన్న పేషెంట్స్ లేచి కూర్చున్నారు .. వాళ్లకు తోడుగా ఉన్న బంధువులు కొందరు భయంతో ఉ య్యాల్లో ఉన్న పిల్లల్ని చేతిలోకి తీసుకుని గుండెలకు హత్తుకున్నారు .. చూస్తూ, చూస్తూ ఉండగానే గలాభా చెలరేగింది .. ఈ హడావుడంతా చూస్తున్న భానుప్రియకి పిచ్చిపట్టినట్టు అ యింది ..

ఏం చేయాలో అర్థం కాక మెదడు మొద్దుబారినట్టు నిశ్చేష్టురాలై నిలబడ్డచోటే కూలబడింది తల చేత్తో పట్టుకుని

ఇదిలా ఉండగా

హాస్పిటల్‌నుంచి ఆయా సాయంతో పాపను తీసుకుని పరారైన ఆదిత్య కొద్ది దూరం పోగానే పాపని తన పక్క సీటులో తాను రెడీగా ఉంచుకున్న బేబీ బెడ్ మీద జాగ్రత్తగా పడుకోబెట్టి, పల్చటి బట్ట కప్పాడు .. కొన్ని క్షణాలు తన రక్తాన్ని పంచుకుపుట్టిన ఆ చిన్నారిని అపురూపంగా చూసుకుని కారు స్టార్ట్ చేశాడు..

రోడ్లంతా దాదాపు నిర్మానుష్యంగా ఉన్నాయి .. అడపా, దడపా వెళ్తున్న కార్లు, లారీలు తప్ప అంతా ప్రశాంతంగా ఉంది .. మూసి ఉన్న షాపుల ముందు కొందరు ముష్టివాళ్లు పడుకుని నిద్రపోతున్నారు ..

అటు వేసవి, ఇటు చలికాని ఆహ్లాదకరమైన కాలం అది .. నెల ఫిబ్రవరి .. ఆ రోజు తేదీ 17 పాప పుట్టిన తేదీ, వారం, టైము మరోసారి మనసులో మననం చేసుకున్నాడు.. కారు ఓ పక్కగా ఆపి, జేబులోంచి డైరీ తీసి వివరాలన్నీ రాసుకున్నాడు..

*సెల్ తీసి తన ప్రాణస్నేహితుడైన బాబ్జీకి ఫోన్ చేశాడు.. బాబ్జీ అ ప్పటికే నిద్రలోకి జారిపోయాడేమో సుమారు ఆరు రింగుల తరవాత మత్తుగా పలికాడు హల్లో .. అంటూ .. బాబ్జీ నేను ఆదిత్యని .. పాపని తీసుకొస్తున్నాను.. నువ్వు రెడీగా ఉండు . నాతో గుంటూరు రావాలి ..*

*ఇప్పుడా? మత్తు ఎగిరిపోయిందేమో ఆశ్చర్యంగా అడిగాడు బాబ్జీ గుంటూరుకి ఇప్పుడెందుకురా. పాప ఉందా నీ దగ్గర?*

*ఉంది .. నేను వస్తున్నాను .. రెడీ గా ఉండు .. అంతా తరవాత చెప్తాను.. సెల్ ఆఫ్ చేసి జేబులో పెట్టుకుని తిరిగి కారు స్టార్ట్ చేసి దిల్‌షుక్ నగర్ వైపు కారు పోనిచ్చాడు..*

*అతని మనసులో రక,రకాల ఆలోచనలు కలగాపులగంగా కదుల్తున్నాయి . పాపని చూస్తుంటే మమతానురాగం ఉప్పెనలా పొంగుతోంది .. గట్టిగా గుండెలకు హత్తుకుని కూర్చోవాలని ఉంది .. కానీ, ఇది సమయంకాదు.. పాపని చేర్చాల్సిన చోటుకి చేర్చాక భానుప్రియతో ఎంతైనా ఫైట్ చేయచ్చు .. ముందు పాప సంగతి చూడాలి .*

*ఈ పాప నాది అ లా  అనుకోగానే అతని గుండె ఉప్పొంగింది . ఈ పాపని పెంచి పెద్ద, చేసి పెళ్లి చెయాలి .. పాపకి పదిమంది పిల్లలు పుట్టాలి వారందరినీ తను సాకాలి .. ఆ పెద్ద కుటుంబంలో తనూ ఒ కడిగా ఉంటూ పెద్ద కుటుంబంలో ఆనందం ఏమిటో అనుభవించాలి ..*

*కారు దిల్‌షుక్‌నగర్‌లో ఉన్న ఒక కాలనీ చేరింది .. కాలనీ బస్టాప్‌లో ఆపుకుని బాబ్జీకి మళ్లీ కాల్ చేశాడు .*

*బాబ్జీ వెంటనే ఫోన్ తిసాడు .. చెప్పు ఎ క్కడిదాకా వచ్చావు? అడిగాడు.*

*బస్టాప్‌లో ఉన్నాను.. మీ ఇల్లు నాకు సరిగా గుర్తులేదు..ఈ చీకట్లో అ సలే గుర్తుపట్టలేను..*

*సరెలే అ క్కడే ఉండు నేనే వస్తాను.. సెల్ ఆఫ్ అ యింది ..*

*స్టీరింగ్ మీద చేతులు పెట్టుకుని హాయిగా నిద్రపోతోన్న పాపవైపుచూస్తూ కూర్చున్నాడు.*

*20 సంవత్సరాలు కూడా నిండని కుర్రవాడు అ యిన ఆదిత్యకి ఈ పాప నా రక్తం అనుకుంటుంటే ఒళ్లంతా పులకించిపోతోంది .*

అ మ్మ ఏమనుకుంటోందో తల్లి గుర్తుకు రాగానే ఒ క్క క్షణం బాధనిపించింది .. తను కనీసం ఆమెకి చెప్పలేదు..

తనెక్కడ ఉన్నాడో సమాచారం కూడా ఇ వ్వలేదు..పాపం ఏడుస్తోంది .

మళ్లీ జాలి స్థానంలో కోపం ఆవహించింది .. బాగైంది .. ఏం? పాపని మనం పెంచుకుందాం అంటే నోరుముయ్యరా పిచ్చివెధవా .. వెధవ పని చేసింది కాక, ఈ వయసులో పిల్లల తండ్రివై గుమాస్తా బతుకు బతుకుతావా? వెధవ్వేషాలేయకు .. వాళ్లిష్టం వచ్చినట్టు చేసుకోని పిల్లని .. అంది ..

ఎంత నిర్దయం ! మగాడు అయినా తనకి ఎంత ఆశగా ఉంది పాపాయిని పెంచుకోవాలని తన రక్తం, తన ప్రాణం .. తన సర్వస్వం  పాప .. పుట్టి ఎంతోసేపు కాకపోయినా,  ఏడు నెలలనుంచి తహతహలాడిపోతున్నాడు పాపనా, బాబా? పాపనా? బాబా అనుకుంటూ ..

ఇద్దరిద్దరే అటు ప్రఖ్యవాళ్లమ్మా అంతే, ఈ అమ్మా అంతే .. మీ వయసేంటి? మీరేంటి? మీకు పిల్లలు కావాలా? అంటూ తిట్టడాలు .. బహుశా ప్రఖ్యక్కూడా తనకి లాగే పాపాయి మీద ప్రేమ ఉండే ఉంటుంది . వాళ్లమ్మకి భయపడి అడాప్షన్‌కి ఇవ్వడానికి ఒప్పుకున్నట్టుంది ..

ఇస్తారిస్తారు .. ఎలా ఇస్తారో చూస్తా .. పాపని తీసుకుని అమ్మమ్మ దగ్గరకి చేర్చాలి ముందు .. చాలా నాక్‌గా అమ్మ దగ్గర అమ్మమ్మ వివరాలు లాగాడు.. జరగబోయెది అంతా ముందే ఊహించే తనీ ప్లాన్ వేశాడు.. ఎట్టి పరిస్థితుల్లోనూ తన పాపని వదులుకునేది లేదు..

తనకి పిల్లలంటే ఇంత ప్రేమ ఎందుకో అమ్మకి చెప్పినా అర్థం కాదు.. అందరూ అందరే . ఎందుకో ఈ ఆడవాళ్లు ఇ లా తయారవుతున్నారు .. ప్రఖ్యని ఎంత బతిమాలాడు ..పెళ్లి చేసుకుందాం ప్రఖ్యా ..పెళ్లయాక కూడా చదువుకోవచ్చు .. నా మాట వి ను అని .. కానీ, విన్నదా .. కెరియర్ ..కెరియర్ అంటూ అబార్షన్ చేయించుకుంటానంది .. అది కుదరలేదని పిల్లని కన్నది .. దీన్ని తల్లీ, తండ్రీ అటు నానమ్మ, ఇటు అమ్మమ్మ బతికుండగా అనాథ చేయడానికి ఎలా మనసొప్పుతోందో .

ప్రఖ్య తల్లి అదేం తల్లి .. ఎ వరైనా కూతురు పెళ్లి కాకుండా తల్లి అ యిందంటే భయపడతారు .. సమాజం కుళ్లబొడుస్తుందని, ఎ లాగోలా పెళ్లి చేస్తారు . కానీ, భానుప్రియగారు అమ్మే అంటే ఆవిడకన్నా నాలుగాకులు ఎ క్కువే చదివింది .. ఇద్దరూ ఒకటే .. భర్త లను వదిలేసి వంటరిగా పిల్లల్ని చూసుకుంటూ ఉద్యోగాలు చేసుకుంటూ స్వే చ్ఛ , స్వాతంత్ర్యం అంటూ తిరుగుతున్నారు ..

అ సలు స్వేచ్ఛ అంటే ఏమిటి? ఆదిత్యకి అర్థం కాలేదు.. అ వును స్వే చ్ఛ అంటే ఏంటి? మరోసారి ఈ ప్రశ్న మనసులో వేసుకున్నాడు.. బాబ్జీ రానీ వాణీ అడగాలి . ఆదిత్య అ లా అనుకున్నాడో లేదో బాబ్జీ పరుగు, పరుగున వస్తూ కనిపించాడు.. ఆదిత్య అ లర్ట్ అ యాడు.. స్టీరింగ్ మీద చేతులు సిద్ధంగా పెట్టుకుని కూర్చున్నాడు.. బాబ్జీ వెనక డోర్ తీసుకుని కారులో కూర్చోగానే స్టార్ట్ చేశాడు ఆదిత్య. మూడున్నర గంటల వయసున్న చిన్న పాపాయిని తీసుకుని ఆ రాత్రివేళ అత్యంత ఆత్మవిశ్వాసంతో, మనోబలంతో ఆ ఇరవై ఏళ్ల కుర్రవాడు తనెప్పుడో చూసీ, చూడనట్టు చూసిన ఓ వృద్ధురాలిని వెతుక్కుంటూ బయల్దేరిన ఆ క్షణం నల్లని ఆకాశంలో నక్షత్రాలన్నీ ఒక్కసారిగా వెలిగి అతనికి దారిచూపిస్తున్నట్టు మెరుపులు కురిపించాయి.. చందమామ దారినిండా వెన్నెల పరిచాడు..

ఏంటిరా ఇది? ఏం చేశావు పాపని ఎత్తుకొచ్చావా? ఎలా పెంచుతావురా? ఏం చేస్తావు నీకు పిచ్చిగానీ పట్టిందా?

ఆదిత్య నవ్వాడు.. బాబ్జీ ఈ పాప కోసం ఈ తొమ్మిది నెలలూ నేను తొమ్మిది యుగాల్లా గడిపాను.. అఫ్‌కోర్స్ యుగం అంటే ఎన్ని సంవత్సరాలో నాకు తెలియదనుకో .. కానీ ఈ నిరీక్షణ అనేది ఎంత భయంకరంగా ఉంటుందో తెలుసుకున్నాను..

కరెక్టేరా . కానీ ఎలా పెంచగలవు చెప్పు.. మీ మదర్ కోపరేషన్ లేదు.. ప్రఖ్య కోపరేషన్ లేదు.. వాళ్లమ్మ సరేసరి .. వాళ్లెవరో పెంచుకుంటామన్నారు కదా .. ఇచ్చేస్తే సరిపోయేది .. అ ప్పుడప్పుడు వెళ్లి చూసి వచ్చేవాడివి ..

చట్టబద్ధంగా ఎవరో పెంచుకుంటే నాకీ పాప మీద హక్కులేం ఉండవురా .. ఈ చిన్నారి భవిష్యత్తు నా అభిరుచులకు అనుగుణంగా మలచుకుంటాను.. ప్రస్తుతం గుంటూరు దగ్గర ఉన్న కారంపూడిలో మా అమ్మమ్మ ఉంది . పాపాయిని అ క్కడ ఉంచుతాను..

మీ అమ్మమ్మ నీకెలా తెలుసు? ఎప్పుడూ చూడలేదన్నావుగా..

నవ్వాడు ఆదిత్య .. బాబ్జీ .. నీకో సంగతి తెలుసా .. ప్రఖ్య కన్సీవ్ అయిందని నాకు తెలిసిన దగ్గర్నించీ నేను పాపని నా దగ్గరకు తెచ్చుకోడానికి పకడ్బందీ యాక్షన్ ప్లాన్ వేసుకున్నాను.. మా అమ్మ పెంచదని నాకు తెలుసు .. అందుకే అమ్మమ్మ దగ్గరకు బయల్దేరాను.. ఒకరోజు అమ్మతో ప్రేమగా మాట్లాడుతూ అమ్మమ్మ ఎక్కడుంటుందీ, ఏం చేస్తుంది తెలుసుకున్నాను... అమ్మమ్మ ఫోటో కూడా సంపాదించాను..

బాబ్జీ మెచ్చుకోలుగా అన్నాడు.. గుడ్ ఆదీ .. చాలా క్లవర్ ఐడియా వేశావు... అది సరే ప్రఖ్యవాళ్లమ్మ ఇప్పుడు అక్కడ చాలా గొడవ చేస్తుందేమో కదా ..

ఈ పాటికి ఆ విడ నామీద పోలీస్ కంప్లైంట్ ఇ చ్చి ఉంటుందని నాకు తెలుసు ..పిరికి వాడిలా పారిపోను .. ఫైట్ చేస్తాను.. ముందు దీనికి సెక్యూర్డ్ ప్లేస్ అమ్మమ్మ .. అ మ్మమ్మకి పాపాయిని అప్పచెప్పి వీళ్ల సంగతి నేను చూసుకుంటాను..

ఎందుకురా ఆడపిల్ల తనే కేర్‌నాట్‌లా ఉంటే నీకెందుకీ బాధ? రిస్కు ..

బాబ్జీ మీరెంతమంది పిల్లలురా మీ అమ్మా నాన్నలకి ..

నలుగురం .. వింతగా చూస్తూ చెప్పాడు..

కదా .. నీకో అన్న, అ క్క , చెల్లి ఇంతమంది ఉన్నారు .. అ మ్మా, నాన్నా, వాళ్ల చుట్టాలు చాలా మంది ఉన్నారు . కానీ, నాకు .. నాకు ఎవరూ లేరు తెలుసుకదా .. నాకు నీకులా పెద్ద కుటుంబంలో ఉండాలని ఉందిరా .. ఎ లాగా నాకా అదృష్టం లేదు.. కనీసం నా చిట్టి తల్లికన్నా పెద్ద కుటుంబం ఏర్పాటు చేయాలి నేను ..

అంటే ఏం చేయాలని?

చూస్తా .. ఏం చేయాలో ఆలోచించలేదు.. ఎలా చేయాలో ప్లాన్ చేశాను.. అ వును కానీ, నిన్నో ప్రశ్న అడగనా?

ఏం ప్రశ్న? అడిగాడు బాబ్జీ ..

స్వేఛ్ఛ అ ంటే ఏంటిరా .

ఫ్రీడం

నేనడిగింది మీనింగ్‌కాదు. డెఫినషన్

ఏమో .. ఎందుకిప్పుడు?

దానికోసమేగా మా అ మ్మ, ప్రఖ్య వాళ్లమ్మ, ఇవాళ ప్రఖ్య ఒంటరిగానే బతకాలనుకుంటున్నారు . అందుకే దాని నిర్వచనం అందులో వాళ్లు పొందే సుఖం ఏవిటో తెలుసుకోవాలని ఉంది ..

అ లా అంటుండగానే పాప బుల్లిస్వరం వినిపించింది .. ఏడుపు .. ఆదిత్య చేతులు చిన్నగా కంపించాయి. *.. పాప ఏడుపు ప్రారంభిం*ంది .. కారు స్లో చేసి ఓ పక్కగా ఆపాడు..

ఎందుకేడుస్తోందో .. ఆకలంటావా అడిగాడు బాబ్జీని .

ఏమో . మరి నాకు మాత్రం ఏం తెలుసు? చలేస్తోందేమో.. చూడు పక్క పాడుచేసిందేమో..

బాబ్జీ పాప పడుకున్న బొంత తడిమాడు.. చల్లగా తగిలింది .. అయ్యో ప్యాస్ పోసింది .. ఏం చేద్దాం?.

అదే మడత పెట్టి వేయి .. చల్లగా ఉన్నచోట. నేను అన్నీ రెడీ చేసుకున్నాను కానీ, డైపర్స్ తీసుకోలేదు. దారిలో ఎ క్కడన్నా మెడికల్ షాపు కనిపిస్తే డెపైర్స్ కొందాం

కానీ, నాకు వేయడం రాదు..

నేను ట్రై చేస్తాలే . ఆదిత్య చెప్పినట్టు బొంత తడిసిన మేరా మడత వేసాడు..

పాపాయిని దానిమిదకి మృదువుగా జరిపాడు..

బాబ్జీ పాపాయిని చూడు.. నా పోలికే కదూ .. అదో రకంగా అన్నాడు ఆదిత్య ..

రేపు మార్నింగ్ చూస్తాను.. పద త్వరగా నాకేంటో అనుమానంగా ఉంది . కారు ఎవరన్నా చెక్ చేస్తారేమో..

అ లా అనగానే ఆదిత్యకి కూడా భయం వేసింది . వెంటనే కారు స్టార్ట్ చేశాడు.. పాప మళ్లీ నిద్రలోకెళ్లిపోయింది.

హైవేలో కారు వేగంగా వెళ్తోంది .. ఆదిత్యా ఎక్కడన్నా డాబా కనిపిస్తుందేమో చూడు .. కాసిని పాలు దొరికితే పాపాయికి స్పూన్‌తో నాలుగు స్పూన్‌లు పోద్దాం .. ఆకలేస్తుందేమో కదా ..అన్నాడు బాబ్జీ .

అన్నీ ఉన్నాయిరా .. డిక్కీలో బాస్కెట్ ఉంది .. అందులో ఫ్లాస్క్‌లో వేడినీళ్లు, పాలపొడి డబ్బా, పాల సీసా అన్నీ ఉన్నాయి .. పాప లేవగానే పాలు పడదాం ..

బాబ్జీ గుండె ఆర్ద్రమైంది .. జీవితంలో ఇంకా మొదటి మెట్టే ఎక్కని ఇతనికి ఈ లేత గులాబీని అపరూపంగా కాపాడే బాధ్యత తీసుకునే ధైర్యం ఎలా వచ్చింది? ఆవేశంలోనో, ఉద్రేకంలోనో వయసు వేడిలోనో కమిట్ అయినంత మాత్రాన పెళ్లికాకుండా కన్న పాపాయిని పెంచాలన్న ధైర్యం ఎక్కడినుంచి వచ్చింది? ఎలా వచ్చింది? రెండు వందల కిలోమీటర్ల దూరం అర్ధరాత్రి ప్రయాణం చేయడం పెద్ద కష్టమేం కాదు.. పుట్టి గంటకూడా కాని ఈ తెల్లగులాబీని తీసుకుని అంత సేపు ప్రయాణం చేయడం ఎంత ధైర్యం?

బాబ్జీ నీకో సంగతి తెలుసా ..

చెప్పు ..

నేను పాపనెలా పెంచాలి? ఏం చేయాలి పాలెలా పట్టాలి .. సెరిలాక్ ఎలా పెట్టాలి? ఎప్పుడు స్టార్ట్ చేయాలి ఇలాంటి వన్నీ ఉన్న బేబీ గ్రోత్ అనే బుక్స్ చదివాను.. కారు డ్రైవింగ్ నేర్చుకున్నాను. పాప కోసం చిన్న, చిన్న జాబ్‌లు కూడా చేసి ట్వంటీ థౌజండ్ సంపాదించాను..

ఇక నువ్వు నీ చదువుకి స్వస్తి చెప్పి ఈ పాప కోసం సేల్స్ బాయ్‌గానో, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గానో ఉద్యోగం చేయాలి ..

లేదు.. ఆ అవసరం రాదు.. మా అమ్మతో మంచిగా మాట్లాడి అమ్మమ్మ గురించి మొత్తం తెలుసుకున్నాను.. అమ్మమ్మ చాలా మంచిది .. తప్పకుండా పాప ఆవిడ దగ్గర క్షేమంగా ఉంటుంది .. రెండేళ్లు నా చదువు అయిందాకా అక్కడే ఉంచి చదువు కాగానే పాపని తెచ్చుకుంటాను.. నేనే పెంచుకుంటాను.. నాకు పిల్లలంటే ఇష్టంరా .. చిన్నప్పటి నుంచీ ఒంటరిగా బతికి, బతికి నాకు నా అనే వాళ్లు చాలా మంది కావాలనిపిస్తోంది .. పాపనెలా వదులుకుంటానురా? ఆర్తిగా, ఉద్వేగంగా అంటోన్న ఆదిత్య మొహం చూడాలని ప్రయత్నించి చీకట్లో స్పష్టంగా కనిపించకపోడంతో కిటికీలోంచి బైటకి చూస్తూ కూర్చున్నాడు బాబ్జీ ..

దూరంగా మిణుకు మిణుకు మంటూ కనిపించిన లైట్లు కాసేపట్లోనే స్పష్టంగా కనిపించసాగాయి.

ఏదో స్టేషన్ వస్తోందిరా అన్నాడు బాబ్జీ ..

ఇంకా మనం సిటీలోనే ఉన్నాం ..అన్నాడు ఆదిత్య ..

అయితే ఇక్కడ తప్పకుండా డైపర్స్ దొరుకుతాయేమో..

లెట్స్ ట్రై .. పడుకుందిగా పాప ..

అవును ..పాపం చలేస్తుందేమో అని నా కోటు కప్పాను..

ఓ థాంక్స్‌రా .. మనస్ఫూర్తిగా అన్నాడు ఆదిత్య .. ..

ఓ పనిచేద్దాం .. ఎక్కడన్నా కాస్సేపు కారాపితే ఇప్పుడే పాలు కలిపి బాటిల్‌లో పోసి పెడదాం పాప లేవగానే ఏడవకుండా పట్టేయచ్చు .. పాప ఏడుపు విన్నారంటే జనం మనం పిల్లల దొంగలం అని తుక్కు కింద కొట్టేయచ్చు అన్నాడు బాబ్జీ .. బాబ్జీకి ఖంగారుగా ఉంది . అప్పుడే పుట్టిన పాపనలా అర్ధరాత్రివేళ ఎక్కడికో తీసికెళ్తుంటే తనకి తాను కిడ్నాపర్ అనే ఫీలింగ్ కలుగుతోంది.. అందుకే ఖంగారుగా ఉన్నాడు..

అతని ఖంగారు గమనించిన ఆదిత్య నవ్వి .. సరేలే కలిపేద్దాం అంటూ రోడ్డుకి పక్కగా కారాపాడు. ఉండు నేను కలుపుతా .. ఫస్ట్ చేతులు శుభ్రంగా కడుక్కోవాలి .. నా సీటు పక్కన బాటిల్‌లో నీళ్లున్నాయి ఇలా ఇవ్వు .. డోర్ తీసుకుని దిగాడు.

బాబ్జీ బాటిల్‌లో నీళ్లు పోస్తుంటే చేతులు శుభ్రంగా కడుక్కున్నాడు ఆదిత్య .. తరవాత మంచి నాప్‌కిన్‌తో తుడుచుకుని డిక్కీలోంచి బాస్కెట్ తీశాడు.. అందులోంచి పాలపొడి డబ్బా, ఫ్లాస్క్ తీశాడు.. గ్లాసుకూడా బైటకి తీసి ఒక స్పూన్ పాలపొడి వేసి, గ్లాసునిండా నీళ్లు పోశాడు..

అన్ని పాలు తాగగలదా పాప అడిగాడు బాబ్జీ ..

ఎన్ని తాగితే అన్నే పడదాం .. అంటూ పాలు కలిపేసి ఫ్లాస్క్‌లో పోశాడు ఆదిత్య ..

ఈ కారెవరిదిరా? అడిగాడు బాబ్జీ డిక్కీ మూసి డ్రైవింగ్ సీట్లోకి వస్తున్న ఆదిత్యని ..

సంజయ్‌ది ..

నీకెలా ఇచ్చాడు.. నువ్వు చెప్పావా? ఇలా వెళ్తున్నానని.

వాడికంతా తెలుసు .. కారు స్టార్ట్ చేస్తూ అన్నాడు..

ఎంతైనా నీకు చాలా ధైర్యం అన్నాడు బాబ్జీ డోర్ గట్టిగా వేస్తూ ..

ఆదిత్య చిన్నగా శబ్దం చేస్తూ నవ్వాడు.. కారు బయల్దేరింది .

---

ఉదయం తొమ్మిది అయింది .. రాత్రంతా నిద్రపట్టక మేలుకుని ఉన్న భానుప్రియ అప్పుడే కళ్లు తెరిచింది.

తెల్లవారు జామున ఎప్పుడో నిద్రలోకి జారిందేమో ఎంత ప్రయత్నించినా కళ్లు తెరిపిడి పడడంలేదు.. తెరిస్తే మండిపోతున్నాయి .. బలవంతంగా కళ్లు విప్పి అరచేతుల్లో చూసుకుని తరవాత తన ఎదురు మంచం మీద బాగా అలసినట్టు ఆదమరచి నిద్రపోతున్న ప్రఖ్య వైపు చూసింది ..

అనస్తీషియా ప్రభావానికేమో రాత్రి నుంచి ప్రఖ్య మగతగా నే ఉంది .. జరిగింది ఏదీ కూడా ప్రఖ్యకి తెలియలేదు..

రాత్రి జరిగిన సంఘటన గుర్తు రావడంతో దిగ్గున లేచింది భానుప్రియ .

అయ్యో ఎంత పొరపాటు చేశాను.. చేతివాచీ చూసుకుంది .. తొమ్మిది దాటుతోంది .. షిట్ ఈ పాటికి పోలీస్ కంప్లైంట్ ఇవ్వాల్సింది ..చటుక్కున లేచి బాత్‌రూమ్‌లోకి వెళ్లింది .. కాసేపట్లో బ్రెష్ చేసుకుని మొహం కడుక్కుని వచ్చి డ్రెస్ సరిచేసుకుని మంచం మీద పడిఉన్న చున్నీ తీసుకుని మెడకు వేసుకుంది ..స్లిప్పర్‌లు వేసుకుని శబ్దం చేయకుండా గదిబైటకి వచ్చింది ..

అప్పుడే సిస్టర్ ఇంజక్షన్ సరంజామాతో వస్తోంది ..

ఆవిడ్ని చూసి మృదువుగా నవ్వుతూ అంది .. మార్నింగ్ వచ్చాను.. మీ ఇద్దరూ మంచి నిద్రలో ఉన్నారు .. డిస్టర్బ్ చేయడం ఎందుకులెమ్మని వెళ్లాను.. టెంపరేచర్ చూసి ఇంజక్షన్ చేస్తాను...

డాక్టర్ వచ్చారా? అడిగింది భాను..

రాలేదు.. వస్తారు టైం అయింది ..

మీరు మార్నింగ్ డ్యూటీ సిస్టర్ కదా .. రాత్రి డ్యూటీ ఆవిడ వెళ్లిపోయిందా?

అవునండి రాత్రి డ్యూటీ వాళ్లెవరూ లేరు . ఏం? ఏమన్నా కావాలా?

వీళ్లకి ఏమీ తెలియదా? భాను సందేహంగా చూసింది ..

మీరు వెళ్లండి లోపలికి .. నేను అరగంటలో వస్తాను.. వచ్చి మా అమ్మాయిని తీసుకుని వెళ్లిపోతాను.. అంటూ వడి,వడిగా బైటకి వెళ్లిపోయింది ..

ఆవిడ వెళ్లినవైపు చూస్తూ భుజాలెగరేసి లోపలికి వెళ్లిపోయింది సిస్టర్ .

భానుమతి రోడ్డు మీదకి వచ్చి ఆటో కోసం చూస్తూ నిలబడింది .. ఆమెకి ఏం చేయాలో అర్థం కాలేదు.. పోలీస్ కంప్లైంట్ తనివ్వాలా? డాక్టర్ కదా ఇవ్వాలి .. ఆవిడ ఇచ్చిందా? రాత్రి ఏం జరిగింది? ఒక్కసారి ఆమెకి ఏం జరిగిందో అర్థం కాలేదు..

డాక్టర్ చాలాసేపు హాస్పిటల్‌లో అణువణువూ వెతికించింది .. తరవాత తనని అడిగింది .. ఏం చేయాలనుకుంటున్నారు .. అని ..

ఖచ్చితంగా వాడే ఎత్తుకెళ్లాడు అని తను అనడం గుర్తుంది ..

ఆ తరవాత వాచ్‌మాన్ ఏదో చెప్పాడు .. ఎవరో బైట చాలాసేపు కారాపుకుని అక్కడే తచ్చాడారని, అతను చిన్న కుర్రాడని చెప్పాడు.. అనుమానం నిజమే అని అనుకున్నారు .. సరే ఉదయం ఆలోచిద్దాం ఏం చేయాలో అంటూ డాక్టర్ వెళ్లిపోయింది ..

ఇప్పుడేం చేయాలి? పోలీస్ కంప్లైంట్ చేయాలా? వద్దా? చేస్తే వాళ్లకి చాలా వివరాలు చెప్పాలి .. చేయకపోతే వాడు తప్పకుండా బ్లాక్ మెయిల్ చేస్తాడు.. వాడు సైకో .. వాడ్ని వదలకూడదు.. అయినా ఎక్కడికి పోతాడు? వాళ్లింటికే వెళ్లి ఉంటాడు.. ఏం తెలియని నంగనాచిలా శరీష హాస్పిటల్‌కి వచ్చి కూర్చుని వెళ్లిపోయింది .. తల్లీ కొడుకు లిద్దరూ కలిసి నాటకం ఆడి, తన కూతురి జీవితం నాశనం చేస్తారు .. బలవంతంగా వాడికి కట్టబెట్టచ్చు శరీష .. అలా జరగడానికి వీల్లేదు.. నో .. బ్యాగులోంచి సెల్ తీసి శరీష నెంబర్ డయల్ చేసింది .

వెంటనే రిసీవ్ చేసుకుంది శరీష .. హలో అంది .

పాపనేం చేశారు? కఠినంగా అడిగింది భాను..

ఏ పాప? విస్మయంగా అడిగింది శరీష ..

ఏం తెలియనట్టు నంగనాచిలా మాట్లాడకు .. నువ్వు , నీ కొడుకు కలిసి ప్లాన్ చేసి పిల్లని కిడ్నాప్ చేశారు .. మమ్మల్ని బ్లాక్ మెయిల్ చేయడానికి చూస్తున్నారు.. తెలివితేటలు మీకే కాదు.. నాకూ ఉన్నాయి ..

భానూ .. ప్లీజ్ .. నాకేం అర్థం కావడం లేదు.. సరిగా చెప్పు ఏం జరిగింది?

ఏం జరగడం ఏంటి? పుట్టిన పిల్లనికిడ్నాప్ చేసుకుని వెళ్లిపోయాడు.. వాడు ఎక్కడికీ వెళ్లడు.. వస్తే నీ దగ్గరకే రావాలి .. అంత చిన్న పసిగుడ్డును తీసికెళ్లి ఏం చేస్తాడు? అందుకే నేను రాత్రి పోలీస్ రిపోర్టు ఇవ్వాలనుకుని కూడా ఇవ్వలేదు.. చెప్పు నీ దగ్గరికి వచ్చాడా లేదా?

భానూ .. నిజం చెప్తున్నాను.. వారం అయింది నేను వాడిని చూసి .. పాపనెత్తుకుపోవడం ఏంటో నాకేం అర్థం కావడం లే దు.. ఎత్తికెళ్లి ఏం చేసుకుంటాడు వాడు? ఏం జరిగింది సరిగా చెప్పు ప్లీజ్

చెప్తున్నాగా పాపనెవరో రాత్రి ఆయా గదిలోకి తీసుకొస్తుండగా ఎత్తుకుని వెళ్లిపోయారు .. అది మీవాడే అని నాకు ఖచ్చితంగా తెలుసు .. మర్యాదగా తీసుకొచ్చి హాస్పిటల్‌లో అప్పగించమను .. లేదంటే వాడి మీద నేను కిడనాప్ కేస్ పెట్టాల్సివస్తుంది ..

భానూ ప్లీజ్ .. శాంతంగా ఆలోచించు .. వాడికేం అవసరం కిడ్నాప్ చేసేది .. ఎవరు చేశారో, ఆయానే ఏదన్నా చేసిందో కనుక్కో .. ఇలాంటివి ఈ మధ్య చాలా జరుగుతున్నాయి .. మనం రోజూ పేపర్లలో చూస్తూనే ఉన్నాం కదా ..

నాన్సెన్స్ .. అంత అర్ధరాత్రి పైగా ఆ హాస్పిటల్ జనరల్ పబ్లిక్ వచ్చేది కాదు.. అందరూ విఐపిలే వస్తారు .. ఎవరికి అవసరం ఉంటుంది .. ఖచ్చితంగా వాడే తీసికెళ్లాడు.. నన్ను బ్లాక్‌మెయిల్ చేయడానికే తీసుకుని వెళ్లాడు.. వాడు నీ కంటికి పిల్లాడిలా కనిపిస్తుండచ్చు .. కానీ, హి ఈజ్ ఏ సైకో ..

భానూ .. తీవ్రంగా పిలిచింది శరీష .. డోంట్ టాక్ రబ్బిష్..

రబ్బిష్ .. వాడు రబ్బిష్ .. నా మాటలు రబ్బిష్ .. వాడు ఎలా దొరకడో చూస్తాను.. నేను అవతల పెద్దమనషులకి మాట ఇచ్చాను.. వాళ్లు ఇంకో గంటలో పాపని అడాప్ట్ చేసుకోడానికి వస్తారు .. మంచి ఫ్యామిలీ .. పిల్ల భవిష్యత్తు బాగుంటుందని నేనే ఏర్పాటు చేశాను.. ఇదంతా కాదని ఆ వెధవ పిల్లని ఎత్తుకుని వెళ్లాడంటే వాడికేదో ధైర్యం, పుష్అప్ ఉండాలి .. లేదంటే వాడు సైకో అయుండాలి .. చూస్తా .. ఏదో తేలుస్తా .. ఇప్పుడే పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్నా ను.

ఫోన్ పెట్టేసింది భానుప్రియ .

అవతల నుంచి శిరీష స్వరం ఖంగారుగా భానూ, భానూ అంటున్నా వినిపించుకోకుండా ఫోన్ డిస్కనెక్ట్ అవడంతో స్థాణువైపోయింది శిరీష ..

ˇ, కానీ, పసిపిల్లతో ఎక్కడుంటాడు? ఉద్యోగం, సద్యోగం లేకుండా, చేతిలో పైసా లేకుండా ఎలా పెంచుతాడు? లేదు.. ఏదో జరిగింది .. ఏం జరిగిందో తెలుసుకోవాలి .. శిరీష అర్జంటుగా తన సెల్‌లో మిస్‌డ్ కాల్స్ లిస్ట్, డయల్ కాల్ లిస్టు చూసింది .. మిస్‌డ్ కాల్స్ లిస్ట్‌లో రాకేష్ నెంబర్, ఉంది ..అదికాక మరో నెంబరు ఉంది ..

ఆ రెండు నెంబర్లు పేపర్ మీద రాసుకుంది ..

ముందు రాకేష్‌కి చేసింది ..ఫోన్ రింగైన వెంటనే లిఫ్ట్ చేశాడు రాకేష్ .. హలో ఆదీ .. అన్నాడు..

ఆదికాదు రాకేష్ నేను ఆంటీని .. ఆది ఇంట్లో లేడు.. నీ దగ్గరకి ఏమన్నా వచ్చాడేమో అని చేశాను అంది ..

లేదాంటి మా ఇంటికి రాలేదు.. వాడు ఒన్ వీక్ నుంచీ కాలేజీకి కూడా రాడం లేదు..నేనే చేయాలనుకుంటున్నాను.. ఏమైందాంటీ ..

శిరీషకి దుఃఖంతో గొంతు బొంగురుపోయింది .. తమాయించుకుంటూ అంది .. ఏం కాలేదు బాబూ .. నామీద అలిగి వెళ్లిపోయాడు.. వాడే వస్తాడనుకున్నాను.. నీ దగ్గర ఉన్నాడేమో అనుకున్నాను.. నువ్వు కాక వాడికి ఇంకెవరు బాగా క్లోజ్ ..

ఒక్క క్షణం ఆలోచించి అన్నాడు.. వాడి ఫ్రెండ్ బాబ్జీ అని ఉన్నాడు.. వనస్థలిపురంలో ఉంటాడు.. అప్పుడప్పుడు వాళ్లిద్దరూ సినిమాలకదీ వెళ్తుంటారు .. వాడు కాక సంజయ్ ..

రాకేష్‌కి చదువు ధ్యాస తప్ప మరో ధ్యాస ఉండదు.. సినిమాలు, షికార్లు అతనికి నచ్చవు.. చదువుకి సంబంధించినంత వరకు మాత్రమే ఎవరితో స్నేహం చేసినా .. అలాంటి వాటికి ఆదిత్యకి వేరే ఫ్రెండ్స్ ఇద్దరున్నారు .. వాళ్ల పేర్లు గుర్తు లేవు శిరీషకి .. వాళ్లు కూడా ఈ మధ్యే ఇంజనీరింగ్‌లోనే ఫ్రెండ్స్ అయారు .. ఆదిత్య ఇంజనీరింగ్‌కి వచ్చాక శిరీష ఇదివరకులా అయినదానికీ, కానిదానికీ రెస్ట్రిక్ట్ చేయడం మానేసింది .. వాడు పెద్దవాడయాడు మరీ చిన్నపిల్లాడిలా కట్టడి చేస్తే సరిగా ఎదగడు అనుకుని కొంచెం ఫ్రీడం ఇచ్చింది ..

శిరీష నిట్టూర్చింది .. బాబ్జీ ఫోన్ నెంబర్ చెప్పగలవా రాకేష్ అని అడిగింది ..

నాకు తెలియదాంటీ .. సారీ .. అన్నాడు రాకేష్..

ఓ ఒ కె .. సరే .. అంటూ ఫోన్ డిస్కనెక్ట్ చేసి మరో నెంబరు డయల్ చేసింది ..

చాలాసేపు రింగైందికానీ, ఆ ఫోన్ ఎవరిదో వాళ్లు లిఫ్ట్ చేయలేదు.. చాలాసార్లు ట్రై చేసి విసుగొచ్చి ఊరుకుంది శిరీష .. మళ్లీ భానుప్రియ నెంబర్‌కి ఫోన్ చేసింది .. ఆవిడ కూడా లిఫ్ట్ చేయలేదు..

శిరీషకి ఏడుపొచ్చేసింది ..

ఏంటి ఇలా జరిగింది? ఎలా పెంచాలనుకున్నాను వీడిని .. వీడు ఇలా తయారయాడు.. నిజంగానే భాను అన్నట్టు వీడు సైకోలాగా అయాడా? ఏం చేయాలిప్పుడు? శిరీష వివేక్‌కి ఉదయాన్నే ఫోన్ చేసి బేలగా అంది . వివేక్ ! నాకు భయంగా ఉంది .. ఆది కనిపించడం లేదు అంటూ బావురు మంది ..

ఖంగారుపడిన వివేక్ .. అరరే .. ఏడవకు? నేను వస్తున్నాను .. ఊరుకో శిరీషా .. ప్లీజ్ .. వాడెక్కడికీ వెళ్లడు నేనున్నాగా . చూస్తాను.. అంటూ ఫోన్ పెట్టేసి వెంటనే బయల్దేరాడు..

**భానుప్రియ** నేరుగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లాలనుకుంది .. కానీ, వాళ్లు వేసే యక్షప్రశ్నలకి తన దగ్గర సమాధానం లేదని ఆమెకే అనిపించింది ..

ఒక్కసారి స్టేషన్‌కి వెళ్లి తను ఎలా మాట్లాడాలి? ఏం మాట్లాడాలి? ఏమని కంప్లైంట్ చేయాలి? అని ఆలోచిస్తే అవును ఏమని చేయాలి అనిపించింది .. పాపని ఎవరో కిడ్‌నాప్ చేశారు .. ఆ పాప ఎవరిపాప? ఆ పాప తండ్రి ఎవరు? పెళ్లి కాలేదా? ఎందుకు కాలేదు? పెళ్లి కాకుండా పిల్లని కన్నదా? వాళ్లు ఖచ్చితంగా ఇలాంటి చెత్త ప్రశ్నలు వేస్తారు ..

భానుప్రియ వెనక్కి తిరిగి మళ్లీ హాస్పిటల్‌కి వచ్చింది ..

నేరుగా డాక్టర్ రూమ్‌కి వెళ్లింది .. అప్పుడే వచ్చింది డాక్టర్ .. భానుప్రియను చూడగానే అంది .. పాప గురించి కంప్లైంట్ చేశారా?

భానుప్రియ సీరియస్‌గా అంది .. నేను చేయడం ఏంటి? మీరు చేయాలి? మీరు రెస్పాన్సిబుల్ .. మీ హాస్పిటల్‌లో పిల్లలకి సెక్యూరిటీ లేదంటే మీకు, మీ హాస్పిటల్‌కి బాడ్‌నేమ్ వస్తుంది కదా .. మీరసలు రాత్రి నుంచీ ఇంత ఇర్రెస్పాన్సిబుల్‌గా ఎలా ఉన్నారో నాకర్థం కావడం లేదు..

డాక్టర్ కాస్సేపు ఏమీ అర్థం కానిదానిలా అయోమయంగా చూసింది ..తరవాత సీరియస్‌గా అంది .. మేడమ్ మీరేం మాట్లాడుతున్నారో మీకర్థం అవుతోందా? రాత్రి అనుకున్నాం కదా .. ఉదయం డెసిషన్ తీసుకుందాం అని ..ఇంతలోకే మీకంత కోపం ఎందుకొచ్చిందో నాకర్థం కావడంలేదు..

మీకెలా అర్థం అవుతుంది నా బాధ? మీకర్థం కాదు... అలా అంటుండగానే ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

ఆవిడ పరిస్థితి అర్థం చేసుకున్నదానిలా మృదువుగా అంది డాక్టర్ ప్రవీణ.. ఆవేశం తగ్గించుకుని ఆలోచించండి భానుప్రియగారూ .. పోలీస్‌లకి ఏమని చెప్తారు, మీరు ఒద్దనుకున్న పాప ఎక్కడుంటే మీకేం? ఒకవేళ మీరనుకుంటున్నట్టు ఆ అబ్బాయే కిడ్నాప్ చేస్తే తండ్రి దగ్గర క్షేమంగా ఉంటుంది కదా..

వాడు ఆ పాపని అడ్డం పెట్టుకుని మమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేయడని మీరు గ్యారంటీ ఇవ్వగలరా?

చేయడు... ఒకవేళ చేసినా మీకేం ఇబ్బంది .. మీ అమ్మాయి ఎలాగా ఇక్కడ ఉండదు.. బెంగుళూరు వెళ్తుంది ..

కానీ, .. భాను ఏం మాట్లాడలేకపోయింది .. ఆవిడ అన్నదీ నిజమే కానీ, ఏంటో భయంగా ఉంది .. భయంకన్నా ఎక్కువ కోపం వస్తోంది .. ఎంత జాగ్రత్తగా ప్లాన్ చేసింది తను.. ఇలా జరగడం ఏంటి?

మీరనవసరంగా ఆందోళన పడుతున్నారు .. మీ అమ్మాయికి కొంచెం ఓపిక వస్తే ఇంటికి తీసికెళ్లి హాయిగా పదిరోజులు రెస్ట్ ఇచ్చి బెంగుళూరు పంపించేయండి ..

ఆవిడ అలా అనగానే భానుప్రియ కళ్లు మూసుకుని ఉద్వేగం అణచుకుంటూ అంది .. సారీ డాక్టర్ .. నాకేం పాలుపోడం లేదు.. ఇప్పుడు వాళ్లు వస్తే నేనేం సమాధానం చెప్పాలి? వాళ్లకి మాట ఇచ్చాం కదా .. పిల్ల ఏదీ అంటే ఏం చెప్పాలి? మీమీద నమ్మకంతో, మీరు మాకు సాయం చేస్తున్నారని మా అమ్మాయిని బెంగుళూరు నుంచి తీసుకొచ్చి ఇక్కడ డెలివరీ చేయించాను.. ఎవరికీ తెలియకుండా ఎంత రహస్యంగా చేసినా ఇలా జరిగిందంటే నాకేం అర్థం కావడంలేదు.. నాకు ఖచ్చితంగా అనుమానంగా ఉంది .. మీ ఆయానో, నర్సో అవతలి వ్యక్తికి సహకరించారు.. లేకపోతే ఇంత పకడ్బందీగా ప్లాన్ చేయలేరు .. చేసినా అమలు చేయలేరు .. వాళ్లెవరో తెలుసుకోండి ..

మాట ఇచ్చింది మీరు కాదు... నేను .. మీకు వాళ్లెవరో కూడా తెలియదుకదా .. నేను చూసుకుంటాను ..మీరు ముందు కొంచెం వేడి కాఫీ తాగి రిలాక్స్ అవండి .. మీరు ఇవ్వమంటే నేను ఇప్పడే పోలీస్ రిపోర్ట్ ఇస్తాను..

నాకేం వద్దు .. తలపట్టుకుని కుర్చీలో కూలబడింది భాను .. గుట్టు చప్పుడు కాకుండా జరిగిపోతుందనుకున్న విషయం పాప కిడ్నాప్‌తో రచ్చకెక్కుతుందన్న భయ పట్టుకుంది భానుకి ..

డాక్టర్ స్వరంలో కొంత సానుభూతి, మరికొంత ఓదార్పు కలిపి అంది .. కాఫీ తాగండి ..

ఆయా వేడిగా ఉన్న కాఫీ కప్పులో పోసి భానుప్రియకి అందించింది ..

మౌనంగా కాఫీ కప్పు అందుకుంది భానుప్రియ ..

కాఫీ తాగి మీరు రూమ్‌కి వెళ్లండి .. మీ అమ్మాయికి కాఫీ అదీ ఇవ్వండి ఆమె సంగతి చూడండి .. నేను వాళ్లకి ఫోన్ చేస్తాను... సారీ చెప్తాను... మీరు ఈ సంగతి నాకొదిలేసి మీ అమ్మాయి హెల్త్ చూసుకోండి .. మధ్యాహ్నం డిశ్చార్జ్ చేస్తాను.. ఆమెని ఇంటికి తీసికెళ్లండి .. నేను ఇంటికే వచ్చి చూస్తాను సరేనా?

భానుప్రియ మౌనంగా కాఫీ తాగి కప్పు ఆయా చేతికిచ్చి ప్రఖ్య పడుకున్న గదిలోకి వెళ్లిపోయింది ..

డాక్టర్ ప్రవీణకి కాస్సేపు తను పొరపాటు చేసిందా అనిపించింది .. అనవసరంగా ఆ కుర్రవాడిని తను ప్రోత్సహించింది .. అయినా వాడు పాపని అలా ఎలా ఎత్తికెళ్లాడు.? తనతో ఒక్కమాట కూడా చెప్పలేదు.. అతనికి సహకరించిన వాళ్లు ఎవరై ఉంటారు, ? ఇన్ని రోజులు నుంచీ తనద్వారానే అన్ని విషయాలు తెలుసుకుంటున్న అతను పాపని అడిగితే  లీగల్‌గానే ఇస్తానంది కదా .. మరి తొందరపడి ఎందుకిలా చేశాడు? ఆవిడకి అంతా అయోమయంగా అనిపించింది .. ఈ ఆరు నెల్లుగా తనెంతో జాగ్రత్తగా మానేజ్ చేస్తూ వచ్చిన విషయం ఇవాళ ఇలా రచ్చకీడ్చబడింది .. ఏం చేయాలో ఆవిడకీ అర్థం కాలేదు.. కాస్సేపలా కూర్చుని నెమ్మదిగా తల పంకిస్తూ  ఫోన్ దగ్గరకు జరుపుకుంది.

టోల్‌గేట్ సమీపిస్తుంటే ఇద్దరికీ ఒక్కసారిగా భయం వేసింది .. పాప ఏడవకుండా ఉంటే కారులో ఎవరున్నారో పట్టించుకోరు .. డబ్బులు తీసేసుకుని పంపిస్తారు.. ఒకవేళ పాప ఏడిస్తే ..ఇద్దరు కుర్రాళ్లు మాత్రం ఉన్న కార్లో చిన్నారి పాపాయి ఉంటే ఎవరికైనా అనుమానం వస్తుంది .. ఏం చేయాలో తోచలేదు ఆదిత్యకి ..

ఏం చేద్దాం బాబ్జీ అడిగాడు భయంగా..

నాకేం తెలుసు? నాకూ భయంగానే ఉంది .. అనవసరంగా రిస్కు తీసుకున్నావు.. అసలు ఇప్పుడే పుట్టిన పాపనెవరన్నా ఇలా తీసికెళ్తారా? ఏమన్నా అయితే మనిద్దరం జైల్లో కూర్చోవాలి ఆదీ .. యు డిడ్ మిస్టేక్ అన్నాడు బాబ్జీ వణుకుతున్న స్వరంతో

ఆదిత్య ఏం మాట్లాడలేదు.. బాబ్జీ అంటోంటే తను చేసింది ఎంత తప్పో అర్థం అవుతోంది .. ఎలా ఇప్పుడు వెనక్కి వెళ్లడమా? ముందుకి వెళ్లడమా? వెనక్కి వెళితే పాప తనకి దక్కదు.. ఈ పాటికి అక్కడ ఎంత రాద్ధాంతం జరుగుతోందో .. వెనక్కి వెళ్లాలంటే  ఇప్పుడు భయం వేస్తోంది .. ఇంకా వంద కిలోమీటర్లన్నా ఉంటుందేమో.. దేవుడా .. ఏం చేయను?

టోల్‌గేట్ సమీపించింది ..

గాభరా అణచుకుంటూ గ్లాస్ దించాడు.. జేబులోంచి డబ్బులు తీసి చేయి బైటకి పెట్టాడు.. టోకెన్ ఇచ్చి చిల్లర ఇచ్చాడు కౌంటర్లో కూర్చున్న వ్యక్తి .. వెళ్లమన్నట్టుగా గేటు తీశాడు పద్దెనిమిదేళ్ల కుర్రాడు..

రిలీఫ్‌గా ఊపిరి పీల్చుకుని కారు వేగంగా పోనిచ్చాడు..

థాంక్‌గాడ్ అన్నాడు బాబ్జీ . నాకేంటో అనుమానంగా ఉందిరా .. పాపకి ఆకలి వేయలేదా? ఇంతవరకూ ఏడవలేదేంటి?

బాబ్జీ అలా అనగానే ఆదిత్య సడన్ బ్రేక్ వేశాడు.. ఏంటిరా ఎందుకలా అంటున్నావు? ఖంగారుగా అడిగాడు వెనక్కితిరిగి బాబ్జీని చూస్తు..

పాప లేచి పాలన్నా తాగాలి కదా..

ఇంతకు ముందు కొంచెం పాలు తాగిందికదా..

కొన్ని చుక్కలేగా .

పుట్టగానే లీటరుపాలు తాగుతుందా? విసుగ్గా అంటూ కారు స్టార్ట్ చేశాడు.. ఏం కాదు నువ్వేం భయపడకు .. తెల్లవారేటప్పటికి మా అమ్మమ్మ దగ్గర ఉంటాం మనం ..

ఇల్లెలా తెలుసుకుంటావు?

తెలుసుకోలేకపోడానికి అదేం మహాపట్నమా? చిన్న ఊరు ..

ఏంకాదు.. చాలా హిస్టారికల్ ప్లేస్ ..పల్నాటి చరిత్ర అక్కడిదే ..

నాకు తెలుసురా .. నువ్వేం వర్రీ అవకుండా కాస్సేపు నిద్రపో .. నేను లెపుతాను..

ఏం నిద్రో .. ఈ టెన్షన్‌తో నిద్రేం వస్తుంది? అంటూ ఆవలించి కళ్లు మూసుకున్నాడు బాబ్జీ ..

తెల్లవారి సుమారు ఏడవుతుండగా కారు మాచెర్ల మీదుగా కారంపూడి చేరింది .. తెలిసిన గుర్తులతో అమ్మవారి గుడి దగ్గర ఆపాడు..

మగవాళ్లు, కొందరు పిల్లలు అరుగుల మీద కూర్చుని వేపపుల్లలు నవుల్తున్నారు.. ఆడవాళ్లు వాకిట్లో నీళ్లు చల్లి ముగ్గులేస్తున్నారు.. కొంతమంది స్నానాలు చేసి, పాత పట్టుచీరలు కట్టుకుని గుడికి వెళ్తున్నారు.. గుడి గోపురం కనిపిస్తోంది .. అప్పుడప్పుడూ గంటలు మోగుతున్నాయి.

కారు దిగి అరుగు మీద కూర్చున్న ఓ వృద్దుడి దగ్గరకు నడిచి లలితమ్మగారుండేది ఎక్కడ? అని అడిగాడు..

మహేష్‌బాబులాంటి కుర్రాడు దగ్గరకు రాగానే కొంతమంది అమ్మాయిలు గుమ్మాల దగ్గర నిలబడి చిత్రంగా చూడసాగారు ..

మీరెవరు బాబూ .. అడిగాడాయన..

నాపేరు ఆదిత్య .. హైదరాబాదునుంచి వస్తున్నాను.. లలితమ్మగారి ఇల్లెక్కడ? అడిగాడు మళ్లీ ..

అదే ఎదురుగా ఉన్న ఎత్తు అరుగుల డాబా ఇల్లు చూపించాడు చేత్తో..

ఆదిత్య గుండె దడ,దడలాడింది .. సన్నగా కాళ్లల్లో వణుకు మొదలైంది .. అక్కడే నిలబడి పూర్తిగా ఇంటి వైపు తిరిగి పరిశీలనగా చూశాడు ఇంటివైపు .. బాగా పాతకాలం ఇల్లు .. కానీ బలిష్టంగా ఉంది .. రెండు వైపులా ఎత్తైన అరుగులు, మధ్యలో లోపలికి వెళ్లడానికి ఆరు మెట్లు .. మెట్లు కడిగి ముగ్గేస్తోంది ఓ అమ్మాయి ..

థాంక్స్ అంటూ ఆ ఇంటి వైపు నడిచాడు ఆదిత్య .. మళ్లీ వెనక్కి వచ్చి డోర్ తెరిచి గుర్రుపెట్టి నిద్రపోతున్న బాబ్జీని లేపాడు.. అలాగే ఒంగి బొంతతో సహా పాపాయిని చేతుల్లోకి తీసుకున్నాడు..

కళ్లు నలుముకుంటూ లేచి వచ్చేశామా అడిగాడు బాబ్జీ ..

ఇదే ఇల్లు దిగు .. అంటూ నిటారుగా నిల్చుని అతిజాగ్రత్తగా పాపనెత్తుకుని అడుగులో అడుగువేస్తూ మెట్లు ఎక్కసాగాడు.. బాబ్జీ కూడా అతడిని అనుసరించాడు..

ఇద్దరు మగపిల్లలు ఒక పసిపాపతో లలితమ్మగారింట్లోకి వెళ్లడాన్ని నోరెళ్లబెట్టుకుని విచిత్రంగా చూస్తు నిలబడ్డారు అంతా ..

పెద్ద వసారా .. ముగ్గేస్తున్న అమ్మాయి వీళ్లిద్దరినీ చూసి లోపలికి పరిగెత్తి అమ్మగారూ .. ఎవరో చుట్టాలొచ్చారండి అని అరిచింది ..

ఎవరే .. అంటూ ఒక స్వరం .. వెనకే తలంటుకున్న జుట్టు వేలు ముడి వేసుకుని జరీ అంచు గుంటూరు నేత చీర కుట్టుకున్న ఒక డెబ్బై ఏళ్ల స్త్రీ లోపల్నించి వచ్చింది ..

ఆదిత్యనీ, బాబ్జీని చూస్తూ అయోమయంగా నిలబడిపోయింది ..

బాబ్జీ భయంగా ఆదిత్య వెనక్కి నక్కాడు..

ఆదిత్య గుండె దడ, దడలాడింది .. ఈమేనా తన అమ్మమ్మ .. ఈ పరిసరాలు, ఈ ఇల్లు, ఈ స్త్రీ ఎప్పుడో, ఎక్కడో అస్పష్టంగా కళ్లముందు మెదుల్తున్నాయి .. ఎప్పుడో చిన్నప్పుడు తనకి జ్ఞానం లేనప్పుడు ఈ ఇంటికి వచ్చాడు.. ఆ రోజు ఈమె బాగా ఏడుస్తున్న గుర్తు .. అమ్మ చెప్పింది ఆరోజు తాతయ్య చనిపోయారని వచ్చారట. మళ్లీ ఇప్పుడు .. ఇలా .. అమ్మతో వచ్చి ఉంటే బాగుండేదేమో ! ఇప్పుడు తనని తాను పరిచయం చేసుకోవాలి .. ఆవిడ గుర్తుపడుతుందా? పట్టలేకపోయినా వివరంగా చెబితే నమ్ముతుందా? ఎవరో అగంతుకలని ఇద్దర్నీ తరిమేయదుకదా .. .. వణుకుతున్న కాళ్లతో మాట్లాడకుండా ఆమె వైపు నడిచాడు

ఆవిడ ఆశ్చర్యంగా చూస్తూ ఎవరు బాబూ మీరు అంది ..

ఆదిత్య కళ్లల్లో అప్రయత్నంగా నీళ్లు తిరిగాయి .. దుఃఖంతో బొంగురుపోయిన స్వరంతొ పిలిచాడు.. అమ్మమ్మా ..

అ మ్మ మ్మ .. నువ్వె నువ్వెవరివి బాబూ .. ఆవిడ సంభ్రమంగా అడుగు ముందుకేసింది ..

ఆదిత్య కొంచెం వేగంగా నడిచి ఆమె దగ్గరగా వచ్చి పాపనందిస్తూ .. నాపేరు ఆదిత్య .. మా అమ్మ పేరు శిరీష ఈ పాప నా కూతురు అంటూఒంగి ఆవిడ పాదాలు తాకాడు..

ఆవిడ అప్రయత్నంగా ఆదిత్య చేతుల్లోంచి పాపను తీసుకుని, పాపనూ, ఆదిత్యనూ నిర్ఘాంతపోయి చూడసాగింది. పాప అకస్మాత్తుగా కెవ్వుమని ఏడుపు ప్రారంబించింది. ఆవిడ నిలువెల్లా వణికిపోసాగింది .. ఏంటిది? ఏం జరుగుతోంది? ఆవిడకేం అర్థం కావడం లేదు..ఈ అబ్బాయేంటి? తన మనవడేంటి? ఇన్నేళ్లు ఎక్కడున్నారో కూడా తెలియని తన కూతురు కుటుంబంలో ఒక వ్యక్తి వచ్చి పసికందును ఇచ్చి, ఏంటిది? ఇదేదో సినిమాలో దృశ్యమో, నాటకమో కాదు కదా .. పోనీ కలా? కాదు ..

అమ్మమ్మా .. నేను చాలా చిన్నప్పుడు వచ్చాను కదా మీ దగ్గరికి. నాకు రావాలని చాలాసార్లు అనిపించింది .. కానీ, మా అమ్మ తీసుకురాలేదు.. కానీ, ఇప్పుడు నేనే మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను..ఎందుకంటే ఈ పాప కోసం ..

ఆవిడ నోట మాటరానిదానిలా నిలబడిపోయింది. ..శిరీష .. ఏనాటి శిరీష? పన్నెండేళ్లవుతుందేమో తల్లీ కూతుళ్ల మధ్య సంబంధాలు తెగిపోయి, అలాంటిది ఇప్పుడు ఈ కుర్రాడు నేను నీ మనవడిని అంటూ వచ్చి తనకో కూతురుండేదని గుర్తుచేస్తున్నాడు.. ఆవిడ కళ్లల్లో అశ్రువులు ధారలు కట్టాయి ..

అప్పటిదాకా ముగ్గేస్తున్న అమ్మాయి వచ్చి అమ్మగారి చేతుల్లోంచి అతి జాగ్రత్తగా ఏడుస్తోన్న పాపాయినందుకుంది.

పాప ఏడుపాపకుండా సన్నగా ఏడుస్తోంది .. ఆ అమ్మాయి పాప పొట్ట చూసింది .. ఆకలిగా ఉన్నట్టుంది .. ..

అప్పటికే ఆవిడ ఉలిక్కిపడి కళ్లు తుడుచుకుని పాప వైపు చూసింది ..

పసికూనమ్మగారూ .. ఎప్పుడు పుట్టింది ఈ పాప? అడిగింది నాగలక్ష్మి చేతుల్లో ఉన్న పాపాయిని ఊరుకోబెట్టడానికి చిన్నగా చేతులూగిస్తూ.

నిన్నరాత్రి అన్నాడు..ఆదిత్య

నిన్నరాత్రా .. ఆవిడ వెర్రిదానిలా చూసింది .. ఆదిత్య తల వంచుకున్నాడు..

నిన్న రాత్రి పుట్టిన పిల్లని ఇంత దూరం  తీసుకొచ్చావా? ఎలా తీసుకొచ్చావు? అసలెందుకు తీసుకొచ్చావు? ఎవరు చెప్పారు నీకిలా తీసుకురమ్మని .. గబ,గబా ప్రశ్నలేస్తూ, పాపాయిని జాగ్రత్తగా మంచం మీద పడుకోబెట్టి  చుట్టిన బ్లాంకెట్ తొలగించింది ..  పాప ఒంటి మీద ఒక లూజు గౌను ఉంది .. సైజు తెలియక కొన్నట్టుంది ఆ గౌను.. పాప సన్నగా ఏడుస్తూనే ఉంది.

ఆవిడ కొన్ని క్షణాలు అచేతనంగా కూర్చుండిపోయి నాగలక్ష్మీ ముందు వేడినీళ్లు కాచు . త్వరగా .. అంటూ పాపని నాగలక్ష్మి చేతుల్లోంచి తీసుకుని ఆదిత్యనీ, బాబ్జీనీ చూస్తూ ఈ పాపకి పాలేమన్నా తెచ్చారా అంది.

అన్నీ ఉన్నాయి అంటూ ఆదిత్య గబగబా వెళ్లి కారులోంచి బాస్కెట్ తీసుకొచ్చి ఆమెకిచ్చాడు..

`మీరెళ్లి మొహాలు కడుక్కోండి .. అంటూ ఆమె పాపకి వేసిన గౌను తీసేసింది .. నాగలక్ష్మి తీసుకొచ్చిన వేడినీళ్లలో గుడ్డ ముంచి ఒళ్లంతా తుడిచింది .. బాస్కెట్‌లో ఉన్న పాలపొడి డబ్బా, పాల సీసా బైటకి తీసి, ఈ సీసా శుభ్రంగా కడుగు అంటూ నాగలక్ష్మికి సీసా ఇచ్చి పాల పొడి, వేడినీళ్లలో వేసి కలిపింది .. రెండు నిమిషాల్లో నాగలక్ష్మి సీసా శుభ్రంగా కడిగి తీసుకొచ్చింది .. తోమిన గ్లాసు తీసుకొచ్చి పాలు చల్లార్చు అని పురమాయించి పాపాయికి మళ్లీ విప్పిన గౌను తొడిగింది ..

మంచం మీద వెనక్కి జరిగి గోడకానుకుని కాళ్లు చాపుకుని పాపాయిని కాళ్ల మీద పడుకోబెట్టుకుంది .. నెమ్మదిగా కాలు ఆడిస్తూ, పాపాయిని ఓదారుస్తూ, నాగలక్ష్మి చల్లార్చి ఇచ్చిన పాలు  సీసాలో పోసి నెమ్మదిగా పట్టసాగింది ..

ఆవిడకి అంతా అయోమయంగా ఉంది ..

కుర్రాడు చూస్తే ఇంకా మీసాలు కూడా పూర్తిగా రాలేదు.. అలాంటిది వీడికి పెళ్లి అవడం ఒక కూతురు పుట్టడం .. దాన్ని పుట్టిన వెంటనే తీసుకుని ఇంత దూరం తనని వెతుక్కుంటూ రావడం అంతా ఏదో  కలలాగా అనిపిస్తోంది .. కానీ, కాళ్ల మీద ఉన్న పాపాయి, ఆ స్పర్శ అదంతా నిజమని చెప్తోంది ..

పాలు తాగడం అయిపోయినట్టుంది  పాప మొహం తిప్పేసుకుని, కళ్లు తెరిచి చంచలంగా చూస్తోంది ..

చక్కటి కళ్లు, గులాబీరంగు ఒళ్లు, .. నల్లని ఉంగరాల జుట్టు ..ఎంత ముద్దుగా ఉంది ..

అయ్యో దీనికి పుట్టగానే వైద్యుల పర్యవేక్షణ ఎంత అవసరం? వీడికెవరు చెప్పారు ఇలా చేయమని .. ఇంతకీ ఈ పాప తల్లి ఏమైంది?

స్నానాలు చేసి ఫ్రెష్‌గా వచ్చిన ఆదిత్యనూ, బాబ్జీనీ చూస్తూ .. పాపని నెమ్మదిగా కాళ్లమీద నుంచి తీసుకుని ఎత్తుకుని మంచం మీద పడుకోబెట్టింది లలితమ్మ..

ఇప్పుడు చెప్పండి .. ఎవరీ పాప? ఎందుకు తీసుకొచ్చారు? మీ ఇద్దరూ నా మనవళ్లేనా? అడిగింది సావకాశంగా..

ఆదిత్య చెప్పడం ప్రారంభించాడు.. ఏదీ దాచకుండా తనకి ఇంట్లో ఉన్న ఒంటరితనం, తనకి  ప్రఖ్యతో కలిగిన స్నేహం,  ఇద్దరూ  ఆకర్షితులు అవడం, ప్రఖ్య తల్లి అబార్షన్ చేయించాలనుకోడం, తను డాక్టర్‌ని కలవడం మొత్తం పూసగుచ్చినట్టు చెబుతోంటే ఆవిడ విభ్రాంతిగా వినసాగింది ..

అంతా చెప్పి అన్నాడు ఆదిత్య ..

అమ్మమ్మా .... నాకు పాపాయి కావాలి .. నేను పెంచుకుంటాను నా పాపని .. కానీ, నా చదువు పూర్తి అయిందాకా మీరు పెంచాలి .. తరవాత నేను పెంచుకుంటాను..పాపని ఎవరికీ ఇవ్వడం నాకసలు ఇష్టం లేదు..

ఆవిడ  ఒళ్లంతా పులకించిపోయింది .. అమ్మమ్మా అని అతను పిలుస్తోంటే ఈ డైభైఏళ్లు ఆ పిలుపుకోసమే బతికిఉన్నానా అన్న అనుభూతలి కలుగుతోంది .. అప్రయత్నంగా ఆదిత్యని దగ్గరకు తీసుకుని తల నిమురుతూ అంది .. చాలా తప్పు చేశావు నాన్నా .. ఏదన్నా జరిగి ఉంటే ఎంత ప్రమాదం .. పిల్లనసలు అట్లా తీసుకురావచ్చా డాక్టర్‌కి చెప్పావా?

లేదు ..

మరి .. అలా చెప్పకుండా ఎందుకు తీసుకొచ్చావు? ఆవిడ నీకోసమే కదా ఆ అమ్మాయికి అబార్షన్ చేయకుండా ఆపింది ..

కానీ, ఆవిడ ఎవరికో దత్తత ఇవ్వాలునుకున్నారు..

నీకెలా తెలుసు?

ప్రఖ్య వాళ్లమ్మకి చెప్తోంటే విన్నా కదా ..

ఒకసారి నీకు మాట ఇచ్చాక తప్పుతుందా డాక్టర్ .. తొందరపాటు కూడదు నాన్నా .. ఇప్పుడు ఆవిడ ఎంత ఖంగారు పడుతుంటారో, ఒకవేళ పాపని నువ్వు ఎత్తుకెళ్లావని పోలీసులకి ఫిర్యాదు చేస్తే..

అమ్మమ్మా .. భయంగా పిలిచాడు..

అలా అనకండి .. నాకు భయం వేస్తోంది ..

అండీ ఏంటిరా? నేను నీకు అమ్మమ్మని నాన్నా ..  మీ అమ్మకి నేనక్కర్లేకపోయినా నాకోసం వెతుక్కుంటూ వచ్చిన నువ్వు నా ప్రాణంరా .. నా మీద కొండంత  నమ్మకంతో ఈ పురిటి గుడ్డును తీసుకుని రెండు వందల కిలోమీటర్లు రాత్రివేళ్ల రావడం నాకు తల్చుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తోంది .. అలాగే తనువంతా

పులకించిపోతోందిరా .. మీ అమ్మ ఎట్లా ఉందిరా? కళ్లలో నీళ్లతో గాద్గదికంగా అడిగింది . ఆవిడకి ఇప్పుడు అర్జంటుగా శిరీషను చూడాలని, గుండెలకు హత్తుకోవాలని అనిపిస్తోంది .. కూతురు తన పట్ల నిర్లక్ష్యంగా, కఠినంగా ఉండడం వలన ఆవిడకూడా అలాగే ఉంటోంది కానీ? ఆవిడ తల్లి మనసు కూతుర్ని తలచుకుని అనుక్షణం ఆవేదన అనుభవిస్తూనే ఉంది ఇంత కాలం .. భర్త పోయాక దేవుడి సేవలో జీవితం గడిపేస్తోంది . ఏనాటికైనా కూతురు వస్తుందని, మిగిలిన ఈ ఇల్లు, కొంత బంగారం ఆమెకి అప్పచెప్పి తను సెలవు తీసుకోవాలని ఎదురుచూస్తూనే ఉంది ..

ఇరవై ఏళ్ల ఈ ఆధునిక యువకుడి మనసులో ఉన్నట్టు శిరీషక్కూడా తనకంటూ ఒక పెద్ద కుటుంబం ఉండాలన్న ఆశ, తపన ఉండి ఉంటే ఎంత బాగుండేది .. వీడికి ఎక్కడి నుంచి వచ్చింది ఈ ఆలోచన? ఆదిత్య వైపు పరిశీలనగా చూసింది .. శిరీష పోలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి ..

అమ్మమ్మా .. సారీ .. జాలిగా చూస్తూ అన్నాడు ఆదిత్య ..

ఆవిడ కళ్లనీళ్లు తుడుచుకుని, నాగలక్ష్మి అలా సెంటర్‌దాకా వెళ్లి పాపాయికి జుబ్బాలు కొనుక్కురా, అలాగే పిల్లల డాక్టర్‌గారిని నేనోసారి రమ్మన్నానని చెప్పు .. అని నాగలక్ష్మితో చెప్పి, పదండి మీ ఇద్దరూ టిఫిను తిందురుగాని అంటూ లేచింది ..

ఆదిత్య పాపాయి వైపు చూశాడు.. కాస్సేపు కళ్లు తెరిచి అటూ, ఇటూ చూస్తూ ఉన్న పాప తిరిగి నిద్రలోకి జారింది .. మెత్తటి పరుపు, చల్లగాలి, లలితమ్మ ఒళ్లు తుడిచినందుకేమో హాయిగా నిద్రపోతోంది ..

బాబ్జీ వైపు చూసి నవ్వాడు ఆదిత్య .. ఆ నవ్వులో చూశావా? నేను సాధించాను... అనే చిన్న ఆత్మవిశ్వాసం కనిపిరిచింది .. అప్పటిదాకా బిగదీసుకుని టెన్షన్‌గా ఉన్న బాబ్జీ కూడా చిన్నగా నవ్వాడు..

లలితమ్మ పెట్టిన వేడి, వేడి ఇడ్లీ , ఘుమ,ఘుమలాడే నెయ్యి వేసిన కారప్పొడి, కొబ్బరి పచ్చడితో చెరి ఆరూ ఇడ్లీలు లాగించి , కమ్మటి కాఫీ తాగి ఒళ్లు మరిచి నిద్రపోయారిద్దరూ ..

వాళ్లు నిద్ర లేచేటప్పటికి ఇంటినిండా ఆడవాళ్లు చాలా మంది పాపాయి చుట్టూ మూగి ఉన్నారు .. అందరి గొంతులూ కలగాపులగంగా గట్టిగా వినిపిస్తున్నాయి.

వాళ్లందరి మధ్యలో పాపాయిని కాళ్ల మీద పడుకోబెట్టుకుని లలితాంబ పాపని అందరికీ చూపిస్తూ నా మునిమనవరాలు .. నన్ను వెతుక్కుంటూ వచ్చిందా చూశావా కాంతం .. అంటూ చెప్తోంది ఎవరికో .. ఆ దృశ్యం చూడగానే ఆదిత్య ఒళ్లు పులకించినట్టు అయింది . ఇంత మందిని ఒక దగ్గర చూస్తుంటే ఎంతో బాగుంది .. అది కూడా వాళ్లంతా తన కుటుంబానికి సంబంధించిన వాళ్లు .. వాళ్లు తన అమ్మమ్మకి ఏమవుతారో తెలియదు కానీ, వాళ్లకీ, ఆవిడకీ ఏదో అపూర్వమైన అనుబంధం ఉందనిపిస్తోంది .. పుట్టగానే ఇంతమంది బంధువులను సంపాదించుకున్న తన చిట్టితల్లి ఎంత అదృష్టవంతురాలు అనిపిస్తోంది .. అర్థం కాకపోయినా వాళ్లందరి మాటలు వింటూ అలా మంచం చివర బొమ్మలా కూర్చుండిపోయాడు.. అందరి గొంతులూ వినిపిస్తున్నాయి ..

ఎవరిపోలికోగానీ పిల్ల మాత్రం పెద్ద అందగత్తె అవుతుందనిపిస్తోంది పిన్నీ అంటోందెవరో ఒకావిడ.

చాల్లేవే అప్పుడే తెలుస్తుందా ఏంటి? పిల్ల మాత్రం మంచి రంగు వస్తుంది .. అదిగో అరికాళ్లు, అరిచేతులు గులాబీరంగులో ఎంత బాగున్నాయో..

రంగేంటి?ఆ కళ్లు చూడు అప్పుడే ఎంత పెద్దగా ఉన్నాయో .. అప్పుడే కళ్లు తెరిచి చూస్తోంది.. ఈ కాలం పిల్లలు  పూవు పుట్టగానే పరిమళించినట్టు పుట్టిన వెంటనే చాలా తెలివితేటల్తో పుట్టేస్తున్నారు..

కాలం తల్లీ .. కలికాలం ..

అవును మరి .. కాలం ..

అవునూ పెద్దమ్మా .. మరి నీకు పురుడు లేదూ ..

ఆదిత్య ఆసక్తిగా వినసాగాడు..

పురుడో, గిరుడో ఆపిల్ల అక్కడెక్కడో ప్రసవించింది .. నేనిక్కడ పురుడంటూ కూర్చుంటే గడుస్తుందా? పదిరోజులు కాగానే పుణ్యాహవచనం చేయించేస్తాను..

వాళ్లమ్మని కూడా పిలిపించి ఎంచక్కా బారసాల చేయి పిన్నీ .. ఎంత కాలమైంది నీ ఇంట్లో ఓ శుభకార్యం జరిగి ..

అవతలి నుంచి సమాధానం రాలేదు కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా అయిపోయింది .. తరవాత మెల్లిగా అంటున్నారెవరో .. అయ్యో పిన్నీ బాధపడకు ..నీ బాధల్ని తీర్చడానికి ఈ పిల్లను పంపించాడా దేవుడు .. ఊరుకో ..

ఊరుకో పిన్నీ .. పంతాలూ, పట్టింపులు ఎంతకాలం ఉంటాయి చెప్పు .. ఇప్పుడు ఈ మనవరాలికోసమైనా ఆ అమ్మాయి నీ దగ్గరకు రావాల్సిందే .. ఊరుకో .. పిల్ల మీద కంటినీరు పడనీయకు ..

నాలుగైదు స్వరాలు ఓదారుస్తున్నాయి ఆవిడని ..

గద్గద స్వరంతో అంటోంది లలితాంబ .. ఏనాటికైనా తన తప్పు తెలుసుకుని వస్తుందనుకున్నాను.. ఆడపిల్ల ఒంటరిగా ఎలా బతుకుతుంది .. అటు భర్త దగ్గరకో, ఇటు నా దగ్గరకో వచ్చి తీరాలి అని నమ్మాను.. దాని పంతం, పట్టుదల ఇంతకన్నా ఏం తెలుస్తాయి చెప్పండే .. ఇన్నేళ్ల తరవాత నా మనవడు నన్ను వెతుక్కుంటూ వచ్చాడు.. అదీ తల్లికి తెలియకుండా .. అంటే తెలిస్తే పంపించదనేగా ..

ఆదిత్య అక్కడ క్షణం కూడా నిలబడలేకపోయాడు... అమ్మమ్మ ఏడుపు స్వరం విని తట్టుకోలేకపోయాడు.. పెద్ద, పెద్ద అడుగులేస్తూ అందరూ కూర్చున్న చోటికి వచ్చాడు..

అతడిని చూడగానే ఒక్కసారిగా అందరి నోళ్లు మూతలు పడ్డాయి .

లలితాంబ ఆదిత్య వైపు చూసి చెంగుతో కళ్లు తుడుచుకుని, పెదాల మీదికి నవ్వు తెచ్చుకుని అంది ..

లేచావా నాన్నా .. దా .. ఇదిగో నీ కూతుర్ని ఎత్తుకుంటావా? అంటూ ఆప్యాయంగా పిలిచింది ..

ఆదిత్యకి దారిస్తూ ఆడవాళ్లంతా పక్కకి తొలిగి నిలబడ్డారు ..

ఆదిత్య వచ్చి లలితాంబ పక్కన మంచం చివర కూర్చున్నాడు..

ఆడవాళ్లంతా వెళ్లొస్తాం పిన్నీ అంటూ నెమ్మదిగా ఒక్కరొక్కరే వెళ్లిపోయారు ..

వెళ్లిపోయిన వాళ్లని చూస్తుంటే ఆదిత్యకి సరదాగా అనిపించింది .. ఇంతమంది తనింటికి ఎప్పుడన్నా వచ్చారా?

లలితాంబ ఆదిత్య దగ్గరగా జరిగి, అతని తల మీద చేయి వేసి జుట్టు నిమురుతూ .. చాలా అఘాయిత్యం చేశావురా నాన్నా .. నీ అదృష్టం బాగుండి పాపాయి క్షేమంగా ఉందిగానీ, ఏదన్నా అయి ఉంటే .. ఎంత ప్రమాదంలో పడేవాడివో తెలుసా .. నాన్నా ఏదన్నా పని చేసేటప్పుడు ఆలోచన ఉండాలి .. వివేకం ఉండాలి .. ఆవేశం అనర్థహేతువు .. అసలు మీ ఇద్దరూ పెళ్లికాకుండా తొందరపడడం తప్పు .. పాపాయిని కనడం ఇంకా తప్పు .. పోనీ డాక్టర్ చెప్పినట్టు ఎవరికైనా పిల్లల్లేనివాళ్లకి ఇచ్చేసినా బాగుండేది .. ఏ ఠికానా లేని నువ్వు దాన్ని పెంచుకోవాలనుకోడం , ఇలా అర్ధరాత్రి వేళ  దొంగతనంగా కారులో ఇంత దూరం తీసుకురావడం చాలా పెద్ద తప్పు .. నాకు తలుచుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తోంది .. అంది .. ఆవిడ స్వరంలో వణుకు స్పష్టంగా వినిపించింది ..

ఆదిత్య జాలిగా చూశాడు .. సారీ అమ్మమ్మా .. నేను చాలా తప్పు చేశాను.. కానీ నాకు పాప కావాలి .. నేను పెంచుకుంటాను ..

ఎలా పెంచుకుంటావురా?

అమ్మమ్మా .. ఒక్క రెండేళ్లు మాత్రం నువ్వు పాపాయిని నీ దగ్గర ఉంచుకోవాలి .. ఈ లోగా నా ఇంజనీరింగ్ అయిపోతుంది .. నేను మంచి జాబ్ చూసుకుని పాపని, నిన్నూ నాతో తీసుకుని వెళ్లిపోతాను..ప్లీజ్ అమమ్మా .. సాహసం చేశానో, తప్పు చేశానో నేను అనుకున్నది సక్సెస్‌ఫుల్‌గా సాధించాను.. పాపని నీకు అప్పగించాను.. ఇంక నేనేం చేసినా ఆలోచించి చేస్తాను.. నీకు ఫోన్ చేస్తాను.. నీ సలహాతో చేస్తాను.. అమ్మని కూడా వీలైతే ఈసారి తీసుకుని వస్తాను.. రాకపోతే మనం ముగ్గురం అంటే పాప, నువ్వు, నేను ఉందాం ..

మరి నీ భార్య?

భార్యా .. మాకు పెళ్లేకాలేదుగా .. అయినా నీకు తెలియదులే అమ్మమ్మా .. ఇప్పుడు ఆడవాళ్లందరికీ కూడా భర్తలు అవసరం లేదు .. వాళ్లకి బాగా చదువుకుని, మంచి ఉద్యోగాలు సంపాదించుకుని దర్జాగా బతకాలని మాత్రవే ఇష్టం .. స్వేచ్ఛగా, ఒంటరిగా బతుకుతారుట .. వాళ్లకి ఎవరూ ఒద్దుట .. కానీ, నాకు చక్కగా అందరూ కావాలనిపిస్తుంది.

అంటే ఆ అమ్మాయి నిన్ను పెళ్లి చేసుకోదా?

చేసుకోదు..

ఎంచేత?

వాళ్లమ్మ ఒద్దంది ..

ఎందుకు?

వాళ్లమ్మ కూడా మా అమ్మలాగే ఒంటరి .. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం  ఇవే కావాలి .. అందుకే కూతుర్ని కూడా అలాగే తయారు చేస్తుందిట .

ఆవిడ అయోమయంగా చూసింది .. అసలీ స్వేచ్ఛ అంటే ఏంటో ఆవిడకి అర్థం కావడంలేదు..

పోనీ నువ్వు వేరే అమ్మాయిని పెళ్లి చేసుకోరా .

ఆవిడ ఆరాటానికి నవ్వొచ్చింది ఆదిత్యకి ..

అమ్మమ్మా .. నేను ఇప్పుడు చేసిందే తప్పు కదా .. చదువు, ఉద్యోగం లేకుండా ఎవరన్నా పెళ్లి చేసుకుంటారా?

ఆవిడ నవ్వింది .. ఆదిత్య ఆ క్షణంలో అమాయకంగా, ముద్దుగా అనిపించాడు.. దగ్గరకు తీసుకుని నుదుటిమీద ముద్దు పెట్టుకుంది .. దేవుడు దయామయుడురా నాన్నా .. ఈ వయసులో నిన్నిలా చూస్తానని అనుకోలేదు.. కూతుర్నే ఇంక చూస్తానని అనుకోలేదు.. అలాంటిది మనవడిని, ముని మనవరాలిని కూడా చూశాను.. పైగా దాన్ని పెంచమంటున్నావు.. చాలురా నా జీవితం ధన్యమైపోయింది నాయనా .. రెండేళ్లు కాదు... నేను బతికున్నంతకాలం నా ప్రాణానికి ప్రాణంగా, కంటికి రెప్పలా చూసుకుంటాను సరేనా?

అమ్మమ్మా .. ఆవిడ కౌగిట్లో దూరిపోయి పిలిచాడు

ఆ క్షణం ఆ ఇద్దరి పరిష్వంగంలో తర,తరాల  రక్తసంబంధపు అనుబంధాలు విలీనమైపోయి, పెచ్చులూడిపోతున్న భారతదేశపు కుటుంబ వ్యవస్థ పునాదులు పటిష్టం అవుతున్నట్టుగా అనిపించింది ..

వాళ్లిద్దరినీ అలా చూస్తూన్న బాబ్జీ ఇరవై నాలుగు గంటల తరవాత ఊపిరి పీల్చుకున్నాడు.

ఆదిత్య ఆమె కౌగిలినుంచి విడివడి, అమ్మమ్మా నేను రాత్రికి వెళ్లిపోతాను.. పాపం వీడు నా ఫ్రెండ్ ఇంట్లో వాళ్లకి చెప్పకుండా నాతో వచ్చాడు.. నేను వెళ్లగానే నీకు ఫోన్ చేస్తాను.. అంటుండగానే ఆవిడ నవ్వుతూ నాకు ఫోన్ ఏం లేదురా .. ఎవరున్నారు నాన్నా నాకు ఫోన్ చేయడానికి .. నా బంధువులంతా ఈ ఊళ్లోనే ఉన్నారు .. గాలితో కబురుచేసినా వచ్చి వాలతారు ..అంది.

నీకు ఫోన్ లేదా? ఆశ్చర్యంగా అడిగాడు..

లేదు .. నవ్విందావిడ..

ఆదిత్య బాబ్జీ వైపు చూశాడు.. వెంటనే తన జేబులో ఉన్న సెల్ తీసి ఆవిడకిస్తూ ఇదిగో ఇది నా ఫోన్ .. ఇది మోగినప్పుడు  అనిచెప్పబోతూ ఆగిపోయి, సెల్ బాబ్జీకిస్తూ .. బాబ్జీ నీ సెల్ ఇలా ఇవ్వు అన్నాడు..

నా సెల్లా ఖంగారుగా చూశాడు బాబ్జీ ..

ఇవ్వరా .. నీకు వేరేది కొనిస్తాలే .. అంటూ దాదాపు బాబ్జీ చేతిలోంచి సెల్ లాక్కుని లలితాంబకిస్తూ ఇదిగో ఇది తీసుకో .. నా ఫోన్ నెంబర్ నీకు రాసిస్తాను.. ఆ నెంబర్ ఇదిగో ఇలా మోగినప్పుడు ఈ స్క్రీన్ మీద కనిపిస్తుంది. అప్పుడు నువ్వు ఈ బటన్ నొక్కి నాతో మాట్లాడచ్చు .. నా సెల్ ఇస్తే మా అమ్మ నాకు ఫోన్ చేస్తుందికదా .. నీకు ప్రాబ్లెమ్ .. అంటూ అప్పటికప్పుడు ఆవిడకి సెల్ డెమో చేసి చూపించాడు..

ఆవిడ కళ్లద్దాలు పెట్టుకుని అటు చూసి, ఇటు చూసి నాకెందుకురా ఇవన్నీ .. పక్కింటి రాజుకి ఇలాంటి ఫోన్  ఉంది వాడి నెంబర్ అడిగి తీసుకుని చేయి . విషయం చెప్తాడు నాకు అంది ..

నేర్చుకో అమ్మమ్మా .. నేను రోజుకి నాలుగైదుసార్లు చేస్తాను.. ప్రతిసారీ అతన్ని డిస్టర్బ్ చేయడం బాగుండదు కదా అంటూ ఆవిడని కన్విన్స్ చేసి తన సెల్ ఇచ్చి పాపని ఒక్కసారి ఎత్తుకుని తిరిగి పడుకోబెట్టి  ఆ రాత్రి డిన్నర్ చేసి బాబ్జీని తీసుకుని తిరిగి హైదరాబాదు బయల్దేరాడు ఆదిత్య.. కారులో కూర్చుని స్టార్ట్ చేస్తూ చేయి ఊపుతున్న ఆదిత్యని కళ్లనీళ్లతో చూస్తూ ఉండిపోయింది లలితాంబ.

శిరీష తిండీ, నీళ్లూ లేకుండా ఏడుస్తూనే ఉంది .. ఇరవై నాలుగ్గంటల్లో ఆమె ఆకర్షణీయమైన రూపంలో ఎంతో మార్పు వచ్చి పదేళ్ల వయసు పెరిగినట్టు అయింది .. భాను మాటలు, ఆమె చేసిన అవమానం, ఆదిత్య చేసిన పని ఆమె మనసంతా వేదనతో నిండిపోయింది. వివేక్ ఆమె దగ్గరే ఉండిపోయి ఓదార్చడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

నువ్విలా బాధపడుతూ కూర్చుంటే జరిగినదంతా మారిపోతుందా శిరీషా .. వాడేం చిన్నపిల్లాడా? ఎక్కడో ఫ్రెండ్ దగ్గర ఉండి ఉంటాడు.. వచ్చేస్తాడు.. వాడికోసం బెంగపెట్టుకుని నువ్విలా ఆరోగ్యం పాడుచేసుకోడం బాగాలేదు..

ఏమో వివేక్ .. వాడిలా తయారవుతాడని నేనెన్నడూ ఊహించలేదు..

ఏమైందిప్పుడు? ఖోనేజ్‌లో నూటికి తొంభైమంది తప్పులు చేస్తారు .. ఇప్పుడు సమస్య విడిపోయినట్టేగా .. ఎవరిదారిన వాళ్లు మీ, మీ పిల్లల్ని తీర్చిదిద్దుకోండి .. నువ్వూ భానూ ..

పాపనెవరు కిడ్‌నాప్ చేసి ఉంటారు .. నాకెందుకో ఆదిత్యమీదే అనుమానంగా ఉంది.

నీదంతా బేస్‌లెస్ .. వాడు పాపని తీసికెళ్లి ఏం చేసుకుంటాడు చెప్పు .. కనీసం పిల్లల్ని ఎత్తుకోడం కూడా రాదు కదా .. ఎలా తీసికెల్తాడు?

మరి ఎవరు తీసికెళ్లి ఉంటారంటావు?

ఎలా తెలుస్తుంది .. పోలీసులు రంగంలోకి దూకితే తెలుస్తుంది .. మరి ఆవిడేమో పోలీస్ కంప్లైంట్ ఇవ్వడానికి సంకోచిస్తోంది ..

ఇంతలో కాలింగ్ బెల్ మోగింది ..

శిరీష భయంగా చూసింది .. ఎవరై ఉంటారు?

ఆమె భుజం మీద అభయం ఇస్తున్నట్టు తట్టి నేను తీస్తాలే .. నువ్వు పడుకో అంటూ వివేక్ లేచి వెళ్లి తలుపు తీసాడు.

ఎదురుగా బాగా అలసిపోయిన మొహంతో, చెదిరిన క్రాఫుతో, నలిగిన బట్టల్తో ఆదిత్య..

వివేక్‌ని చూడగానే అప్రయత్నంగా మొహం చిట్లించి , తల వంచుకుని లోపలికి నడిచాడు ఆదిత్య .

అతని వాలకం చూస్తూంటే ఏదో అనుమానం, భయం కూడా వేసింది వివేక్‌కి ..

ఆదీ .. పిలిచాడు..

ఆదిత్య తలతిప్పి కూడా చూడకుండా లోపలికి వెళ్లబోతుంటే వివేక్ చటుక్కున అతని భుజం పట్టుకుని ఆపుతూ అడిగాడు..

ఎక్కడినుంచి వస్తున్నావు?

ఆదిత్య మాట్లాడలేదు..

శిరీష వివేక్ మాట విని బోర్లా పడుకున్నదల్లా చివ్వున వెల్లకిలా తిరిగి ఆదిత్య వైపు చూసింది .. తూలిపోతున్న శరీరం అదుపులో పెట్టుకుంటూ ఆదీ అంటూ లేచింది ..

వివేక్ అసహనంగా అడిగాడు.. వినిపించడంలేదా?

ఆదిత్య అసలు తనని కాదన్నట్టు నిలబడిపోయాడు.. శిరీషతూలుతూ నడుస్తూ ఆదీ, ఆదీ .. ఎక్కడికెళ్లావురా అంటూ  ఆదిత్య దగ్గరగా వచ్చింది.

ఎప్పుడు చూసినా నలగని బట్టల్తో, నీటుగా, అందంగా ఉండే శిరీషనాస్థితిలో చూస్తుంటే వివేక్ మనసు కరిగిపోయింది .. ఆమె అలా అవడానికి కారకుడైన ఆదిత్య చలనం లేనట్టుగా శిలలా నిలబడ్డం చూస్తుంటే ఒళ్లుమండిపోయింది ..

నిన్నే అడుగుతున్నాను.. ఎక్కడికెళ్లావు ఆదీ .. అడిగాడు వివేక్..

ఆదిత్య  ఒక్కసారి తలెత్తి వాళ్లిద్దరినీ చూసి తలతిప్పుకుంటూ ఊరికెళ్లాను అన్నాడు.

ఊరా? షాకింగ్‌గా ఒకళ్లనొకళ్లు చూసుకున్నారు శిరీష, వివేక్

ఏ ఊరు? విస్మయంగా అడిగింది శిరీష

మీకనవసరం .. విసురుగా జవాబిచ్చాడు ఆదిత్య ..

శిరీష స్థంభించిపోయింది .. ఆదిత్య తనని ఛెళ్లున చెంపమీద కొట్టినట్టు అనిపించింది ..

ఏమన్నావు? దగ్గరగా వచ్చి సూటిగా ఆదిత్య కళ్లల్లోకి చూస్తూ అడిగింది.

చూపులు తిప్పేసుకుని అన్నాడు.. కరెక్టే అన్నాను.. ఆయనెవరు నన్నడగడానికి.

ఆదీ .. ఉద్రేకంతో వణికిపోతూ శిరీష చేయి ఎత్తబోయింది .. వివేక్ ఒక్క అంగలో వచ్చి ఆమె చేయి గట్టిగా పట్టుకున్నాడు..

నువ్వెళ్లు నేను మాట్లాడతాను..  బలవంతంగా శిరీషను గదిలోకి పంపించబోతుంటే శిరీష ఆవేశంతో వణికిపోతూ వివేక్ చేతుల్నించి విడిపించుకుని ఆదిత్య వైపు నడిచింది .. విసురుగా ఆదిత్య చొక్కా కాలర్ పట్టుకుని లాగి చెంపమీద చెళ్లు, చెళ్లున కొట్టసాగింది ..

శిరీ .. ఏంటా ఆవేశం? వివేక్ బలవంతంగా శిరీషను లాగి గదిలోకి నెట్టి తలుపేశాడు.. లోపల్నించి శిరీష ఏడుస్తూ గట్టిగా తలుపుకొట్టసాగింది ..

వివేక్  ఆదిత్య దగ్గరగా వచ్చి అతని భుజం మీద చేయేశాడు..

నువ్వు చాలా పెద్ద తప్పు చేశావు .. నీకు తెలుసా .. అడిగాడు నిదానంగా .

తప్పు చేయడానికి నేను నువ్వు కాదు... విసురుగా అన్నాడు ఆదిత్య ..

వాట్ డూ యూ మీన్? విస్మయంగా అడిగాడు వివేక్ ..

యస్ .. యూ ఆర్ ఏ క్రిమినల్ .. నన్నూ, మా అమ్మనీ విడదీయడానికి వచ్చిన రాక్షసుడివి .. ఐ హేట్ యూ .. అరిచాడు ఆదిత్య ..

వివేక్ కి కాస్సేపు ఏమీ అర్థం కాలేదు.. ఆదిత్య ఏం మాట్లాడుతున్నాడో, ఏం జరుగుతోందో అర్థం కానట్టు బిత్తరచూపులు చూస్తూ నిలబడిపోయాడు..

సిగ్గులేదూ.. మా అమ్మతో ఇల్లీగల్ కాంటాక్ట్స్ పెట్టుకోడానికి .. నీతిలేని నువ్వు నన్ను తప్పు చేస్తున్నానని బ్లేమ్ చేస్తావా? నీకసలు ఆ అర్హత లేదు.. ఆయాసపడిపోతూ అరుస్తున్న ఆదిత్యను ఎలా అదుపుచేయాలో అర్థం కాలేదు వివేక్‌కి .. నెమ్మదిగా ఆ అబ్బాయి తనని ఎందుకు ద్వేషిస్తున్నాడో తెలుసుకోడానికి ప్రయత్నించసాగాడు.. అర్థమవుతున్నకొద్దీ సిగ్గుతో, అవమానంతో నిలువెల్లా దహించుకుపోతున్నట్టు అనిపించింది .. అప్రయత్నంగా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆదిత్య భుజమ్మీద ఉన్న అతని చేయి జారిపోయింది . కలలో నడుస్తున్నట్టుగా నెమ్మదిగా కదిలిబైటకి వెళ్లిపోయాడు..

అతను వెళ్లిన వైపు కసిగా చూసి విసురుగా తన గదిలోకి వెళ్లిపోయాడు ఆదిత్య

శిరీష తలుపు బాదుతూనే ఉంది ..

ప్రఖ్య సూట్‌కేసులు సర్దేసుకుని, తయారై సోఫాలో కూర్చుని టి వి చూస్తోంది .. లోపల భాను చీరకట్టుకుంటోంది.

ప్రఖ్య బెంగుళూరు వెళ్లిపోతోంది .. చదువు కంటిన్యూ చేసి, ఇంక అక్కడే సెటిల్ అవడానికి భాను నిర్ణయించేసింది .. త్వరలోనే తను కూడా బెంగుళూరు వెళ్లే ప్రయత్నాలు కూడా మొదలుపెట్టింది . ప్రఖ్యకి భవిష్యత్తు తల్చుకుంటే బెంగుళూరు వెళ్లాలనే ఉంది .. కానీ, ఒక వారం క్రితం తన గర్భం నుండి బైటపడిన ఓ చిన్ని ప్రాణి రూపం ఆమె కళ్లల్లో మెదలుతోంది .. జీవితంలో మొదటిసారిగా తన శరీరంలో కలుగుతున్న అనేకరకాల స్పందనలు, చిత్రమైన ప్రకంపనలు, మార్పులు ప్రఖ్యకి అటు కొన్ని మధురమైన ఆలోచనలను, కొన్ని భయాలను కూడా కలగచేస్తున్నాయి . ఆమెకి ఆదిత్యతో సమాగమానికి ముందు కలిగిన తీయని అనుభూతులన్నీ గుర్తొస్తున్నాయి .. ఆ అనుభవఫలితం తన గర్భం అనీ, ఆ గర్భంలోనుంచి బైటికి వచ్చిన ఓ చిన్ని ప్రాణి తనకు కూతురు అవుతుందని, తాను కూడా ఒకప్పుడు అమ్మ గర్భంనుంచి అలాగే అదే విధంగా జనించిందని కొత్త విషయాలు ఎన్నడూ ఆలోచించలేని విషయాలు ఇప్పుడు ప్రతిక్షణం మనసులో మెదులుతూ అశాంతికి గురిచేస్తున్నాయి ..

పాపని ఒక్కసారి చూడాలనిపిస్తోంది ..

తను వెళ్తున్నట్టు ఆదిత్యకి చెప్పాలని అనిపిస్తోంది ..

కానీ, అపరకాళిలా మండిపడుతూన్న భానుని చూస్తుంటే తన కోరికల్లో ఏ ఒక్కటి కూడా వ్యక్తపరచలేకపోతోంది .. ఏదో ఒంకతో పోనీ ఒక్కసారి వెళ్ళి ఆదిత్యను చూసి వద్దామన్నా ఇంట్లోంచి బైటకి వెళ్ళనివ్వడం లేదు..

పాపని కిడ్నాప్ చేసినవాడు ప్రఖ్యని కూడా ఎక్కడ కిడ్నాప్ చేస్తాడో అని భయపడుతోంది భాను..

పాప కిడ్నాప్ గురించి డాక్టర్ పోలీస్‌లకి ఫిర్యాదు చేసింది .. హాస్పిటల్ నుంచి ఒక పాపని ఎవరో అపహరించుకుపోయారన్న విషయం మాత్రమే చెప్పింది .. కానీ, ఎవరిపాప, ఏంటి అన్న సంగతి చెప్పలేదు..

ఆవిడ తన పరపతి ఉపయోగించి, అపహరించబడిన పాప గురించి ఫిర్యాదు మాత్రం చేసింది .. కానీ, వెతికించే ప్రయత్నాలు చేయలేదు.. పోలీసులు కూడా లాంఛనంగా కేసు రిజిస్టర్ చేసుకున్నారు కానీ, వాళ్ల రికార్డుల్లో ఏ మాత్రం కదలిక ఉండని అనేక కేసుల్లో ఇదీ ఒకటిగా ఉండిపోయింది .. . డాక్టర్ ప్రవీణకి ఆదిత్యే పాపని తీసుకుని వెళ్లాడని నమ్మకంగా అనిపించింది కాబట్టే ఆవిడ కూడా ఆ విషయం సీరియస్‌గా తీసుకోలేదు.. తప్పకుండా ఆదిత్య వెనక్కి వస్తాడని తనని కలుస్తాడని గాఢంగా విశ్వసిస్తోంది.

అలాగే పాపని కిడ్నాప్ చేసింది ఆదిత్య అన్న విషయం భాను ప్రియకి కూడా ఖచ్చితంగా తెలిసింది. ఇప్పుడు ఆమెకి ఆదిత్య ఏ క్షణంలోనైనా వచ్చి బ్లాక్‌మెయిలింగ్‌కి దిగుతాడని భయం పట్టుకుంది .. అసలు మూడోరోజే ప్రఖ్యని పంపాలనుకుంది కానీ, ఆ పరిస్థితుల్లో ఏమీ తెలియని ఆ పిల్లనలా వేరే ఊరికి పంపించడం ప్రమాదం అని ఆగింది .. కానీ ఏ క్షణానికా క్షణం భయం, భయంగా గడుపుతోంది. ఆఫీసుకి లీవు పెట్టేసి ప్రఖ్యతోటే ఉంటోంది .. ఇవాళ ప్రఖ్యని తీసుకుని వెళ్లి బెంగుళూరులో దింపివస్తే కానీ, ఆవిడ ఆందోళన తగ్గదు.. పాపని పిల్లలు లేని వాళ్లెవరో పెంపకానికి తీసుకున్నారని మాత్రం ప్రఖ్యకి చెప్పింది .. మిగతా విషయాలేమీ ఆ పిల్లకి తెలియకుండా జాగ్రత్త పడింది ..

కాకపోతే ప్రఖ్య మాత్రం తను మళ్లీ బెంగుళూరు వెళ్లాలా? వద్దా? అనే మీమాంసలో పడింది .. వెడితే ఇంక జీవితంలో ఆదిత్యని కలిసే అవకాశం రాదు.. ఇంతకు ముందు ఆదిత్యతో అనేక అనుభూతులు పంచుకున్నప్పుడు కేవలం వయసు పెట్టే గిలిగింతల ఒత్తిడి తప్ప ప్రత్యేకంగా ఆదిత్య పట్ల ప్రేమా, అనురాగం లాంటివి కలగలేదు.. కానీ ఇప్పుడు ఎందుకో ఆదిత్యకి దూరంగా వెళ్లాలనిపించడంలేదు..

పాపని కూడా ఎక్కడో వదిలి వెళ్లాలంటే తనకి తనే ఒక శాడిస్టులా అనిపిస్తోంది .. చాలాసార్లు పేపర్లలో చదివింది, టివిలో న్యూస్‌లో చూసింది .. మురుగు కాలవల్లో , చెత్తకుండీల్లో , హాస్పిటల్ ఆవరణలో పసిపిల్లలను వదిలి వెళ్లిన తల్లుల గురించిన వార్తలు .. ఆరోజు అవి చదవలేకా, వినలేకా చెవులు, కళ్లు మూసుకుని ఆ తల్లులని తిట్టుకుంది .. కానీ ఇప్పుడు తనే చేస్తోందా తప్పు .. తను పాపం చేస్తోంది .. ఒక్కసారి ఆదిత్యతో మాట్లాడి, పాపనెవరో తీసికెళ్లారు, ఎక్కడికి తీసికెళ్లారో, ఎవరు తీసికెళ్లారో తెలుసుకుని పాపని తీసుకురమ్మని చెప్పాలని ఉంది. కానీ ఎలా? ఎలా కలవాలి?

ఏమిటే ఆలోచిస్తున్నావు? బస్సు టైమ్ అయింది పద .. లక్డీకాపూల్ దాకా వెళ్లాలి .. ట్రాఫిక్ తెలుసుగా ఎలా ఉంటుందో తయారై చేతిలో ఎయిర్ బ్యాగ్‌తో హాల్లోకి వచ్చింది భానుప్రియ ..

ప్రఖ్య నెమ్మదిగా లేచి, టి వి ఆఫ్ చేసింది ..

అప్పుడే కాలింగ్ బెల్ మోగింది ..

భానుప్రియ విసుగ్గా మొహం చిట్లించింది .. ఎవరో ఈ టైమ్‌లో .. విసుక్కుంటూ వెళ్లి తలుపు తీసింది .

తలుపు తీయగానే ఎదురుగా నిలబడిన వ్యక్తిని చూసి స్థంభించిపోయింది .

ఆదిత్య ..

ఎక్స్‌క్యూజ్‌మీ .. ఆదిత్య స్టైలిష్‌గా అంటూ ఆవిడని తప్పుకుని లోపలికి వచ్చేశాడు.

ఆదిత్య స్వరం వినగానే ప్రఖ్య లో చలనం వచ్చినట్టు అయింది .. మొహం విప్పారింది .. ఆదీ అంటూ రెండు అడుగులు ముందుకేసిందల్లా భానుప్రియ హుంకరింపుతో ఆగిపోయింది ..

అరేయ్ .. ఎక్కడికిరా, బైటకి నడుపు .. గెట్ అవుట్ .. .. భానుప్రియ విసురుగా వచ్చి ఆదిత్య జబ్బపట్టుకుని డోర్ దాకా తోసుకుంటూ వచ్చింది ..

ఆదిత్య విసురుగా ఆవిడని విడిపించుకుని ఒక ఉదుటున ప్రఖ్య దగ్గరగా వచ్చి ఎక్కడికి వెళ్తున్నావు ప్రఖ్యా .. అడిగాడు సోఫా దగ్గరగా పెట్టిన సూట్‌కేసు, బాగు చూస్తూ..

ప్రఖ్య బెదురుగా తల్లివైపు చూసి మొహం తిప్పుకుంది .. భయంతో ఆమె గుండె దడ,దడలాడుతోంది .. అయినా ఆదిత్యను చూసిన ఆనందంతో మాత్రం కళ్లు మెరిసిపోతున్నాయి ..

అది గమనించిన భానుప్రియ మండిపడుతూ అరిచింది .. ఎవర్రా నువ్వు? మర్యాదగా బైటకి వెడతావా? పోలీసులను పిలవనా?

ఆదిత్య నిదానంగా ఆవిడవైపు తిరిగి అన్నాడు .. పిలవండి .. తప్పకుండా పిలవాలి .. నా భార్యని మీరు నా నుంచి విడదీస్తున్నారని నేనే కంప్లైంట్ చేయాలనుకుంటున్నాను.. నేను స్టేషన్‌కి వెళ్లేబదులు వాళ్లే ఇక్కడికి వస్తే ఇంకా బాగుంటుందికదా .. పిలవండి ..

నిశ్చేష్టురాలైంది భానుప్రియ .. ఎంత ధైర్యం వీడికి? నిన్నకాక మొన్న తన కళ్లముందు ఎదిగి తనతోటే సవాల్ విసురుతాడా? భార్య అంటాడా తన కూతుర్ని .. నిప్పులు కురిపిస్తూ అంది ..

యూ బాస్టర్డ్ ... ఏంట్రా కూస్తున్నావు? చెప్పు తీసుకొంటా .. వెళ్లు ముందు విసురుగా వచ్చి ఆదిత్య షర్టు పట్టుకుని లాగింది ..

ఆదిత్య అంతకన్నా విసురుగా ఆవిడ చేయి విసిరికొట్టి అన్నాడు.. మర్యాదగా ప్రవర్తించండి .. ఇంటి అల్లుడిని ఇలా అవమానిస్తారా?

ఏవడురా అల్లుడు? నీ బతుక్కి నా అల్లుడివయే అర్హత కూడా ఉందా? ఎక్కువగా మాట్లాడావంటే పళ్లు రాలగొడతాను..

నాకూ వచ్చండి .. మీరేం చేయగలరో  అవన్నీ నేనూ చేయగలను.. కానీ, చేయను .. ఎందుకంటే మీతో నాకనవసరం .. నాక్కావాల్సింది నా భార్య .. అంటూ ప్రఖ్య దగ్గరగా నడుస్తూ .. సీరియస్‌గా అడిగాడు.. ప్రఖ్యా .. నువ్వు నాతో వస్తున్నావా?

ప్రఖ్య వణికిపోతూ నిలబడింది ..

ఏందుకలా వణికిపోతున్నావు... ప్రఖ్యా  మనం పెళ్లి చేసుకోకపోయినా మనకో పాప ఉంది .. అది మన ప్రేమగుర్తు .. పాప నా దగ్గర ఉంది .. ఒక తల్లిగా పాపని ఒదులుకుని వెళ్లిపోడం రాక్షసం .. మీ అమ్మకెలాగా మొగుడూ, ఓ కుటుంబమూ లేదు... ఒద్దు కూడా .. నీక్కూడా ఫ్యామిలీ అనేది కావాలా , ఒద్దా?

ఫ్యామిలీ  .. ప్రఖ్య కి ఒక్కసారిగా ఒళ్లు గగుర్పొడిచినట్టు అయింది .. అందులోనూ ఆదిత్య పదే, పదే తనని భార్య అంటూ సంబోధించడం ఆమెకి వింటుంటే మధురంగా అనిపిస్తోంది .. తనకో పాప ఉంది .. అవునూ పాప .. పాప .. ఆది దగ్గర .. ఎలా? ఎలా? ఆ విషయం స్ఫురణకి రావడంతో అయోమయంగా ఆదిత్యవైపు, తల్లివైపు చూసింది ..

భానుప్రియ కళ్లు నిప్పులు చెరుగుతున్నాయి .. మొహం ఎర్రగా జేవురించి ఉంది .. పగబట్టిన పులిలా గర్జిస్తోంది .. ఆవిడ చూపులు ఆదిత్యవైపు తిరిగి తీక్షణంగా అతడినే చూస్తున్నాయి .. ఏ క్షణాన అయినా మీదపడి కరిచేలాగా ఉంది.

రాస్కెల్ .. పాపని కిడ్నాప్ చేసి నన్ను, నా కూతుర్ని బ్లాక్‌మెయిల్ చేయాలనుకుంటున్నావా? నీ ఆటలు నా దగ్గర సాగవు .. నాకు తెలుసు నువ్వే కిడ్నాప్ చేశావని .. నిన్నసలు ఇలా వదలకూడదు.. మర్యాదగా ఆ పాపని తెచ్చివ్వు .. గట్టిగా అరిచింది ..

ఏం చేసుకుంటారండి పాపని? మీకు పిల్లల్ని పెంచే టైం ఉందా? మీ కూతుర్ని పెంచనిస్తారా? తీసికెళ్లి ఎవరికో ఇస్తారు .. అమ్ముకుంటారు ..

నోర్ముయ్ ఏంట్రా వాగుతున్నావు? చేయెత్తింది భానుప్రియ..

కరెక్ట్‌గా మాట్లాడుతున్నాను.. మీకు పిల్లలు, మొగుడు ఫ్యామిలీ లైఫ్ ఏమీ ఒద్దు .. స్వేచ్ఛ కావాలి .. మా అమ్మకీ అంతే .. స్వేచ్ఛ కావాలి .. మీ ఇద్దరూ హాయిగా స్వేచ్ఛగా బతకండి .. నేనూ, నా భార్యా  మా పాపా ఆనందంగా బతుకుతాం .. మీతో మాకెలాంటి సంబంధం ఒద్దు ..

ప్రఖ్య నివ్వెరపోయి చూస్తోంది .. నిలువెల్లా వణికిపోతోంది .. ఎప్పుడూ ధైర్యంగా ఉండే ప్రఖ్య ఆ క్షణంలో తప్పుచేసిన ఆత్మన్యూనతతో తల్లికి ఎదురుచెప్పలేకపోతోంది .. అలా అని ఆదిత్యను తల్లిలాలా అసహ్యించుకోడంకానీ, అతని మీద కోపం తెచ్చుకోడం కానీ చేయలేకపోతోంది .. ఆదిత్య మాటలు ఆమెకి సబబుగా అనిపిస్తున్నాయి .. కానీ, వాటిని అంగీకరించే ఆత్మస్థైర్యం మాత్రం ఆమెకి కలగడంలేదు..

ఇప్పుడు తను ఆదిత్యతో వెళ్లి ఎక్కడ, ఎలా బతకాలి? పాపని తనెలా పెంచగలదు.. తనకేం చేతకాదు.. పాపని ఎత్తుకోడం కూడా రాదు .. అలాంటప్పుడు ఆదిత్య అన్నట్టు ఒక ఫ్యామిలీ ఏర్పాటు చేసుకునే శక్తి ఎట్లా వస్తుంది .. ఆమెకేం అర్థం కావడంలేదు..

ఆదిత్య మళ్లీ అన్నాడు.," ప్రఖ్యా .. నీకు తెలుసు .. మనిద్దరం ఒంటరితనంతో ఎంత బాధపడ్డామో .. మన పాపని అలా చేయద్దు .. నామాట విని నాతో వచ్చెయ్ .. ఇద్దరం కలిసి చదువుకుందాం .. మన ఫ్యూచర్ డిజైన్ చేసుకుందాం .. మీ అమ్మని, మా అమ్మని వదిలేద్దాం .. మన జీవితాలు మనం ఏర్పరచుకుందాం .. మన పాపని పెంచుకుందాం .. ఇంకా పిల్లల్ని కందాం .. ప్లీజ్ ప్రఖ్యా నా మాట విను .. నాతో రా .. "అతని స్వరంలో ప్రాధేయత, నడకలో వేగం పెరిగి చటుక్కున ప్రఖ్య దగ్గరకు నడిచి ఆమె చేయి పట్టుకున్నాడు..

మెరుపులా వచ్చిన భానుప్రియ ఆదిత్య చెంపమీద ఛెళ్లున చరిచి ప్రఖ్యని అతని చేతుల్నించి విడిపించి " పోరా, పో దరిద్రుడా .. పోతావా? మెడపట్టి గెంటనా? "అంది ..

అనుకోని ఆ సంఘటనకి నివ్వెరపోయిన ఆదిత్య కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి ..

చెంప మీద కుడిచేత్తో రుద్దుకుంటూ ఆవేశంగా అన్నాడు.. "మిస్ భానుప్రియగారూ .. మీరు మీ అమ్మాయిని పెళ్లికాకుండా కన్నారో, మొగుడ్ని వదిలేసి తిరుగుతున్నారో కానీ, ఆ అమ్మాయికి ఎలాగా తండ్రి ప్రేమ లేకుండా పెంచారు .. మీకసలు సెంటిమెంట్స్, అనుబ ంధాలు లేవు .. కనీసం మీ కూతురన్నన్నా సరిగా పెంచండి .. నాతో కలిసి పాపని కన్న ఈమెకి పెళ్లి అవుతుందనే ఆశిస్తున్నారా? జరగదు.. ఎన్నటికీ జరగదు.. ఈ మె భర్తను ఏనాటికైనా నేనే .. ఈ అవమానం గుర్తుంచుకుంటాను.. ఇంతకింత పగ తీర్చుకుంటాను..," అంటూ ప్రఖ్యవైపు తిరిగి అన్నాడు..

"ప్రఖ్యా ఇండివిడ్యువాలిటీ గురించి, స్వేచ్ఛ గురించి కబుర్లు చెప్పడం కాదు.. పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో తెలుసుకోడం చాలా అవసరం .. మీ అమ్మ మాటలు వింటే నీ బ తుకు నాశనమే .. నా మాట విను.. నేను నీ కోసం ఎదురుచూస్తుంటాను.. నువ్వు రా .. మీ అమ్మని ఎదిరించి వస్తావో బతిమాలి వస్తావో నీ షఇష్టం .. బట్ ఒక్కటి చెప్తున్నాను.. ఒంటరి బతుకు బతికేకన్నా చావడం బెటర్ .. ఒంటరి బతుకు బతుకే కాదు.. పదిమందిలో బతికితేనే బతుక్కి అర్థం ఉంటుంది .. మనం చనిపోయిన తరవాత కాసిని కన్నీళ్లు కార్చడానికి ఎవరన్నా ఉంటారు .. "ఈ మాటలనేసి గిరుక్కున వెనక్కి తిరిగి డోర్ తీసుకుని వెళ్లిపోయాడు.. అతను ఆవేశంతో తిరిగి మూసిన డోర్ గట్టిగా శబ్దం చేస్తూ గోడకి కొట్టుకుని ఆగిపోయింది.

ప్రఖ్యకి దుఃఖం ముంచుకొచ్చింది .. సోఫాలో కూలబడిపోయి వెక్కి, వెక్కి ఏడవసాగింది ..

అప్పటివరకూ స్థాణువై నిలబడిన భానుప్రియ ప్రఖ్య వెక్కిళ్ల శబ్దం విని ఆమె వైపు చూసింది .. విసురుగా ఆమె దగ్గరకు నడిచి అరిచింది ..

ఎందుకే ఏడుస్తున్నావు? వాడేదో పిచ్చి కూతలు కూస్తే ఏడవడానికి సిగ్గులేదూ .. చూడూ నేనిప్పుడే చెబుతున్నా .. నా కూతురు డేర్ డెవిల్ అనిపించుకోవాలి .. చెత్త ప్రలోభాలకి, నీచ, నికృష్ట వాగుడుకీ చలించిపోయి ఏడుస్తూ కూర్చోడం అంటే నాకసహ్యం .. ఇంకెప్పుడూ ఏడవకు .. లే లేచి బయల్దేరు .. ఊ .. వెళ్లు మొహం కడుక్కురా ..

ప్రఖ్య ఆవిడ స్వరంలోని తీక్షణతకి బెదిరిపోతూ లేచి వాష్ బేసిన్ దగ్గరకు వెళ్లిపోయింది..

భానుప్రియకిప్పుడు కొద్దిగా భయం కలగసాగింది .. తను ఊహించింది నిజమే .. పాపని వీడే కిడ్‌నాప్ చేశాడు.. చేసి ఏం చేస్తాడు? బ్లాక్‌మెయిల్ చేస్తాడా? పోలీస్ కంప్లైంట్ ఇవ్వడం మంచిదా? కాదా? ఇస్తే తప్పకుండా దాని వెనక అనేక ప్రశ్నలు, సమస్యలు తప్పవు… ఈ గోలలో ప్రఖ్య చదువు దెబ్బతినడం ఖాయం .. అంతకన్నా వాడినుంచి ప్రఖ్యని దూరంగా పంపించేయడం మంచిది .. అలా అనుకున్నాక ఆమెకి కొంచెం శాంతిగా అనిపించింది ..

ప్రఖ్య మొహం కడుక్కుని వచ్చి, కిందపెట్టిన సూట్‌కేస్ చేతిలోకి తీసుకుంది.

కాలగర్భంలో ఏడాది గిర్రున తిరిగిపోయింది .

. ఈ ఏడాది నుంచీ ఆదిత్య శిరీషకి దూరంగా ఒక గది తీసుకుని ఉంటున్నాడు.. కాలేజీ అయిపోగానే రెండు గంటలసేపు ఒక నెట్ కేఫ్‌లో పనిచేస్తున్నాడు.. నెలకి ఐదారువేలు వస్తోంది ..

ఇంకో రెండు గంటలు టెన్త్ క్లాస్ పిల్లలకి నలుగురుకి ట్యూషన్ చెప్తున్నాడు.. శిరీష తన పేరున సేవింగ్స్ ఎకౌంట్‌లో వేసిన డబ్బులు కాలేజీ ఫీజులకి వాడుకుంటూ చేతిఖర్చుకింద తనే స్వయంగా సంపాదించుకుంటున్నాడు.. మధ్య, మధ్య నాలుగైదు సార్లు అమ్మమ్మ ఊరు వెళ్లి పాపని చూసి వచ్చాడు..

పాప ఎదుగుతున్న వివిధ దశలు చూస్తుంటే అతని ఒళ్లు పులకించిపోతోంది .. బి టెక్ ఐపోగానే ఉద్యోగం చూసుకుని పాపనీ, అమ్మమ్మనీ తెచ్చేసుకోవాలి అని ప్రతిరోజూ అనుకుంటాడు..

ఆదిత్యకి లలితాంబ రెండు లక్షలిచ్చింది .. ఆ డబ్బు పాప పేరున ఫిక్స్ చేశాడు ఆదిత్య . అతనికి అటు ప్రఖ్యతోగానీ, ఇటు శిరీషతోగానీ ఎలాంటి కమ్యూనికేషన్ పెట్టుకోలేదు..

ఆదిత్య చాలా మారాడు.. మనస్తత్వంలో చిన్నపిల్లాడి చంచలత్వం, ఆలోచనలేని ఆవేశం అన్నీ పోయాయి. అసలు, సిసలైన యువకుడులా తయారయాడు.. ఆలోచనల్లో విచక్షణ, పరిణతి వచ్చేశాయి .. అతని రూపంలో

కూడా బాలుడి పసితనం పోయి ఒళ్లొచ్చి మేన్‌లీగా తయారయాడు.. అతనికి ఒకే టార్గెట్ ఉంది .. బి టెక్ పూర్తిచేయాలి .. ఉద్యోగం చూసుకుని పాపని తెచ్చుకోవాలి .. ఇంకా ఏడాది ఆగితే ఇంజనీరింగ్ అయిపోతుంది .. ఒక్క ఏడాది .. ఆ తరవాత తనకో ఇల్లు, ఇంట్లో సందడిచేసే పాప, మంచి సలహాలిస్తూ, తను తప్పుచేయబోయినా సరిదిద్ది తనని మంచిమార్గంలో నడిపించే పెద్దావిడ అమ్మమ్మ .. బుద్ధి మారి, అమ్మకూచిలా కాక, యువతిగా మారిన ప్రఖ్య వస్తే ఒక భార్య ఎంత బాగుంటుంది ఇల్లు ..

అమ్మ .. ఆదిత్యకి శరీష గుర్తొచ్చింది .. కళ్లు చెమర్చాయి ..

ఆరోజు వివేక్ ఆవిడని గదిలో కి తోసి తనతో మాట్లాడాక తను సూటిగా వేసిన మాటల తూటాలతో గాయపడి వెళ్లిపోయాడు.. ఆ తరవాత తను స్నానం చేసి, తయారై వచ్చిందాకా అమ్మ తలుపు బాది, బాది, ఏడ్చి, ఏడ్చి సొమ్మసిల్లిపడిపోయింది .. ఆదిత్య తలుపు తీసి, ఆమెకి తాత్కాలిక ఉపచర్యలు చేసి, సూట్‌కేస్ తీసుకుని ఇంట్లోంచి వచ్చేశాడు.. ఆ తరవాత ఆవిడ ఎన్నిసార్లు రాకేష్‌తో కబురుచేసినా వెళ్లలేదు..

అమ్మ ఏం చేస్తోందో .. ఒక్క క్షణం ఆదిత్య మనసు విలవిల్లాడింది.

ఏం చేస్తుందిలే .. ఆ వివేక్‌తో హాయిగా ఎంజాయ్ చేస్తుంటుంది .. అంతలోకే నిర్లక్ష్యంగా అనుకున్నాడు..

కానీ, ఎందుకో అలా అనుకోబుద్ధికాలేదు.. పాపం ఎంత ఏడుస్తోందో అనిపించింది .. ఏది ఏమైనా తన చదువు పూర్తి అయి ఉద్యోగం సంపాదించుకునేదాకా వెళ్లేది లేదు... అప్పుడు అమ్మమ్మ, పాపతో కూడా వెళ్లి సగౌరవంగా తన దగ్గరకు తీసుకువస్తాడు..

అలా అనుకున్నాక ఆదిత్యకెంతో ఆనందంగా అనిపించింది ..

యస్ .. అలాగే చేయాలి .. అలా జరిగిన్నాడు తన జీవితానికో అర్థం ఉంటుంది .. ఏదో సాధించానన్న తృప్తి ఉంటుంది ...

ఆదిత్య ఆలోచిస్తూనే కమ్మటి నిద్రలోకి జారిపోయాడు..

బెంగుళూరులో ప్రఖ్య చదువు నిరాటంకంగా సాగిపోతోంది .. భానుప్రియ కూడా బెంగుళూరులో వేరే ఉద్యోగం చూసుకుని పూర్తిగా షిఫ్ట్ అయిపోయింది ..

ప్రఖ్య మనసులోంచి క్రమంగా ఆదిత్యరూపం కనుమరుగవడమేకాక, పాపని కూడా పూర్తిగా మర్చిపోయింది. తోటి విద్యార్థులతో పోటీగా సాగుతోన్న చదువు మీద ఆసక్తి బాగా పెరిగింది .. ఇప్పుడామెకి కూడా పెళ్లి, పిల్లలు, సంసారం అనే జంజాటంలో పడ్డ ఆడదానికి భవిష్యత్తు ఉండదన్న నమ్మకం గాఢంగా పడిపోయింది .

బి టెక్ అయిపోగానే స్టేట్స్ వెళ్లి ఎం ఎస్ చేయడానికి జి ఆర్ ఇ, టోఫెల్ లో చేరింది .. అమెరికన్ యాక్సెంట్‌లో ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడుతోంది .. తన ఆఫీసు వాళ్ల ద్వారా యునైటెడ్ స్టేట్స్‌లోని యూనివర్శిటీల వివరాలు తెప్పించింది భానుప్రియ ..

ఈ ప్రయత్నాలు, చదువు వీటితో పూర్తిగా బిజీగా అయిపోయిన ప్రఖ్యకి ఆదిత్య గురించి ఆలోచించే సవయం కూడా లేదు..

ఎప్పుడైనా గుర్తొచ్చినా ఆమె పెద్దగా బాధపడడం లేదు.. ఏదో టీనేజ్‌లో జరిగిన ఒక చిన్న ఇన్సిడెంట్‌గా, అది ప్రతి అమ్మాయి, అబ్బాయి జీవితంలో చాలా సహజంగా జరిగే పొరపాటుగా భావించి వెంటనే మర్చిపోడానికి బాగా అలవాటు పడింది.

బి టెక్ ఫైనల్ ఇయర్ పరీక్షలు మొదలైనాయి .. అయితే అంతకు ముందే ఇన్ఫోటెక్ వాళ్లు కండక్ట్ చేసిన కాంపస్ సెలక్షన్‌లో ఆదిత్య సెలక్ట్ అవడం , అతనికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ రావడం జరిగింది . ఆదిత్య ఆనందానికి హద్దుల్లేవు.. తన కల సాకారం కావడానికి ఎంతో దూరంలేదన్న నమ్మకం, ఆశతో అతను ఎప్పటికన్నా ఉత్సాహంగా మారిపోయాడు.. ఉద్యోగంలో చేరేముందే పరీక్షలు రాయడానికి కంపెనీ పర్మిషన్ తీసుకున్నాడు ఆదిత్య ..

అటు ప్రఖ్యా, ఇటు ఆదిత్యా కూడా సీరియస్‌గా చదువుతున్నారు .

భవిష్యత్తుపైన ఇద్దరికీ విడి, విడిగా కొన్ని స్థిరమైన అభిప్రాయాలు పడిపోయాయి ..

చిన్నప్పటినుంచీ ఆదిత్య పడిన ఒంటరితనపు బాధ, ఆవేదనలోంచి వెలువడిన కొన్ని భావాలు అతనికి కుటుంబ వ్యవస్థ మీద చెప్పలేనంత మమకారం కల్పించడానికి దోహదం చేశాయి .

తప్పో, ఒప్పో, మంచో, చెడో తనొక తప్పు చేశాడు.. దాని ఫలితంగా తనకో పాపాయినిచ్చాడు దేవుడు.. ఇప్పుడు ఆ పాప తనని డాడీ అని ముద్దు ముద్దు గా పిలుస్తోంటే అతనికి దూరమైన ఓ తీయని పిలుపు ఈ రోజు తన పాపాయికి దక్కించిన ఆనందంతో మురిసిపోతున్నాడు.. అమ్మమ్మ ఊరికి వెళ్లినప్పుడల్లా పాపాయి చేత పదే, పదే డాడీ అని పిలిపించుకుంటూ ఆ పిలుపులోని మాధుర్యాన్ని మనసారా ఆస్వాదిస్తున్నాడు .. తనకు దక్కని ఆ పిలుపులోని మహత్యాన్ని, ఆ నందాన్ని తల్చుకుని కళ్లు తడి అవుతుంటాయి .. కానీ, భగవంతుడు తన ఆక్రందన విని చిన్నవయసులోనే తనని తండ్రిని చేశాడేమో అనుకుంటుంటాడు.

ఒక్కోసారి తన పాపాయికి తండ్రినిచ్చి తల్లిని దూరం చేసినందుకు బాధగా కూడా అనిపిస్తుంటుంది. కానీ, ప్రఖ్య పాపాయికోసం తప్పకుండా తన దగ్గరకు వస్తుందన్న ఆశాభావం మాత్రం అతను కోల్పోడంలేదు.. తప్పకుండా బి టెక్ పరీక్షలైపోగానే వాళ్లమ్మని ఎదిరించి పాపకోసం వస్తుందని అతని ప్రగాఢ విశ్వాసం .. ప్రఖ్య కూడా ఆడదే కదా .. ఆడవాళ్లు ప్రపంచంలో ఏదైనా ఒదులుకుంటారు కానీ, పిల్లల్ని మాత్రం ఒదులుకోరు .. పాపాయి ఏమైందో అనే ఆలోచనతో అయినా ప్రఖ్య తప్పకుండా వస్తుంది ..

పరీక్షలైపోయాయి .. ఆదిత్య ఒక శనివారం వెళ్లి లలితాబంతో మాట్లాడాడు..

అమ్మమ్మా నిన్నూ, పాపనీ నాతో తీసికెళ్లి పోవాలనుకుంటున్నాను .. త్వరలో మంచి ఇల్లు చూసి తీసుకుని వెళ్తాను.. వస్తావా? అనడిగాడు..

ఆవిడ కళ్లు నీటితో నిండిపోయాయి ..

చివరిరోజుల్లో కొడుకుంటే కొడుకు దగ్గర, లేదా కూతురి దగ్గరా, ప్రశాంతంగా వెళ్లిపోవాల్సిన జీవితంలో సగభాగం ఒంటరిగా ఉన్న ఒక్క కూతురి జాడకోసం బాధపడుతూ గడిచిపోయింది .. ఇప్పుడు మనవడు తనని అతనితో రమ్మంటున్నాడు.. ఇది నిజమా? కలా? నిజమే అయినా తనిప్పుడు ఆ పట్నం వెళ్లి బతకగలదా? ఈ ఇల్లు ఏం చేయాలి? ఆవిడకేం అర్థం కాలేదు..

నెమ్మదిగా అంది .. ఈ వయసులో నేనక్కడికి వచ్చి సర్దుకుని ఉండలేనేమోరా తండ్రీ .. పాపని నా దగ్గరే ఉంచి ముందు నీ భార్యని తెచ్చుకో .. తరవాత పాపని తీసుకుని వెళుదువుగాని ..

ఆదిత్య నిరాశగా అన్నాడు.. నా భార్య .. ఆవిడ ఎక్కడుందో నాకు తెలియదు అమ్మమ్మా .. తనంతట తను వస్తే తప్ప నేనుగా వెళ్లి తెచ్చుకునే అవకాశం లేదు.. నీ కక్కడ చాలా బాగుండేలా చూసే పూచీ నాది .. అంతేకాదు.. నువ్వు వచ్చాక నేను అమ్మని కూడా తీసుకొచ్చేస్తాను.. అందరం కలిసి ఉండచ్చు ..

అమ్మనా? ఆవిడ నమ్మలేనంత ఆశగా చూసింది.

అమ్మ వస్తుందా? నేను అమ్మను చూస్తానా? నా శిరీషను చూస్తానా? చెప్పరా తండ్రీ నా కూతుర్ని నేను పోయేలోగా చూస్తానా? ఉద్వేగంగా అడిగింది .

తప్పకుండా చూస్తావు అమ్మమ్మా .. లేకపోతే నేను ఇంతకాలం నుంచీ పడిన ఈ బాధలన్నిటికీ నాకేం దక్కినట్టు .. అమ్మమ్మా! నువ్వు, అమ్మా, నేను, నా భార్యా, నా పిల్లలు అందరూ కలిసి ఉండాలన్నది నా కున్న ఓ తీయటి కల . నా చిన్నప్పుడు మా ఇంటి దగ్గర చుట్టుపక్కల వాళ్లంతా ఇంటినిండా జనంతో పండగలు చేసుకుంటుంటే ఒంటరిగా నిలబడి నేను పొందిన బాధ ఏంటో నాకు తెలుసు .. అమ్మ ఎప్పుడూ నన్ను ఎవరితో కలవనిచ్చేది కాదు… ఆవిడ గురించి అందరూ వివరాలడుగుతారని ఆవిడ భయం .. కానీ, అప్పుడు ఆ భయంలోంచి ఒక్క క్షణం నేనేం కోల్పోతున్నానో అమ్మ గుర్తించి ఉంటే ఇవాళ నాకిలాంటి పరిస్థితి వచ్చేది కాదు అమ్మమ్మా .. ఆదిత్య స్వరం గాద్గదికం అయింది ..

ఆవిడ చప్పున ఆదిత్యని దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకుంది ..

ఆవిడ పరిష్వంగంలో అనుభూతిని ఆస్వాదిస్తూ మౌనంగా రోదించసాగాడు ఆదిత్య ..

తప్పురా .. మగవాడివి ఏడవకూడదు .. తప్పు చేసి పారిపోయే వాళ్ల సంగతి తెలుసురా నాన్నా .. కానీ, నీలాగా ఆ తప్పుని ఒప్పుగా మార్చుకోడాని, చిన్న వయసులోనే ఇంతంత సాహసాలు చేసినవాళ్లగురించి నాకు తెలియదురా .. నీ ద్వారానే తెలిసింది .. మూడేళ్ల క్రితం అప్పుడే భూమ్మీద పడిని చిన్నారిని తీసుకుని నువ్వు రెండు వందల కిలోమీటర్ల దూరం ప్రయాణించి రావడం తల్చుకుంటే నాకిప్పటికీ ఒళ్లు గగుర్పొడుస్తుంది ..ఆ దేవుడు నిన్ను దయతలిచి పాప క్షేమంగా ఉండేలా చూశాడు కానీ, ఏదన్నా జరిగి ఉంటే నిన్ను నువ్వు క్షమించుకోగలిగేవాడివా?

ఆదిత్య చలించిపోతూ చూశాడు.. అవునమ్మమ్మా .. చాలా అడ్వెంచర్ చేశాను.. నా స్నేహితుడు బాబ్జీ ఎంత భయపడిపోయాడో .. కానీ, నాకెందుకో ఆ క్షణంలో భయమే వేయలేదు.. ఎంత సేపటికీ నా పాపని నేను దక్కించుకోవాలన్న ఆరాటం తప్ప మరో ఆలోచనే కలగలేదు.. సారీ అమ్మమ్మా ..

ఆవిడ నవ్వింది .. సారీ నాకెందుకురా .. అటు చూడు .. అంటూ అప్పుడే నిద్రలేచి నోట్లో వేలేసుకుని చిట్టి, చిట్టి అడుగులతో వస్తోన్న పాపాయిని చూపిస్తూ అంది ..దానికి చెప్పు ..

ఆదిత్య పాపని చూడగానే తన ఉద్వేగం, బాధా అంతా మర్చిపోయినవాడిలాగా చటుక్కున ఆవిడని వదిలి పాప దగ్గరకు వెళ్లి గబుక్కున ఎత్తుకున్నాడు.. డాడీ అంటూ పాప ఇదిత్య మెడని చుట్టేసుకుంది చిట్టి చేతుల్తో ..

తరచూ వచ్చి వెళ్లడం వలన ఆదిత్య బాగా అలవాటైపోయాడు..

లలితాంబ వాళ్లిద్దరినీ మురిపెంగా చూస్తూ పాపాయికి పాలు కలపడానికి వంటగదిలోకి వెళ్లిపోయింది ..

ఆదిత్య పాపతో ఆడుకుంటూ కబుర్లు చెబతూ సర్వం మరిచిపోయాడు..

ప్రఖ్యకి యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలోని మూడు యూనివర్శిటీల్లో ఎం ఎస్‌కి సీటొచ్చింది .. ఆమె కాలిఫోర్నియా యూనివర్శిటీ సెలక్ట్ చేసుకుంది ..

భానుప్రియకి ఆకాశాన్ని అందుకున్నంత సంతోషంగా ఉంది .. ఇంతకాలం తనకీ, తన కూతురికీ అండగా ఉండి, ఎంతో సాయం చేసిన స్నేహితురాలు మాధురికి కృతజ్ఞతలు తెలియచేసుకుంది ..

నువ్వే ఆరోజు మాకు షెల్టర్ ఇవ్వకపోయి ఉంటే ఈ పిచ్చిది ఏమయేదో సుజా .. ఆ వెధవ దీని అమాయకత్వాన్ని క్యాష్ చేసుకుని  ఈ  పాటికి నలుగురు పిల్లల తల్లిని చేసి, ముసలిదాన్ని చేసేవాడు.. నీ మేలు ఎప్పటికీ మర్చిపోలేను అంది మాధురితో..

ఆపదలో ఉన్న నా స్నేహితురాలికి ఆ మాత్రం సాయం చేయకపోతే స్నేహానికి అర్థం ఏంటి భానూ .. కాకపోతే ప్రఖ్య కూడా ఆ రిలేషన్ సీరియస్‌గా తీసుకోలేదు కాబట్టి సరిపోయింది కానీ, సీరియస్‌గా తీసుకుని ప్రేమ

అనీ, అతను లేకపోతే బతకలేనని ఫోర్స్ చేసి ఉంటే ఏమయేది? ఏది ఏమైనా యూ ఆర్ లక్కీ .. నీ ఆదర్శాలు అర్థం చేసుకుని తదనుగుణంగా మసలిన కూతురు దొరికింది ..అంది మాధురి ..

ఆరోజే ప్రఖ్య అమెరికా వెళ్లే రోజు ..

రెండు పెద్ద సూట్‌కేసులు సర్దుకుంది .. ఒక క్యాబిన్ బ్యాగు నిండా పుస్తకాలు, సర్టిఫికెట్స్ ఒక జత బట్టలు పెట్టుకుంది .. హ్యాండ్‌బాగ్‌లో డబ్బులు, పాస్‌పోర్ట్, ఇతర కాగితాలు, పెన్ను, మధ్యలో ఫ్రెష్ అవడానికి కావలసిన టూత్‌బ్రెష్, పేస్టు, పౌడర్, బొట్టు, దువ్వేన, సబ్బు, చిన్న న్యాప్‌కిన్ అన్నీ సర్దుకుంది ..

ఇప్పుడు ప్రఖ్య బాగా ఎదిగింది .. జీన్స్ ప్యాంట్ , లాంగ్ కుర్తీ వేసుకుంది .. నుదుట చిన్న నల్లటి స్టిక్కర్, కుడిచేతికి బ్రేస్‌లెట్ .. సింపుల్‌గా అందంగా , ఆధునికంగా ఉంది .. ఇంగ్లీష్ తప్ప మరో భాష మాట్లాడదు..

మాధురి భర్త శ్రీకర్ కారు సిద్ధం చేశాడు..

ప్రఖ్య మాధురికి హగ్ ఇచ్చి థాంక్యూ ఆంటీ .. ఐ లవ్ యూ అంది ..

మాధురి నవ్వుతూ .. ఆల్ ద బెస్ట్ అంది ..

భానుప్రియకి మొదటిసారిగా కళ్ల వెంట నీళ్లొచ్చాయి .. జాగ్రత్తగా ఉండు బేటా .. అంది ప్రఖ్యని దగ్గరకు తీసుకుని ..

ప్రఖ్య అభయం ఇస్తున్నట్టుగా అంది . డోంట్ వర్రీ మమ్మీ .. ఇంక నా గురించి ఆలోచించకు .. యు జస్ట్ టేక్ కేర్ ఆఫ్ యువర్‌సెల్ఫ్ .. బైదిబై .. మిస్టర్ ఉత్తేజ్‌ని అడిగానని చెప్పు .. అంది ..

ఉత్తేజ్‌ని ఏనాడూ ప్రఖ్య అంకుల్ అని కానీ, మరో వరసతో కాని పిలవలేదు.. అతనితో చాలా తక్కువసార్లు మాట్లాడింది .. అతను ప్రఖ్య దృష్టిలో భానుప్రియ బాయ్‌ఫ్రెండ్ .. అందుకే పేరు పెట్టి సంబోధిస్తుంది .. వయసుకి మించిన మానసిక పరిణతి వలన తల్లి బాయ్‌ఫ్రెండ్ గురించి ఎటువంటి కామెంట్స్ చేయదు.. పైగా భానుప్రియ కూడా ప్రఖ్యని కొన్ని విషయాల్లో చాలా ఆధునిక బావాలతో పెంచింది .. అందుకే ఉత్తేజ్‌తో ప్రఖ్య ఎలా ఉంటుందో అనే విషయం భానుప్రియ కూడా పెద్దగా ఆలోచించలేదు.. అతనితో ప్రఖ్య అనుబంధం బాగుండాలని అతనిని తండ్రి స్థానంలో ప్రఖ్య గౌరవించాలని వగైరా ఆలోచనలు ఆమెకేం లేవు .. అతనితో తనకున్న అనుబంధాన్ని చాలా కాజువల్‌గా తీసుకుంటుంది.. వాళ్లిద్దరి మధ్యా ఎంతో కాలంగా రహస్యంగా సాగుతూ వస్తోన్న వాళ్ల బంధానికి త్వరలో చెక్ పెట్టేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి .. ఉత్తేజ్ భార్యకు విడాకులిచ్చేశాడు.. ఆ కాగితాలు రాగానే ఇద్దరూ పెళ్లిచేసుకుని లీగల్ అయిపోదామనుకుంటున్నారు .. ఈ విషయం ప్రఖ్యకి తెలిసినా పట్టించుకోలేదు.. ప్రాధాన్యత అసలే ఇవ్వలేదు..

ప్రఖ్యా, భానుప్రియా అవడానికి తల్లీ , కూతుళ్లే అయినా ఫ్రెండ్స్‌లాగా ఉంటారు .. తల్లిగా తన కూతురికి మంచి భవిష్యత్తునిచ్చి తన జీవితం తన ఇష్టం వచ్చినట్టు మార్చుకోవాలని ఎదురుచూస్తున్న భానుప్రియకి

ఇప్పుడు ఆ అవకాశం వచ్చింది .. ప్రఖ్య అమెరికా వెళ్లిపోతోంది .. మళ్లీ ఎప్పుడు వస్తుందో, ఇంక పెళ్లి .. ఆ విషయం ప్రఖ్యకే వదిలేసింది .. తనకిష్టం అయినవాడు, అన్ని విధాలా తనకు అనుకూలమైనవాడు తటస్థపడితే తనే పెళ్లి చేసుకునే స్వేచ్ఛ ప్రఖ్యకిచ్చేసింది .. ఇదివరకులా తొందరపడి తప్పు చేసే దశ నుంచి ప్రఖ్య ఎదిగింది .. తనని కాపలా కాయాల్సిన అవసరం లేదిప్పుడు .

భానుప్రియ హాయిగా ఊపిరి పీల్చుకుంది ..

ఎయిర్‌పోర్ట్‌కి మాధురి , ఆమె భర్త, భానుప్రియా వెళ్లారు ..

ప్రఖ్య లగేజీ చెక్ ఇన్ అయిపోగానే చివరిసారిగా వీడ్కోలు చెప్పి అందరూ వెనక్కి తిరిగారు .

ప్రఖ్య హ్యాండ్‌బ్యాగ్, క్యాబిన్‌బ్యాగ్ తీసుకుని సెక్యూరిటీ చెకింగ్ వైపు వెళ్లిపోయింది ..

శిరీష ఆఫీసునుంచి నీరసంగా వచ్చి తలుపు తీసుకుని లోపలికి వెళ్లి సోఫాలో వాలిపోయింది ..

ఈ మధ్య ఆమె ఆరోగ్యం బాగా దెబ్బతింది .. మనిషి బాగా చిక్కిపోయింది .. జుట్టంతా ఊడిపోయి పల్చగా అవడంతో జడగానీ, ముడిగానీ వేసుకోడం మానేసి, అలాగే వదిలేస్తోంది .. ఇదివరకు పెళ,పెళ్లాడే కాటన్ చీరలు కడుతుండేది .. ఇప్పుడు ఏది పడితే అదే .. ఆ చీర నలిగిపోయినా, వెలిసిపోయినా పట్టించుకోడం లేదు..

ఆదిత్య ప్రవర్తనకి, భానుప్రియ చేసిన అవమానానికి మానసికంగా బాగా దెబ్బతింది శిరీష .

ఎంత ప్రేమగా, ఎంత జాగ్రత్తగా చూసుకున్నా వివేక్ కూడా పూర్తిగా ఆమె దగ్గర ఉండలేకపోతున్నాడు.. చాలా రోజులుగా అతనికీ, అతని భార్యకీ మధ్య యుద్ధం మొదలైంది .. మావగారు, బావమరిది  కూడా పరోక్షంగా హెచ్చరించారు అతడిని .. అందుకే వివేక్ శిరీషతో ఇదివరకులా ఎక్కువ సమయం గడపలేకపోతున్నాడు.. ఎదిగిన పిల్లలిద్దరున్న ఇంట్లో అనవసరంగా ఇంకో స్త్రీ విషయంలో భార్యతో గొడవపడడం అతనికి ఇష్టం ఉండడంలేదు.. పైగా ఆమెకి పుట్టింటి బలగం ఎక్కువగా ఉండడంతో వాళ్ల ఇన్‌వాల్వ్‌మెంట్ కూడా కొంచెం ఎక్కువగానే ఉంటుంది .. నలభై ఏళ్లు దాటిపోతోంటే ఇంకా వాళ్లందరి చేతా నీతులు చెప్పించుకోడం వివేక్ అహాన్ని దెబ్బతీస్తోంది .. అలా అని శిరీష మీద ప్రేమనీ, తామిద్దరి మధ్యా ఉన్న అనుబంధాన్నీ వదులుకోలేకపోతున్నాడు.. కాకపోతే ఇదివరకులా రాత్రిళ్లు ఉండిపోడం, ఎక్కువ సమయం ఆమెకి కేటాయించడం తగ్గిపోయింది ..

అది కూడా శిరీషను మానసికంగా కృంగదీసింది .. ఇంతేనా ఈ బంధం అనిపిస్తోంది .. ఏనాటికైనా తను పరాయిదే .. వివేక్‌కి తను ఏమీ కాదు.. ఏమీ కానప్పుడు ఇంతకాలం పంచుకున్న మధురానుభూతులకి అర్థం ఏంటి?  ఇంతకాలం సాగించిన సహజీవనం విలువ ఏంటి? వివేక్ వైవాహిక జీవితానికి అంత వెయిట్ ఇచ్చేటప్పుడు తనతో ఎలా సహజీవనం సాగించాడు? ఈ ప్రశ్నలన్నిటికీ ఆమెకి సమాధానం మృగతృష్ణ అయింది ..

దాంతో ఆమె నిర్వికారంగా మారిపోయింది ..

ఆదిత్య రెండు, మూడుసార్లు కలిశాడని వివేక్ చెప్పాడు.. కానీ తనని చూడలేదని కూడా చెప్పాడు.. ఆదిత్య ఎక్కడ ఉంటున్నాడో అతని స్నేహితులను అడిగినా ఆవిడకి సరైన సమాధానం లభించలేదు.. ఈ మధ్యే ఆదిత్యకి ఇన్ఫోటెక్‌లో ఉద్యోగం వచ్చిందని తెలిసింది .. అందుకు సంతోషించాలో, బాధపడాలో ఆమెకి అర్థం కావడంలేదు.. పాపనేం చేసాడో, ఎక్కడ ఉంటున్నాడో, ఏం తింటున్నాడో అనే ఆలోచనలతో ఆమె మాతృహృదయం తల్లడిల్లిపోతోంది. కానీ, ఆమెని ఊరడించి, సాయం చేసి తల్లినీ, కొడుకునీ కలిపే సాహసం మాత్రం ఎవరూ చేయడానికి సిద్ధంగా లేరు .. ఆరోజు ఆదిత్య చేసిన అవమానంతో వివేక్ కూడా అతని ప్రస్తావన రాకుండా జాగ్రత్త పడుతున్నాడు..

భానుప్రియ బెంగుళూరు వెళ్లిపోడం, ఆదిత్య తననుంచి దూరంగా పోడం ఇదంతా కేవలం తనకి ఆ భగవంతుడిచ్చి న శాపంలా భావిస్తోంది శిరీష ..

ఆమెకి ఈ మధ్యే నాకెవరూ లేరా అనే భావన కలుగుతోంది ..

మనసులో ఏ మూలో అమ్మ ఎక్కడుందో, ఎలా ఉందో అనే ఆలోచనకూడా కలుగుతోంది .. కానీ, ఆ ఆలోచన స్థిరంగా ఉండడం లేదు.. ఇంకా ఉందా అమ్మ .. ఉంటే నాకోసం ఒక్కసారన్నా ఎక్కడుందో కూతురు అని ఎందుకు ప్రయత్నించలేదు.. ఎందుకిలా తనని వదిలేసింది .. అనే వేదన కూడా కలుగుతోంది ..

సర్వం కోల్పోయి, ఆత్మీయత, అనురాగం, మమతలు అన్నీ దూర ం అయాక తల్లి ప్రేమకోసం పరితపిస్తోంది .. అమ్మన్నా ఉంటే నా ఈ మానసిక వేదన ఆమెకి చెప్పుకునేదాన్ని కదా .. ఇప్పుడు నాకెవరున్నారు నా బాధ వినడానికి అనుకుంటోంది .

ఎప్పుడూ వంటరిగా ఉంటే పిచ్చెక్కిపోతోంది అని తరచూ ఆదిత్య అనే మాటలు ఇప్పుడు బాగా అర్థం అవుతున్నట్టుగా అనిపిస్తోంది ..

ఒంటరిగా ఉండడం శాపం .పగవాళ్లు కుడా ఎప్పుడూ ఒంటరిగా ఉండకూడదు.. రేపు తనకి ఏదన్నా అయితే, ఈ నాలుగు గోడల మధ్య, ఈ బంధింపబడిన తలుపుల వెనక తనకి ఏ హార్ట్ ఎటాకో వస్తే .. తను చచ్చిపోతే తలుపు తీసేవాళ్లు కూడా ఎవరూ లేని ఈ బతుకు బతుకేనా అనిపిస్తోంది ..

శిరీషకి ఏడుపొచ్చేసింది .. వెక్కి, వెక్కి ఏడవసాగింది ..

ఆదిత్య తిరిగిన ఆ పరిసరాలన్నీ ఆమెని వెక్కిరిస్తున్నట్టుగా అనిపిస్తోంది ..

అకస్మాత్తుగా కాలింగ్ బెల్ మోగింది .. ఆమె కళ్లనీళ్లతో ఆశగా తలుపువైపు చూసింది .. వివేక్ వచ్చి ఉంటాడా? ఈ మధ్య వారం అయింది వచ్చి .. రోజూ ఫోన్ మాత్రం చేస్తున్నాడు .. ఆమె కళ్ల నీళ్లు తుడుచుకుంటూ ఆశగా వెళ్లి తలుపు తీసింది ..

ఎదురుగా నిలబడిన వ్యక్తిని చూడగానే ఆమెకి నోటమాటరాలేదు... నిశ్చేష్టురాలైపోయింది ..

ఎవరు? ఎవరితను.. ఆరడుగుల పొడుగు, నిండుగా సంతరించుకున్న మగతనం, అందమైన ముఖవర్చస్సు .. తొణికిసలాడుతున్న వ్యక్తిత్వం .. ఎవరు? ఆదీ .. అస్పష్టంగా పలికింది ..

అమ్మా .. ఆర్తిగా పిలిచాడు ఆదిత్య ..

వణికిపోతూ నాలుగడుగులు వేసింది శిరీష .. పడిపోబోతున్న ఆమెని చటుక్కున పట్టుకున్నాడు ఆదిత్య ..

అలాగే ఒడిసి పట్టుకుని లోపలికి వచ్చి, తల తిప్పి వెనక్కి చూసి రా అమ్మమ్మా అన్నాడు..

అప్పటిదాకా ఆదిత్య వెనకాల, కొంచెం ఎడంగా నిలబడిన లలితాంబ చటుక్కున ముందుకు వచ్చింది .. ఆమె చేతిలో ముద్దులు మూటగడుతున్న బంగారు బొమ్మలాంటి నాలుగేళ్ల పాప ..

శిరీష తేలిపోతున్న కళ్లతో చూసింది .. అస్పష్టంగా కనిపించారు ముగ్గురూ ..

అ .. అమ్మా .. అంటూ ఆదిత్య చేతుల్లో తల వాల్చేసింది ..

అఁవ్మా .. ఆదిత్య ఖంగారుగా ఆవిడ్ని కదుపుతూ అలాగే తీసుకొచ్చి సోఫాలో పడుకోబెట్టాడు .. లలితాంబ పాపని కిందికి దించి , సోఫాలో ఓ పక్కకి కూర్చుని శిరీష మొహం రెండు చేతుల్లోకి తీసుకుని శిరీ .. శిరీ అని ఖంగారుగా పిలవసాగింది ..

ఆదిత్య డైనింగ్ హాల్లో ఉన్న ఫ్రిజ్ తెరిచి, మంచినీళ్ల బాటిల్ తీసుకొచ్చి చల్లటి నీళ్లు శిరీష మొహం మీద చిలకరించాడు..

అతి ప్రయత్నం మీద కొద్దిగా కళ్లు తెరిచింది శిరీష .. ఎదురుగా కన్నీళ్లతో కనిపించిన తల్లిని చూడగానే ఆమెకి దుఃఖం ఆగలేదు..

శిరీష తల ఒడిలో పెట్టుకుని జుట్టు నిమురుతూ వెక్కిళ్లు పెడుతోన్న కూతుర్ని ఓదార్చడం మర్చిపోయిన దానిలా నిశ్చేతనంగా కూర్చుంది లలితాంబ . ఆవిడ కళ్లు కూడా వర్షిస్తున్నాయి ..

పాప బిక్కచచ్చి నిలబడిపోయింది ..

ఆదిత్య కళ్లు తుడుచుకుని పాపనెత్తుకుని శిరీష దగ్గరగా వచ్చాడు..

అమ్మా .. ఇలా చూడు .. ఇది నా కూతురు .. నీ మనవరాలు .. అన్నాడు.

శిరీష కన్నీళ్లతో తలెత్తి పాప వైపు చూసింది ..

అంతే ఆమె ఉద్వేగంగా, ఆర్తిగా చేతులు చాచి పాపని దగ్గరకు లాక్కుని గుండెలకి హత్తుకుంది ..

అమ్మమ్మ, అమ్మ, కూతురు .. ఆ ముగ్గురినీ అంత దగ్గరగా, అంత ఆర్తిగా, అంత ఆత్మీయంగా చూసిన ఆదిత్య కళ్లు నీటితో నిండిపోయాయి ..

సాధించావు ఆదీ అ నుకున్నాడు ..

నేను కాఫీ కలుపుకుని తెస్తాను .. అంటూ వంటగదిలోకి వెళ్లాడు.. కాస్సేపు అక్కడే వెక్కి, వెక్కి ఏడిచి కాఫీ కలుపుకుని తెచ్చాడు..

అతనిచ్చిన కాఫీ అమృతంలా అందుకుంది శిరీష ..

ఇన్నాళ్లూ ఎక్కడున్నావురా? వీడు నీకెలా కలిశాడమ్మా అడిగింది లలితాంబని .

ఆదిత్య తన దగ్గరకు వచ్చిన రోజు నుంచీ ఈ రోజు దాకా జరిగినదంతా పూసగుచ్చినట్టు చెప్పింది లలితాంబ .

నేను చేయలేని పని వాడు చేశాడు.. ఇంతకాలం నా పరువు, మర్యాదలను మంటగలిపిన వాడు పుట్టాడని బాధపడ్డానమ్మా .. ఇప్పుడు నా కొడుకు నీతికి, ధర్మానికీ కట్టుబడి బతికి, పట్టుదలతో తను కోరుకున్నది సాధించాడని గర్వంగా ఉంది ..

నిజం తల్లీ .. ప్రేమ పేరుతో ఆడపిల్లల్ని వంచించి, లొంగదీసుకుని గర్భిణిని చేసి పారిపోతున్నవాళ్లు, ప్రేమ, ప్రేమ అంటూ వెంటపడి, వేధించి, కాదన్నందుకు యాసిడ్‌పోసి తగలబెట్టేవాళ్లు, ఆడపిల్లని కామదృష్టితో తప్ప మరోలా చూడలేని కాముకులు ఇలాంటి ఎందరో దుర్మార్గులున్న ఈ సమాజంలో నీ కొడుకు లాంటి వాళ్లు నూటికి ఒక్కళ్లున్నా చాలు .. చాలు .. ఉద్వేగంగా అంది లలితాంబ..

శిరీష కళ్లల్లో ఆదిత్య పట్ల అంతులేని అభిమానం వెల్లివిరిసింది .. మెరిసేకళ్లతో ఆదిత్యనుచూసి అయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ ఆదీ .. అంది .

ఆదిత్య గర్వంగా నవ్వాడు..

అంతా బాగుంది .. ఇంతకీ ఆ అమ్మాయి ఎక్కడుందే? అడిగింది లలితాంబ ..

నాకు తెలియదమ్మా .. భాను చాలా మొండిది .. మూర్ఖురాలు .. అనుకున్నది సాధించి తీరుతుంది .. ఖచ్చితంగా ఆ అమ్మాయిని అమెరికా పంపించి ఉంటుందనిపిస్తోంది .. అంది ..

ఆదిత్య మొహం మ్లానమైంది .. కానీ అది కాస్సేపే .. వెంటనే అన్నాడు..

వెళ్లినా ప్రఖ్య మాత్రం తప్పకుండా వెనక్కి వస్తుందమ్మా అన్నాడు..

వాళ్ల మనస్తత్వాలు అవికావురా అంది శిరీష ..

కానీ వస్తుందమ్మా .. తప్పకుండా వస్తుంది .. నాకా నమ్మకం ఉంది .. అన్నాడు..

గాడ్ బ్లెస్ యూ అంది శిరీష .. ఇంతకీ పాప పేరేంటిరా అడిగింది పాపని ముద్దు పెట్టుకుంటూ ..

ఇంకా పెట్టలేదమ్మా .. ఆరోజు సిస్టర్ నా చేతికిస్తూ నీ పాప వైట్ రోజ్ అంది .. అదే పేరు తో పిలుస్తాను.. తెల్లగులాబీ అని..

తెల్ల గులాబీ .. తెల్ల గులాబీ .. బాగుందిరా .. ఈ చిట్టి తల్లి నన్ను, నా తల్లిని కలిపింది .. నాకింతకన్నా ఏం కావాలిరా ఆదీ .. నాన్నా .. ఇకనుంచీ నన్ను వదిలిపోవుకదూ . పక్కన కూర్చున్న ఆదిత్యని దగ్గరకు తీసుకుంటూ అడిగింది శిరీష .

వెళ్లనమ్మా .. నాకు కుటుంబం కావాలి .. పెద్ద కుటుంబ ం కావాలి .. అమ్మ, నాన్న, అమ్మమ్మ, నానమ్మ, నా భార్యా, పిల్లలు, వాళ్ల పిల్లలు .. పెద్ద కుటుంబం .. వసుధైక కుటుంబం కావాలి .. ఆ కుటుంబంలో ఎవరికీ ఎప్పుడూ ఇన్‌సెక్యూరిటీ ఉండదు... ఎప్పుడూ ఎవరూ ఒంటరితనంతో బాధపడరు .. దెబ్బలాటలు, మనస్పర్ధలు, అలకలు, కోపాలు ఎన్ని వచ్చినా కుటుంబంలోనే సమసిపోతాయి .. చివరికి ఏకమయేది కుటుంబమే .. అందుకే నాకు కుటుంబం కావాలి .. నాకు సింగిల్ ఫ్యామిలీ ఒద్దు .. కాకపోతే నేను చెప్పిన బంధువుల్లో కొందరు నాకు లేకపోవచ్చు .. కానీ, నా పిల్లలకి మాత్రం అందరూ ఉంటారు .. నా నమ్మకం నన్ను గెలిపిస్తుంది .. నా కూతురికి తప్పకుండా అమ్మ, అమ్మమ్మ కూడా ఉంటారు .. స్థిరంగా, గంభీరంగా, ఆత్మవిశ్వాసంతో అన్నాడు ఆదిత్య ..

దేవుడు నిన్ను ఆశీర్వదిస్తాడు నాన్నా అంది లలితాంబ..

నలుగురూ ఒకళ్లనొకళ్లు స్పృశించుకుంటూ ఆ స్పర్శలోని మాధుర్యాన్ని అనుభవిస్తూ పరవశంతో కళ్లు మూసుకున్నారు..

ఒకప్పుడు, తనూ ప్రఖ్యా మాట్లాడుకున్న మాటల్లో ఏదో చేయాలి .. ఏదో చేయాలి అనే మాట మళ్లీ గుర్తొచ్చింది.. అవును చాలా చేయాలి .. ఏనాటికైనా పాపకి దాని తల్లిని తీసుకొచ్చి ఇవ్వాలి .. పాపని ఉన్నత చదువులు చదివించాలి.. ఉజ్జ్వలమైన భవిష్యత్తు ఇవ్వాలి .. అన్నిటికీ మించి జీవితం అంటే అసలైన నిర్వచనం తెలియచేసి, జీవితపు విలువల్ని ప్రాక్టికల్‌గా చూపించాలి ..అనుకుంటూ కళ్లు మూసుకున్నాడు ఆదిత్య .

కాలం మెల్లిగా గడుస్తోంది..

ఆదిత్యకి శని,ఆదివారాలు రెండూ సెలవురోజులే .. కాకపోతే పని ఎక్కువగా ఉంటే శనివారం కూడా ఒక్కో రోజు ఇంట్లో నే కంప్యూటర్ ముందు కూర్చుని పనిచేస్తూ ఉంటాడు..

శిరీష వాలంటరీ రిటైర్ మెంట్ తీసుకుంది ..

పాపాయిని అరచేతుల్లో పెంచుకుంటోంది .. ఆవిడ పంచప్రాణాలూ పాపాయే .. ఇప్పుడు ఆమెకి తనకంటూ ఒక సపరేట్ జీవితం ఉంటుందని, ఆ జీవితానికి కొన్ని ఆనందాలుంటాయని, అవన్నీ తన స్వేచ్ఛగా ఉంటేనే పొందగలుగుతాననే ఆలోచన ఏ కోశానాలేదు.. తన ఆనందం, సుఖం, శాంతి అన్నీ పాపాయి చుట్టూ అల్లుకుని బతుకుతోంది ..

సుమారు ఇరవై సంవత్సరాలు కోల్పోయిన మాతృప్రేమ తిరిగి జీవితపు ఆఖరి మజిలీలో సంతృప్తిగా పొందగలుగుతోంది .. అల్లరి,చిల్లరిగా , మొండిగా, మూర్ఖంగా ఉన్న కొడుకు ఇప్పుడు ఎంతో సంస్కారవంతుడిగా, హుందాగా ప్రవర్తిస్తున్నాడు..అతడిని చూస్తుంటే ఆమెకి వీడు వాడేనా, నా కొడుకేనా, ఒకనాడు తననీ, వివేక్‌నీ కూడా నోటికొచ్చినట్టు మాట్లాడి అవమానించిన ఆదిత్యేనా అనిపిస్తుంటుంది .. టీనేజ్‌లో చేసిన తప్పుని శాపంగా మార్చుకోకుండా ఆ తప్పునింత హుందాగా దిద్దుకున్న కొడుకుని గర్వంగా చూసుకుంటూ ఉంటుంది ..

మరో ఏడాది గడిచిపోయింది..

ఒకనాడు కాలిఫోర్నియా యూనివర్శిటీలో ఆదిత్య స్నేహితుడు రాకేష్‌కి అనుకోకుండా ప్రఖ్య ఎదురైంది. ఆమెని చూసి ముందు గుర్తుపట్టకపోయినా ఎక్కడో చూశానీమెని అనుకుంటూ ఉంటే ఆమే చనువుగా పలకరించింది ..

నువ్వు రాకేష్ కదూ అంటూ ..

నువ్వు ప్రఖ్య .. అవునా .. అడిగాడు రాకేష్ ..

నువ్విక్కడికి ఎప్పుడు వచ్చావు? ఆశ్చర్యంగా అడిగింది ప్రఖ్య ..

నేనూ అదే అడుగుతున్నాను.. హౌకమ్ యూ ఆర్ హియర్ అన్నాడు రాకేష్ .

ఇది నా ఎయిమ్ .. అమెరికాలో ఎం ఎస్ చేయడానికే కదా కష్టపడ్డాను.. ఇందులో ఆశ్చర్యం ఏం లేదు.. అంది ప్రఖ్య ..

కానీ, నీకోసం అక్కడ ఆదిత్య ఎదురుచూస్తున్నాడు.. నువ్విక్కడికి వచ్చినట్టు వాడికి తెలుసా? అడిగాడు రాకేష్..

ఆదిత్యా? నొసలు చిట్లించింది ప్రఖ్య .. నేనసలు అతని గురించి ఆలోచించడం మానేసి చాలాకాలమైంది.

అదేంటి? ఆశ్చర్యంగా అడిగాడు రాకేష్.. మీ ఇద్దరూ లవర్స్ కదా !

నాన్సెన్స్ విసురుగా అంది ప్రఖ్య .. ఎవరు చెప్పారు?

ఎవరు చెప్పడం ఏంటి ప్రఖ్యా .. మీరు తరచూ కలుసుకోడం, కలిసి తిరగడం అందరికీ తెలుసు కొత్తగా చెప్పడం దేనికి? మీరిద్దరూ ప్రేమించుకుంటున్నారని, చదువు పూర్తి అయాక పెళ్లి చేసుకుంటారని అనుకున్నాం

లవ్, గివ్ ఏం లేదు..

మరి .. .. పాప?

జ స్ట్ యాక్సిడెంట్ ..

అంటే నువ్వు ఆదిత్యను మ్యారేజ్ చేసుకోవా?

అసలా ఆలోచనే లేదు.. ఏదో టీనేజ్‌లొ పరస్పరం అట్రాక్ట్ అయాం .. అంతే ..

కానీ, పాపనేం చేస్తావు?

ఏమో ! భుజాలెగరేసింది .. అయినా తను పెంచుకుంటానన్నాడు కదా .. పెంచుకోడంలేదా?

రాకేష్ చిరాగ్గా చూశాడు..

వాడు పెంచుకుంటున్నాడో, ఏం చేస్తున్నాడో కానీ, నీ కూతురి పట్ల నీకేం రెస్పాన్సిబిలిటీ లేదా? నాకు చాలా వింతగా ఉంది ప్రఖ్యా .. బీయింగ్ ఎ ఉమన్ అసలు ను వ్వు పాప విషయంలో ఇంత నెగ్లిజెన్స్ చూపించడం రియల్లీ వండర్ ..

రాకేష్ .. నేను కనాలని పాపని కనలేదు.. కనాల్సి వచ్చింది కాబట్టి కన్నాను.. ఆదిత్యని నేను ప్రేమించడం, అతను లేకపోతే బతకలేను అనుకోడంలాంటివి కూడా ఏం జరగలేదు.. మా ఇద్దరి స్నేహం అలా సాగింది .. అయినా తనే ప్రొవోక్ చేశాడు.. నేనూ టీనేజ్‌లో ఉన్నాను.. అంతే దాని కోసం నా కెరియర్ పాడు చేసుకుని కమిట్ అయి ఉండడం రెడిక్యులస్ ..

రాకేష్ కళ్లల్లో రెప్పపాటు కాలం ఆమె పట్ల ఏవగింపు కలిగింది .. ఈమె ఏం ఆడది అనుకున్నాడు.. స్వరంలో కొంచెం తీవ్రత పలికిస్తూ అన్నాడు..

ఏనాటికైనా పాప కోసం అయినా నువ్వు ఆదిత్యతో కలిసి బతుకుతావనే మేమంతా అనుకున్నాం ..తనూ అదే నమ్మకంతో ఎదురుచూస్తున్నాడు.. నువ్వు నిజంగా ఆడదానివైతే వెళ్లాలి కూడా ..

మేమంతా అంటే ..

ఆల్ ఫ్రెండ్స్ .. భుజాలెగరేశాడు రాకేష్ ..

ఎందుకలా? ఆశ్చర్యంగా అడిగింది ప్రఖ్య.

ఎందుకేంటి? యూ హావ్ డాటర్ .. డాటర్‌ని కూడా వదులుకుని నువ్వు సాధించేదేం ఉంటుందని అనుకుంటున్నావు?.

యాక్సిడెంటల్‌గా జరిగిందో, జరగాలనే జరిగిందో ఒక ఇన్సిడెంట్ జరిగింది .. దాని రిజల్ట్ పాప .. పాపని తల్లిలేనిదానిగా వదలడం నీకెలా అనిపిస్తుందో కానీ, నాకు మాత్రం .. అఫ్‌కోర్స్ నాకే కాదు మన ఇండియన్ సొసైటీలో ఎవరికీ కూడా ఇది కరెక్ట్ అనిపించదు.. నీకు కరెక్ట్ అనిపించినా అది ఎక్స్‌క్యూజబుల్‌కాదు.. కాబట్టి నువ్వు వెంటనే ఆదిత్యకి మెయిల్ పంపించు .. నీ ఎం ఎస్ అవగానే వెళ్లిపోడమో, ఆదిత్యనే ఇక్కడికి పాపతో సహా పిలిపించుకోడమో ఏదో ఒకటి చేస్తే మంచిది ..

ప్రఖ్య తల అడ్డంగా ఆడిస్తూ స్థిరంగా అంది .. ఓ .. నో .. నా వల్లకాదు.. అయినా నాకిప్పుడు ఆదిత్య మీద ఇంట్రస్ట్ ఏం లేదు.. నేనిప్పుడు ఫ్యామిలీ లైఫ్‌లో పడితే నా కెరియర్ ఏం కావాలి?

మళ్లీ కెరియర్ అంటావేంటిప్రఖ్యా? మీ మదర్ నీ కెరియర్ కోసం ఏం చేసిందో నీకు తెలుసు .. మరి మీ మదర్‌కి నీ మీద ఉన్న రెస్పాన్సిబిలిటీ నీకు నీ పాప పట్ల ఉండదా? నీ క్యారెక్టర్ ఏంటో నాకేం అర్థం కావడంలేదు.

వాట్ డూ యూమీన్ ..

రాకేష్ నవ్వాడు.. ఐ మీన్ వాట్ ఐ సే .. నువ్విప్పుడు గర్ల్ కాదు.. మదర్ .. ఒక మదర్‌వి .. బిహేవ్ లైక్ ఎ మదర్ .. ఎనీ వే .. నీకు సెంటిమెంట్స్ లేవని ఇప్పుడే అర్థమైంది .. ఇదీ ఒకందుకు మంచిదే .. ఆల్ ద బెస్ట్ .. చేయి చాచాడు రాకేష్..

అతని మాటలు గురిచూసి వేసిన బాణంలా తగలాల్సిన చోట తగలడంతో మ్రాన్పడిపోయి నిలబడ్డ ప్రఖ్య అప్రయత్నంగా షేక్‌హ్యాండ్ ఇచ్చింది ..

నీకేదన్నా హెల్ప్ కావాలంటే కాల్ మీ .. ఇదిగో నా నెంబర్ .. చిన్న స్లిప్ మీద సెల్ నెంబర్ వేసి, ఆమెకిచ్చి తనకోసం ఎదురుచూస్తూన్న స్నేహితుడితో వెళ్లిపోయాడు

ప్రఖ్య అతని మాటలు పదే, పదే తల్చుకుంటూ ఉన్న చోటే శిలలా నిలబడిపోయింది ..

నువ్విప్పుడు గర్ల్ కాదు.. మదర్ , మదర్ .. మదర్ .. మదర్ .. బిహేవ్ లైక్ ఏ మదర్ .. రాకేష్ మాటలు చెవుల్లో గింగిర్లెత్తుతోంటే అచేతనంగా అతను వెళ్లిన వైపు చూస్తూ ఉండిపోయింది ..